: VENKATESVARA C? I.NTAL SERIES No. 51

Editor:—PROF. P. V. RAMANUJASW

TALLAPAKA WORK : Vo

# ADHYATMAS. NKIRTANALU

BY

## TALLAPAKA ANNA CHARYULU

(Including the a ditiona ... found in the long copper plate ..d revised readings of songs ... Volume II.)

R. AN ... NA SARMA

*Reader in Music*

*Sri Venk... vara Oriental I...stit... upati*

PUBLISHED UNDER THE AUTHORITY OF

SRI C. ANNA RAO, B.A.

EXECUTIVE OFFICER

*... Devasth... ... Board of Trustees*

SRI VENKATESVARA ... INSTITUTE ... TIRUPATI

PRIN

TIRUMALAI-TIRUPATI DE... ...AMS PRESS

TIRUPA

1955

SRI VENKATESVARA ORIENTAL SERIES—No. 51

*Editor* :—Prof: P. V. RAMANUJASWAMI, M.A.

## తాళ్లపాకవారి గేయరచనములు

### XI-వ సంపుటము

# అధ్యాత్మసంకీర్తనలు

## అన్నమాచార్యరచితములు

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయములో సంగీతవాఙ్మయ పరిశోధకుఁడగు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మచే

పరిశోధింపఁబడినవి.

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌వారి తరపున

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ చెలికాని అన్నారావు, బి. ఏ. గారి అనుమతిని

ప్రకటింపఁబడినది.

తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాక్షరశాల

1955

శ్రీ

# పీఠిక

ఈ పదునొకటవ సంపుటముతో అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల ముద్రణము ముగిసినది. కీ. శే. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్యుల రచనలని ప్రత్యేకముగా గుర్తించిన అధ్యాత్మసంకీర్తనల రేకులు 1 మొదలు 391 వఱకును గలవానిలోని సంకీర్తనలన్నియు 'తాళ్ళపాకవారి గేయరచనములు' 5, 6, 7, 8, 9, 10, 11, సంపుటములుగా శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ ప్రకటించినట్లైనది. మొత్తము ప్రకటనకు లభించిన అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు 2209. వీనిలో కొంచెము తక్కువగా అన్నియు సాధారణ తామ్రపట్టములలోనివే. ఈ రేకులకు సా. రే. అని గుర్తుంచితిని.

ఇవిగాక శ్రీ తాళపత్రములరీతిని సుమారు 2½ అంగుళముల వెడల్పును 33 అంగుళముల పొడవునుగల నిడురేకులు 120 గలవు. సా. రే. లలో చెక్కించుటకు పూర్వము ఈ రీతిగా రేకులు చేయించి చెక్కింపనుపక్రమించి వానిపలుచదనమును నిడుపును అనుకూలముగా తోఁపనికారణముచేఁ గాఁబోలు, అంతటితో వదలి, చేతికనువైన లావైన సా. రేకులలో మొదటినుండి మరల పాటలను చెక్కించినట్లు తోఁచుచున్నది. మరియు నిడురేకుల వ్రాఁతగూడ అందముతక్కువ. వ్రాసిన వారి భాషావ్యుత్పత్తియు సామాన్యము. నలుగురైదుగురు లేఖకుల కైవాడము స్పష్టముగానున్నది. కొన్ని రేకులలో మాత్రము కడపట "అన్నమాచార్యుల సంకీర్తనలు ౧౦. మంగళమహా శ్రీ శ్రీ శ్రీః జేయును. శ్రీ తిరుమలయ్యగారి ఆనతిని అన్నమగాజు తిమ్మయ్య వ్రాసెను." ఇట్లు

లేఖకుని పేరుగలదు. (చూ. ని-రే. ౨) తక్కిన యేరకపు రేకులందు గాని వ్రాసిన వారిపేరు గానరాదు. సా-రే. లలో లేని అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు 77 ని-రే. లలో లభించినవి. ఈ సంపుటమున అవి రెండవభాగముగా చేర్పఁబడినవి. నేఁటికిని దక్షిణదేశమందలి వారి భజన సంప్రదాయమున 'తోడయ మంగళం' అనఁబడు తొలిపాటలలో నొక్కటిగా సర్వత్ర వ్యాప్తిలోనున్న 'నారాయణతే నమో నమో' అను సంకీర్తన మనకీనిడురేకులలోనే దొరకినది. * రాగముమాత్రము మారినది. రేకులో దీనిది పాడిరాగము. వ్యవహారములో నిప్పుడిది మధ్యమావతి. ఇదిగాక ఇందలి వ్రాఁత అంత వ్యత్యస్తము గాకున్న సా. రే. లలోని యెన్నోపాఠ సందేహములిందు తీరినవి.

మరియు అహోబల నరసింహస్వామి దేవళమున లభించిన పెద్ద రేకులు 35. ఇవి 27 అంగుళముల పొడవును 16 అంగుళముల వెడల్పును గలవి. ఇవి యైదైదు రేకులు గుదిగా ఒకలావైన కడియములో చేర్చి యుంచఁబడినవి. పె. రే. అని వీని గుర్తు. సా. రే. లలోని సంకీర్తనలే ఇందును పునరుక్తములు. అందలి వ్రాఁత తప్పులెన్నో ఇందు సవరింపఁబడినవి. అక్షరములజాతి యదే. కనుక సా-రే, పె-రే. ల వ్రాఁత ఒక్కవ్యక్తి చేతిమీఁదుగానో లేక ఒకలేఖన సంప్రదాయమునకు చేరిన గురుశిష్యులచేతనో నడిచినదని యూహింపవచ్చును. ఈ రెండువిధముల రేకులను ప్రత్యేకముగా తయారుచేయించి రెండుమార్లు పాటలను చెక్కించు వ్యయప్రయాసములింతయని యూహించుట కష్టము. దీని యుద్దేశముగూడ దురూహామే. ఈ పె-రే. లు ఎన్నియుండినవో తెలి

---

* దీనినే కడపటి చరణమున 'పురందర విఠలతే నమో నమో' అని మార్చి పురందర దాసరాయల పదముగా కర్ణాటకులు కొందఱు వాడుచున్నారు!

యదు. మనకు దొరికినవి 35 మాత్రమే. అందు అన్నమాచార్యుల, తిరుమలాచార్యుల అధ్యాత్మ శృంగారసంకీర్తనలు వేరుపరచి యియ్యఁబడినవి. పె-రే. లు సా-రే. లకు అనువాదములే కనుక పాఠభేదములు ప్రాయశః ఇందు లభింపవు.

ఇదిగాక తంజావూరి సరస్వతీమహాలు భండారమునందలి P. 465 సంఖ్యగల తాటాకులప్రతి 'శ్రీ వేంకటేశ్వర విన్నపాలు' అనుదానికి ప్రతివ్రాయించి తెప్పించఁబడినది. అందు 90 సంకీర్తనలు వేంకటేశాంకితములు కలవు. కాని యిందులో అన్నమాచార్యులవేవో ఇతరులవేవో తెలుపఁబడలేదు. రేకులలోని అన్నమాచార్యుల కృతులు కొన్ని ఇందుగలవు. పాఠ వివేకమునకు ఇదియు కొంత తోడుపడినది.

వీనికి తోడు తిరుపతివాసులైన శ్రీ తాళ్ళపాక వేంకటశేషాచార్యులయింటి వ్రాఁత ప్రతి యొకటి వారి దయతో లభించినది. (S. V. O. 6609) ఇందు శృంగారాధ్యాత్మరచనలు 275 కలవు. కాని ఇందును కర్తలపేర్లు తెలియవు. మరియు తరువాతి పదకవుల రచనలును ఇందు కలిసినట్లున్నది. కొన్ని పాదముల సవరణల కిదియు నుపకరించినది.

వీని నన్నిటిని పరస్పరము సంప్రతించుపనికై కొంతకాలము పట్టినది. ఇది గాక 1936 లో తిరుమల-తిరుపతి దేవస్థానము వారు ప్రచురించిన 'The works of Thallapaka poets, Vol. II' అనుదానిలోని అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనల ముద్రణము చాల అసడ్డగా జరిగినది. పైని రేకులను వ్రాఁతప్రతులను పరిశీలించి సరియైన పాఠములతో వానిని మరల ప్రచురించుట అత్యావశ్యకమనిపించినది. అట్లుచేసి సవరించిన 173 అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు ఈ

సంపుటమున 3-వ భాగముగా ప్రకటింపఁబడినవి. ఇట్లు చేయుటకు ఈ ప్రాచ్యపరిశోధనాలయాధ్యక్షులు శ్రీ పరవస్తు రామానుజస్వామి ఎం.ఏ. గారు దయతో నా కనుమతినిచ్చిరి. వారికి నా ధన్యవాదములు.

ఈ కారణముచేత ఈ సంపుటము కొంత విలంబముతో వెలువడ వలసి వచ్చినది. ఈ కార్యములో మొదటి కొన్ని దినములు మాత్రము శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల తోడు నాకు లభించినది. దానికై వారికి నేను కృతజ్ఞత ఇందు తెల్పుకొనుచున్నాను తరువాత ఏకాంగి గానే నేఁపని నిర్వహింపవలసితిని. ఇదిగూడ విలంబహేతువైనది.

12-వ సంపుటమునుండి అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు ప్రకటింపఁబడును. ఆ సంపుటము గూడ ఇంతలో ముద్రణకెక్కు స్థితిలో నున్నది. స్వరపరచిన 'తాళ్ళపాకపాటలు' రెండవసంపుటమును త్వరలో ప్రకటింపఁబడుటకు సిద్ధమయినది.

శ్రీ తిరుమల-తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారగు శ్రీ చెలికాని అన్నారావు బి. ఏ. గారు ఈ సంకీర్తనల ప్రకటనకై, వ్యాప్తికై చూపుచున్న అపారమైన యుత్సాహమునకు తగినంత త్వరగా పని జరుపు శక్తి శ్రీనివాసుఁడు నా కనుగ్రహించినచో కొంతయైనను వారి దయాఋణమును తీర్చుకోవలెననుటయే నా యాశంస.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము, తిరుపతి.<br>30—3—55

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,<br>సంగీతవాఙ్మయ పరిశోధకుఁడు.

శుభమస్తు

శ్రీ తా ళ్ళ పా క

# అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమ్మాచార్యులు అవతరించిన పదారుయేఁడ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అదిమొదలుగాను శాలివాహనశకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ ౧౨ నిరుఘానకు (నిరోధానకు? తిరోధానానకు) తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ సంకీర్తనలు.

351-వ రేకు. శ్రీరాగం

చేరి కొల్వరో యీతఁడు శ్రీదేవుఁడు
యీరీతి శ్రీవెంకటాద్రి నిరవైనదేవుఁడు. ॥పల్లవి॥

అలమేలుమంగనురమందిడుకొన్న దేవుఁడు
చెలఁగి శంఖచక్రాలచేతిదేవుఁడు
కలవరదహస్తముఁ గటిహస్తపు దేవుఁడు
మలసీ శ్రీవత్సవనమాలికలదేవుఁడు. ॥చేరి॥

ఘనమకరకుండలకర్ణములదేవుఁడు
కనకపీతాంబర శృంగారదేవుఁడు
ననిచి బ్రహ్మాదుల నాభిఁగన్న దేవుఁడు
జనించెఁ బాదాల గంగ సంగతైనదేవుఁడు. ॥చేరి॥

కోటిమన్మథాకారసంకులమైనదేవుఁడు
జూటపుఁగిరీటపుమించులదేవుఁడు
వాటపుసొమ్ములతోడి వసుధాపతిదేవుఁడు
యీటులేని శ్రీ వెంకటేశుఁడైన దేవుఁడు. ॥చేరి॥ 1

పళవంజరం

ఇతఁడొకఁడే సర్వేశ్వరుఁడు
సితకమలాక్షుఁడు శ్రీ వెంకటేశుఁడు. ॥పల్లవి॥

పరమయోగులకు భావనిధానము
అరయనింద్రాదులకైశ్వర్యము
గరిమ గొల్లెతలకౌఁగిట సౌఖ్యము
సిరులొసఁగేటి యీ శ్రీవెంకటేశుఁడు. ॥ఇత॥

కలిగి యశోదకు కన్నమాణికము
తలఁచినకరికిని తగుదిక్కు
అలద్రౌపదికిని యాపద్బంధుఁడు
చెలరేఁగిన యీ శ్రీవెంకటేశుఁడు. ॥ఇత॥

తగిలిన మునులకు తపముల సత్ఫలము
ముగురువేల్పులకు మూలము
ఒగి నలమేల్మంగకొనరినపతి యితఁడు
జిగిమించిన యీ శ్రీవెంకటేశుఁడు. ॥ఇత॥ 2

వసంతం

నిండెను లోకములెల్ల నెరిసితనికరుణ
పండిరాసులాయఁ గీర్తిప్రతాపములెల్లను ॥పల్లవి॥

గరుడవేగమునఁ గదలె విజయరథ
మిరవై యందు దేవుడేఁగుచుండఁగా
సారిదిఁ బట్టుకుచ్చులు చుక్కలతో సందడించ
గరిమఁ బైఁడికుండలు గగనముదాఁకను ||నిండె||

అనిలవేగమున నదె వెడలె రథము
అనిమిషులు పగ్గములందుకోఁగా
తనుఁదానె ఘనశంఖధ్వనులు దిక్కులునిండ
సునిసి చక్రము దనుజుల సాధింపఁగను ||నిండె||

వెలయ మనోవేగాన వేంచేసీ మిగిడి రథ
మెలమిఁ దమదాసులు మోచి పొగడ
అలిమేలుమంగ దనకటు విడెమియ్యఁగాను
బలిమి శ్రీవేంకటాద్రిపతి మించీనిందును ||నిండె|| 3

బౌళిరామక్రియ

దేవతలఁ గాచిన దేవుఁడితఁడు
వేవేలుప్రతాపముల వీరరాముఁడితఁడు ||పల్లవి||

రావణుఁజంపి పుష్పకరథమెక్కి సీతతోడ
తావుగా నయోధ్యను పట్టముగట్టుక
వావిరి సుగ్రీవాదివానరకోట్లు గొలువ
చేవమీరి పొగడొందు శ్రీరాముఁడితఁడు ||దేవత||

వసుధ యింతయునేలి వసిష్ఠాదులు నొగడ
యొనగ నశ్వమేధాలెల్లాఁ జేసి
పొనఁగఁ గుశలవుల పుత్రులుగా నమ్ముగాంచి
రసికత మించుదశరథరాముఁడితఁడు ||దేవత||

అలర రుద్రునెదుటనటు విశ్వరూపు చూపి
లలి బ్రహ్మపట్టమనిలజునికిచ్చి
యిల శ్రీవెంకటాద్రినిరవై నిలిచినాఁడు
చలమునాధించిన జయరాముఁడితఁడు. ॥దేవత॥ 4

## మాళవశ్రీ

నమోనమో దశరథనందన మమ్మురక్షించు
కమనీయ శరణాగతవజ్రపంజరా. ॥పల్లవి॥

కోదండదీక్షాగురుఁడ రామచంద్ర
ఆదిత్యకుల దివ్యాస్త్రవేది
సోదించుమారీచుని తలగుండుగండ
ఆదినారాయణ యసురభంజనా. ॥నమో॥

ఖరదూషణశిరఃఖండనప్రతాప
శరధిబంధన విభీషణవరదా
అరయ విశ్వామిత్రయాగసంరక్షణ
ధరలోన రావణదర్పాపహరణ. ॥నమో॥

పొలుపొంద నయోధ్యపురవరాధీశ్వర
గెలుపొందిన జానకీరమణ
అలఘుసుగ్రీవ అంగదాదికపిసేవిత
నలలిత శ్రీవెంకటశైలనివాసా. ॥నమో॥ 5

## కేదారగౌళ

నిలిచినవాఁడవు నీవేకాక దైవమా
నెలవై ప్రకృతి నేను నీలోనిసొమ్ములము. ॥పల్లవి॥

తరి నిరువదేను తత్వములుండఁగాను
యెరఁగని యజ్ఞానికెవ్వరు గురి
నెరిఁ జై తన్యమెల్లా నీసొమ్మై వుండఁగాను
యెరుకవొక్కటేకాక యెవ్వరున్నారీడను. ॥నిలి॥

దినలెక్కలూరుపులు తెచ్చితెచ్చి వొప్పించఁగ
యెనలేని జన్మములకెవ్వరు గురి
వునికై బ్రిహ్మాండము వొళ్ళునీకై వుండఁగాను
యెనసే ఆనందమే కాకెవ్వరున్నారీడను. ॥నిలి॥

అచ్చపుసుముద్రవంటాత్మలణులై యుండగా
యిచ్చఁ గామక్రోధాలకెవ్వరు గురి
నిచ్చలు శ్రీవెంకటేశ నీవేలికవై యుండఁగా
హెచ్చేటిదాస్యమేకాక యెవ్వరున్నారీడను ॥నిలి॥ 6

352-వ రేకు. భూపాళం

తెలియఁడుగాక ద్రిష్టము జీవుఁడు
సులభమిదివో యిచ్చోటనే పరము. ॥పల్లవి॥

మనసునఁ దలచిన మర్మములు గరఁగి
చొనుపుచు నింద్రియసుఖమిచ్చు
అనువుగ నిటువలె హరిఁదలపోసిన
తనకు బ్రహ్మానందము సమకొనదా. ॥తెలి॥

మాటలాడినను మరిగి మానవులు
యీటున మెచ్చిత్తురేమైనను
నాటనిట్ల హరినామము నొడివిన
గాటపువరములు కలుగునే కాదా. ॥తెలి॥

చేసినపుణ్యము చేతఁజిక్కుకొని
రాసి వెనుతగిలి రక్షించు
వేసరకిటు శ్రీ వెంకటేశ్వరుని
ఆసల కైంకర్యము ఫలించును. ॥తెలి 7

### వసంతం

తల్లి యాపె కృష్ణునికిఁ దండ్రి యీతఁడు
చల్లఁగా లోకము లెల్లా సంతోసమందెను. ॥పల్లవి॥

అరుదై శ్రావణబహుళాష్టమినాఁటిరాత్రి
తిరువవతారమందెను కృష్ణుఁడు
యిరవై దేవకిదేవి యెత్తుకొని వసుదేవు
కరములందుఁబెట్టితే కడుసంతోసించెను. ॥తల్లి॥

తక్కక యమునానది దాఁటతండు రేపల్లెలో
పక్కన యశోదాదేవి పక్కఁబెట్టెను
ఎక్కువనాపె కృష్ణునినెత్తుక నందగోపుని
గక్కన వినిపించితే కడుసంతోసించెను. ॥తల్లి॥

మరిగి పెద్దై కృష్ణుఁడు మధురలోఁ గంసుఁజంపి
వెరసి యలమేల్మంగఁ బెండ్లాడి
తిరమై శ్రీ వెంకటాద్రిని దేవకీదేవియు
ఇరవై తే వసుదేవుఁడేఁచి సంతోసించెను. ॥తల్లి॥ 8

### హిందోళం

కరుణానిధివి గట్టుకో ఏపుణ్యమైన
శరణాగత వజ్రపంజరుఁడవు నీవు ॥పల్లవి॥

మన్నించేనంటే నిన్ను మానిపేవారెవ్వరు
పన్ని కోపగించితే నీపట్టు కెదురెవ్వరు
చెన్నుమీర నీపెట్టిజెట్టి జీవులెల్లాను
వన్నిగా నీసొమ్ము నీవువలసినట్టు సేయి. ॥కరు॥

కాచేనంటే నిన్నుఁగాదనేవారెవ్వరు
ఏచి యాజ్ఞవెట్టేనంటే యిదేలనేవారెవ్వరు
లాచి పెంపుడుగుజ్జులు లలినీజీవులెల్లాను
చేచేత నీదాసులను సేసినట్టుసేయి. ॥కరు॥

వరమిచ్చేనంటే నడ్డపడేవారెవ్వరు
సరి నిహమిచ్చేనంటే సాధించేవారెవ్వరు
సిరుల శ్రీవెంకటేశ చేతిలోవారము నీకు
హరి నీపాఁతవారమెట్టైనా దయసేయి. ॥కరు॥ 9

భైరవి

ఈతఁడు విష్ణుఁడు రిపులెక్కడచొచ్చేరు మీరు
చేత చక్రమెత్తినాఁడు శ్రీవెంకటేశుఁడు. ॥పల్లవి॥

జలధులు చొచ్చిచొచ్చి సారెఁ బ్రతాపించినాఁడు
చలమునఁ బాతాళము సాధించినాఁడు
బలుభూమిదూరి వొక్కకొలికిఁ దెచ్చినాఁడు
నిలిచి యంతరిక్షమునిండి భేదించినాఁడు. ॥ఈత॥

చేరి బ్రహ్మాండము తూఁటుచేసి చూచినాఁడు
వీరుఁడై రాచమూఁక వెదకినాఁడు
ఘోరపుత్రికూటాది కొండలు జయించినాఁడు
వారించి చక్రవాళపర్వతము దాఁటినాఁడు. ॥ఈత॥

మట్టి దైత్యపురాల మర్మాలు విదళించినాఁడు
చుట్టువేడెమున యింతా సోదించినాఁడు
యిట్టె శ్రీవెంకటాద్రినిరవై యెక్కినవాఁడు
రట్టుగాఁ దనదాసులనిట్టె రక్షించినాఁడు. ॥ఈత॥ 10

వరాళి

జీవుఁడించుకంత చేఁత సముద్రమంత
చేవెక్కి పలుసూరుఁ జిగిరించీ మాయ. ॥పల్లవి॥

కోపములైతేను కోటానఁగోట్లు
దీపనములైతేను దినకొత్తలు
చాపలబుద్ధులు సమయని రాసులు
రాపాడీఁ గడవఁగరాదువో మాయ. ॥జీవు॥

కోరికలైతేను కొండలపొడవులు
తీరనిమోహాలు తెందేపలు
ఊరేటిచెలమలు వుడివోనిపంటలు
యీరీతినె మెలయించీని మాయ ॥జీవు॥

మునుకొన్నమదములు మోపులకొలఁదులు
పెనఁగినలోభాలు పెనువాములు
నినుఁబై శ్రీవెంకటేశ నీదాసులనంటదు
యెనసీ పరులనైతే యీఁదించీని మాయ. ॥జీవు॥ 11

కాంబోధి

ఎన్నఁడో కో నే నీచేరఁ దగులక
అన్నిటా శ్రీపతికాధీనమాట. ॥పల్లవి॥

దేహాధీనము తిరిగేటి జీవులు
దేహము యర్థాధీనము
మోహాధీనము ముంచిన యర్థము
ఆహా యిది పుణ్యాధీనము. ॥ఎన్న॥

సతతముఁ బురుషుఁడు సతుల యాధీనము
అతివలు వయసుకు నధీనము
గతియగు వయసులు కాలాధీనము
అతిశయమిది మాయాధీనము. ॥ఎన్న॥

దైవాధీనము తగిన జగమిది
దేవుఁడు మోహాధీనము
చేవల మోహము శ్రీ వేంకటపతి
సేవాధీనము సిలుగే లేదు. ॥ఎన్న॥ 12

353–తేకు భల్లాటి

పెదయాబళపుఁ గొండఁ బెరిగిసదే
వదలక కొలిచితే వరములిచ్చీని. ॥పల్లవి॥

పదివేలశిరసుల బలునరసింహము
గుదిగొన్న చేతుల గురుతైనది
ఎదుటఁ జోదాలుఁ గన్నులెన్నైనఁ గలిగినది
యిది బ్రహ్మాండపుగుహా నిరవైనది. ॥పెద॥

ఘన శంఖచక్రాదుల కైదువలతోనున్నది
మొనసి రాకాసిమొకములఁ గొట్టేది
కనకపుదైత్యుని కడుపుచించినది
తనునమ్మిన ప్రహ్లాదు దాపునుదండైనది. ॥పెద॥

శ్రీవనితఁ దొడమీఁదఁ జేకొని నిలిపినది
దేవతలు గొలువ గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందుఁ జెలఁగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది. ॥పెద॥ 13

ముఖారి

నరులార నేఁడువో నారసింహజయంతి
సురలకు నానందమై శుభములొసఁగెను. ॥పల్లవి॥

సందించి వైశాఖశుద్ధచతుర్దశి శనివార
మందు సంధ్యాకాలమున నోభళేశుఁడు
పొందుగాఁ గంభములోనఁ బొడమి కడపమీఁద
కందువగోళ్లఁ జించెఁ గనకకశిపుని. ॥నరు॥

నరమృగరూపము నానాహస్తముల
అరిది శంఖచక్రాది ఆయుధాలతో
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచిరక్షించి నిలిచె
గురుతరబ్రహ్మాండ గుహలోనను. ॥నరు॥

కాంచనపుగద్దెమీఁద గక్కనఁ గొలువై యుండి
మించుగ నిందిరఁ దొడమీఁదఁ బెట్టుక
అంచె శ్రీవెంకటగిరి నాదిమపురుషుండై
వంచనసేయక మంచివరాలిచ్చీనదివో. ॥నరు॥ 14

సామంతం

దైవమొక్కఁడే సంతత భజనీయుఁడు
భావము సమబుద్ధిఁ బాయఁగఁ దగదు. ॥పల్లవి॥

హరియే సకలాంతరాత్మకుఁడటుగాన
తిరమై యొకరి నిందింపఁదగదు
అరయఁగ లోకము లనిత్యమటుగాన
మరిగి కొందరమీఁది మమతయు వలదు. ॥దై వ॥

బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమె కాన
గహనపుఁదనవుద్యోగము వలదు
సహజవిహారుఁడు సర్వేశ్వరుఁడు గాన
వహిఁ దానెవచ్చినవి వలదనఁదగదు. ॥దై వ॥

తపములు జపములు దాస్యమూలమె కాన
ఉపమల సందేహమొగి వలదు
యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి
చపలచిత్తమువారి సంగమిఁక వలదు. ॥దై వ॥ 15

లలిత

ఏగతినుద్ధరించేవో యింతటిమీఁదట మమ్ము
భోగపుఁగోరికలచేఁ బొలిసెఁబో ప(గ?)తులు. ॥పల్లవి॥

పరగి నాలుకసొంపు పరసిపోయె
పరులనే నుతియించి పలుమారును
విరసపుఁ బాపముల వినికిచే వీనులెల్లాఁ
గొరమాలె మాకు నేఁటి కులాచారము. ॥ఏగతి॥

మొక్కలాన పరధనమునకుఁ జాఁచిచాఁచి
ఎక్కువఁ జేతుల మహిమెందో పోయె
తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి
ముక్కపోయె మాకు నేఁటి ముందటి పుణ్యాలు. ॥ఏగతి॥

ఎప్పుడు నీచులయిండ్లకెడతాకి పాదములు
తప్పని తపములెల్లఁ దలఁగిపోయె
యిప్పుడె శ్రీవెంకటేశ యిటునిన్నుఁ గొలువఁగా
నెప్పున నేఁజేసినట్టి నేరమెల్లానణఁగె. ॥ఏగతి॥ 16

సాళంగనాట +

* అయమేవ అయమేవ ఆదిపురుష
జయకరం తమహం శరణంభజామి. ॥పల్లవి॥

అయమేవ ఖలుపురా అవనిధరస్తు సో
ప్యయమేవ వటదళాగ్రాదిశయన
అయమేవ దశవిధవతారరూపైశ్చ
నయమార్గ భువిరక్షణం కరోతి. ॥అయ॥

అయమేవ సతతం శ్రియఃపతిదేవేషు
అయమేవ దుష్టదైత్యాంతకస్తు
అయమేవ సకల భూతాంతరేష్టు క్రమ్య
ప్రియభక్తపోషణం విదృత్ప్రనోతు. ॥అయ॥

అయమేవ శ్రీవెంకటాద్రి విరాజితే
అయమేవ వరదో ప్యాచకానా
అయమేవ వేదవేదాంతశ్చ సూచితో
అయమేవ వైకుంఠాధీశ్వరస్తు. ॥అయ॥ 17

* ఈకీర్తనను ఈక్రింది విధముగా సవరించి పఠింపఁదగును :—

అయమేవ అయమేవ ఆదిపురుషో
జయకరం తమహం శరణం భజామి. ॥పల్లవి॥

అయమేవ ఖలు పురా అవనీధరస్తు సో
ప్యయమేవ వటపత్రాగ్రాధిశయనః

## సామంతం

ఇన్నిటా నింతటా నిరవొకటే
వెన్నుని నామమే వేదంబాయె. ॥పల్లవి॥

నలినదళాక్షుని నామకీర్తనము
కలిగి లోకమునఁ గలదొకటే
యిలనిదియే భజియింపఁగఁబుణ్యులు
చెలఁగి తలఁప సంజీవని యాయె. ॥ఇన్ని॥

కోరిక నచ్యుత గోవిందాయని
ధీరులు దలఁపఁగఁ దెరువొకటే
ఘోరదురితహర గోవర్ధనధర
నారాయణయని నమ్మఁగఁగలిగె. ॥ఇన్ని॥

తిరువేంకటగిరిదేవుని నామము
ధరఁదలపగ నాధారమిదే
గరుడధ్వజుని సుఖప్రదనామము
నరులకెల్లఁ బ్రాణము దానాయె. ॥ఇన్ని॥ 18

---

అయమేవ దశవిధైరవతారరూపైశ్చ
నయమార్గభువి రక్షణం కరోతి. ॥అయ॥

అయమేవ సతతం శ్రియఃపతిర్దేవేషు
అయమేవ దుష్టదైత్యాంతకస్తు
అయమేవ సకలభూతాంతరేష్వాత్మక్య
ప్రియభక్తపోషణం ప్రీత్యా తనోతి ॥అయ॥

అయమేవ శ్రీవేంకటాద్రౌ విరాజతే
అయమేవ వరదోపి యాచకానాం
అయమేవ వేదవేదాంతైశ్చ సూచితో
స్త్వయమేవ వైకుంఠాధీశ్వరస్తు. ॥అయ॥

354-వ రేకు. రామక్రియ

ఎందరు సతులో యెందరు సుతులో
యిందునందు నెట్లెరిఁగే నేను. ॥పల్లవి॥

మలయుచు నాయభిమానములని నే
కెలననిపుడు వెదకేనంటే
పలుయోనులలో పలుమా (మ?) రుఁబొడమిన
చలమరి నాతోలు జన్మంబులను. ॥ఎంద॥

గరిమెలఁ బాణిగ్రహణము సేసిన
సిరుల చెలులఁ గలసేనంటే
తరుణుల గురుతులు తలఁపున మరచితి
పరగిన బహుకల్పంబులయందు. ॥ఎంద॥

శ్రీవెంకటగిరి చెలువుని యాజ్ఞల
భావించియె కరిఁ బైకొంటి
తావులఁజూడఁగ తగిలినకోర్కుల
భావరతుల బెంబడి మనసందు. (?) ॥ఎంద॥ 19

గుండక్రియ

కటకట హరిమాయాకల్పనెట్టిదో
తటుకునఁ బారవేసే తలఁపెందు లేదు. ॥పల్లవి॥

అనంతకోటి యుగాదులనుండియు
తనివోక విషయాలఁ దగిలుండినా
దినదినకొక్కక్క రుచియై తీపులై ఁ పండీఁగాసి
వెనుకొన్నయాత్మకు వెగటెందు లేదు. ॥కటకటా॥

కడలేక నాలుకకుఁ గన్నయాహారములెల్ల
నొడలిలోఁ బూఁటవ్రాఁట నొట్టుకొనినా
సడిఁ బైపై వింతవింత చవులే వెదకుఁగాని
విడువని యాత్మకు వెగటింపు లేదు. ॥కటకటా॥

కలకాలముననుండి కాపురపు లంపటాలె
కలిమితోఁ దొడఁగుచ్చి కట్టుకొనినా
యెలమితో శ్రీవెంకటేశ్వరునాజ్ఞల
నలవాటైన యాత్మకలపే లేదు. ॥కటకటా॥ 20

లలిత

నటనల భ్రమయకు నామనసా
ఘటియించువారియె కలవాఁడు. ॥పల్లవి॥

ముంచిన జగమిది మోహినీగజము
పొంచినయాస పుట్టించేదిది
వంచనల నిజమువలెనే వుండును
ముంచులు మాయలె మరునాఁడు. ॥నటన॥

సరిసంసారము సంతలకూటమి
సారిదిఁబచారము చూపేదిది
గరిమనెప్పుడుఁ గలకలమనుచుండును
మరులగువిధమే మాపటికి. ॥నటన॥

కందువదేహము గానిముదియదిది
అందిన బహురూపమ్మాడేదిది
యెందును శ్రీవెంకటేశ్వరుఁడుండును
డిందుపడఁగనిదె తెరమరఁగు. ॥నటన॥ 21

పరిసంసారమనే - బహురూపక్షేత్రం కాని
చదువుఁదనాన కందు-సమర్థుఁగాను. [VII-21]

### గుండక్రియ

నిశ్చింతం పరమం సుఖమనుమాటే నిజమునిజము తెలియరుగాని
ఆశ్చర్యంబిది పరమయోగులకు ననుభవులకు దృష్టాంతమునుండీ. ॥పల్లవి॥

కరచరణాదులుగల చైతన్యము గక్కునఁ బానుపుపై నుండి
సరుగన సడిలిన నిద్రామందము సమకూడీ నరులకటువలెనే
పరమాత్మునిపై సకలోద్యోగ వు(గో?) పాయంబులు దా దిగవిడిచి
ధరఁ దానుండిన బ్రహ్మానందము తనుఁదానే పైకొనుఁజుండీ. ॥నిశ్చిం॥

ఉన్నతిఁ దానొక దేశములోపల నుండి క్రితముచూచిన నవియెల్లా
అన్ని దేశములు నటుదలపోసిన యంతకుగోచరమైనట్లు
ఎన్నగఁబూర్వజ్ఞానంబున సర్వేశ్వరుఁడగుహరిఁ దలఁచినను
సన్నిధియగు సుజ్ఞానానందము సత్యము సత్యంబదిసుండీ. ॥నిశ్చిం॥

ననిచిన ప్రపంచకల్ప (ల్ప?) ములలో నానావిధముల జంతువులు
తనుఁదాఁజూడఁగ రానిరూపులద్దములోపలఁ గన్నట్లు
ఘనుఁడగు శ్రీవెంకటపతిరూపము గక్కున నెదుటనె సేవించి
అనయము తనుఁదా నంతసించుటే యాత్మానందంబిదినుండీ. ॥నిశ్చిం॥ 22

### సాళంగనాట

ఒసఁగితివిన్నియు నొకమాఁటే
వెస నీకఁజేసే విన్నపమేది. పల్లవి॥

నారాయణ నీనామము దలఁచిన
నీరానివరములిచ్చితివి
చేరి నిన్నునిటు సేవించిననీకఁ
గోరి పడయనీకఁ గోరిక లేవి. ॥ఒస॥

హరి నీకొకనరి యటు శరణంటే
గరిమల నన్నిటు గాచితివి
నిరతముగా నిఁక నిను నుతియింపుచు
అరగొరతని నిను నడిగేదేదో. ॥ఒస॥

శ్రీవేంకటేశ్వర చేయెత్తి మొక్కిన
భావమె నీపై పరగితివి
యీవరుసల నీవింతటిదాతవు
ఆవల నినుఁ గొనియాడెడిదేమి. ॥ఒస॥ 23

**భౌళి**

దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువఁగా తిరుతేరు. ॥పల్లవి॥

తిరువీధులేగీని తిరుతేరు
తిరుపుగొన్నట్లాను తిరుతేరు
తెరలించె దనుజులఁ దిరుతేరు
తిరిగె దిక్కులనెల్ల తిరుతేరు. ॥దేవ॥

ధిక్కరించీ మోతలఁ దిరుతేరు
దిక్కరి కుంభాలదరఁ దిరుతేరు
తిక్కముత్తేల కుచ్చుల తిరుతేరు
తెక్కులఁ బ్రతాపించీఁ దిరుతేరు. ॥దేవ॥

తిరిచెఁ గలకలెల్లఁ దిరుతేరు
ధీర గరుడవాహపుఁ దిరుతేరు
చేరి యలమేలుమంగతో శ్రీవేంకటేశ్వరుని
తీరున నెలకొన్నట్టి తిరుతేరు. ॥దేవ॥ 24

355-వ రేకు. సాళంగ

మాధవ భూధవ మదనజనక
సాధురక్షణచతుర శరణు శరణు. ॥పల్లవి॥

నారాయణాచ్యుతానంత గోవింద శ్రీ
నారసింహ కృష్ణ నాగశయన
వారాహ వామన వాసుదేవ మురారి
శౌరీ జయజయతు (?) శరణు శరణు. ॥మాధ॥

పుండరీకేక్షణ భువనపూర్ణగుణ
అండజగమన నిత్య హరి ముకుంద
పండరిరమణ రామ బలరామ పరమపురుష
చండభార్గవరామ శరణు శరణు. ॥మాధ॥

దేవ దేవోత్తమ దివ్యావతార నిజ
భావ భావనాతీత పద్మనాభ
శ్రీ వేంకటాచల శృంగారమూర్తి నవ
సావయవసారూప్య శరణు శరణు. ॥మాధ॥ 25

లలిత

దొరకినయప్పుడె తుదగాక
మరుగకుమెన్నఁడు మరి మనసా. ॥పల్లవి॥

తనుభోగంబులఁ దనిపినవిమ్మట
వెనుకొని హరిఁ దడవేనంటే
దినమునుఁ దను నింద్రియముల చలమిది
తనియుట యెన్నఁడు దగుమనసా. ॥దొర॥

తిరముగునాసలు దీరినవిమ్మట
తెరలి విరతిఁ బొందే నంటే
మరలని యాశామయమీచిత్తము
విరతి యెన్నఁడీఁక వెడమనసా. ॥దొర॥

ముదిసినవిమ్మట మొగి శ్రీ వేంకట
సదయుఁ గొలుతు నిచ్చటనంటే
హృదయము శ్రీ వెంకటేశుని నెలవిది
యిదిగనుటెన్నఁడు యీమహిమనసా. ॥దొర॥ 26

లలిత

తెలిసియుఁ దెలియదు దేరినచిత్తము
నలినాక్ష గోవింద ననుఁగావవయ్యా. ॥పల్లవి॥

ఏఁకట నినుగొలిచి యితరుల వేఁడనేల
వేఁకపుటాసల నాలో వెలితిగాక
చీఁకటివాసినమీఁద చీఁదరగొనఁగనేల
మాఁకువంటివెడబుద్ధి మానదిదేమయ్యా. ॥తెలిసి॥

పొంచి నీదాసుఁడనై యల్పుల వేఁడఁ బోనేల
చంచలగుణముల నాజాలిగాక
అంచలఁ దెరువుకని యడవిఁ బడఁగనేలా
యించుకంత యేవపుట్టదేమి పాపమయ్యా. ॥తెలిసి॥

మతిలో నీవుండఁగాను మాయలఁ బొరలనేలా
వెతకి తెలియని నావేదురుగాక
గతియై శ్రీ వేంకటేశ కరుణించితివి నన్ను
తతి నాతపమునేఁడు దరిచేరెనయ్యా. ॥తెలిసి॥ 27

గుండక్రియ

తెలియనివారికిఁ దెరమఱుఁగు
తెలిసినవారికి దిష్టంబిదియే. ॥పల్లవి॥

కన్నులయెదుటనుఁ గాంచిన జగమిది
పన్నిన ప్రకృతియు బ్రహ్మమునే
యిన్నిట నుండఁగ నిదిగాదని హరిఁ
గన్నచోట వెదకఁగఁ బోనేలా. ॥తెలి॥

అగపడి యిరువదియైదై జీవునిఁ
దగిలినవెల్లాఁ దత్త్వములే
నగవుల నిదియును నమ్మఁగఁ జాలక
పగటునఁ దమలోఁ భ్రమయఁగ నేలా. ॥తెలి॥

అంతరంగుఁడును సర్వావతారము
నింతయు శ్రీవేంకటేశ్వరుఁడే
చెంతల నీతనిసేవకులకు మరి
దొంతికర్మముల తొడసిఁకనేలా. ॥తెలి॥ 28

గుండక్రియ

ఏలోకో కర్మమా యిందుకుఁ బాలై తిని
పాలుపడిన యీ జలభ్రమణమువలెను. ॥పల్లవి॥

ధరలోఁ బుట్టినప్పుడే తలఁచ నీ యాత్మ
మఱుగఁడు పరమైతే మఱచీఁగాని
అరిది దుర్భావముల నలవడ్డనాలికె
హరినామములయందు నలవడదు. ॥ఏలో॥

జవకట్టి పూర్వవాసనల సంసారమే
చవియె తాఁగాని ముక్తి చవిగాదు
భువిఁగల విషయాలఁ బుంగుడయ్యేఁగాని మతి
వివరించి దైవమును వెదకలేదు. ||ఏలా||

శ్రీవేంకటేశుకృపచేత నింతేకాని
నావాత నివి గైవశము గావు
జీవమిప్పుడితని పాదాలు చేరికాని
ఏవుపమలనుఁ గానమిన్నాళ్లును. ||ఏలా|| 29

ముఖారి

చవి నోరికేడఁదెత్తు సంపదేడఁదెత్తు వీని
సవరించుటే నానంపదిది గాదా. ||పల్లవి||

పచ్చడాలెక్కడఁదెత్తు పట్టుచీరలేడఁదెత్తు
వెచ్చనిండ్లేడఁదెత్తు వెంట వెంటను
తెచ్చిన యీపచ్చడము దేహమిది వెంటవెంట
వచ్చీఁగాక తన్నుఁదానె వద్దనఁగవచ్చునా. ||చవి||

దొరతనమేడఁదెత్తు దొడ్డసొమ్ములేడఁదెత్తు
యెరవులసిరుల నేనేడఁదెత్తు
వెరవుననేనెవ్వరిని వేసరించఁజాలక
దరిచేరుటే దొరతనమిది గాదా. ||చవి||

తోడఁబుట్టువులనేడఁ దోడితెత్తుఁ జుట్టాల
నేడఁదెత్తు సుతులపొందేడఁదెత్తును
వేడుకైనపొందు శ్రీవెంకటేశుఁ దలఁచుటే
యీడులేని బంధుకోటి యీతఁడేకాఁడా. ||చవి|| 30

356-వ రేకు. శ్రీరాగం

ఓపవనాత్మజ ఓఘనుఁడ
బాపుబాపనఁగఁ బరగితిగా. ॥పల్లవి॥

ఓ హనుమంతుడ వుదయాచలని
ర్వాహక నిజ సర్వప్రబల
దేహము మోఁచిన తెగువకు నిటువలె (?)
సాహసమిటువలెఁ జాటితిగా. ॥ఓపవ॥

ఓ రవిగ్రహణ ఓ దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపు వినతాతనయాదులు
గారవింప నిటు గలిగితిగా. ॥ఓపవ॥

ఓ దశముఖహార ఓ వేంకటపతి
పాదసరోరుహపాలకుఁడా
యీ దేహముతో నిన్నిలోకములు
నీదేహమొక్క నిలిచితిగా ॥ఓపవ॥ 31

ముఖారి

దిక్కులేనివారు నీవేదిక్కని కొలువఁగా
అక్కరకితఁడు దైవమందురువో నిన్నును. ॥పల్లవి॥

పొలుపడి నిన్నుఁజేరి పట్టికొలిచిన వారి
జాలిపాటు తొలఁగించి జడనువాపి
మూలఁబడనీక తెచ్చి ముద్దుసేసికావఁగాను
మేలెరుఁగు బుధులెల్ల మెత్తురువో నిన్నును. ॥దిక్కులేని॥

కొండలుఁ గోట్లునైన కోరికలుగలవారి
యండనె కోరికలిచ్చి యాదరించఁగా
నిండినదాసులకెల్ల నీవే దైవమవని
కొండమీఁదనుండినఁ బైకొందురువో నిన్నును. ॥దిక్కులేని॥

ఏకమైనమనసుతో నెవ్వరు దలఁచినాను
చేకొని కరుణఁ గృపసేయఁగాను
యేకాలము శ్రీవేంకటేశుఁడు మాదైవమని
లోకమెల్లఁ దామే కొలుతురువో నిన్నును ॥దిక్కులేని॥ 32

## వరాళి

ఏదియుఁగానఁడు (గాననందు?) నేదిగాదందు
ఆదిపురుష నీదాస్యమే చాలునాకు. ॥పల్లవి॥

గరిమఁ గొందరికి సాకారమై నిలిచితి
గురునిరాకారమై కొందరికి
సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవట నీవు
ధర నిర్గుణమవట తగిలి కొందరికి. ॥ఏదియు॥

ఒకటఁ గళాపూర్తినొనరి యుండువట
ఒకట నిష్కళుఁడవై వుడివోవట
ఒకచో జీవుల (కు?) నీకొరయ భేదమట
ఒకచో నె (న?) భేదమట ఉన్నారట నీకు. ॥ఏదియు॥

అదన నిందరిలోన నంతరాత్ముఁడవట
యెదుట శ్రీవెంకటేశుఁడవట
యిదియది యననేల యింతయును నీ మహిమ
కదిసి నీ పాదాలె కనుఁగొంటగాక. ॥ఏదియు॥ 33

లలిత

మాధవ కేశవ మధుసూదన విష్ణు
శ్రీధరా పదనభం (ఖం?) చింతయామియామాయం (మోవయం?) ॥పల్లవి॥

వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా
రామ రామ కృష్ణ నారాయణాచ్యుత
దామోదరానిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో. ॥మాధవ॥

పురుషోత్తమ పుండరీకాక్ష దివ్య
హరి సంకర్షణ యధోక్షజ
నరసింహ హృషీకేశ నగధర త్రివిక్రమ
శరణాగతరక్ష జయజయ నేవే. ॥మాధవ॥

మహితజనార్దన మత్స్య కూర్మ వరాహా
సహజభార్గవ బుద్ధ జయతుర (గ?) కల్కి
విహితవిజ్ఞాన శ్రీ వేంకటేశ శుభకరం
అహమిహతహతద (అహమిహ తవపద?) దాస్యమనిశం భజామి. ॥మాధవ॥

గుండక్రియ

అందిచూడగ నీకు నవతారమొకటే
యందువాడవైతివి యేటిదయ్యా. ॥పల్లవి॥

నవనీతచోరా నాగపర్యంకా
నవనరక్షక హరీ చక్రాయుధా
అవల దేవకిపుట్టినని యశోదకు నిన్ను
నివలఁ గొడుకవనేదిది యేటిదయ్యా. ॥అంది॥

పట్టపు శ్రీరమణా భవరోగవైద్య
జట్టిమాయలతోడిశౌరి కృష్ణ
పుట్టినచోటొకటి పాదలెడిచోటొకటి
యెట్ట (ని?) ను నమ్మవచ్చు నిదియేటిదయ్యా. ॥అంది॥

వేదాంతనిలయా వివిధాచరణా
ఆదిదేవ శ్రీ వెంకటాచలేశ
సోదించి తలఁచినచోట నీ వుండుదువట
యేదెస నీ మహిమే యిదేఁటిదయ్యా. ॥అంది॥ 36

## గుండక్రియ

తలపోఁత చిత్తమునఁ దరిగానక బుద్ధి
గలఁగెఁ గావవో మమ్ముఁ గర్మమా. ॥పల్లవి॥

పాపజాతిమేనితోడఁ బడ్డపాటే చాలదా
ఆపదలకేల లోనాయ నిప్పుడు
దీపమైన హరిభక్తి దెలిసియుంతటనై న
గాపాడి పరమీవో కర్మమా. ॥తల॥

చెప్పరాని సుఖములు చెప్పిచెప్పి కనికని
చప్పుడుగా లోకమునఁ జాటిచాటి
దెప్పరపుభవములఁ దిప్పుదీరై తిమిదె
కప్పుకొని కావఁగదో కర్మమా. ॥తల॥

వేడుకలన్నియు శ్రీ వెంకటాద్రిరాయఁడే
కూడిన మాదైవమని కొనియాడి
యేడఁజూచినను బుణ్యామెక్కుడాయనని నమ్మి
గాడలెల్లాఁ బాసితిమి కర్మమా. ॥తల॥ 37

357-వ రేకు. సామంతం

సర్వేశ్వరుఁడే శరణ్యము
నిర్వాహకుఁడిన్నిటఁ గాన. ||పల్లవి||

బలుదేవతలకు బ్రహ్మాదులకును
జలజనాభుఁడే శరణ్యము
అలరిన బ్రహ్మాండమలిసిననాఁడును
నిలిపినాతఁడిన్నిటిఁగాన. ||సర్వే||

అనేకవిధముల నఖిలజీవులకును
జనార్దనుఁడే శరణ్యము
అనాథనాథుఁ డంతరాత్మకుఁడు
అనాదిపతి యితఁడటుగాన. ||సర్వే||

తగునిశ్చలులగు తనదాసులకును
జగదేకపతే శరణ్యము
చిగురుఁజేవయగు శ్రీ వేంకటేశుఁడు
అగువరములొసఁగు నటుగాన. ||సర్వే|| 38

లలిత

సోదించిరిదియె సురలును మునులును
ఆదికినాది హరినామం. ||పల్లవి||

అరిది వేదశాస్త్రార్థ సంగ్రహము
అరయఁగ నొకటే హరినామం
దురితహరము భవదుఃఖనాశనము
అరిభయంకరము హరినామం. ||సోదించి||

సకలపుణ్యఫలసార విహారము
అకలంకము శ్రీహరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది (శ్రీ ?) హరినామం. ||సోదించి||

కందువ సదరము కైవల్యపదము
అందరికిదియే హరినామం
ఎందును శ్రీవెంకటేశ్వరు కరుణకు
నందుకోలైన హరినామం. ||సోదించి|| 39

సాళంగనాట

ఇన్నిటికి నోపునా యీ మనసు నన్ను
మన్నించి నీమనసు మరిగించు మనసు ||పల్లవి||

పొలఁతులకాఁకనే పుటమెక్కె మనసు
చలివేఁడిజవ్వనమునందిఁ జిక్కె మనసు
వలరాజుతూపునంజు వడినెక్కె మనసు
మలసి రతిసుఖాల మరపాయ మనసు. ||ఇన్ని||

పచ్చని కనకముపై భ్రమఁబడె మనసు
చిచ్చువంటివిషయాల శివమెత్తె మనసు
ఒచ్చువుఁ బాపాలకెల్లా నొడిగట్టె మనసు
బచ్చన చంచలములఁ బాటిచెడె మనసు. ||ఇన్ని||

కోరి యంతలో గురుఁడు గొంటవేసె మనసు
ఓరుపుతో నీపాలికొప్పగించె మనసు
ఈరీతి శ్రీవేంకటేశుఁడ నామనసు
ఘోరపువిజ్ఞానము తుదకెక్కె మనసు. ||ఇన్ని|| 40

### రామక్రియ

నమ్మితే నితఁడే మన్ననఁ గాచు
ఇమ్ముల ధ్రువునిఁ బట్టమేలించినట్లు ॥పల్లవి॥

తీరని కర్మములైన దీరుఁబో శ్రీహరిపాద
మేరీతిఁ గొలిచినా నెవ్వారికిని
చేరరానియడవిలో శిలలై పడియున్న
భారపుటహల్య శాపము దేరినట్లు. ॥నమ్మి॥

కలుగని సిరులెల్లఁ గలుగుఁబో శ్రీహరిఁ
గొలిచినవారికిఁ గోరినట్లే
అలనాఁడు దరిద్రుఁడైన కుచేలుని
బలుసంపదలఁ దెచ్చి బతికించినట్లు. ॥నమ్మి॥

చూడఁగా మూఢులకైన సులభుఁడై నిలుచుఁబో
వేడుకతోఁ బాడితే శ్రీవేంకటేశుఁడు
యీడనె మాబోంట్లకు నిరవై కోనేటిదండ
మేడెపువరములెల్ల మెచ్చియిచ్చినట్లు. ॥నమ్మి॥ 41

### లలిత

దేవునిమరవకు మింతే మాట చిత్తమా
దీవెనై కలఁడు మాకు దేవుఁడు. ॥పల్లవి॥

అరుదగుజీవుని బ్రహ్మాండగోళములోన
తెరఁగై పుట్టించువాఁడు దేవుఁడు
అరసి కమ్మరవచ్చి యన్నపానాదులు వెట్టి
తిరుగ రక్షించువాఁడు దేవుఁడు. ॥దేవుని॥

బలుసంసారములోన భ్రమసి యుండినమాకుఁ
దెలిపి చెప్పినవాఁడు దేవుఁడు
తెలియనికర్మములు తెగనిబంధాలు వాపి
తిలకించి కాచువాఁడు దేవుఁడు. ॥దేవుని॥

తల్లియుఁ దండ్రియునై దాతయై కలఁడుమాకు
తెల్లమి శ్రీవేంకటాద్రిదేవుఁడు
మల్లాడి తనదాసులమతిలోఁ దానుదయించి
తెల్లవారించేవాఁడు దేవుఁడు. ॥దేవుని॥ 42

## ముఖారి

ఆలించు పాలించు ఆదిమపురుష కృప
జాలిదీర నీకే శరణుచొచ్చితిమి. ॥పల్లవి॥

గతినీవే మతినీవే కర్తవుభర్తవు నీవే
పతియు వేపి (నీవే ?) యేపట్టునా మాకు
యితరములెవ్వరున్నారెంచిచూడ నిన్నుఁబోల
చతురుఁడ నిన్నునే శరణుచొచ్చితిమి ॥ఆలించు॥

జననీజనకులు శరణము నీవే
పునికిమనికి నీవే పుపమ నీవే
మనసిచ్చి నీవే నన్ను మన్నించుకొంటేనే
చనవిమనవి నీకే శరణుచొచ్చితిమి. ॥ఆలించు॥

లోకసాక్షివి నీవే లోకబంధుఁడవు నీవే
యీకడ శ్రీవెంకటేశ యిదివో నీవె
నీకంటె మరిలేరు నిఖిలమింతయుఁ గావ
సాకారరూప నీకే శరణు చొచ్చితిమి. ॥ఆలించు॥ 43

358-వ రేకు. గుండక్రియ

నాటకమింతా నవ్వులకే
పూటకుఁబూటకుఁ బొల్లైపోవు. ॥పల్లవి॥

కోటివిద్యలునుఁ గూటికొఱకె పో
చాటువ మెలఁగేటి శరీరికి
తేటల నాఁకలిదీరినపిమ్మట
పాటుకుఁ బాటే బయలై పోవు. ॥నాట॥

మెఱసేటిదెల్లా మెలుఁతలకొఱకే
చెఱల దేహముల జీవునికి
అఱమరపుల సుఖమందినపిమ్మట
మొఱఁగుకు మొఱఁగే మొయిలై పోవు. ॥నాట॥

అన్ని చదువులును నాతనికొఱకే
సన్నెరిఁగిన సుజ్ఞానికిని
యిన్నిట శ్రీవేంకటేశుదాసునికి
వెన్నెలమాయలు విడివడిపోవు. ॥నాట॥ 44

గుండక్రియ

ఎన్నిటికెన్నిటికని యెక్కడఁ దగిలెదము
మన్నించు దేవ మాకుఁజాలు. ॥పల్లవి॥

ముఖరమై మాఁకులకు మొదలఁబోసిననీరు
శిఖలకుఁ దనువెక్కి చిగిరించినయట్టు
నిఖలప్రయోజనాలు నీమూలమే కాన
ముఖపతి నీసేవే మాకుఁజాలు. ॥ఎన్ని॥

వరుసలనిన్నిటా వన్నె బంగారమే
పరిపరివిధముల పలుసొమ్ములైనట్లు
నిరతిఁ గర్మఫలాలు నీమూలమే కాన
మరుగురుఁడవు నీవే మాకుఁ జాలు. ॥ఎన్న॥

వెలయ శ్రీవేంకటేశ వివిధజంతువులకు
అలవిలేనిభూమే యాధారమైనట్లు
నెలవు దేవతలకు నీవేలికవు గాన
మలసి నీశరణమే మాకుఁజాలు. ॥ఎన్న॥ 45

## రామక్రియ

మాయలో మోహమున మరచితివిదే హరి
వేయింటికి వింటే వివేకమా. ॥పల్లవి॥

అంతటికినొడయఁడు అఖిలజీవులలోన
అంతర్యామి శ్రీహరియట
యింతటిలో నీకు హితబంధువులు వేరి
వింతవారెవ్వరు నీకు వివేకమా. ॥మాయ॥

అరయ నక్షరవాచి యతఁడట యిలలోనఁ
బరమమంత్రాలెపో పలుకులెల్ల
నిరతపునుతి యేది నిందయేది యిందులోన
వెరవెరఁగవుగాక వివేకమా. ॥మాయ॥

మొదలను నడుమను ముగిసినర్థములందు
యెదుటను శ్రీవెంకటేశుఁడట
యిదియది యననేల యిచ్ఛాద్వేషమేల
వెదకుము సమబుద్ధి వివేకమా. ॥మాయ॥ 46

రామక్రియ

సందెకాడఁ బుట్టినట్టి చాయలపంట యెంత
చందమాయఁ జూడరమ్మ చందమామపంట. ॥పల్లవి॥

మునుపఁ బాలవెల్లి మొలచి పండినపంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్నుఁగొనచూపులపంట
వినువీధి నెగడిన వెన్నెలలపంట. ॥సందె॥

వలరాజుపంపున వలపువిత్తినపంట
చలువై పున్నమనాఁటి జాజరపంట
కలిమికామినితోడఁ గారుకమ్మినపంట
మలయుచుఁ దమలోని మచ్చిమానిపంట. ॥సందె॥

విరహులగుండెలకు వెక్కసమైన పంట
పరగ చుక్కలరాసి భాగ్యముపంట
అరుదై తూరుపుఁగొండ నారఁగబండినపంట
యిరవై శ్రీవెంకటేశునింటిలోనిపంట. ॥సందె॥ 47

ఆహిరి

ఎన్నఁడు విజ్ఞానమిఁక నాకు
విన్నపమిదె శ్రీవెంకటనాథా. ॥పల్లవి॥

పాసినఁ బాయవు బంధములు
ఆసదేహమున్నన్నాళ్ళు
కోసినఁ దొలఁగవు కోరికలు
గాసిలి చిత్తము గలిగినన్నాళ్ళు. ॥ఎన్న॥

కొచ్చినఁ గొరయవు కోపములు
గచ్చుల గుణములు గలనాళ్ళు
తచ్చినఁ దలఁగవు తహతహలు
రచ్చల విషయపు రతులన్నాళ్ళు. ॥ఎన్న॥

ఒకటికొకటికిని వొడఁబడవు
అకట శ్రీవేంకటాధిపుఁడ
సకలము నీవే శరణంటే యిఁక
వికటములణఁగెను వేడుకనాళ్ళు ॥ఎన్న॥ 48

బౌళి

ఎంతవెట్టి గొండదవ్వి యెలుకఁ బట్టెద నేను
పంతపు శ్రీహరి నా భ్రమ వాపవే. ॥పల్లవి॥

పడనిపాట్లఁ బెక్కుపనులఁ దిరుగుటెల్ల
కుడిచే పట్టెఁడు కూటికొరకింతే కా
కడదాఁకాఁ జెలులతోఁ గాఁపురము సేయుటెల్ల
వొడలు మరచియుండే వొక్కనిమిషానకా. ॥ఎంత॥

ఘనమైన గృహములు గట్టుకొనుటెల్లాను
తనువు మోచేయంతటికే కా
తనివోని మతిలోని తలపోఁతలెల్లాను
యెనసిన బదుకు తానెంచుటకే కా. ॥ఎంత॥

యింతలోని పనియని యెరఁగని చేఁతలెల్లా
సంతకూటములు యీసంసారానకా
చెంతల శ్రీవేంకటేశ చేరి నీకే శరణంటే
యింతకమున్నిటి నేరమేమనేవో కా. ॥ఎంత॥ 49

359-వ రేకు. లలిత

నీవె కాచుటగాక నేరుపు నాయందేది
చేవల వేపమాను చేదు మానీనా. ॥పల్లవి॥

ఒరసి దుర్గుణములనూనిన నాచిత్తము
మరలి మంచిగుణాన మట్టుపడీనా
హరి నిన్నుఁ దలఁచక యడవిఁ బడిన మరి (తి?)
దరిచేరి నిన్ను మఱిఁ (రి?) దలఁచఁ బోయీనా. ॥నీవె॥

పాలుమాలి యింద్రియాల బారిఁబడ్డ పుట్టువిది
ఆలరి వైరాగ్యసుఖమందఁ బోయీనా
?లవర్ణ నినుమాని నిత్యసంసారైన నేను
కాలమందే నిన్నెరఁగఁ గలనా (నేను). ॥నీవె॥

గరిమ సుజ్ఞానము గలిగిన సాత్వికు
మరయ వేరొకచోట నణఁగీనా
యిరవై (వై?) శ్రీ వేంకటేశుఁడ నీకరుణబ్బె
శరణాగతుఁడ నాక్కు స్వతంత్రమా. ॥నీవె॥ 50

ముఖారి

ఇందుకు విరహితములిన్నియు నజ్ఞానమని
చందమున గీతలందుఁ జాటీసిదివో. ॥పల్లవి॥

మానావమానములు మాని డంబు విడుచుట
పూని హింసకుఁ జొరక యోరుపు గలుగుటయు
ఆని మతిఁ గరఁగుట యాచార్యోపాసన
తానెప్పుడు శుచియౌట తప్పని విజ్ఞానము. ॥ఇందు॥

అంచల సుస్థిరబుద్ధి యాత్మవినిగ్రహము
అంచితవిషయ నిరహంకారాలు
ముంచిన జన్మదుఃఖములు దలఁపోయుట
కంచవు సంసారము గడుచుటే జ్ఞానము. ॥ఇందు॥

అరిమిత్ర సమబుద్ధి యనన్యభక్తియు
నరినేకాంతకమ్మును సజ్జనసంగ విముక్తి (?)
ధర నధ్యాత్మజ్ఞానతత్వము దెలియుట
గరిమలందుట శ్రీవేంకటపతి జ్ఞానము ॥ఇందు॥ 51

లలిత

ధ్రువవరదునివలె తుదకెక్కఁగాక మరి
యివల గర్మఫలంబు లేవైన సతమా. ॥పల్లవి॥

కరిరాజవరదునకు కడఁగి శరణంటేను
కరిఁగాచి నట్లనే కాఁచుగాక
పరదైవముల కెంత భంగపడి మొక్కినా
అరసి రావణుఁగొనఁగినట్లనే కాదా. ॥ధ్రువ॥

శ్రీపతిని అడిగినను జిగి నజావింటువలె
చేపట్టిసిరుల రక్షించుఁగాక
అపోక కౌరవ్యుఁడు హరిపరాఙ్ముఖుఁడైన
పైపైనె సంపదలు పార్థుచేఁ బడవా. ॥ధ్రువ॥

శ్రీవెంకటేశుఁడిచ్చే యీ వరంబులే
వోవలను ద్రిష్టమై యుండుఁగాక
భావించ నితరములు పరలోకములయందు
కై వశంబగు ననే కథలవలెఁగాదా. ॥ధ్రువ॥ 52

బౌళి

ఏమినేయుదు నింతయు నీమాట
సామజవరద నాచందమిది. ॥పల్లవి॥

జలములోపల నున్న చందురునీడవలె
నలుగడలఁ గదలీ నామనసు
వెలుచు మేఘములు గప్పిన సూర్యునివలె
నెలుఁగదు నాలోని విజ్ఞానము. ॥ఏమి॥

కడఁగి యాకసమున గాలియణఁగినట్లు
వడిఁగానరాదు నావైరాగ్యము
ముడిగిముత్తెపుఁజిప్ప ముత్యము విధంబున
జడిసీ నాలోని సాత్వికము. ॥ఏమి॥

యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీకృపవలె
ఉప్పతిల్లె నిజభక్తి యొక్కటై నీపై
కప్పిన నీసేవవలెఁ గన్ననిధానమువలె
అప్పసమై నిలిచె బ్రహ్మానందము. ॥ఏమి॥ 53

బౌళిరామక్రియ

ఎన్నఁడు నేఁగందు నిందు నిందిరాపతి నీవె
కన్నులెదుటనుండి కరుణింతుగాక. ॥పల్లవి॥

పొడమిన యట్టె నిన్ను పొంచికొలిచే నంటే
కడు నాకప్పుడు వివేకము చాలదు
అడరి యంతటిమీఁదనైనాఁ దెలియఁ జూచితే
వడి జవ్వనమదము వశమ్మందున్నాద్ను. ॥ఎన్నఁడు॥

వెనకనేఁ బ్రౌఢనై విరతిఁ బొందే నంటే
ధనవాంఛనేమియుఁ దడవనీదు
తనువు ముదిసి నీకుఁ దపము సేసేనంటే
వొనర నేమిటికిని వోపికలేదు. ॥ఎన్నఁడు॥

శ్రీ వేంకటేశ ఈసిలుగులఁ బెట్టనేల
కైవశమై నీవు గలిగుండఁగా
నీవె కృపసేసి నేఁడిం గావకున్న
పావనమైన యీ పదవెందుఁ గద్దు. ॥ఎన్నఁడు॥ 54

## సామంతం

ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు
కందువ నిధానమవై కలవుగా నీవు ॥పల్లవి॥

అరసి ధ్రువుని గాచినట్టి నీవు
కరుణతోఁ బ్రహ్లాదుఁగాచిన నీవు
కరిరాజు శరణంటేఁ గాచిన నీవు
కరతలామలకమై కలవుగా నీవు. ॥ఇందరి॥

గట్టిగా విభీషణుఁగాచిన నీవు
అట్టె ద్రౌపదిఁ గాచినప్పటి నీవు
చెట్టవట్టి బలిఁగాచిన నీవు నాకు
కట్టిన ముడుపవై కలవుగా నీవు. ॥ఇందరి॥

కమ్మర సుగ్రీవునిఁ గాచిన నీవు నేఁడు
కిమ్ముల లోకములు రక్షించే నీవు
నెమ్మది శ్రీ వెంకటనిలయ నీవు నాకు
కమ్ముకొని దాపుదండై కలవుగా నీవు. ॥ఇందరి॥ 55

360-వ రేకు. లలిత

దైవమే నేరుచుఁగాక తగిలించ విడిపించ
ఈవల సంసారికి నేమిసేయ వచ్చును. ॥పల్లవి॥

ఆన యెచ్చోటనుండు నక్కడ దైన్యమునుండు
వాసులన్నీ నెందునుండు వన్నెలు నందుండు
వేసట యెక్కడనుండు వీతరాగమాడనుండు
యీాసుల నీలంకెవాప నెవ్వరికిఁ దరము. ॥దైవ॥

అతికోపమేడనుండు నజ్ఞానమూడనుండు
మతిఁ బంతమెందుండు మత్సరమందుండు
మతకములేడనుండు మాయలును నందునుండు
యితరులెవ్వరు నిందు కేమనఁ గలరు. ॥దైవ॥

తనభక్తి యెందుండు తపమును నందుండు
మనసెందునుండు దీమసమును నందుండు
తనివి యెక్కడనుండు తగుసుఖమందుండు
తనర శ్రీవేంకటేశు దైవికములివియే. ॥దైవ॥ 56

ముఖారి

వింతనానెఁ (?) దనకు వేసాలవాఁడు
కంతునికి గురుఁడనఁ గలిగినవాఁడు. ॥పల్లవి॥

జడిగోని మొదలఁ దా జలసూత్రపువాఁడు
వెడమాయలుగ బారి విద్యలవాఁడు
కడు సోద్యములనే కర్మపుఁ జేఁతలవాఁడు
అధరి కంభపుసూత్రమాడెడివాఁడు. ॥వింత॥

ఇలనుండి మిన్ను ముట్టె యింద్రజాలములవాఁడు
తల ద్రుంచి బ్రదికించు తక్కులవాఁడు
తెలియఁ గొండలు నీళ్ళఁ దేలవేసినవాఁడు
కలసి పగలు రేయిగాఁ జేసేవాఁడు. ॥వింత॥

మగువల భ్రమయించే మానవ్రతములవాఁడు
వెగటై రాయి గంతులు వేయించేవాఁడు
చిగిరించే వరముల శ్రీ వేంకటాద్రివాఁడు
బగివాయకిట మమ్ముఁ బాలించేవాఁడు. ॥వింత॥ 57

## ముఖారి

నగవులు నిజమని నమ్మేదా
వొగినడియాసలు వొద్దనవే. ॥పల్లవి॥

తొల్లిటికర్మము దొంతులనుండఁగ
చెల్లబో యిఁకఁ జేసేదా
యెల్లలోకములు యేలేటి దేవుఁడ
వొల్లనొల్లనిఁక నొద్దనవే. ॥నగవు॥

పోయినజన్మము పొరుగులనుండఁగ
చీయనక యిందుఁ జెలఁగేదా
వేయినామముల వెన్నుఁడ మాయలు
ఓయయ్య యింకనొద్దనవే. ॥నగవు॥

నలి నీనామము నాలికనుండఁగ
తలకొని యితరముఁ దడవేదా
బలు శ్రీ వేంకటపతి నిన్నుఁగొలిచి
వొలుకుఁ జంచలములొద్దనవే. ॥నగవు॥ 58

### మంగళకౌశిక

భారకుఁడతఁడే బంధువుఁడతఁడే
చేరితిమతనినె చెంచెలమేలా. ॥పల్లవి॥

చేనకునాయుధము చేతఁగలిగితే
ఘననిర్భయుఁడై కడఁగీనట్ల (ట?)
అనంతాయుధుఁడాతుమ నుండఁగ
వెనుకొని యెందుకు వెఱవఁగనేలా. ॥భార॥

భువి నొకరాజును బొందుగఁ గొలిచిన
యివల నచ్చికంబెరఁగఁడట
భువనరక్షకుఁడు పాదిగొని ఉండఁగ
వివరించి యొరుల వేఁడఁగ నేలా. ॥భార॥

తోవ నిధానము దొరకినయప్పుడు
యేవిధములు మరి యెంచఁడట
శ్రీవేంకటపతి చేకొని కావఁగ
భావన నితరోపాయము లేలా. ॥భార॥ 57

### సామంతం

తానె తానే యిందరి (గు) గురుఁడు
సానఁబట్టినభోగి జ్ఞానయోగి. ॥పల్లవి॥

అపరిమితములైన యజ్ఞాలు వడిఁజేయఁ
బ్రపన్నులకు బుద్ధి వచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురుల గరిమల కర్మయోగి. ॥తాన॥

అన్ని చేతలును బ్రహ్మార్పణవిధిఁ జేయ
మన్నించు బుద్ధులను మఱుగఁజెప్పి
ఉన్నతపదమున కొనరఁగఁ గరుణించ (చు?)
పన్నగశయనుఁడే బ్రహ్మయోగి. ॥తాను॥

తనరఁగఁ గపిలుఁడై దత్తాత్రేయుఁడై
ఘనమైన మహిమ శ్రీవేంకటరాయఁడై
వొనరఁగ సంసారయోగము కృపసేయు
అనిమిషగతుల నభ్యాసయోగి. ॥తాను॥ 60

కన్నడగౌళ

పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవె
యిరవుగఁ గంటి వింటి నిదివో నీరూపము. ॥పల్లవి॥

పెక్కురోమకూపముల పెనుబ్రహ్మాండాలు మోచే
వెక్కసపు నీకుఁ ద్రివిక్రమాకృతి యేమి
అక్కడ వేదశ్రుతి 'యత్యతిష్ఠద (ద్ద?) శాంగుల'
మెక్కువయని పొగడీనిదివో నీరూపము. ॥పర॥

వెదక జీవులలోనే వేవేలు రూపుల (లు?) నీకు
యెదిటి దశావతారాలేమి యరుదు
అదె 'విశ్వతోముఖ యనంతమూర్తి'వని
యిదె శ్రుతి పొగడీని యిదివో నీరూపము. ॥పర॥

దిందుపడి సురలు నీతిరుమేనఁ బొడమఁగ
యిందరు నీవేయవుటేమి యరుదు
యెందును శ్రీవేంకటేశ 'యేకో నారాయణ'
యిందులో శ్రుతి చాటీనిదివో నీరూపము. ॥పర॥ 61

361-వ రేకు. రామక్రియ

భళి భళి రామా పంతపు రామా నీ
బలిమికెదురులేరు భయహర రామా. ॥పల్లవి॥

విలువిద్యరామా వీరవిక్రమ రామా
తలకొన్న తాటకాంతక రామా
కొలమై (?) బరుని తలగుండుగండ రామా
చలమరి సమరపు జయరామ రామా. ॥భళి॥

రవికుల రామా రావణాంతక రామ
రవిసుతముఖ్య కపిరాజ రామా
సవరఁగాఁ గొండలచే జలధిగట్టిన రామ
జవసత్త్వసంపన్న జానకీరామ. ॥భళి॥

కౌసల్యరామా కరుణానిధిరామా
భూసురవరద సంభూతరామా
వేసాలఁ బొరలే శ్రీ వెంకటాద్రిరామ
దాసులమమ్ముఁ గావఁదలకొన్నరామ. ॥భళి॥ 62

లలిత

అన్నిటికినిది పరమౌషధము
వెన్నునినామమే విమలౌషధము. ॥పల్లవి॥

చిత్తశాంతికిని శ్రీపతినామమె
హత్తిననిజ దివ్యౌషధము
మొత్తపు బంధవిమోచనంబునకు
చిత్తజగురుఁడే సిద్ధౌషధము. ॥అన్నిటి॥

పరిపరివిధముల భవరోగములకు
హరిపాదజలమె యౌషధము
దురితకర్మములఁ దొలఁగించుటకును
మురహరుపూజే ముఖ్యౌషధము. ॥అన్నిటి॥

యిలనిహపరముల నిందిరావిభుని
నలరి భజింపుటె యౌషధము
కలిగిన శ్రీ వేంకటపతి శరణమె
నిలిచిన మాకిది నిత్యౌషధము. ॥అన్నిటి॥ 63

సామంతం

ఎల్లలోకములవారి కేలిక దానే
కొల్లగావరములిచ్చే గురుతైనదైవము. ॥పల్లవి॥

కొండల కోనలలోన కోనేటి సరిదండ
మెండైనబంగారు మేడలలోన
నిండు జవ్వనముతోడి నెలఁత కాఁగిటలోన
వుండి జగమెల్ల నేలీ నుద్దండదైవము. ॥ఎల్ల॥

నాలుగుచేతులతోడ నవ్వులమోముతోడ
పోలి శంఖుఁజక్రముల సొంపుతోడ
నేలమిన్ను నొకటై నిలుచున్నరూపుతోడ
పాలుపడి మెరసేని ప్రత్యక్షదైవము. ॥ఎల్ల॥

సంపదలు కడుమించి చవులతో నారగించి
జొంపపు విరులపూజ సొంపుమించి
యింపుల శ్రీ వేంకటాద్రి నిరవై వున్నాఁడు వీఁడె
పంపుడు దేవతలతోఁ బ్రతిలేనిదైవము. ॥ఎల్ల॥ 64

లలిత

బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ
దొల్లిటి బారి నింకఁ దోయకుమో యయ్యా ॥పల్లవి॥

చిక్కుల భవములఁ జెరఁజిక్కి వోపలేక
నిక్కి నీమరఁగు చొచ్చి నిలిచితిని
అక్కజమై యల్లనాఁడే అప్పుల కర్మములెల్ల
యిక్కడనె చుట్టుముట్టీ నేమిసేతునయ్యా. ॥బల్లిదు॥

లచ్చి సంసారమునకు లగ్గమచ్చి తీరలేక
ఇచ్చట నిన్నుఁగొలిచి యెక్కువైతిని
పొచ్చముల నల్లనాఁటి పూఁటద్దీరదని కొన్ని
బచ్చనబంధాలు వచ్చెఁ బాఁపగదవయ్యా. ॥బల్లిదు॥

అంచల నింద్రియముల కరివెట్టి పెట్టలేక
ముంచి నీపాదాలకు మొరవెట్టితి
పొంచిన శ్రీవెంకటేశ భువనరక్షకుఁడవు
పంచలనున్నాఁడ నన్నుఁ బాలించవయ్యా. ॥బల్లిదు॥ 65

పాడి

కలకాలము నిట్టే కోఁపురవు బదుకాయ
యిలదైవమా నాకెన్నఁడో నిశ్చయము. ॥పల్లవి॥

గుట్టుతో వైరాగ్యమే కోరుదునే నొకవేళ
అట్టున సంసారపుటాఁజడి గోరుదు
మట్టుపడి యొకచోట మ(న?)సెందు నిలువదు
యిట్టె చెంచలుఁడ నాకె నెన్నఁడో నిశ్చయము. ॥కలకాలం॥

కొంతవడినే సత్త్వగుణమందు నెలకొందు
అంతలో రాజసగుణినై యుందును
చెంత దామసగుణము చేకొందునొకవేళ
యింత పలువంచలు నాకెన్నఁడో నిశ్చయము. ॥కలకాల॥

వివరించి యొకవేళ వివేకివలెనుందు
అవల మూఢుఁడనౌదు నంతటిలోనే
తవిలి శ్రీవెంకటేశ తగనిన్ను దలఁచంగ
యివలఁ దొత్రేయాయ (?) నెన్నఁడో నిశ్చయము. ॥కలకాల॥ 66

బౌళి

మానదు మతి మఱవునఁ దెలివియు
యేనింక దైవమ యేమిసేయుదును. ॥పల్లవి॥

సకలపురాణాలు శాస్త్రాలు విని విని
వొకవేళ సుజ్ఞానమొదవును
వికటమై యంతలో విషయసుఖము గని
అకట కమ్మర బుద్ధి నవే కతలు. ॥మానదు॥

పలుదుఃఖముల బాధఁబడువారిఁ బొడగని
పలికి సంసారముపై రోసును
నలువంక సిరులలో నటియించువారిఁజూచి
తలఁచి యాసల వెంటాఁ దగులునంతటను. ॥మానదు॥

మొడపకలమెల్లంగ యీ రీతినిన్నునే
బడిబడి యలసితిట్టె పైపై నింక
బిడుముడి నీమీఁద శ్రీవేంకటేశ్వర
తడవియిట్లు దయదలఁచకుండేనను. ॥మానదు॥ 67

362.వ రేకు. లలిత

హరిహరి యిందరికి నబ్బురముగాని యిది
పరగనీదాసుఁడే పరతత్త్వవేది. ॥పల్లవి॥

పొలసి మశకమందుఁ బొడమేటి జీవుని
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపోయీని
నిలువెంత నీఁకెంత నీమాయలివి భువి
బలిమిఁ దెలియువాఁడె పరతత్త్వవేది. ॥హరిహరి॥

తగిలిచూచిన నాత్మఁదనుఁగానరాదు గాని
జగమెల్ల దానై తే సరిగనీని
చిగురెంత చేగెంత శ్రీపతి యిందులోనీ
పగటు దెలియువాఁడే పరతత్త్వవేది. ॥హరిహరి॥

ఏవంకఁ దనబుద్ధి యెక్కడనుండునో కాని
శ్రీ వెంకటేశ నిన్నుఁ జింతించీని
పూవెంత ఫలమెంత పురుషోత్తముఁడు నీ
భావమెఱుఁగువాఁడె పరతత్త్వవేది. ॥హరిహరి॥ 68

సామంతం

అల్లదివో విజయధ్వజము జగ
మెల్లఁజేకొనియె నీతఁడు. ॥పల్లవి॥

తొక్కినచోట్లు దొక్కటి తురగపు
రెక్కలమీఁదటి రేవంతుఁడు
చక్కఁగ నసురల సంహరించి యిదె
దిక్కులుగెలిచెను దేవదేవుఁడు. ॥అల్ల॥

ఓడక శంఖము నొగిచక్రముతో
సూదుకుఁ దిరిగేటి శూరుఁడు
యీడనుండి సురలిందరిఁ గాచేటు
మేడెపు మన లక్ష్మీవిభుఁడు. ॥అల్లదె॥

శరణనువారలఁ జయ్యన గాచిన
శరణాగతరక్షణఘనుఁడు
తిరమై యింతకు దిక్కై నిలిచిన
గరిమెల శ్రీ వెంకటవిభుఁడు. ॥అల్లదె॥ 69

రామక్రియ

ఎక్కడ నీ వుద్యోగమెటు విచ్చేసేవయ్యా
యిక్కువ నీమహిమకు నెవ్వరెదురయ్యా. ॥పల్లవి॥

వల్లించి గరుడనిపై నీవుబ్బున నెక్క
అల్లనాఁడె పారిజాతమడవికెక్క
పల్లదపు రుద్రుఁడును బాణుని వాకిలి దొక్క
చుల్లరి రాక్షసమూఁక సురసురసుక్క. ॥ఏక్కడ॥

గరుడనిపై నీవు కదుఁబేరెములువార
ధరజలధరుల నమృతములు దేర
నిరతిఁ గంసాదుల నెత్తురు టేరులువారె
పరులు నీకెదిరిన పగయెల్లఁదీరె. ॥ఎక్కడ॥

బంగారు గరుడనిపై నీవు వీధులేఁగ
చెంగట శ్రీ వెంకటేశ సిరుఁలుమూఁగె
సంగతి నలవేల్మంగ సంతసాన వీఁపీగె
పొంగారు దేవదుందుభులు పైపై వాఁగె. ॥ఎక్కడ॥ 70

## వరాళి

సమమతివని నీవే చాటుదువు
రమణనేరుపు నేరములెవ్వరివి. ॥పల్లవి॥

రావణాదులైన రాక్షససమితిలో
నీవే దేవతలలో నీవేకావా
భావింప నసురలు పగ నీకునైరి
యీవల సురులెల్ల (లేల?) హితులైరి. ॥సమ॥

సకలజంతువులకుఁ జైతన్యుఁడవు నీవే
వొకరు నీకుపకారమొనరించేరా
అకట కొందరిఁ బాపాత్ములఁగాఁ జేసి
వెకలిఁ గొందరిఁ బుణ్యవిధులఁ జేసితివి. ॥సమ॥

అటుగాన నిట్టాయ నట్టాయ ననవేల
యిటు నీచిత్తముకొలఁదింతేకాక
గటియించి శ్రీ వేంకటపతి నీదాసు
లిటువలె ఘనులైరిదివో నీకృపను. ॥సమ॥ 71

## ఆహిరి

నేనవగుణినైన నీకుఁబోదు భువి
లోన భక్తవత్సలుఁడవటుగాన. ॥పల్లవి॥

పరమపూరుషా భవరోగవైద్య
ధరణీధర మాధవ కేశవా
అరిది సంసారాన నలసితి నినుఁగను
తెరువేదో వెరవేదో తెలియ నేనిపుడు. ॥నేనవ॥

భువనాతీతా పుండరీకేక్షణ
నవనీతప్రియ నారసింహా
యివల నాయపరాధమెంతైనఁ గలదు నా
వివరము చింతించి వెసఁగావరాదా. ॥నేనవ॥

అగుణా సగుణా యాద్యంతరహితా
అగణిత శ్రీ వేంకటాద్రినాథ
నిగమగోచర నేను నీయాధీనమనింతే
నగుఁబాటు గాకుండననుఁగావుమిప్పుడు. ॥నేనవ॥ 72

కన్నడగౌళ

తలలేదు తోఁకలేదు దైవమా నీమాయలకు
తెలిసియుఁ దెలియక తిరిగేము నేము. ॥పల్లవి॥

తనువేఁటిదో యీ తలపోఁతలేఁటివో
యెనయు సంసారసుఖమిది యేఁటిదో
వెనక ముందేఁటిదో వివేకమెరఁగక
దినదినమును నేమో తిరిగేము నేము. ॥తల॥

పుట్టుగిది యెక్కడో పోయేటిదెక్కడో
యిట్టె యీ సిరులెల్లా నెక్కడెక్కడో
వట్టులేని హరినిర్మాణ చక్రములోన
దిట్టలమై యేమేమో తిరిగేము నేము. ॥తల॥

నేరుపేదో నేరమేదో నిలిచినదాకటేదో
వూరకే నీదాసులమై వున్నారము
చేరి నన్నేలినయిట్టె శ్రీ వేంకటేశ్వర
గారవించి కరుణించి కావఁగదవే ॥తల॥ 73

363-వ రేకు. మాళవి

ఇదియే వేదాంతమిందుకంటె లేదు
ఇదియే శ్రీవేంకటేశుని మతము. ॥పల్లవి॥

విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వనకవారెల్ల
విరతిఁ బొందకున్న వీడదు భవము. ॥ఇదియే॥

చిత్తమే పాపము చిత్తమే పుణ్యము
చిత్తమే మోక్షసిద్ధియును
చిత్తమువలెనే శ్రీహరి నిలుచును
చిత్తశాంతిలేక చేరదు పరము. ॥ఇదియే॥

ఎంతచదివినా యెంతవెదకినా
యింతకంటె మరి యింకలేదు
యింతట శ్రీవేంకటేశుదాసులాట
యెంతవారికైన యిదియే తెరువు. ॥ఇదియే॥ 74

గుండక్రియ

జీవుఁడు నిత్యుఁడు యీ చింతలెట్టు దొరకెనో
భావించ నిదియేఁటి ప్రచారమో. ॥పల్లవి॥

తనువు మోచితినంటా తరుణుల పొందులంటా
దినదినరుచులంటాఁ దిరిగేము
మొనసి సంసారమే మోహినీగజమై
వెనకఁ దలఁచమేఁటి వికారమో. ॥జీవుఁడు॥

కడుపు నిండినదంటాఁ గమ్మరనాఁకలియంటా
వెడఁగు భోగములంటా వెవకేము
వుడివోనియాసలే వుబ్బుఁగవణములై
విడువదు మతి కేటి విచారమో. ॥జీవుఁడు॥

దివము రాతిరియంటా తెలివంటా నిదురంటా
భువిఁ గాఁపురములఁటాఁ బొరలేము
ఇవల శ్రీ వేంకటేశ యింతలో నీదాసినని
వివరము గంటి నెట్టి వివేకము. ॥జీవుఁడు॥ 75

## మాళవశ్రీ

ఇందుకుఁగా నామెరఁగమి నేమని దూరుదును
అందియు నిను నేఁదెలియక అయ్యో నేనిపుడు. ॥పల్లవి॥

ఆతుమలోననుండి యఖిలోపాయములు
చేతనునకు నీవే చింతించఁగాను
కాతురపడి నేను కర్తననుచుఁ బనులు
యీతలఁ జెప్పఁగఁబూనే నిస్సిరో. ॥ఇందు॥

తనువిటు నీవొసఁగి తగుభాగ్యము నీవై
అనువుగ జీవుని నీయటు నీవేలఁగను
తనియక నేనొరులు దాతలనుచుఁ బోయి
కనుఁగొని వేడఁగఁ దొడఁగేఁ గటకటా. ॥ఇందు॥

శ్రీ వేంకటాద్రిపై నుండి చేరి కన్నులెదుటను
సేవగొని యిట్టె కృపసేయఁగాను
సోవలఁ గన్నవారెల్లాఁ జుట్టములంటా నేను
జీవులతోఁ బొందుసేసేఁ జెల్లఁబో. ॥ఇందు॥ 76

### సామంతం

ఇట్టిదివో హరికృప యెంచినను
గట్టిగా నాహరికృపే కలదువో మాకు. ॥పల్లవి॥

బలుహిరణ్యాక్షుఁడు (?) ప్రహ్లాదునిబట్టి
జలధి వేసిన నీరుచట్టై తేలె
కలుషించి కమ్మరాను కడునగ్నిఁ దోసిన
నిలువెల్లఁ జల్లని నీరై తొలఁకె. ॥ఇట్టి॥

దిట్టమై యేనుగులచే దీకొలపిన వాఁటి (?)
నట్టె కొమ్ములు తునుకలై పోయను
పట్టియెత్తి రాలమీఁదఁ బలుమారు వేసిన
బట్టబయలే దూదిపానుపులై నిలిచె. ॥ఇట్టి॥

కడసారెఁ గంభములోఁ గలఁడంటేఁ గలిగి
చిడుముడి రక్కసులఁ జీరివేసె
జడియు శ్రీ వెంకటాచల నారసింహుఁడై
పొడచూపి మాకు దిక్కై పొదలించె నేఁడు. ॥ఇట్టి॥ 77

### శ్రీరాగం

అది బ్రహ్మాండంబిది పిండాండము
బుదుటు జీవులము వున్నారమిదివో. ॥పల్లవి॥

ఉదయాస్తమయము లొనరినవలెనే
నిదురలు మేల్కను నియమములు
కదిసి త్రిసంధ్యాకాలంబులవలె
గుదిగొను దేహికి గుణత్రయములు. ॥అది॥

పుడమి సస్యములు పొదలిన వలెనే
పొడలి రోగములున్నవివే
ఉడుగని వెలుపటి వుద్యోగమువలె
కొడిసాగెడి మితి కోరికలు. ॥అది॥

వెలుపలఁగల శ్రీ వేంకటవిభుఁడే
కలఁడాతుమలో ఘనుఁడితఁడే
చలమున నీతని శరణాగతియే
ఫలమును భాగ్యము బహుసంపదలు. ॥అది॥ 78

గుజ్జరి

ఏమిసేయవచ్చు హరి యెలయించే మాయలివి
వేమరు నాతనిఁ గొల్చి విడుకొంటగాక. ॥పల్లవి॥

పాయమే పరచైతేఁ బట్టఁగ నెట్లవచ్చు
రోయుదాఁకా నందులోఁ దిరుగుటగాక
కాయపువోడ తప్పుగాలి విసరినవేళ
పోయినట్టె పోనిచ్చి పొనుఁగుటగాక. ॥ఏమి॥

మనసే మలినమైతే మణుఁగెట్టు సేయవచ్చు
కొసర విరతిదాఁక నోర్చుటగాక
తన యంతరంగపుటద్దము మాసితే నది
మినుకు విజ్ఞానాన మెరుఁగిచ్చుట గాక. ॥ఏమి॥

మెచ్చు నాలుకఁదీపు మింగకెట్టు మానవచ్చు
కొచ్చి కొచ్చి సారె రుచిగొనుటగాక.
నచ్చుల శ్రీ వేంకటేశునామము నోరనుంటే
పచ్చి తనభాగ్యమంట బ్రదుకుటగాక. ॥ఏమి॥ 79

364-వ రేకు. లలిత

ఆడరమ్మ పాడరమ్మ అంగనలు చూడరమ్మ
వేడుకఁ బరుషలెల్ల వీధినుండరమ్మా. ||పల్లవి||

అల్లదివో వోఁగునూఁతులౌభళేశు పెద్దకోన
వెల్లి పాలనీటిజాలు వెడలే సోన
చల్లనిమాఁకునీడ సందడిమేడల వాడ
యెల్లగాఁగ నరసింహుఁడేగీ నింతితోడను. ||ఆడ||

సింగారపు మండపాల సింహాల మునిమంద
లంగవు తెల్లగోపురమదె మిన్నంద
చెంగట నాడు (ఘ?) వార్లు చేరి పన్నిద్దరుఁగొల్వ
సంగడిఁ దాఁగొలువిచ్చీ జయనరసింహాము. ||ఆడ||

కందువ శ్రీ వేంకటేశు కల్యాణముల వేది
అందమై భూములకెల్లా నాదికి నాది
మందల పాలకొండ మలకు నట్టనడుమ
విందగు దాసులతోడ వి(ర)హరించీ దేవుఁడు. ||ఆడ|| 80

లలిత

ఇతరమెరఁగ గతి యిదియె శరణ్యము
సతతపూర్ణునికి శరణ్యము ||పల్లవి||

సర్వలోకముల సాక్షై కాచిన
సర్వేశ్వరునకు శరణ్యము
ఉర్వికి మింటికి నొక్కటఁ బెరిగిన
సార్వభౌమునకు శరణ్యము. ||ఇతర||

శ్రీకాంత నురముచెంగట నిలిపిన
సాకారునకును శరణ్యము
పై కొని వెలిఁగెటి పరంజ్యోతియై (యా?)
సాకుమారునకు శరణ్యము. ॥ఇతర॥

తగనిహపరములు దాసులకొసఁగెటి
జగదీశ్వరునకు శరణ్యము
నగు శ్రీ వేంకటనాథుఁడ నీకు
సగుణమూర్తి యిదె శరణ్యము. ॥ఇతర॥ 81

## దేవగాంధారి

ఏదైన దేవుఁడు ప్రాణికియ్యక లేదు
పాదుగ నాతనిమీఁది భక్తే సాధనము. ॥పల్లవి॥

దేహమునకు ఫలము తెగని యాలుబిడ్డలు
దేహాంతరాత్మకును దేవుఁడొకఁడే ఫలము
దేహమే బంధకము దేవుఁడింతే మోక్షము
ఊహల రెంటికి మనసాక్షే సాధనము. ॥ఏదైన॥

పుట్టినందుకు ఫలము పొందగు భోగములే
పుట్టుదె (గు?) గెలుచుటకు భువి జ్ఞానమే ఫలము
పుట్టుటకుఁ గర్మము పోవుటె యకర్మము
వెట్టి యీ రెంటికిని విరతే సాధనము. ॥ఏదైన॥

చింతించుటకు ఫలము సిరులెల్లఁ జేకొనుటె
చింత విడుటకు ఫలము శ్రీ వేంకటేశు సేవే
చింతలే దుఃఖములు నిశ్చింతములే సుఖములు
కొంత దాఁచనేల శ్రీ గురుఁడే సాధనము ॥ఏదైన॥ 82

ధన్నాసి

శరణాగతపంజర బిరుదది నీది
కరుణానిధివై కావవే నేఁడు. ॥పల్లవి॥

ప్రళయకాలమునాఁడు బ్రహ్మాండకోట్లు
పొలవక నీకుక్షి చొచ్చినట్టు
చెలఁగి నీమరఁగున శ్రీ వెంకటాద్రిమీఁద
ఇల నరలోకమెల్ల నెక్కెఁ గావవే. ॥శరణా॥

అసురబాధలకుఁగా నఖిలదేవతలును
కొసరుచు మొరవెట్టఁ గూడినట్టు
ముసరి కోనేటిదండ మూఁకలు మూఁకలుగట్టి
విసిగి ప్రాణులు విన్నవించేరు గావవే. ॥శరణా॥

జీవులఁ బుట్టించునాఁడు చేరి యా యా నెలవుల
నీవలన జనులెల్ల నిలిచినట్టు
శ్రీ వేంకటేశ నిన్నుఁ జేరినట్టివారినెల్ల
తావుల నిలిపి యిట్టె దయఁగావవే. ॥శరణా॥ 83

నారాయణి

కావఁగ నీకే పోదు కరుణానిధివి గాన
భావించి నీవని తుదపదమే యెక్కితిమి. ॥పల్లవి॥

కరిరాజవరద నీకడనున్నవారికి
కరిరాజభయములెక్కడాఁ బొందవు
సిరుల నీయర్థమే చింతించి చింతించి
నరలోకమెల్ల నీనగమె యెక్కితిమి. ॥కావ॥

కాళింగమర్దన నిన్నుఁగని మనువారికి
కాళింగభయములెక్కడా లేవు
తాలిమితో నిదియే తలపోసి తలపోసి
కేలిమనుజులము నీగిరియె యెక్కితిమి. ॥కావ॥

కందువ శ్రీ వేంకటకట కేశ నీవద్ద
నెందుఁ గటకేశభయమిఁక లేదు
ఇందుకే పో జగమెల్లా నిటు శరణని మూల
కందువని దండ శ్రీ వెంకటమె యెక్కితిమి. ॥కావ॥ 84

## దేసాక్షి

అతఁడే రక్షకుఁడందరికతఁడే
పతి యుండఁగ భయపడఁ జోటేది. ॥పల్లవి॥

అనంతకరములనంతాయుధము
లనంతుఁడు ధరించలరఁగను
కనుఁగొని శరణాగతులకు మనకును
పనివడి యిఁక భయపడఁ జోటేది. ॥అతఁడే॥

ధరణి నభయహస్తముతో నెప్పుడు
హరి రక్షకుఁడై యలరఁగను
నరహరికరుణే నమ్మినవారికి
పరఁగున నిఁకభయపడఁ జోటేది. ॥అతఁడే॥

శ్రీ వెంకటమున జీవులఁ గాచుచు
నావల నీవల నలరఁగను
దైవశిఖామణి దాపగు మాకును
భావింపఁగ భయపడఁ జోటేది. ॥అతఁడే॥ 85

365-వ రేకు. హిందోళం

కరుణించవె నిజగతి బోధించవె
హరి నిన్నుఁ గొలువక యలసీఁ బ్రాణి. ||పల్లవి||

కలలో నింతులఁ గలసినట్లనే
వెలిఁ గాంతలతోడి వేడుకలు
లలి నిందుకుఁగా లంపటములఁ బడి
పలుమారు నూరక బడలీఁ బ్రాణి. ||కరు||

నిన్నటి యాహారనిజరుచి వలెనే
అన్నువ నిప్పటి యాహారము
యెన్న నిందుకే యిడుమలఁ బొరలుచు
కన్నగతులఁ గడుఁ గలఁగీఁ బ్రాణి. ||కరు||

పరుసము సోఁకిన బంగారమువలె
పరమభాగవత పట్టములు
అరయఁగ శ్రీ వేంకటాధిప నీకృప
యిరవుగఁ గని తుదకెక్కీఁ బ్రాణి. ||కరు|| 86

మంగళకౌశిక

ముట్టితేనే మూఁపై బట్టితేనే పంతమయీ
యిట్టె మమ్ముఁ గావవే యిందిరారమణ. ||పల్లవి||

తీరుగాఁ బుణ్యము సేసితే జన్మబంధమై (మయీ?)
తోరపు నాపాపములై తే దుఃఖమైని (మయీని?)
ఊరకుంటే నీప్రపంచముల్లంఘించినట్టై
యేరీతి నడచువార మిందిరారమణ. ||ముట్టి||

అంకె దయఁ దలఁచితే నన్నిటికిఁ దనులై
కొంకక కోపించితేనే క్రూరమ్మైని
మంకున నూరకవుంటే మదోన్మత్తుఁడై
యింకనేమి సేయువార మిందిరారమణ. ॥ముట్టి॥

ఇన్ని చిక్కులునేల యిట్టె శ్రీ వేంకటేశ
నిన్నక నీశరణంటే మేలైని
వెన్నెల నీయర్థమె వేదశాస్త్రసమ్మతై
యెన్న నీవే సేయువాఁడవిందిరారమణ. ॥ముట్టి॥ 87

శంకరాభరణం

ఎప్పుడేబుద్ధి పుట్టునో యెఱఁగరాదు
దెప్పరపు మాబ్రదుకు దేవునికే సెలవు. ॥పల్లవి॥

యేడనుండి పుట్టితిమో యింతక తొల్లి యింక
నేడకుఁ బోయెదమో యిటమీఁదను
వీడని మాయంతరాత్మ విష్ణుఁడు మా
జాడ జన్మమతనికే సమర్పణము. ॥ఎప్పు॥

గతచన్న పితరులక్కడ నెవ్వరో
హితపై యిప్పటిపుత్రులిది యెవ్వరో
మతి మాజీవనమెల్ల మాధవుఁడు
అతనికే మాభోగాలన్నియు సమర్పణము. ॥ఎప్పు॥

తొడికి స్వర్గాదులు తొల్లియాడవో యీ
నడచే ప్రపంచమునాకేడదో
కడఁగి శ్రీ వేంకటేశు గతియే మాది
అడఁగు మాపుణ్యపాపాలతని కర్పణము. ॥ఎప్పు॥ 88

## మలహరి

ఇదియే సాధనమిహాపరములకును
పదిలము మాపాలి పరమపునామం. ॥పల్లవి॥

కలిదోషహరము కైవల్యకరము
అలరిన మా శ్రీహరినామం
సులభము సౌఖ్యము శోభనతిలకము
పలుమారును శ్రీపతినామం. ॥ఇది॥

పాపనాశనము బంధవిమోచనము
పైపై నిది భూపతినామం
స్థాపితధనమిది సర్వరక్షకము
దాఁపి (పు ?) రమిది మాధవనామం. ॥ఇది॥

నేమము దీమము నిత్యకర్మమిది
దోమటి గోవిందునినామం
హేమము శరణము యిన్నిట మాకును
యేమేర శ్రీవేంకటేశ్వరునామం. ॥ఇది॥ 89

## పాడి

నమ్మినదిదివో నాపితురార్జితె
మిమ్మఁ జూడరో యిది మాదిగాదు. ॥పల్లవి॥

నలినదళాక్షుని నామాంకితమే
నిలువునఁ బాఁతిన నిధానము
కలకాలమిదే గాదెలకొలుచులు
నలుగడ నిదియే నాలుకరుచులు. ॥నమ్మి॥

శ్రీపతిరూపమె చింతించు తలఁపె
పైపై మాయింట భాగ్యములు
పూఁపల మిత్రులుఁ బుత్రాదులిది (?)
వైపగు మాకిదె వ్యవసాయములు. ॥నమ్మి॥

శ్రీ వేంకటపతి సేవిది యొకటే
భావించు నాయుష్యభోగ్యములు
కైవల్యపదవిదె కాయజసుఖమిదె
సావధానముల సంసారమిది (దే?). ॥నమ్మి॥ 90

## భైరవి

సందడి సొమ్ములతోడి సాకారమిదె వీఁడె
యిందరు వర్ణించరో యీరూపము. ॥పల్లవి॥

చుక్కలతో నాకాశము సూస్తై నిలువఁబోలు
నిక్కి రత్నాలజలధి నీటు గాఁబోలు
మిక్కిలి నానావర్ణమేఘపంక్తి గాఁబోలు
యిక్కడనే నిలుచున్నదీరూపము. ॥సంద॥

నించిన పంచవన్నెల నీలగిరి గాఁబోలు
అంచల సంధ్యాకాలమదే గాఁబోలు
చించకా (?) తని మెరుఁగుల చీఁకటిది గాఁబోలు
మెంచఁగ నలవిగాదు యీ రూపము. ॥సంద॥

పున్నమ (యు?) నమాసయు పోగై నిలువఁబోలు
ఉన్నతి యోగీంద్రుల యూహ గాఁబోలు
పన్నిన బ్రహ్మాండాల భరణిది గాఁబోలు
యిన్నిట శ్రీ) వేంకటేశు యీ రూపము. ॥సంద॥ 91

366-వ రేకు. ముఖారి

అతఁడే యెక్కుడు దైవమందరికంటె
తతినింకాఁ జెప్పిచూప దైవాలుగలవా. ॥పల్లవి॥

జలధి దచ్చేనాఁడు సకలదేవతలుండ
యెలమి నేదేవుఁ జేరె నిందిరాదేవి
అల గజేంద్రుఁడు మూలమని మొరవెట్టునాఁడు
తెలియ నేదేవుఁడు విచ్చేసి కాచెను[1]. ॥అత॥

పుడమి గొలుచునాఁడు పొడవైన దేవతలు
కెడసి యెవ్వరడుగుకింద దాఁగిరి
కడలేని జగములు గల్పించే బ్రహ్మదేవుఁ
డడరి యేదేవు నాభియందుఁ బుట్టెను. ॥అత॥

ఎంచి నాఁడు దేవతల నింద్రియాలఁ జొక్కించే
పంచబాణుఁడేదేవుని పట్టి యిపుడు
కొంచక శ్రీవేంకటాద్రిఁ గోరిన వరములిచ్చి
అంచల లోకములేలీ నండనేదేవుఁడు. ॥అత॥ 92

లలిత

నారాయణ నీనామమె గతియిఁక
కోరికలు నాకుఁ గొనసాగుటకు. ॥పల్లవి॥

పై పై ముందట భవజలధి
దాపు వెనకఁ జింతాజలధి
చాపలము నడుమ సంసారజలధి
తేపయేది యివి తెగనీఁదుటకు. ॥నారా॥

1. 'తెలియ విచ్చేసి యేదేవుఁడు కాచెను' అని పాఠమున్నచో యతి సరిపోవును.

పండె నెడమఁ బాపపురాశి
అండఁ గుడిని పుణ్యపురాశి
కొండను నడుమఁ ద్రిగుణరాశి యివి
నిండఁ గుడుచుటకు నిలుకడ యేది. ॥నారా॥

కిందిలోకములు కీడునరకములు
అందెటి స్వర్గాలవె మీఁద
చెంది యంతరాత్మ శ్రీవేంకటేశ నీ
యందె పరమపదమవల మరేది. ॥నారా॥ 93

కాంబోది

కర్మమెంత మర్మమెంత కలిగినకాలమందు
ధర్మమిది యేమరక తలఁచవో మనసా. ॥పల్లవి॥

చెలువల పొంతనుంటె చిత్తమే చెదరుఁగాని
కలుగనేరదెంతైనా ఘనవిరతి
ఉలుకకగ్గిపొంత నుంటేఁ గాఁకలేకాక
చలువలు గలుగునా సంసారులకును. ॥కర్మ॥

బంగారు వోడగంటేఁ బట్టనాస వుట్టుఁగాని
సంగతి విజ్ఞానపు జాడకు రాదు
వెంగలి యభిని దింటే వెఱ్ఱి వెటాటాడుఁగాని
అంగవించునా వివేకమప్పుడే లోకులకు. ॥కర్మ॥

శ్రీవేంకటేశుభక్తి చేరితే సౌఖ్యముగాని
ఆవల నంటవు పాపాలతిదుఃఖాలు
చేవ నమృతముగొంటే చిరజీవియగుఁగాని
చావులేదు నోవులేదు సర్వజ్ఞులకును. ॥కర్మ॥ 94

సామంతం

ఒకరిబుద్ధులు వేరొకరి పనికిరావు
అకలంకుఁడింతటికి నంతర్యామి. ॥పల్లవి॥

పొడమించునాతఁడే పొదలించునాతఁడే
నొడిగించు నాతఁడే నోరఁగొలఁది
గడియించు నాతఁడే కడలేని సిరులెల్ల
అడియాలమగు లోని యంతర్యామి. ॥ఒకరి॥

మతియిచ్చు నాతఁడే మరపించు నాతఁడే
గతియైన నాతఁడే కరుణానిధి
వెత మాన్పునాతఁడే వెలయించు నాతఁడే
అతిశయమగు లోని యంతర్యామి. ॥ఒకరి॥

ఇహమిచ్చు నాతఁడే యెదురెదురనే వచ్చి
సహజపుఁ బరమిచ్చు సరినాతఁడే
విహగగమనుఁడు శ్రీ వెంకటేశుఁడతఁడే
అహరహమాదరించు నంతర్యామి. ॥ఒకరి॥ 95

రామక్రియ

కేవల కృష్ణావతార కేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా. ॥పల్లవి॥

కిరణార్కకోటితేజ కేశవా
హరి లక్ష్మీనాయక యాది కేశవ
గిరిరాజసుత (తా?) నుత కేశవ నమో
శరధిగంభీరశాయి జయజయ కేశవా. ॥కేవల॥

కేకి పింఛావతంస కేశవ
శ్రీకర గుణాభిరామ చెన్న కేశవ
కేక (కి?) వాహనవరద కేశవ
పాకశాసనవంద్య భళిభళి కేశవా. ॥కేవల॥

కింకరబ్రహ్మాదిగణ కేశవ నా
మాంకిత శ్రీవేంకటాద్రి కేశవ
కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ సర్వ
శంకాహరణ నమో జగదేక కేశవా. ॥కేవల॥ 96

ముఖారి

ఒలపక్షము లేనొక్క దేవుఁడవు
నలినాక్ష హరీ నమో నమో. ॥పల్లవి॥

నేరిచిన నే నేరకుండిన నీ
కారుణ్యమొక్కటే కలది
పారి ఘంటాకర్ణుభక్తికి సరిగా
చేరి శుకాదులఁ జేకొంటిగాన. ॥ఒల॥

సాదనైన నేఁ జలమతినైనా నీ
పాదమొక్కటే నేఁబట్టినది
పాదైన వసిష్ఠుభక్తికి సరిగా
మేదిని వాల్మీకి మెచ్చితిగాన. ॥ఒల॥

యేమిటా శ్రీవేంకటేశ యెంతైన నీ
నామమొక్కటె నే నమ్మినది
సామజముభక్తి సరిగా నీవును
ప్రేమతోఁ బ్రహ్లాదుఁ బెంచితిగాన. ॥ఒల॥ 97

367-వ రేకు. బౌళి

ఓహో యెంతటివాఁడే వొద్దనున్నవాఁడే హరి
సాహసపుగుణముల చతురుఁడా యితఁడు. ॥పల్లవి॥

జలధిలోఁ బవళించి జలనిధి బంధించి
జలనిధికన్యకను సరిఁ బెండ్లాడి
జలనిధిలో నిండి జలనిధి మథియించి
జలధి వెరించిన (వెరిఁజిన?) చలమరా యితఁడు. ॥ఓహో॥

ధరణికిఁ బతియై ధరణి గ్రుంగినఎత్తి
ధరణికూఁతురుఁ దానె తగఁ బెండ్లాడి
ధరణిఁ బాదముమోపి ధరణిభారము దించి
ధరణీధరుఁడైన దైవమా యితఁడు. ॥ఓహో॥

కొండ గొడుగుగనెత్తి కొండ తూఁటువడనేసి
కొండకిందఁ గుదురై కూచుండి
కొండపై శ్రీ వేంకటాద్రి కోనేటిరాయఁడై
కొండవంటి దేవుఁడైన కోవిదుఁడా యితఁడు. ॥ఓహో॥ 98

శుద్ధవసంతం

ఏమనిచెప్పెద నిటమీఁద హరీ
శ్రీమంతుఁడ నినుఁ జేరితిమిదివో. ॥పల్లవి॥

వినుచున్నారము వెనకటిపాట్లు
కనుచున్నారము కలఁగెటివారల
దినదినభావము తెలిసీఁ దెలియదు
మనసున భయమిసుమంతయు లేదు. ॥ఏమని॥

భువి నెఱఁగుదుమిదె పుట్టెడి దెసలను
తవిలి మరణములు దలఁచెదమట్లనె
వివరపుటాసలు విడిచీ విడువవు
నవమగు విరక్తినాఁటదు వోయె (?) ॥ఏమని॥

చదివెదమిదివో సకలశాస్త్రములు
వెదకెదమిదె శ్రీ వేంకటేశ నిను
మదిలోనుండఁగ మరచివుంటిమిదె
యెదుటఁ గంటిమిఁక యేలాపనులు ॥ఏమని॥ 99

లలిత

ఆచార విచారాలవియు నేనెఱఁగ
వాచామగోచరపు వరదుఁడ (వు?) నీవు. ॥పల్లవి॥

తపమొక్కటే నాకుఁ దగునీశరణనుట
జపమొక్కటే నిన్ను సారెకు నుతించుట
ఉపమొక్కటే నీవె వున్నతుఁడవంట
విపరీత విజ్ఞాన విధులేమి నెఱఁగ. ॥ఆచా॥

కర్మమొక్కటె నీకైంకర్యగతి నాకు
ధర్మమొక్కటె నీ దాసానుదాస్యము
మర్మమొక్కటె నామతి నిన్నుఁ దలఁచుట
అర్మిలి నింతకంటె నవల నేనెఱఁగ. ॥ఆచా॥

బలిమి యొక్కటె నాకు భక్తి నీపైఁ గలుగుట
కలిమియొక్కటె నీవు గలవని నమ్ముట
యెలమితో శ్రీ వేంకటేశ నీవు గతిదక్క
పలుబుద్ధుల నేఁబోరలు భావనలేన (యె?) రఁగ. ॥ఆచా॥ 100

### లలిత

పనిలేదేమియు నాకు పంపుడు నీ బంటనింతే
యెనపిన తెడ్డు చౌ (చవు?) లెరుఁగునటవయ్యా. ॥పల్లవి॥

మనసు నీవిచ్చితివి మాఁటలు నీవిచ్చితివి
తనువు నీవిచ్చితివి యంతర్యామి
చెనసి నీదువల్లఁ జేసేకర్మపు (ఁ?) బంట
నినుపుఁ గణఁజాల నించుకొనవయ్యా. ॥పని॥

సత్తువ నీవిచ్చితివి చలము నీవిచ్చితివి
తత్తరమిచ్చితివి యంతర్యామి
యిత్తల నావల నీవు యెందుకైనఁ బెరరేఁచి
యెత్తుక యేమైన గడియించుకొనవయ్యా. ॥పని॥

మాయలు నీవిచ్చితివి మదము నీవిచ్చితివి
ఆయపు శ్రీవెంకటాద్రి యంతర్యామి
యేమెడ నేఁజేసేటి యిన్నపరాధాలు
వేయయిన నీవెనక వేసికొనవయ్యా. ॥పని॥ 101

### బౌళి

నిచ్చలూ లోకము చూచి నివ్వెరగయ్యా నాకు
చెచ్చెర శ్రీహరి నీచిత్తము నాభాగ్యము. ॥పల్లవి॥

జీవమతిసూక్ష్మము చిత్తము చంచలము
భావము నిరాకారము భవమెల్ల నెయ్యాకు
యేవిధులఁ బొరలెనో యిది నాబ్రదుకు
దేవుఁడ నీచిత్తము నాతేఁకువైన భాగ్యము. ॥నిచ్చ॥

ఊరుపెల్ల గాలి నావుప వెల్లమాయ
కూరిమెల్ల మొరఁగు నాగుణము విచారము
నేరుపేదో నేరమేదో నిజము దెలియదు
శ్రీరమణుఁడవు నీచిత్తము నాభాగ్యము. ॥నిచ్చ॥

కాలము పారేటి దాడి కాయము తూంట్లబొంత
ఆలరి శ్రీ వేంకటేశ యది నీచేత
యేలాగుతెరఁగను యిటు నీశరణనుటే
శీలము నాకు నీచిత్తము నాభాగ్యము. ॥నిచ్చ॥ 102

పాడి

అమ్మేదొకటియును (యని ?) యసిమలోదొకటి యని
కమ్మిలోని నీయందె కలిగె నీమాఁట. ॥పల్లవి॥

సరవితో నిను నుపనిషద్వాక్యములయందు
పురుషోత్తముఁడవనుచుఁ బొగడఁగాను
అరిది నారాయణశివిద్యై యస్మృతి మొసఁగుచో
అరయ శ్రుతిదె విరోధంబాయ నీమాఁట ॥అమ్మే॥

తలపోయ ధర్మసంస్థాపనుఁడవని నిన్ను
చెలరేఁగి శాస్త్రములు చెప్పఁగాను
తెలఁకకేటు గోపపరదారగమనము నీవు
యిలఁజేయ శాస్త్రవిరహితమాయ నీమాఁట. ॥అమ్మే॥

వైకుంఠపతివనుచు వడిఁబురాణములెల్ల
యేకమొకటే వశియించఁగాను (?)
యీాకడ శ్రీ వేంకటేశ్వరుఁడవై తివిదె
చేకొలఁది నిటు నీకె చెల్లు నీమాఁట. ॥అమ్మే॥ 103

368-వ రేకు. గుజ్జరి

ఇతరములన్నియు నడుమంత్రములే యెంచి చూచినను యింతాను
హితవగు బంధుఁడీశ్వరుఁడొకఁడే యాతని మరవకుమీ జీవాత్మా. ॥పల్లవి॥

భవకూపంబుల బడలెడినాఁడు పాయనిబంధువుఁడితఁడొకఁడే
దివిస్వర్గంబునఁ దేలెడినాఁడు తిరుగఁబాయకె (డె?) వుడితఁడొకఁడే
నవనరకంబుల నలఁగెడినాఁడు నటనలఁ బాయఁడితఁడొకఁడే
యివలనవలహృదయేశుఁడువిష్ణుఁడుయాతనిమరవకుమీజీవాత్మా. ॥ఇతర॥

పశుమృగాదుల వొడలెత్తినప్పుడు పాయనిబందుగుఁ డితఁడొకఁడే
విశదపు దుఃఖపువేళలనైనా విడువనిబంధుఁడితఁడొకఁడే
శిశువైనప్పుడు వృద్ధైనప్పుడు చిత్తపుబందుగుఁడితఁడొకఁడే
దశావతారపు విష్ణుఁడొకఁడె యాతఁడని తలఁచుమీ జీవాత్మా. ॥ఇతర॥

భావజకేలినిఁ జొక్కినప్పుడును ప్రాణబంధువుఁడితఁడొకఁడే
యీవల నావల నిహపరములలో నిన్నిటిబంధువుఁడితఁడొకఁడే
దైవము దానని శరణనియెడు నను దగ్గరికాచెను యితఁడొకఁడే
శ్రీవేంకటగిరినాయకుఁడితఁడే చేరి భజించుము జీవాత్మా. ॥ఇతర॥ 104

తెలుఁగు కాంబోది

తెగఁ గోయుటకు హరి దివ్యనామకీర్తనము
వెగటునాయుధమిది విడువకుమీ మనసా. ॥పల్లవి॥

భవపాశములచేతఁ బట్టువడ్డ దేహికి
యివలఁ గర్మపాశాలు యివియుఁ గొన్నే
తవిలె నాశాపాశతతులవి యొకకొన్ని
కవగూడఁ దవిలెను కామపాశములు. ॥తెగ॥

పమ్మి లోకపు రుణానుబంధపు జీవికి
యిమ్ముల సంసారబంధాలివియుఁ గొన్ని
కమ్మరఁ బుణ్యపాప కలుషబంధాలు గొన్ని
సమ్మతించన భోగములే సకలబంధములు. ॥తెగ॥

శ్రీ వేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
జీవుఁడు నాతనిలోనే చేకొని పాయఁడు వీఁడ
భావించి కొలిచిన పాయును మాయలన్ని
దేవుఁడితని నమ్మిన తీరుఁబో దుఃఖములు. ॥తెగ॥ 105

## గుండక్రియ

హరి నీకే శరణని గెలుచుట గాక
యిరవుగ నెరఁగఁగ నెవ్వరితరము. ॥పల్లవి॥

తనువికారములు తరవులు వెట్టిన
కొనయెరుకై నా కొరతవడు
మనసువికారము మమతలఁ దగిలిన
యెనసి యెదురువడ నెవ్వరితరము. ॥హరి॥

కంతువికారము కన్నులఁగప్పిన
పంతపు విరతియు బయలౌను
చింతాలహరులు చీఁదర రేఁగిన
యింతయు వీడ్కొనవె (నె?) వ్వరితరము. ॥హరి॥

అతిగుణవికారమాసలఁ బెట్టిన
సతత యోగములు జడనుపడు
మతి శ్రీ వేంకటపతి నినుఁ గొలిచిన
యితరము దగ్గర నెవ్వరితరము. ॥హరి॥ 106

## మాళవిగౌళ

నారాయణ నిను నమ్మిన నాకును
మేరతో నీపాదమే గతి గలిగె. ॥పల్లవి॥

చింతాజలధులఁ జిక్కిన దాఁటించ
నంతట నీపాదమదె తేప
కాంతల మోహపు కట్లు తెంచఁగ
పంతపు నీపాదపరశువు గలిగె. ॥నారా॥

అతిదురిత పంకమందినఁ గడుగఁగ
మితి నీపాదమే మిన్నేరు
రతిఁ గర్మజ్ఞులు (ర్మాగ్నులు?) రాఁజిన నార్చఁగ
వ్రతము నీపాదమే వానయై నిలిచె. ॥నారా॥

జిగి నజ్ఞానపు చీఁకటి వాయఁగ
తగు నీపాదముదయపు రవి
నగు శ్రీవేంకటనాథ నన్నేలఁగ
మిగులఁగ నీపాదమే శరణంబు. ॥నారా॥ 107

## మలహరి

శరణంబితఁడే సకలము నాకును
వెరవున మనసా వెతకవో యితని. ॥పల్లవి॥

అభయంబొసఁగెటి యతఁడెవ్వఁడు మును
ఇభరక్షకుఁడతఁడెవ్వఁడు
ఉభయవిభూతుల కొడయండెవ్వఁడు
ప్రభువతఁడే నాపాలిదేవుఁడు. ॥శరణం॥

శరణాగతులకు సరిదాపెవ్వఁడు
యిరవుగ శ్రీపతి యెవ్వఁడు
అరిదుష్టదైత్య హంతకుఁడెవ్వఁడు
పరమును నతఁడె నా పాలిదేవుఁడు. ||శరణం||

ఆదిశంఖచక్రాయుధుఁడెవ్వఁడు
యేదెసఁ బూర్ణుఁడెవ్వఁడు
వేదమయుఁడు శ్రీ వేంకటపతియై
పాదాయ నిదె నాపాలిదేవుఁడు. ||శరణం|| 108

369-వ రేకు. గుండక్రియ

ఎఱఁగఁడు పరసుఖమీశ్వర నీమాయ
నెఱి విచారముల నెగడినదాఁక. ||పల్లవి||

అతిహేయములో నడరు వరాహము
అతిహేయము సుఖమని తలఁచు
మతి సంసారంబె మరగిన యాతుమ
పతిలేనిదిదే పరమని తెలియు. ||ఎఱఁగ||

ఘోరి విషములోనఁ బొడమిన కీటము
అరిది విషము తీపని తినును
పరగ యోనిసంభవమగు దేహాతుమ
పెరిగి యందుకే ప్రియపడును ||ఎఱఁగ||

ఇంతేసి నిన్నియు నెఱిఁగిన యీయాతుమ
అంతరాత్మ నీవని తలఁచి
యింతట శ్రీ వేంకటేశ్వర నిన్నే
రంతుల శరణనె రక్షించవే. ||ఎఱఁగ|| 109

భూపాళం

ఇవియె పో ప్రద్యుమ్న యిహపరసాధనము
భవజలధుల తేప పరమయోగులకు. ॥పల్లవి॥

వామన గోవింద విష్ణు వాసుదేవ హరి కృష్ణ
దామోదరాచ్యుత మాధవ శ్రీధరా
నీమహిమ గానలేము నిన్నెంచఁగలేము
నామజపమే చాలు నాలుక (కు ?) సులభము ॥ఇవి॥

అనిరుద్ధ పురుషోత్తమాధోక్షజ ఉపేంద్ర
జనార్దన కేశవ సంకర్షణా
నినుఁ దలఁచఁగలేము నిన్నుఁ దెలియఁగలేము
నునుపై నీనామమే నోటికి సులభము. ॥ఇవి॥

నారాయణ పద్మనాభ హృషీకేశ
నారసింహ మధుసూదన త్రివిక్రమ
నీరూపు భావించలేము నిక్కపు శ్రీవెంకటేశ
ఆరయ నీనామజపమన్నిటా సులభము. ॥ఇవి॥ 110

లలిత

కన్నులెదుటిదే ఘనవైకుంఠము
వెన్నుని గొలిచిన విజ్ఞానికిని. ॥పల్లవి॥

తలఁచినదెల్లా తత్త్వరహస్యమె
తెలిసిన యోగికి దినదినము
పలికినదెల్లా పరమమంత్రములె
ఫలియించిన హరిభక్తునికి. ॥కన్ను॥

పట్టినదెల్లా బ్రహ్మాత్మకమే
పుట్టుగు గెలిచిన పుణ్యునికి
మెట్టినదెల్లా మిన్నేటినిధులె
అట్టడి తెగువ మెఱయువానికిని. ||కన్ను||

వినినవియెల్లా వేదాంతములే
ఘనుఁడగు శరణాగతునికిని
యెనసిన శ్రీ వేంకటేశుఁడె యింతా
కొనకెక్కిన నిజకోవిదునికిని. ||కన్ను|| 111

## సామంతం

బాపు బాపు దేవుఁడా పంతపువోమనసా
ఓపెఁగా యిందుకు జీవుఁడోహో నీమాయ. ||పల్లవి||

నిన్నటిదినము నేఁడు నిజమో కల్లో
కన్నులఁ గన్నట్లాయఁ గానఁగరాదు
యెన్నఁగ రేపటిదినమేమో యెట్లో
ఉన్నట్టు దెలియఁగరాదు వోహో నీమాయ. ||బాపు||

బాలనాఁటి పుట్టుగిది భ్రమరో నిజమో
గాలినె కాలముఁబోయ కతలాయను
ఈలీల మీఁదిమరణమేమో యెట్టో
వోలిఁ దెలియఁగరాదు వోహో నీమాయ. ||బాపు||

నెక్కు (కొక్కు ?)న మింగినకడి నిజమో కల్లో
గక్కున రుచియుఁ దోఁచె కానఁగరాదు
యెక్కువ శ్రీ వేంకటేశ యిన్నియు నీదాసుఁడై నే
వొక్కటఁ గానఁగవచ్చు వోహో నీమాయ. ||బాపు|| 112

గుండక్రియ

వెరగుతో మరచితే వెనక లేదు
కరివరదుఁడే తక్క గతియొండు లేదు ॥పల్లవి॥

ఆస విడిచినఁగాని యధికసుఖము లేదు
యీసు విడిచినఁగాని యిహము లేదు
వాసి విడిచినఁగాని వైపగు విరతి లేదు
వాసుదేవభక్తిఁగాని వరముక్తి లేదు. ॥వెరగు॥

చలము మానినఁగాని సాత్వికగుణము లేదు
పలుశంక వోకకాని ఫలము లేదు
సిలుగింద్రియాల గెలిచినఁగాని క్రోధ లేదు
జలజాక్షుచింతఁగాని సమబుద్ధిలేదు. ॥వెరగు॥

దైవము కరుణనెకాని తగువిజ్ఞానము లేదు
భావించి చూచినఁగాని బలిమి లేదు
ఈవల శ్రీవేంకటేశుఁడితఁడె దైవమితని
సేవించినంతఁగాని సిద్ధిమరి లేదు. ॥వెరగు॥ 113

భైరవి

హరినామము కడు నానందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా. ॥పల్లవి॥

నలినాక్షుని శ్రీ నామము
కలిదోషహరము కైవల్యము
ఫలసారము బహుబంధమోచనము
తలఁచవో తలఁచవో తలఁచవో మనసా. ॥హరి॥

నగధరునామము నరకహరణము
జగదేకహితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా. ॥హరి॥

కడఁగి శ్రీ వేంకటపతినామము
బడిబడినే సంపత్కరము
అడియాలంబిల నతిసుఖమూలము
తడవవో తడవవో తడవవో మనసా. ॥హరి॥ 114

370-వ రేకు. దేవగాంధారి

ఇందుకు ధ్రువాదులిటు సాక్షి
చెంది నమ్మవో జీవుఁడ నీవు. ॥పల్లవి॥

కొండలవంటివి ఘోరపాపములు
ఖండించును హరిఘననామజపము
నిండించును మతి నిత్యానందము
పండించునపుడె పరమపదంబు. ॥ఇందు॥

జలధులవంటివి జననబంధములు
తొలఁగించును హరితూరిన భక్తిది
వెలిఁగించును ఘనవిజ్ఞానంబులు
చెలఁగించును బహుసిరిసంపదలు. ॥ఇందు॥

తోవరాని బహుదుఃఖములణఁచును
శ్రీ వేంకటపతిఁ జేరిన శరణము
పావనంబుగాఁ బచరించు గుణము
కైవసమగు లోకములెల్లాను. ॥ఇందు॥ 115

భూపాళం

చిక్కవద్దు చొక్కవద్దు సిలుగుఁబ్రపంచముల
తక్కిన భోగములెల్లా దైవమే యెరుఁగు. ॥పల్లవి॥

అంతరంగమునఁ దాను హరిఁ దలఁచినఁ జాలు
అంతటి మీఁదటి పనులాతఁడెరుఁగు
పంతమున నాతనిపై భారము వేసినఁ జాలు
వింతవుద్యోగములు గోవిందుఁడే యెరుఁగు. ॥చిక్క॥

చేకొని యాతనిరూపు సేవించినఁ జాలు
ఆకడి యీకడి కర్మాలాతఁడెరుఁగు
తేఁకువ నచ్యుతభక్తి తిరమయినఁ జాలు
దీకొని పరము చూప దేవుఁడే యెరుఁగు. ॥చిక్క॥

సాదించి మాధవుని శరణుచొచ్చినఁ జాలు
ఆదియు నంత్యములెల్లా నాతఁడెరుఁగు
పోదియై శ్రీ వేంకటేశుఁ బూజించినఁజాలు
పాదుకొని రక్షించఁ బరమాత్ముఁడెరుఁగు. ॥చిక్క॥ 116

లలిత

మఱచితిమంటే మరిలేదు
తఱితోఁ దలఁచవో దైవపు (ము?) మనసా. ॥పల్లవి॥

పుట్టుచునున్నది పోవుచునున్నది
పట్టపు జీవుల ప్రపంచము
నట్టనడుమనే నరహరినామము
గుట్టునఁ దలఁచుకొ కొనకొని మనసా. ॥మఱ॥

పొద్దు వొడుచునదె పొద్దు గుంకునదె
తిద్దిన జగముల దినదినము
అద్దపునీడల యంతర్యామిని
వొద్దనె తలఁచె నొనరవొ (తలఁచవొ వొనరఁగ ?) మనసా. ॥మఱ॥

లోపల వెలుపల లోఁగొనివున్నది
శ్రీపతి మహిమల సృష్టియిదే
యేపున శ్రీ వేంకటేశ్వరుఁ డితఁడే
దాపని నమ్మిచుఁ దలఁచవొ మనసా. ॥మఱ॥ 117

## సామంతం

చెల్లె నీచేఁతలు నీకే చేరి మేడెగుడిదిన్న
నల్లదె కంటిమి నిన్ను హనుమంతరాయ. ॥పల్లవి॥

జంగ చాఁచినట్టి నీసంగతి పాదములు
చెంగలించి యెత్తిన నీ శ్రీహస్తము
ముంగలిఁ బిడికిలించి మొలఁజేర్చిన చేయి
అంగమాయ నీసొబగు హనుమంతరాయ. ॥చెల్లె॥

పెరిగినవాలము పెద్దైన పీరుఁదును
అరిగి జలధి దాఁటే యాయితమును
సిరుల బంగారుకాసె చెలఁగిన సింగారము
అరుదాయ నీవునికి హనుమంతరాయ. ॥చెల్లె॥

స్వామికార్యపుఁజింత జానకి సేమపువార్త
దీమసాన మగుడి యేతెంచిన చేఁత
రామనామజపముతో రతి శ్రీ వెంకటపతి
కా మేటిబంటవై తివి హనుమంతరాయ. ॥చెల్లె॥ 118

లలిత

నేనై విడువద్దు తానై తగులవద్దు
తానే తానై వుండేఁ దగులెల్ల నూడు. ॥పల్లవి॥

పొద్దు వొద్దు హరిఁ దలఁపునఁ దలపోయఁగ
ఒద్దికైన పలుచేఁతలున్న వెల్లా మరచును
నిద్దిరించువాని చేతి నిమ్మపంటివలెనే
బుద్ధితోఁ గర్మములు గొబ్బున జారిపోవును. ॥నేనై॥

పలుమారు గురుసేవఁ బరగఁగాఁ బరగఁగా
చలివాసి యాత్మవిజ్ఞానముఁ బొడచూపు
కలగన్నవాఁడు మేలుకనిన కలవలెనే
పలుసంసారములెల్ల భావనలై యుండును. ॥నేనై॥

పక్కన శ్రీవేంకటేశుపై భక్తి వొడమఁగా
అక్కజపు టిహపరాలరచేతివి యౌను
చొక్కపు పరుసమంటి సొంపుగాని లోహము
నిక్కఁ బైఁడై నట్టు నెరుసెల్లఁ దొలఁగును. ॥నేనై॥ 119

శంకరాభరణం

పరగీనదివో గద్దెపై సింహము వాఁడె
పరమైన యాభళనారసింహము. ॥పల్లవి॥

తెల్లని మేని సింహము దేవసింహము
మెల్లని చిరునవ్వుల మేఁటి సింహము
చల్లేటి యూరుపులతో జయసింహము వాఁడె
బల్లిదుఁడై వెలసే యాభళ నారసింహము. ॥పరగీ॥

నిలుచున్న సింహము నిత్యసింహము
అలరుఁ గొండలమీఁది యాదిసింహము
వెలుపలి కడపపై వీరసింహము
పలుకుఁ బంతము (ల?) యహోబళ నారసింహము. ॥పరగీ॥

పుట్టుజడల సింహము పూర్ణసింహము
అట్టడి యార్పుల యాఁటడి సింహము
జట్టిగొన్న దాసులకు శాంతసింహము
పట్టపు శ్రీ వేంకట యహోబళ నారసింహము. ॥పరగీ॥ 120

371-వ రేకు. బౌళి

అడియ నడియనయ్య యఖిలలోకైకనాథ
తడలోఁకుల తాపత్రయము మానుపుటకు ॥పల్లవి॥

శరణు శరణు వో సర్వేశ్వర నీకు
మరణ భయములెల్ల మానుపుటకొఱకు
మొరయొ మొరయొ నీకు ముకుంద మాధవ
దురితములన్నియుఁ దొలఁగించుటకు. ॥అడియ॥

దండము దండము నీకు దైవశిఖామణి
పండియుఁ బండని మతి పాకము సేయుకొఱకు
అండనె దాస్యము దాస్యము నీకు నేనైతి
నిండు నీకరుణ నాపై నించేటి కొఱకు. ॥అడియ॥

అభయ మభయము శ్రీ యాదినారాయణ
ఉభయకర్మము నాకు నూడుచుటకొఱకు
విభుఁడ శ్రీ వేంకటేశ వినుతి సేసెద నిన్ను
శుభములన్నియు మాకుఁ జూపేటి కొఱకు. ॥అడియ॥ 121

గుండక్రియ ✓

నీచనైన నావల్ల నెరవై దైవమా
ఛీ ఛీ యిన్నివిధులఁ జిక్కువడె బదుకు. ||పల్లవి||

ఎదుటివేమైనఁ గోరు నింతలోనే మనసు
అది సంభవించకున్న నలమటపడుఁ దాను
కదిసి చేకూరితేను ఘనమై హర్షించు
వెద నీరువంక తుంగ విధమాయ మనసు. ||నీచ||

ఎక్కడికైన నేఁగు నెరఁగక తనువు
అక్కడ దుర్లభమైతే నంతలో వేసారు
దక్కి యుందే సుఖమైతేఁ దానే విఱ్ఱవీఁగు
గక్కన రొంపిలోని కంభమాయఁ దనువు. ||నీచ||

ఎందుకైనా సమ్మతించు నిరవైన జీవుఁడు
చెందిన పసిఁడికి చెలులకే మత్తుఁడౌను
కందువ శ్రీవేంకటేశ కరుణించవయ్య యింక
పొంది ప్రాఁటచెలమాయఁ బుట్టుగుల సినము. ||నీచ|| 122

లలిత

హరి నీమాయనే అంతాను
అరసి నీకు శరణనియెదను. ||పల్లవి||

మొదట నెవ్వరిక నేమాటాడిన
అది నీ ఘననామాంకితమే
అదిగో సకలశబ్దాఖ్యుఁడవని నిన్ను
పొదలి చదువులు పొగడీఁగాన. ||హరి||

యెవ్వరిఁ బొడగని యెక్కడనుండిన
నివ్వటిల్ల నది నీరూపే
నెవ్వదీర నిదె నిను విశ్వరూపుఁ
డెవ్వల నని శ్రుతులెంచీఁ గాన. ॥హరి॥

భావన యిది నీ బ్రహ్మాత్మకమే
శ్రీ వేంకటేశ నాచింత యిదే
ఆవల నిను సర్వాంతర్యామని
దేవ శాస్త్రములు తెలిపీఁ గాన. ॥హరి॥ 23

బౌళి రామక్రియ

కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించె నాపెదఁ బొడెద నేను. ॥పల్లవి॥

నీ పాదతీర్థము నీరజభవుని
పై పై కమండల పానీయము
చేపట్టి శంభుని చిరుజడలలో
దీపించు గంగాతీర్థరాజము. ॥కలిగె॥

ఘన నీ నామమె గౌరినాలికపై
పనిగొన్న మంత్రపాఠము
అనుఁగువాణికి నాదిచదువులఁ
బెనఁచే మొదలి బీజాక్షరము. ॥కలిగె॥

శ్రీ వెంకటేశ్వర చేరి నీదాసుల
సేవ నాపాలిఁటి జీవనము
ఆవటించి శరణాగతులకును
త్రోవయైనదిదె దోషహరము. ॥కలిగె॥ 124

### కన్నడగౌళ

ధరలోను జనహితము నానా భ
క్తరక్షణము నడపఁ గదయ్యా. ॥పల్లవి॥

హరీ నీకు నాగపాశబంధన
మది నీమహిమకు నటు వెలితా
తరవాతను రావణాది యసురల
తలలు నరకుట ప్రతాపము గాదా. ॥ధర॥

మును నీపై నొక భూతము నడచిన
మొగి నీమహిమకు నదివెలితా
ఘనహుంకారము మాత్రమున (డచినందు) నే
కడకుఁ దరముట ప్రతాపము గాదా. ॥ధర॥

కలియుగమున శ్రీ వేంకటగిరిపైఁ
గదిసిన నీమహిమకు వెలితా
కలిమల మథనుఁడ కల్క్యవతారము
గయికొనుటచటఁ బ్రతాపము గాదా. ॥ధర॥ 125

### దేవగాంధారి

హరి నీకే నేరుణమత్తుఁగాక తగవైతే
వారిమ నొకరియ్య నొకరికి దిద్దుటా. ॥పల్లవి॥

మొలచు జననలోకమునకు నుదుట వ్రానే
బలుఁడ నీచే నేఁ బత్రసాలమందుకొంటి
పెలుచు దేవతలకు పితరులకు ఋణము
యిల నత్తునట యివి యేనాటిఋణము. ॥హరి॥

యేయెడ నేమినేసి యేలోకమందునా
పాయని నీవే నాకు ప్రాణబంధుఁడవైతి
కాయపుఁ జుట్టరికాలు ఘన (క?) ఋణానుబంధ
మీయెడఁ గలిగెనట యేనాటి ఋణము. ॥హరి॥

శ్రీ వేంకటేశ నివి (నీవె?) చిక్కులఁబెట్టి నాకు
కావిరిఁ గర్మాలు మెడఁగట్టితివిగా
సోవల నీశరణము చొచ్చిన నాకునిక
యెవ్వారికెవ్వారు యేనాఁటిఋణము. ॥హరి॥ 126

372-వ రేకు. శ్రీరాగం

విన్నపమిదే నీకు వేవేలు విధముల
నన్నుఁ గావవె హరి నమో నమో. ॥పల్లవి॥

నీగుణము నేనెరిఁగి నిన్నుఁ గొలువనేర
నాగుణము నీవెరిఁగి నన్ను నేలుకొనవయ్యా
సాగరము నీవు దచ్చి సతిఁ దెచ్చుకొన్నట్టు
నాగశయనుఁడ హరి నమో నమో. ॥విన్నప॥

నీవున్న చోటెరిఁగి నిన్నుఁ దలఁచ నేర
నావున్న చోటెరుఁగుదు నన్ను నీవు దలఁచవే
కోవిదుఁడ నారఁ బేరుకొన్నవానిఁ గాచినట్టు
నావొడయ హరిహరి నమో నమో. ॥విన్నప॥

మనసులోనున్న నిన్ను మరవకుండ నేర
మనసులోని నీవే నామరవు దెలుపవయ్యా
పనివడి యహల్యఁ బాదమునఁ గాచినట్టు
ననిచి శ్రీవెంకటేశ నమో నమో. ॥విన్నప॥ 127

సామంతం

ఇన్ని విధాలు యిఁక నేల ప్ర
పన్నుఁడై మీఁద బహువిధులేలా. ॥పల్లవి॥

సతతభూతదయా సత్యవాక్యము గలితే
కుతిలపు ధర్మాల గొడవలేలా
ప్రతిలేని విజ్ఞానభావశుద్ధి గలిగితే
మతకపుఁ గర్మాలు మరియేలా. ॥ఇన్ని॥

పొందుగ నిన్నిటను సమబుద్ధి నిలిచితేను
సందడిలోఁ దీర్థాచరణలేలా
నిందమాని యానమాని నిర్మలచిత్తులయితే
వందడైన వుపవాసవ్రతములేలా. ॥ఇన్ని॥

శ్రీవేంకటపతి చింతనము గలిగితే
పావనపు శాస్త్రాల పఠనలేలా
ఆవల నీతని దాసులందుఁ బ్రేమగలిగితే
కావరపుటితర సంగతులేలా. ॥ఇన్ని॥ 128

లలిత

తథాకురుష్వ ముదా మామద్యైవ
అధోక్షజ త్వం అనుదాసోహం. ॥పల్లవి॥

తవాస్మి శరణం దహరావాహం
భవదురితాని భంజ మమ
భువి కృతంచయా పురా ప్రతిజ్ఞాం
జవన దదామి సర్వేభ్యఇతి. ॥తథా॥

వ్రజామి శరణం వరద తవాహం
త్యజితానుబంధ ధర్మమమ
భుజకృతాం పురా ప్రతిజ్ఞాం
వృజినై ర్మోక్షయిష్యామీతి. ॥తథా॥

చింతితం మయా శ్రీ వేంకటేశ
కింతు త్వం మయి కృపాంకురు
తంతుహి పురాకృతం ప్రతిజ్ఞాం
అంతగతిం నయామీతి మహి. ॥తథా॥ * 129

భూపాళం

నీనామమే మాకు నిధియు నిధానము
నీనామమె యాత్మనిధానాంజనము. ॥పల్లవి॥

నమో నమో కేశవ నమో నారాయణ
నమో నమో మాధవ నమో గోవింద
నమో నమో విష్ణు నమో మధుసూదన
నమో త్రివిక్రమ నమో వామనా. ॥నీనా॥

నమో నమో శ్రీధర నమో హృషీకేశ
నమో పద్మనాభ నమో దామోదర
నమో సంకర్షణ నమో వాసుదేవ ♦
నమో ప్రద్యుమ్నతే నమో యనిరుద్ధా. ॥నీనా॥

---

* ఈ సంస్కృత సంకీర్తన రేకులో నున్నట్లు ఎత్తి ముద్రింపఁబడినది. కొన్ని చోట్ల సవరణ సాధ్యమైనను పలుచోట్ల అట్లుచేయ వీలు కాలేదు. అక్షరములు మాత్రము కాక పదములే అందందు లోపించినవని యూహింపవలసి యున్నది.

♦ 'నమో వాసుదేవ నమో సంకర్షణ' అని యుండవలయును. ఇప్పటి పాఠమున ప్రసిద్ధనామావళి క్రమము తప్పినది. మరియు శ్రీకేశవ 'హరి' నామమున కెందు చోటులేదాయెను. అది 'శ్రీ వేంకటేశ' అను ముద్రానామమున అంతర్హితమైనది. లేదా 'హరి వేంకటేశ' అని పాఠము కాఁబోలును.

నమో పురుషోత్తమ నమో యధోక్షజ
నమో నారసింహ నమోస్తు యచ్యుత
నమో జనార్దన నమోస్తు ఉపేంద్ర
నమో శ్రీ వేంకటేశ నమో శ్రీకృష్ణా. ॥నమో॥ 130

## రామక్రియ

ఎంతలేదు చిత్తమా యీఁతలేల మోఁతలేల
వంతులకుఁ బారనేల వగరించనేలా. ॥పల్లవి॥

దక్కనివి గోరనేల తట్టుముట్టుపడనేల
చిక్కినంతకే సంతసించరాదా
ఒక్కమాఁటే వుప్పుదిని వుపతాపమందనేల
చక్కఁజూడఁ దగినంతే చవిగొనరాదా. ॥ఎంత॥

పారి పారి వేఁడనేల బడలికపడనేల
మీఁరి దైవమిచ్చినంతే మెచ్చరాదా
వీరిడై పొడవెక్కి విఱుగఁబడఁగనేల
చేరి యుండినంతకే చేఁచాఁచరాదా. ॥ఎంత॥

జీవులఁ గొలువనేల సిలుగులఁ బడనేల
శ్రీ వేంకటేశుఁడాత్మఁ జిక్కివుండఁగా
దావతి పడఁగనేల దప్పులఁ బొరలనేల
కైవశమైనందుకే గతిగూడరాదా. ॥ఎంత॥ 131

## వరాళి

శ్రీపతీ నీకెదురుచూచే నాకు నిట్లనే
దాఁపై నేఁడిపుడె ప్రత్యక్షము గావే. ॥పల్లవి॥

పదునాలుగేండ్లును బాసి నీకెదురుచూచే
యదన గుహునికిఁ బ్రత్యక్షమైతివి
కదిసి నీశరణంటే కరిరాజు నెదుటను
అదివో తొల్లియుఁ బ్రత్యక్షమైతివి. ॥శ్రీప॥

ప్రక్కన నహల్యశాపవిమోచనముగాఁగ
అక్కరతోడుతను బ్రత్యక్షమైతివి
చక్కగాఁ దపముసేసే శబరియెదుట నీవు
అక్కడ నాఁడందునుఁ బ్రత్యక్షమైతివి. ॥శ్రీప॥

భావించినట్టు మతిఁ బరమయోగులకెల్ల
తావుకొని నిచ్చలుఁ బ్రత్యక్షమైతివి
శ్రీవేంకటేశ నిన్నుఁ జింతించు మాబోంట్లకు
దైవమవై యిప్పుడే ప్రత్యక్షమైతివి. ॥శ్రీప॥ 132

373_వ రేకు. రామక్రియ ✓

తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమ. ॥పల్లవి॥

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో
అటు బాలుల రొదలు ఆకాశమెట్టోరిచెనో
కటకటా యిట్లాయఁ గలికాలమహిమ. ॥తతి॥

అంగలాచే కాముల యంగభంగపుదోఁపు
లింగితాన మింట సూర్యుఁడెట్టు చూచెనో
పొంగునానాజాతిచేత భువనమెట్లానెనో
కంగి లోకమిట్లాయఁ గలికాలమహిమ. ॥తతి॥

అరుదు గోహత్యలు సేయఁగ దూడలంగలావ
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధన చూరకెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ మెందణఁగెనో కలికాలమహిమ. ॥తతి॥

దేవాలయాలు నానాదేశములెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయగొంత పుట్టదాయ
కావరమె ఘనమాయఁ గలికాలమహిమ. ॥తతి॥

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరలకెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తనలుండే విపరీతకాలమున
గరువాలుఁ గపటాలె కలికాలమహిమ. ॥తతి॥

వృషమించి దంపతులు వొకరొకరినిఁ జూడ
చపల దుఃఖములతో సమయఁగాను
తపములు జపములు ధర్మములెందణఁగెనో
కప్పురఁ బాపాలు నిండెఁ గలికాలమహిమ. ॥తతి॥

తలలు వట్టీడువఁగా తల్లులు బిడ్డలవేయ
తలఁపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కలుగోయ మరుఁడెట్టు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమ. ॥తతి॥

దీనతలోఁబడి గుండెదిగులసురుసురులు
వానినెట్లు లోఁగొ (నె?) నో వాయుదేవుఁడు
గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ
గానఁబడె నింతేసి కలికాలమహిమ. ॥తతి॥

పలుమారు నమ్మించి ప్రాణములుగొనఁగాను
యిలఁ దమలోఁ బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీవేంకటేశ నీవే యెరుఁగుదువు
కలుమనే ఘనమాయఁ గలికాలమహిమ. ॥తతి॥ 133

లలిత

నీవు నాసొమ్మవు నేను నీసొమ్ము
యీవల నీవెపుడు మాయింటనుండఁ దగవా. ॥పల్లవి॥

హరి నీరూపము నాకు నాచార్యుఁడు మున్నె
కెరలి నాపాల నప్పగించినాఁడు
నరహరి నిను నేనన్యాయమునఁ దెలియను
పొరఁబడి నీకెందుఁ బోఁదగునా. ॥నీవు॥

జనని నీదేవి లక్ష్మి జనకుఁడవు నీవె
తనువులు నాత్మబాంధవము నీవే
అనయము నేనెంత యపరాధినైనాను
పనివడి నీవు నన్నుఁ బాయఁదగునా. ॥నీవు॥

బహువేదములు నిన్ను భక్తవత్సలుఁడవని
సహజబిరుదు భువిఁ జాటీని
యిహమున శ్రీవేంకటేశ యిది దలఁచైన
విహితమై నాకడకు విచ్చేయవే. ॥నీవు॥ 134

బౌళి

ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మాకిటునలె
పొంది యీతనిఁ బూజించఁ బొద్దాయనిపుడు. ॥పల్లవి॥

ధారుణి మైరావణు దండించి రాముఁ దెచ్చి
నేరుపున మించిన యంజనీతనయా
ఘోరనాగపాశములఁ గొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా. ॥ఇంది॥

నానాదేవతలకు నరసింహుఁ గంభములో
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా
మానవుఁడై (డౌ?) కృష్ణమహిమల విశ్వరూపు
పూని బండినుంచుకొన్న పోటుబంట యర్జునా. ॥ఇంది॥

శ్రీ వల్లభునకు నశేషకైంకర్యముల
శ్రీ వేంకటాద్రినైన శేషమూరితీ
కైవసమైనయట్టి కార్తవీర్యార్జునుఁడా యీ
దేవుని నీవేళ నిట్టె తెచ్చి మాకునియ్యరే. ॥ఇంది॥ 135

తోండి

స్వతంత్రుఁడవు నీవు సరిలేని దొరవు నే
సతికమై యాడినట్లు ఆడఁబోయేవా. ॥పల్లవి॥

యెంత నీమనసునను యెట్టుండె నట్లనే
అంతయుఁ జేయువయ్యా మాకదె చాలు
అంతకంటే నెక్కుడు నేమంటిమివో యటమీఁదఁ
జెంతల మాచెప్పినట్టు సేయఁబోయేవా. ॥స్వతం॥

కమ్మి నీవు మునుప సంకల్పించినట్లనే
కిమ్ముల నారీతిఁ జిత్తగించవయ్యా
అమ్మరో నేనందుకుఁ గాదనినను నీవు
సమ్మతించి మాతలఁపు సాగనిచ్చేవా. ॥స్వతం॥

పొంచీదేహమున మమ్ముఁ బుట్టించినట్లనే
పెంచి నీపై భక్తిమాకుఁ బెనచవయ్యా
నించిన శ్రీవేంకటేశ నేనే పదరితిఁగాక
మంచితనములు నీవు మానఁబోయేవా. ॥స్వతం॥ 136

374-వ రేకు. సామంతం

వెనక ముందరికిఁ బెద్దలకెల్లను వివరపుసమ్మతి యీ వెరవు
వెనకొని తనగురునాథుని యనుమతి వేదోక్తంబగు నీ తెరువు. ॥పల్లవి॥

కనకాసక్తుఁడు గాకుండుట మది కైవల్యమునకు నొక తెరువు
వనితల భ్రమలను వల (లఁ) దగులని మది వైకుంఠమునకు నొక తెరువు
మును కోపముఁ బెడఁబాసిన మతి మోక్షంబునకును నొక తెరువు
యెనసి యింద్రుపై హరిఁ దలఁచిన మతి యిన్నిటికెక్కు-డు యీ తెరువు. ॥వెన॥

నిరతి విషయముల నణఁచిన దృఢమతి నిశ్శ్రేయసమునకొక తెరువు
విరతితోడ నెలవైనమతి విభవపుఁ బరమున కొక తెరువు
వెరవున నిందరిమీఁదటి సమమతి విష్ణులోకమున కొక తెరువు
యిరవెరిఁగంతట హరి నమ్మినమతి యిన్నిటి కెక్కు-డు యీ తెరువు. ॥వెన॥

పన్నినకోరిక తెగఁగోసినమతి పరమపదమునకు నొక తెరువు
వున్నవిచారములుడిగించినమతి వున్నతపదమున కొక తెరువు
సన్నుతి భగవద్దాసుల దాస్యమె చలమతి ముక్తికి నొక తెరువు
యిన్నిట శ్రీవేంకటపతిశరణమె హితమతి నెక్కుడు యీ తెరువు. ॥వెన॥ 137

గుజ్జరి

కూడుదురూరకె నొకచో గుమి విత్తురు వేరొకచో
యేడకొ తెరువులు నడతురు యేఁటిదొ హరిమాయ. ॥పల్లవి॥

కొందరు జీవులు పురుషులు కొందరు (జీవులు ?) కాంతలు
కొందరు గొందరు నానాకువలయజంతువులు
యిందరుఁ గూడుక భువిలో నేమో యేమో చేసెద
రెందును నేమియుఁ గానరు యిట్టిది హరిమాయ. ॥కూడు॥

జననంబులు మరణంబులు జనునుదయాస్తమయంబులు (?)
జనులివిగనుచునె కనకము సరినార్జింపుదురు
పొనుగుచు నిలిచినదేదో పోయినదేదో కానము
యెనగొని వెరగయ్యీనిదె యిట్టిది హరిమాయ. ॥కూడు॥

జీవులకీ బ్రహ్మాండము చీమలపుట్ట విధంబున
కావరమిటు గప్పున్నది కాలత్రయములను
తావుల శ్రీవెంకటపతి దాసులు చొరకిటు నవ్వఁగ
యీవల నావలఁ బొదిగీ నిట్టిది హరిమాయ. ॥కూడు॥ 138

శోకవరాళి

నడవరో జడియక నవ్యమార్గమిది
మడుఁగిది వైష్ణవమార్గమిది. ॥పల్లవి॥

ఘన శుకముఖ్యులు గన్నమార్గమిది
జనకాదుల నిశ్చలమార్గమిది
సనత్కుమారుఁడు జరపుమార్గమిది
మనువుల వైష్ణవమార్గమిది. ॥నడవ॥

నలుగడ వసిష్ఠు నడుచుమార్గమిది
యిల వేదవ్యాసుల మార్గంబిది
బలిమి గలుగు ధ్రువపట్టపు మార్గము
మలసిన వైష్ణవమార్గమిది. ॥నడవ॥

పర (మ) మార్గంబిదె ప్రపంచమార్గము
గురుమార్గంబిదె గోప్యమిదే
గరిమెల శ్రీ వేంకటపతి మాకును
మరిపెను వైష్ణవమార్గమిదే. ॥నడవ॥ 139

ముఖారి

సమ్మతించి కనుకొంట సభన నిశ్చలబుద్ధి
యెమ్మెనెంత బోధించినా నెక్కడేల కలుగు. ॥పల్లవి॥

తలఁపులో కొలఁది దైవము తనవల్ల
గల విరతికొలఁది ఘనసుఖము
తెలిసిన కొలఁదే తేటల విజ్ఞానమందు
నెలమి నెవ్వరికైన నెక్కడేల కలుగు. ॥సమ్మ॥

తపము కొలఁదియె తరువాతి ఫలమును
ఉపమ కొలఁదియే యోగమును
ప్రపత్తి కొలఁదియే భాగవతభక్తియును
యెపుడు నెవ్వరికైనా నెక్కడేల కలుగు. ॥సమ్మ॥

చెంది చేసినకొలఁదే శ్రీ వేంకటేశుసేవ
అంది పొందిన కొలఁదే యానందము
కందువనితని కృపగలకొలఁదే యింతాను
యెందును దక్కినవారికెక్కడేల కలుగు. ॥సమ్మ॥ 140

బౌళి

వెదకిన నిదియే వేదార్థము
మొదలు తుదలు హరిమూలంబు. ॥పల్లవి॥

మునుకొని అవయవములు యెన్నైనా
పనివడి శిరసే ప్రధానము
యెనలేని సురలు యెందరు గలిగిన
మునుపటి హరియే మూలంబు. ॥వెదకి॥

మోవని యింద్రియములు యెన్నైనా
భావపు మనసే ప్రధానము
యీవల మతములు యెన్నికలిగినా
మూవురలో హరి మూలంబు. ॥వెదకి॥

యెరవగు గుణములు యెన్నికలిగినా
పరమజ్ఞానము ప్రధానము
యిరవుగ శ్రీ వేంకటేశ్వరు నామమె
సరవి మంత్రముల సారంబు. ॥వెదకి॥ 141

375-వ రేకు. బౌళి

ఎప్పటి జీవుఁడె యెప్పటి జగమే యెంతగాలమును నీరీతే
కప్పక వచ్చితివనాదినుండియు కర్మమ యింకా వేసరవా. ॥పల్లవి॥

మఱచితివా తొలుజన్మంబుల మరణకాలముల దుఃఖపుఁబొల్లు
మఱచితివా యమకింకరులై యి మర్దించిన బహుతాడనలు
మఱచితివా నరకకూపముల మాఁటికి మాఁటికిఁ బరచిన బాధలు
మఱియును సుఖమని భవమేకోరెదు మనసా ముందర గానవుగా. ॥ఎప్పటి॥

తలఁచవుగా జననకాలమునఁ దనువిదియే యిటు పుట్టిన రోఁతలు
తలఁచవుగా బాల్యంబునఁ దల్లితండ్రుల శిక్షలు వ్యాధులును
తలఁచవుగా సంసారమునకును దైన్యంబున యాచించెటి యలమట
తలఁపుననిదియే వలెనని వోమెదు తనువా యింకా రోయవుగా. ॥ఎప్పటి॥

కంటివిగా మలమూత్రాదులు కడుఁగఁగఁ దీరని దినదినగండము
కంటివిగా కనురెప్పలనే కాలముగడచెటి కడత్రోవ
కంటివిగా శ్రీ వేంకటపతి కరుణచేత నీ వివేకభావము
అంటి యిటువలెనె సార్వకాలమును అంతరాత్మ నిన్నుఁదలఁచవుగా, ॥ఎప్పటి॥

## లలిత

అన్ని మంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశుమంత్రము. ॥పల్లవి॥

నారదుండు జపియించె నారాయణమంత్రము
చేరెఁ బ్రహ్లాదుఁడు నారసింహమంత్రము
కోరి విభీషణుఁడు చేకొనె రామమంత్రము
వేరె నాకుఁగలిగె వేంకటేశుమంత్రము. ॥అన్ని॥

రంగగు వాసుదేవమంత్రము ధ్రువుండు జపించె
సంగవించెఁ గృష్ణమంత్ర మర్జునుఁడును
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుఁడు పఠించె
వింగడమై నాకునబ్బె వేంకటేశుమంత్రము. ॥అన్ని॥

ఇన్ని మంత్రములకెల్ల యిందిరానాథుఁడె గురి
పన్ని నదిదియే పరబ్రహ్మమంత్రము
నన్నుఁ గావఁ గలిగెఁబో నాకు గురుఁడియ్యఁగాను
వెన్నెలవంటిది శ్రీ వేంకటేశు మంత్రము ॥అన్ని॥ 143

## వరాళి

హరిఁ గొలిచినఁగాని ఆపదలణఁగవని
యెఱఁగక పొరలితిమిందేమి నిజము. ॥పల్లవి॥

పుట్టిన దేహమొకటి పొందినవికారాలఁ
బట్టిన జీవుఁడొకఁడు ప్రాణములేదు (ను?)
కట్టిడిచిత్తమొకటి కరణములై తేఁ బది
యిట్టిదివో మాజన్మమిందేది నిజము. ॥హరి॥

మొదలి ప్రకృతొకటి ముంచిన గుణాలు మూఁడు
కదియు మోహమొకటి కర్మాలు పెక్కు
పొదలుఁగర్మమొకటి భోగాలనంతములు
యిదివో మాజన్మమెంచ మిం (నిం?) దేది నిజము. ॥హరి॥

అంతరాత్మ శ్రీవేంకటాద్రీశుఁడొక్కఁడే
చింతించ జీవులై తే సేనాసేన
అంతలో నితని శరణని బ్రతికితేఁగాక
యెంతలేదు మాజన్మమిందేది నిజము. ॥హరి॥ 144

ముఖారి

ఇదివో తెరమరఁగిహపరములకును
వెదకి కన్న మీఁద విచారమేలా. ॥పల్లవి॥

హరికుక్షిగతమె యఖిలలోకములెల్ల
నరకము స్వర్గమన్న నయమెంచనేలా
యిరవై యుండినచోనే యిటు హరిదాసుఁడై తే
పరమపదమునదే భ్రమయఁగ నేలా. ॥ఇది॥

అందరిలోపల హరి యంతరాత్ముఁడై యుండ
యిందును నరసురలని యెంచఁగ నేలా
అందిన మనసులో హరిభక్తి గలిగిన
నందునె మోక్షము తప్పదనుమానమేలా. ॥ఇది॥

ఘటన శ్రీ వేంకటేశు కల్పితమై జన్మములు
యిటు సుఖదుఃఖములు యెచ్చుకొందే (కొద్దే?) లా
నటలేక యాతని శరణము చొచ్చితేనే
పటుజీవన్ముక్తి యదే పలుమాటలేలా. ॥ఇది॥ 145

దేశి

హరి నీవే సర్వాత్మకుఁడవు
యిరవగు భావన యియ్యఁగదే. ॥పల్లవి॥

చూడక మానవు చూచేటికన్నులు
యేడనేవైనా యితరములు
నీడల నింతా నీరూపములని
యీడువడని తెలివియ్యఁగదే. ॥హరి॥

పారక మానదు పాపపు మనసిది
యీరసములతో నెందైనా
నీరజాక్షయిది నీమయమే యని
యీరీతుల తలఁపియ్యఁగదే. ॥హరి॥

కలుగక మానవు కాయపు సుఖములు
యిలలోపలఁ గలవెన్నైనా
అలరిన శ్రీ వేంకటాధిప నీకే
యిలనర్పితమను యిహమియ్యఁగదే. ॥హరి॥ 146

376-వ రేకు. లలిత

అతఁడే యెరుఁగును మముఁబుట్టించిన యంతరాత్మయగు నీశ్వరుఁడు
అతికీనతుకదు చిత్తశాంతియిదె ఆత్మవిహారంబిఁక నేఁగో. ॥పల్లవి॥

కనుచున్నారము సూర్యచంద్రులకు ఘనవుదయాస్తమయములు
వినుచున్నారము తొల్లిటివారల విశ్వములోపలి కథలెల్లా
మనుచున్నారము నానాటికి మాయలసంసారములోన
తనిసీఁ దనియము తెలిసీఁదెలియము తరువాతి పనులిఁక నేవో. ॥అత॥

తిరిగెదమిదివో ఆసలనాసల దిక్కులనర్థార్జన కొరకు
పొరలెదమిదివో పుణ్యపాపముల భోగములందే మత్తులమై
పెరిగెదమిదివో చచ్చెడి పుట్టెడి భీతిగలుగు దేహములోనే
విరసము లెరఁగము మరచీ మరవము వెనకటికాలము విధియేదో. ॥అత॥

అట్టినారము హరినుతిచే నాటఁడీ (డిఁబోవక ?) గురువనుమతిని
పట్టినారమిదె భక్తిమార్గమిదె (ముదు ?) బలువగు విజ్ఞానముచేత
గట్టిగ శ్రీ) వెంకటపతి శరణని కంటిమిదివో మోక్షము తెరువు
ముట్టీముట్టము పట్టీపట్టము ముందటి కైంకర్యంబేదో. ॥అత॥ 147

మాళవిగౌళ

ఇతఁడే యతఁడు గాఁబోలేలికె బంటును నై రి
మితిలేని రాఘవుఁడు మేఁటి హనుమంతుఁడు. ॥పల్లవి॥

జలధి బంధించి దాఁటె చలపట్టి రాఘవుఁడు
అలరి వూర కేదాఁటె హనుమంతుఁడు
అలుకతో రావణుని యదటణఁచె నతఁడు
తలఁచి మైరావణుని దండించె నితఁడు. ॥ఇత॥

కొండ వెల్లగించెఁ దొల్లి గోవర్ధనుఁడతఁడు
కొండతో సంజీవియెత్తెఁ గోరి యీతఁడు
గుండు గరఁచె నహల్యకొరకు సీతాపతి
గుండు గరఁగఁగఁబాడె కోరి యీతఁడు. ॥ఇత॥

అంజనాచలము మీఁదనతఁడు శ్రీ వేంకటేశుఁ
డంజనీతనయుఁడాయ ననిలజుఁడు
కంజాప్తకులరామఘనుఁడు దానును దయా
పుంజమాయ మంగాంబుధి హనుమంతుఁడు ॥ఇతఁ॥ 148

సామంతం

మంగాంబుధి హనుమంతుని (త నీ?) శరణ
మంగవించితిమి హనుమంతా. ॥పల్లవి॥

బాలార్కబింబము ఫలమని పట్టిన
ఆలరిచేఁతల హనుమంతా
తూలని బ్రహ్మాదులచే వరములు
వోలిఁ జేకొనిన వో హనుమంతా. ॥మంగా॥

జలధిదాఁట నీ సత్వము కపులకు
నలరి తెలిపితివి హనుమంతా
ఇలయు నాకసము నేకముగా నటు
బలిమిఁ బెరిగితివి భళి హనుమంతా. ॥మంగా॥

పాతాళములోపలి మైరావణు
నాతలఁ జంపిన హనుమంతా
చేతులు మోడ్చుక శ్రీ వేంకటపతి
నీతలఁ గొలిచే హిత హనుమంతా. ॥మంగా॥ 149

శంకరాభరణం

కదిసి యాతఁడు మమ్ముఁగాచుఁగాక
అదె యాతనికె శరణంటే నంటి నేను. ॥పల్లవి॥

ఎవ్వని వుదరమున నిన్నిలోకములుండు
ఎవ్వని పాదము మోఁచె నిల యలను
యెవ్వఁడు రక్షకుఁడాయ నీ జంతుకోట్లకు
అవ్విభునికి శరణంటే నంటినిప్పుడు. ||కదిసి||

సభలో ద్రౌపదిఁ గాచె సర్వేశుఁడెవ్వఁడు
అభయహస్తమొసఁగె నాతఁడెవ్వఁడు
ఇభవరదుఁడెవ్వఁడు యీతనికె వొడిగట్టి
అభినవముగ శరణంటే నంటినిప్పుడు. ||కదిసి||

శరణుచొచ్చిన విభీషణుఁ గాచె నెవ్వఁడు
అరిది యజునితండ్రి యాతఁడెవ్వఁడు
యిరవై శ్రీవేంకటాద్రి యెక్కినాతఁడితఁడే
అరసి యితనికే శరణంటే నంటినిప్పుడు. ||కదిసి|| 150

భైరవి

అనాదివిషయవిహారము గన ఆతుమ
అనేకమై వీఁగె నందుకే యీ యాతుమ. ||పల్లవి||

అన్నిట కర్మపుఁబంకమంటినదీ యాతుమ
మున్ను కోపదుర్గంధములఁ బొఁగె నీ యాత్మ
పన్ని భవముల కుప్పపట్టినదీయాతుమ
యెన్నఁడు సుజ్ఞానమింక నెరిగీనో యాత్మ. ||అనాది||

చెంచెలపుఁ దిప్పపెంటఁ జివికినదీయాత్మ
పంచల యాసల నురిఁ బడినదీయాత్మ
కంచపు భోగపుఁగాఁక గరివడీ నీయాత్మ
యెంచి విజ్ఞానమెన్నఁడెరిఁగీనో యాత్మ. ||అనాది||

మెలమితో శ్రీవేంకటేశుకృప నీయాత్మ
తెలిసి యించుకించుక తేటపడె నాత్మ
అలరి యాచార్యుని ఆధీనమైనాత్మ
మలసి యజ్ఞానమెట్టు మరచెనో యాత్మ. ||అనాది|| 151

377-వ రేకు. లలిత

నిఖిలమింతయు మేలు నేనే కీలు
మఖరక్షకుఁడ నన్ను మన్నించవే. ||పల్లవి||

నిండును జలనిధులైనా నెఱి నేటిమొత్తములచే
నిండదు నామనసైతే నిచ్చాయానల
పండును లోకములోని బహువృక్షతతులైనాఁ
బండదు నామనసైతే బహువిషయముల. ||నిఖిల||

తనియుఁ బసురమైన ధరణిఁ గసవు మేసి
తనియదు నామనసు ధనకాంక్షల
ఒనరఁ గారుచిచ్చైనా నొకవేళ శాంతిఁబొందు
పొసిగి యేపొద్దు శాంతిఁబొందదు నామనసు. ||నిఖిల||

లోకములోఁ గఠినపులోహమైనాఁ గరఁగును
కైకొని నామతి గరఁగదు భ్రమసి
యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను
నీకే శరణంటి నెమ్మదిఁ గావఁగదే. ||నిఖిల|| 152

గుండక్రియ

సిబ్బితి పడఁగనేల చింతలఁ బొరలనేల
గొబ్బున మొదలిసేరు కొనకెక్కదా. ||పల్లవి||

నెలవై తత్త్వార్థము నేనెఱఁగకుండినాను
తలఁపులోపలివాఁడు తానెఱుఁగుఁగా
అలరి దేహమున నేనశుచినై యుండినాను
యిల నాయంతరియామి యెప్పుడూ శుచేకా. ॥సిబ్బి॥

తిరమై నేను దివ్యదేశములనుండకున్న
ధర నాలోఁ బరమాత్మ తానుండుఁగా
నిరతి గుణముల నే నీచుఁడనై నాను
అరయ నాపాలిహరి యధికుఁడేకా. ॥సిబ్బి॥

ఒగి నేఁ బరతంత్రుఁడనై వుండినాను నాలోన
తగిన స్వతంత్రుఁడు తాఁ గలఁడు గా
వెగటై నేనుండినా శ్రీ వేంకటేశుఁడెదుటనే
వగలెల్లఁ దీర్చి కైవసమాయఁగా. ॥సిబ్బి॥ 153

## భైరవి

ఒక్కటి కొకటివి తోఁగములు
యిక్కడ మాబుద్ధులెక్కడఁ గొలుపు. ॥పల్లవి॥

పాయపు (వు?) మతిలో బలువగునాసలు
కాయము భువిలోఁ గలదాఁకా
ఆయము సంసారమందుకు మూలము
యేయుపా (య?) ములు యెక్కడఁ గొలుపు. ॥ఒక్క॥

మానదు కోపము మతిచంచలమును
కాని కర్మమిది గలదాఁకా
ఆనిన మనసే యందుకు మూలము
యే నేరుపులిఁక నెక్కడఁ గొలుపు. ॥ఒక్క॥

అందరు మోక్షంబవ్వల నివ్వలఁ
గందువ నిను మతిఁ గనుదాఁకా
అందితి శ్రీ వేంకటాధిప నీకృప
నొందలి మాయలు నొక్కడఁ గోలుకు. ॥ఒక్క॥ 154

## గుజ్జరి

హరిహరి నిను సకలాంతర్యామివి (ని?) ఆత్మఁదలఁచుటే యోగంబు
శరణాగతరక్షామణి నిన్నే శరణనియెడిదే తుదిపదము. ॥పల్లవి॥

నీయందే యీ సచరాచరమును నీవె చరాచరమందు నిత్యముగ
పాయక వుండుట గని తలపోయుట వరమహాత్మంబుల సారంబు
కాయము జీవుఁడు నీయధీనమై కలుగఁగఁ బ్రకృతియుఁ బురుషుఁడుగానిటు
మాయల ముంతువు మాయకుఁ జొరవని మతిఁ దలపోయుట సుజ్ఞానంబు. ॥

తనలోఁ (పలఁ?) బరతత్త్వపు నీవును తా నీపరతత్త్వములోపలఁగా
మననునఁ దలఁచుట వేదాంతంబుల మంతనముల సన్మార్గంబు
ఘనములకును మరి ఘనమై యుండే కడుసూక్ష్మమునకుఁ గడు సూక్ష్మంబై
యెనసిన పూసలలో దారమవని యెన్నుట పరమరహస్యంబు. ॥హరి॥

ఆతుమలోపల ఘనవై కుంతము ఆతుమ నీ నై కుంతములోపల
యీతల నాతల సరిగాఁ దెలియుట యిదియే బ్రహ్మానందంబు
శ్రీ తరుణీశ శ్రీ వేంకటపతి నేవారతె నిను నే భజియించెద
నీతపు దైవమవై ననుఁగావుము తలఁచెదమిదియే తత్త్వంబు. ॥హరి॥ 155

## గౌళ

వలసిన వారికి వై పులివి
చలమున మానుటె జయుమర్మం. ॥పల్లవి॥

తనలోనే పో దైవము
ఘనమే యణువై కనినది
కనవలె నీతనిఁ గనుటకు
మనసు లయమౌటె మర్మం. ॥వలసి॥

భావములోనే పరమము
తావై తలఁపే తగిలినది
కైవశమై యిది గలుగుటకు
కేవలశాంతం కృతమర్మం. ॥వలసి॥

హృదయములోనే యింతాను
తుదిపదమై మదిఁ దోఁచీని
యెదుటనె శ్రీవేంకటేశ్వరుని
కదిసి భజించుటె ఘనమర్మం. ॥వలసి॥ 156

బౌళి

రామమిందీవర శ్యామం పరాత్పర
ధామం సురసార్వభౌమం భజే. ॥పల్లవి॥

సీతావనితా సమేతం
పీత (స్ఫీత ?) వానరబల వ్రాతం
పూతకౌసల్యాసంజాతం
వీత భీత మౌని విద్యోతం. ॥రామ॥

వీరం రణరంగధీరం
సార ధర్మకులోద్ధారం
క్రూరదానవ సంహారం
శూరాధారాచార సుగుణోదారం. ॥రామ॥

పావనం భక్తసేవనం
దైవిక విహగప ధావనం
రావణానుజ సంజీవనం
శ్రీ వేంకట పరిచితభావనం. ॥రామ॥ 157

378-వ రేకు. ముఖారి

పట్టిన వ్రతము నీవే పరిపాలింతువు గాక
బట్టబయలింతే నేను బలిమున్నదా. ॥పల్లవి॥

దేవ నీవు మనసు సోదించఁగానె ధీరుఁడనై
ఆవలఁ జలించకుండే యంతవాఁడనా
పూవువంటి చిత్తమింతే పొల్లువంటికాయమింతే
భావించనిందులఁ బస వున్నదా. ॥పట్టిన॥

అంతరాత్మవై నీవు అటు మరఁగులు సేయ
నంతనె నినుఁ దెలిసే యంతవాఁడనా
గంతివంటి గుణమింతే గాలివంటి ప్రాణమింతే
యింత రట్టుసేయనిందు నెడమున్నదా. ॥పట్టిన॥

మచ్చిక శ్రీ వేంకటేశ మాట నీవై యుండఁగాను
అచ్చపు నిన్నునుతించే యంతవాఁడనా
గచ్చువంటి యిహమింతే గనివంటి పరమింతే
ముచ్చటికిందుకుఁ దుద మొదలున్నదా. ॥పట్టిన॥ 158

పాడి

నరసింహా రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ
సరుగ నాశత్రుల సంహరించవే. ॥పల్లవి॥

నరసింహ రామకృష్ణ నమో శ్రీవేంకటేశ
పరగ నా శత్రుల సంహరించవే ॥పల్లవి॥
శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల

బావతిట్లకు శిశుపాలునిఁ జంపిన
యేవకోపకాఁడవు నేఁడేందు వోతివి
నీవాఁడనని నన్ను నిందించి (చే?) శత్రువును
చావఁగొట్టి వానినిట్టే సంహరించవే. ॥నర॥

దాసుని భంగించేటి తరిఁ గన్యఁ (పుఁ?) జంపిన
యీసుకోపకాఁడవిపుడేందు వోతివి
మేసుల నీలాంఛనాలు మించినన్ను దూషించె
సాసించి శత్రువును సంహారింపవే. ॥నర॥

కల్లలాడి గూబయిల్లు కైకొన్న గద్దఁజంపిన
యెల్లగాఁగఁ గోపకాఁడవెందు వోతివి
యిల్లిదె శ్రీవేంకటేశ యీ నీమీఁదిపాటలు
జల్లన దూషించుశత్రువు సంహారింపవే. ॥నర॥ 159

నరాళి

ఎరిఁగీ నెరఁగరు దేమి సేతు మతి
హరిదాస్యంబదియే సుఖము. ॥పల్లవి॥

వెతలఁ బొరలే ఘనవిభవముకంటె
అతిపేదరికమది సుఖము
గతి నెరవుల సింగారముకంటెను
సతమగు తన నిచ్చలమే సుఖము. ॥ఎరిగీ॥

పలుబాములఁ బడు పగలిటికంటె
తెలిసి నిద్రించు రాతిరి సుఖము
అలమట గడించు నమృతముకంటె
కలపాటి తనకు గంజే సుఖము. ॥ఎరిగీ॥

పరపీడలొనఁగు భవమునకంటే
ధరఁబాడమని చందము సుఖము
గరిమల శ్రీ వేంకటపతి నీకే
శరణనియెడి నాజన్మమె సుఖము. ॥ఎరిగి॥ 160

## శ్రీరాగం

పుట్టుఁగా బుట్టిన నాభోగపుటాస
పట్టి యేమిగట్టుకొంటి బదుకవో యాసా. ॥పల్లవి॥

ఊరుదిప్పినట్టి యాస వూగము దిప్పినయాస
చేరవచ్చి దైన్యమందించిన యాస
భారపెట్టి దేహమెల్లా బడలించిన యాస
పారి మమ్మేఁచితి వింతబదుకవో యాసా. ॥పుట్ట॥

నాలుకరుచులయాస నాతులకాఁకల యాస
కాలకాసుకైన బొంకు గరపేయాస
వోలిఁ బుణ్యతపమెల్ల వొరులకమ్మించునాస
పాలుమాలించితివింక బదుకవో యాసా. ॥పుట్ట॥

కిందుపరచేటియాస కెలిసేయించేటియాస
పొందియట్టే సంతసానఁ బొదిపే యాస
కందువ శ్రీ వేంకటేశుఁ డని శరణంటి నేను
పందతనమెల్ల నింక బదుకవో యాసా. ॥పుట్ట॥ 161

## సామంతం

అరూపమునకె హరి నేను మొక్కెదను
చేరి విభీషణుని శరణాగతుఁడని చేకొని సరిఁ గాచితివి. ॥పల్లవి॥

ఫాలలోచనుఁడు బ్రహ్మయు నింద్రుఁడు
సోలినగ్నులును సూర్యచంద్రులును
నీలోనుండఁగ నెరిఁ గనెఁ గిరీటి
మూలభూతివగు మూర్తివి గాన. ||ఆరూ||

అనంతశిరసుల ననంతపదముల
అనంతనయనములనంతకరముల
ఘన నీరూపము గనుఁగొనెఁ గిరీటి
అనంతమూరితివన్నిటఁ గాన. ||ఆరూ||

జగములిన్నియును సకలమునీంద్రులు
నగు శ్రీ వేంకటనాథుఁడ నిన్నే
పొగడఁగఁ గిరీటి పొడగనె నీరూపు
అగణితమహిముఁడవన్నిటఁ గాన. ||ఆరూ|| 162

రామక్రియ

ఆంజనేయ యనిలజ హనుమంత నీ
రంజకపుఁ జేఁతలు సురలకెంచ వసమా. ||పల్లవి||

తేరిమీఁద నీరూపు దెచ్చిపెట్టి యర్జునుఁడు
కౌరవుల గెలిచె సంగరభూమిని
సారెకు భీముఁడు పురుషామృగముఁ దెచ్చుచోట
నీరోమములు గావా నిఖిలకారణము. ||ఆంజ||

నీమూలమునఁ గాదె నెలవై సుగ్రీవుఁడు
రామునిఁగొలిచి కపిరాజాయను
రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవిఁ
బ్రేమముతో మగుడను బెండ్లాడెను. ||ఆంజ||

బలుదైత్యులను దుంచ బంటతనము మించ
కలకాలమును నెంచఁ గలిగితిగా
అల శ్రీ వేంకటపతి యండనె మంగాంబుధి
నిలయపు హనుమంత నెగడితిగా. ॥ఆంజ॥ 163

379-వ రేకు. శంకరాభరణం

ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీకు మాకు రక్ష. ॥పల్లవి॥

మొదల నింద్రుఁడు నీమోమునకెల్లా రక్ష
యిదె నీశిరసునకు నినుఁడు రక్ష
కదిసి నీకన్నులకు గ్రహతారకాలు రక్ష
చెదర (ని?) నీమేనికెల్ల శ్రీరామరక్ష. ॥ఏల॥

పిరుఁదు వాలమునకు బెడిదపుశక్తి రక్ష
గరుడఁడు నీకరయుగముల రక్ష
గరిమ నీకుక్షికి కరివరదుఁడు రక్ష
సిరుల నీమహిమకు శ్రీరామరక్ష. ॥ఏల॥

వడి నీపాదములకు వాయుదేవుఁడు రక్ష
తొడలకు వరుణుఁడు తోడగు రక్ష
విడువని మతికిని వేదరాసులే రక్ష
నెడని నీయాయువుకు శ్రీరామరక్ష. ॥ఏల॥

నలువ నీగళరక్ష నాలుకకుర్వర రక్ష
అలర నీసంధులకు హరుఁడు రక్ష
పలు నీరోమములకు బహుదేవతలు రక్ష
చెలఁగు నీచేఁతలకు శ్రీరామరక్ష. ॥ఏల॥

అంగపు నీతేజమున కగ్ని దేవుఁడు రక్ష
శృంగారమునకెల్లా శ్రీపతి రక్ష
మంగాంబునిధి హనుమంత నీకేకాలము
చెంగట శ్రీ వేంకటాద్రి శ్రీరాము రక్ష. ॥ఏలు॥ 164

శాళి

ఎన్నఁడొకో సుజ్ఞానము యీ యాత్మకు
కన్నులెదిటివి చూచి కాలమునిట్లాయను. ॥పల్లవి॥

హేయములో సుఖము తొంగిలిలో సుఖము
కాయము నమ్మికదా కష్టపడెను
పాయములో చవులు పాపములో చవులు
మాయలు నమ్మికదా మనసూనిట్లాయను. ॥ఎన్న॥

కల్లలోని బదుకు కాసువీసపు బదుకు
కల్లరి ప్రాణాలు నమ్మి కట్టువడెను
వెల్లినేఁటి తలఁపు యింద్రియాలు తలఁపు
కొల్ల సంసారముఁగూడి గుణమునిట్లాయను.

అంగడిఁ బెట్టేసిరులు అలయింపులో సిరులు
దొంగజీవుఁడు యిట్లనే తొట్రుపడెను
అంగపు శ్రీ వేంకటేశుఁడంతలో మన్నించేఁగాను
ముంగిటెల్లా మోక్షమాయ ముచ్చటె యిట్లాయెను. ॥ఎన్న॥ 165

లలిత

ఏమిటివాఁడఁ గాను యిఁక నేను నా
సామపుఁ గర్మము నీకే సమర్పయామి. ॥పల్ల॥

తలఁపులోపల నున్న తత్వము (మా?) యిట్టె
వెలినుండే నాపాలి విష్ణుమూర్తి
పలుకులోపల నుండే పరమాత్ముఁడా నా
చలమరి మతి నీకే సమర్పయామి. ॥ఏమి॥

పుట్టుగులిచ్చినయట్టి పురుషోత్తమా తుద
ముట్టించు మోక్షపు మురమర్దనా
గుట్టుతో నిహాముచూపే గోవిందుఁడా నా
జట్టిచైతన్యము నీకే సమర్పయామి. ॥ఏమి॥

అరిదిభోగములిచ్చే యంతరాత్ముఁడా నాకు
శరణమైనయట్టి సర్వేశ్వరా
వెరసి నన్నేలిన శ్రీవేంకటేశుఁడా నా
సరవులన్నియు నీకే సమర్పయామి. ॥ఏమి॥ 166

## పాడి

ఒక్కఁడే యేకాంగవీరుఁ డుర్వికి దైవమానా (మైనాఁడు?)
ఎక్కడా హనుమంతుని కెదురా లోకము. ॥పల్లవి॥

ముఁదట నేలే పట్టమునకు బ్రహ్మయినాఁడు
అందరు దైత్యులఁ జంపి హరిపేరైనాఁడు
అంది రుద్రవీర్యము దానై హరుఁడైనాఁడు
యెందు నీహనుమంతుని కెదురా లోకము. ॥ఒక్క॥

చుక్కలు మోవఁ బెరిగి సూర్యుఁడు దానైనాఁడు
దిక్కుఁబాతాళముదూరి శేషుఁడైనాఁడు
గక్కన వాయుజుఁడై జగత్ప్రాణుఁడైనాఁడు
యెక్కువ హనుమంతుని కెదురా లోకము. ॥ఒక్క॥

జలధిఁ బుటమెగసి చంద్రుఁడు దానై నాఁడు
చెలఁగి మేరువుపొంత సింహమైనాఁడు
బలిమి శ్రీ వేంకటేశుబంటై మంగాంబుధి
నిల యీహనుమంతుని కెదురా లోకము. ॥ఒక్క॥ 167

దేశాక్షి

ఏమరక తలఁచరో యిదే చాలు
కామించినవి యెల్లఁ గక్కననే కలుగు. ॥పల్లవి॥

దురితములెల్లఁ దీరు దుఃఖములెల్ల నణఁగు
హరియని వొకమాఁటు అన్నాఁజాలు
సురలు పూజింతురు సిరులెల్లఁ జేరును
మురగురుని నామమటు పేరుకొన్నఁ జాలు. ॥ఏమ॥

భవములన్నియుఁ బాయు పరము నిహముఁజేరు
అవల నారాయణయన్నాఁ జాలు
భువియెల్లాఁ దానేలు పుణ్యములిన్నియుఁజేరు
తవిలి గోవిందునాత్మఁ దలఁచినఁ జాలు. ॥ఏమ॥

ఆనందము గలుగు నజ్ఞానమెల్లఁ బాయు
ఆనక శ్రీ వేంకటేశ యన్నాఁజాలు
యీనెపాన నారదాదులిందరు నిందుకు సాక్షి
దానవారి మంత్రజపతపమే చాలు. ॥ఏమ॥ 168

380-వ రేకు. బౌళి

ఎందును బోరాదీసంసారము
కందువ నీమాయ గడవఁగ వశమా. ॥పల్లవి॥

కలిమే చిత్తవికారహేతువది
అలర లేమి దైన్యహేతువు
పలులంపటములు బంధహేతువులు
తలఁగిన నడవదు తనుపోషణము. ॥ఎందు॥

మదవికారమిదె మహితయౌవనము
తుద వార్ధకమే దురంతము
ఇదె యర్థార్జన యాతాయాతన
అదియు మానితే నాఁకలి ఘనము. ॥ఎందు॥

ఎన్ని గడియించే వెన్నిట ముంచే
విన్నిట శ్రీవేంకటేశ్వరుఁడ
అన్నిట నంతర్యామివి నీవే
కన్ను దనియ ననుఁ గావఁగదే. ॥ఎందు॥ 169

దేవగాంధారి

వారిధిశయనవో వటపత్రపరియంక
గారవాన మేలుకొని కన్నులు దెరవవే. ॥పల్లవి॥

ఘనయోగిహృదయపు కమలాలు వికసించె
నొనర విజ్ఞానసూర్యోదయమాయ
మును జీవపరమాత్మముల జక్కవలు గూసె
వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవే. ॥వారిధి॥

కలుషములనేటి చీకటిల్లఁ బెడఁబాసె
నలువంక వేదకీరనాదము మ్రోసె
అలరి యితరధర్మాలనేటి చుక్కలు మాసె
జలజాక్ష మేలుకొని సతిమోము చూడవే. ॥వారిధి॥

కపటరాక్షసనేత్రకలుషహరములు మోచి
యిపుడే సుకర్మముల యెండ గాసె
అపురూప శ్రీ వేంకటాద్రీశ మేలుకొని
నిపుణుఁడ యిందిరయు నీవు మమ్ముఁగావకే ॥వారిధి॥ 170

### శుద్ధవసంతం

చేకొన్న భక్తులపాలి చింతామణి
సాకారమై వున్నాఁడు సర్వేశ్వరుఁడు. ॥పల్లవి॥

వాఁడిగోళ్ళచేత వడి హిరణ్యుని జంపి
వేడుక నెత్తురులెల్ల వెదచల్లుచు
పోఁడిమి నరసింహుఁడై పొడచూపె నల్లవాఁడె
మూఁడు మూర్తులకును మూలమీతఁడు. ॥చేకొన్న॥

కొండమీఁదఁ గూచుండి కోపముపసంహరించి
అండనున్న దేవతలకభయమిచ్చి
మెండుగ సులభుఁడై మెరయుచునున్నవాఁడు
దండి జగములకెల్ల దైవమీతఁడు. ॥చేకొన్న॥

వేవేలుచేతులను వెస నాయుధాలు వట్టి
చేన మీరి ప్రతాపాన సిరులు మించి
యీవల సహోబలాన నిరవై యున్నవాఁడు
శ్రీ వేంకటాద్రిమీఁది సిద్ధమూర్తి యీతఁడు. ॥చేకొన్న॥ 171

### సామంతం

కలశాపురముకాడ కందువ సేసుకొని
అలరుచున్నవాఁడు హనుమంతరాయఁడు. ॥పల్లవి॥

సహజాన నొకజంగచాఁచి సముద్రము దాఁటి
మహిమ మీఱఁగ హనుమంతరాయఁడు
ఇహమున రాముబంటై యిప్పుడూనున్న వాఁడు
అహరహమును దొడ్డ హనుమంతరాయఁడు. ॥కల॥

నిండు నిధానపులంక నిమిషాన నీరుసేసె
మండితమూరితి హనుమంతరాయఁడు
దండితో మగిడివచ్చి తగ సీతశిరోమణి
అండ రఘుపతికిచ్చె హనుమంతరాయఁడు. ॥కల॥

వదలని ప్రతాపాన వాయుదేవుసుతుఁడై
మదియించినాఁడు హనుమంతరాయఁడు
చెదరక యేపొద్దు శ్రీవేంకటేశువాకిట
నదివో కాచుకున్నాఁడు హనుమంతరాయఁడు. ॥కల॥ 172

## లలిత

వేవేలచందాలవాఁడు విఠలేశుఁడు
భావించ నలవిగాని పరమాత్ముఁడితఁడు. ॥పల్లవి॥

సతతము రుక్మిణీసత్యభామల నడుమ
రతికెక్కిన సింగారరాయఁడితఁడు
చతురత సనకాదిసంయమీంద్రుల మతి
నతిశయిల్లేటి పరమానంద మితఁడు. ॥వేవే॥

దేవతలకెల్లాను దిక్కు దెసై వెలుఁగొంది
తావుకొన్నయట్టి యాధారమితఁడు
మూవంక గొల్లెతలు మున్ను నేసినతపము
కైవసమై ఫలించిన ఘనభాగ్యమితఁడు. ॥వేవే॥

వరముతో యశోద వసుదేవాదులకు
పరగిన కన్నులపండుగీతఁడు
సిరులు మించినయట్టి శ్రీ వేంకటాద్రిమీఁది
నిరతి దాసులపాలినిధానమీతఁడు. ॥వేవేల॥ 173

తోండి

సుగ్రీవనారసింహా సులభుఁడవందరికి
నగ్రేసరుఁడ నీవవధారు దేవా. ॥పల్లవి॥

సనకాదులొకవంక జయవెట్టుచున్నారు
ఎనసి సురలు చేతులెత్తి మొక్కేరు
మునులిరుమేలానుండి మునుకొని నుతించేరు
అనుపమాలంకార అవధారు దేవా. ॥సుగ్రీ॥

గంగాదినదులెల్లఁ గడిగీ నీపాదములు
పొంగుచు సప్తఋషులు పూజించేరు
సంగతి వాయుదేవుండు సరినాలవట్టమిడీ
నంగజకోటిరూప యవధారు దేవా. ॥సుగ్రీ॥

పరగ నారదాదులు పాడేరు నీచరితలు
పరమయోగీంద్రులు భావించేరు
సిరులు మించినయట్టి శ్రీ వేంకటాద్రిమీఁద
నరుదుగ నున్నాఁడవు అవధారు దేవా. ॥సుగ్రీ॥ 174

381-వ తేకు. మాళవి

అరుదీ కపీంద్రుని యధికప్రతాపము
సురలకు నరులకీ సుద్దులెందుఁ గలవా. ॥పల్లవి॥

ఉదయాచలముమీఁద నొక్కజంగ చాఁచుకొని
వుదుటున నపరాద్రినొక్కజంగ చాఁచుకొని
తుద సూర్యమండలముతోడ మోము దివ్వుకొంటా
పెదవులెత్తి చదివెఁ పెద్దహనుమంతుఁడు. ||అరుదీ||

ఒక్కమొలగంట చంద్రుఁడొక్కమొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టఁగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్లఁ బెరిగెను పెద్దహనుమంతుఁడు. ||అరుదీ||

పిడికిలించినచేత బిరుదుల పండ్లగోల
తడయక కుడిచేత దశదిక్కులు
జడియక శ్రీ వేంకటేశ్వరుని మన్ననబంటు
బెడిదపు మహిమల పెద్దహనుమంతుఁడు. ||అరుదీ|| 175

## బౌళి

నమో నమో రఘుకులనాయక దివిజవంద్య
నమో నమో శంకరనగజ (జా ?) నుతా. ||పల్లవి||

విహితధర్మపాలక వీరదశరథరామ
గహనవాసినీ తాటకామర్దన
అహల్యాశాపమోచన అసురకులభంజన
సహజవిశ్వామిత్ర సవనరక్షకా. ||నమో||

హరకోదండహర సీతాంగనావల్లభ
ఖరదూషణారి వాలిగర్వాపహా
తరణితనూజాది తరుచరపాలక
శరధిలంఘనకృత్య సౌమిత్రిసమేతా. ||నమో||

బిరుద రావణశిరోభేదక విభీషణ
వరద సాకేతపురవాస రాఘవ
నిరుపమ శ్రీ వేంకటనిలయ విజయనగర
పురవరవిహార పుండరీకాక్షా. ॥నమో॥ 176

సాళంగనాట

చిత్తా అవధారు జియ్యా పరాకెచ్చరికె
హత్తి కానుకలిచ్చేరు అదె రాజరాజులు. ॥పల్లవి॥

రామ రఘుకులవీర రాజీవలోచన
కోమలశ్యామలవర్ణ కొలువువేళ
వామదేవాదిమునులు వారె సుగ్రీవుడు వాడె
వేమారును వానరవీరులు మొక్కేరు. ॥చిత్తా॥

దేవ సీతాసమేత ధీరలోకనాయక
భావించనవధరించు పాడువేళ
పావని యల్లవాడె భల్లూకపతి వీడె
సేవించీని భరతునిఁ జేకొను శత్రుఘ్నుని. ॥చిత్తా॥

శ్రీమదయోధ్యావిహార శ్రీ వేంకటనివాస
సామజవాజిరథాల సందడివేళ
సౌమిత్రి యీవంక విభీషణుఁడు నావలివంక
నీమహిమలెల్లా మెచ్చి నీకు విన్నవించేరు. ॥చిత్తా॥ 177

గుజ్జరి

హేయమేమీ లేదు జగమింతా రుచికరమే
మాయావికారమిది మనసెట్టు రోసును. ॥పల్లవి॥

కాయధారణములింపు కాంతలభోగములింపు
ఆయతమై వారివారి యాహారాలింపు
సోయగపుఁ గన్నులకు చూచేటి వేడుకలింపు
చాయ మనసాడఁబడి సమ్మతించితేను. ॥హేయ॥

పలుకులెల్లానింపు భావములెల్లానింపు
చెలరేఁగి తమతమ చేఁతలింపు
జలముల సంగతుల సహజములవి యింపు
వొలిసి తమమనసు వోడఁబడితేను. ॥హేయ॥

తగిన జన్మములింపు తమచక్కఁదనాలింపు
జగతివారికి వారిజాతులింపు
నిగిడి శ్రీవేంకటేశ నీమహిమలే యవి
ఒగరులేక మనసాడఁబడి వుండేను. ॥హేయ॥ 178

## సామంతం

ఎందలివారము నేము యెఱఁగవసముగాదు
సందడి విష్ణునకే శరణుచొచ్చేదము. ॥పల్లవి॥

తెర దీసినట్టుండు తెలిసితే జ్ఞానము
మరుగక మఱచితే మరఁగైతోఁచు
ఉరియై తగులుఁ గర్మమూడిచితే మూడును
ఇరవైన హరిమాయ తెలయిఁపుచున్నది. ॥ఎందలి॥

కడుఁ బుణ్యవశమై కాచుకుండు స్వర్గము
నడుమఁ బాపమూలము నరకము
తడవితేనంటును దాఁటేదే నేరుపు
యెడయకచ్యుతు మాయలెల్లయింపుచున్నవి. ॥ఎందలి॥

పట్టితేఁ దనమనసు పరమాత్మఁ గనిపించు
చుట్టుకొంటే బంధమై సూడు సాధించు
ఒట్టి శ్రీ వేంకటేశ్వరుఁడొకపి మమ్ము నేలెఁగాని
ఇట్టె యాదేవుని మాయ లెలయించును. ॥ఎందలి॥ 179

ధన్నాసి

పరమవివేకులాల బంధువులాల
తెరదీసి మాకునది తెలుపరో. ॥పల్లవి॥

ఏడు జానలమేనిలో నిందిరానాథుఁడున్నాఁడు
వేడుకతో నతనిని వెదకరో
పూడిచివున్నది మతిఁ బొందుగ వైకుంఠము
చూడరో ధ్యానముసేసి సోదించరో. ॥పరమ॥

కొడిదెఁడు బయలిలో గోవిందుని నెలవఁట
చిడిముడితో నిట్టే చేరి పట్టరో
అడఁచి దాఁచివున్నది అందే బ్రహ్మానందము
విడువరో యీ ముడియ వెలయఁ జేపట్టరో. ॥పరమ॥

ఊని నల్లెఁడు నాలికలోనుండు శ్రీ వేంకటేశుఁ
డానుకొని బత్తితోడ నటు నిల్పరో
నానఁబెట్టివున్నది నామకీర్తనములందు
తానకముగా నేపొద్దూఁ దలఁచుకోరో. ॥పరమ॥ 180

382-వ రేకు. సాళంగనాట

నీగురుతులు చూచుకో నీబిరుదులెంచుకో
యీగతిని కలబంట నీకన్నన్నుఁ గావవే. ॥పల్లవి॥

కానిలే నేనెంత కఠినచిత్తుఁడనైన
నానొసల నివే పట్టెనామములు
మేను తోలునెమ్ములతో మెరసినదైనాను
పూనితిఁ దమ్మితులసిపూసల పేరులు. ॥నీగు॥

భ్రమసి నేఁజేసినవి పాపకర్మములైనాను
జమళి భుజాలనివే శంఖచక్రాలు
అమరఁ దఱచుగా నేనాడేవి కల్లలైనా
తమిఁ బాడీ నాలిక నీతగు సంకీర్తనలు. ॥నీగు॥

తలఁచితే నావోజ తామసగుణమైనాను
పిలిచేది భువిలో నాపేరు తిమ్మఁడు
అలర శ్రీవేంకటేశ అన్నిట నేదుష్టనైనా
తలకొనె నాయందు దాసరితనములు. ॥నీగు॥ 181

మాళవి

చెప్పితే నాశ్చర్యము చేసినచేఁత లితఁడు
ముప్పిరి మనుజవేషమునఁ బుట్టె నీతఁడు. ॥పల్లవి॥

రాముఁడుదయించె దశరథునికిఁ దమ్ములతో
గామిడైన తాటకిని ఖండించెను
ఆముక యజ్ఞముగాచె హరునివిల్లు విరిచె
ప్రేమమున సీతాదేవిఁ బెండ్లియాడెను. ॥చెప్పి॥

మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపె వాలిని యా సుగ్రీవునిఁ బెంచె
జడధి బంధించెను సరుగ రావణుఁగొట్టె
బడినే విభీషణునిఁ బట్టముగట్టెను. ॥చెప్పి॥

సీతాదేవితో నయోధ్యసింహాసనం బెక్కి
పోతరించి కుశలవపుత్రులఁ గాంచె
శ్రీ తరుణితోఁగూడ శ్రీ వేంకటేశుఁడై నిల్చె
కౌతుకమున జగము కరుణఁగాంచెను. ॥చెప్పి॥ 182

## లలిత

ఏడై నా సుఖమే యున్నిటా నీవు గలవు
కాదుగూడదని నిన్నుఁ గక్కసించనేటికి. ॥పల్లవి॥

ఇహాపరములలో నీవెందు నన్నుఁ బెట్టినాను
నిహితమై రెంటిలోనా నీవు గలవు
వహి కెక్కె నేలినవాఁ డెక్కడ నుండుమన్నా
తహతహఁ గొలువుకుత్తరువే బంటుకును. ॥ఏడై॥

పాపపుణ్యములలో నేపని నన్నుఁ జేయించినా
కాపాడి రెండు నీవు కల్పించినవే
యేపున మగఁడైనవాఁ డేమి సేయించినాను
దాపగఁ బతివ్రతాధర్మమే యాలికిని. ॥ఏడై॥

కల్లనిజములలో నొక్కటి నన్ను నాడించినా
చెల్లించ రెంటికి నీవే శ్రీ వేంకటేశా
తల్లిదండ్రులే బాస దగ నాడనేర్పినాను
తెల్లమిగ నాడేది తేకువే బిడ్డనికి. ॥ఏడై॥ 183

## వరాళి

శ్రీసతీశ బహుజీవ చైతన్యుఁడవు నీవు
చేసే నా చేఁతలెల్లా నీ సేవలెసుమ్మీ. ॥పల్లవి॥

అనుక జగద్రూపుఁడవని విన్నందురుగాని (న?)
నేనట్టే చూచినవెల్లా నీరూపులే
నానాశబ్దవాచ్యుఁడ వెన్నఁగ నీవటుగాన
వీనుల విన్నవెల్లా నీ విష్ణుకథలే. ॥శ్రీస॥

అట్టే విశ్వభుజుఁడవై తివి తొల్లే కనక
నెట్టిన నారుచులెల్లా నీప్రసాదాలే
గుట్టుతో సర్వవ్యాపకుఁడవు నీవటుగాన
ముట్టిన నాతనుభోగములు నీకే సెలవు. ॥శ్రీస॥

ప్రకటన జీవులకెల్ల ప్రాణమవు నీవేకాన
ముక్కున నాయాఘ్రాణములెల్లా నీవే
నెక్కొని శ్రీవేంకటేశ నీవే లోకకుటుంబివి
తక్కక నా సంసారధర్మమెల్లా నీవే ॥శ్రీస॥ 184

## లలిత

బడిబడి నింద్రియాలే పరువులు వెట్టుఁగాని
యెడయని చుట్టరికాలెవ్వరికీ లేవు. ॥పల్లవి॥

వన్నెసతుల రూపులు వారివద్దనేవుండఁగా
కన్నులఁ జూచేవారికి కళ రేఁగును
ఎన్నిక వారిగుణాలు యెదమాటలాడఁగాను
విన్నవారికి నూరకే వేడుకలు పుట్టును. ॥బడి॥

అంతా నింతాఁ గమ్మవిరులంగళ్ళలో నుండఁగాను
సంతవారలూరకే వాసనగొందురు
బంతివారి కంచాలలో పలురుచులుండఁగాను
వింతవారలందుకుఁగా వెస నోరూరుదురు. ॥బడి॥

వెరవిచే దేహాలు వేరేవేరే వుండఁగాను
సురతాన సోఁకితేనే చొక్కుదురు
ఇరవై శ్రీవేంకటేశుఁడిన్నిటికి సూత్రధారి
సరినితని దాసులు జడియరిందుకును. ॥జడి॥ 185

కన్నడగౌళ

వట్టిజోలి యెంతలేదు వైరాగ్యమే సుఖము
నెట్టుకొని వివేకించ నేరవలెఁ గాని. ॥పల్లవి॥

కట్టుకొంటే నెంతైనాఁ గలదు సంసారము
పట్టి చేసితేఁ గలవు పనులెన్నైనా
చుట్టుకొంటే నూరఁగల చుట్టరికముఁ గలదు
అట్టె మోక్షము గడించేదరుదింతేకాని. ॥వట్టి॥

చేసేనంటేఁ గలవు సేనాసేన పనులు
లాసి తగిలించుకొంటే లంపటాలంటు
ఆసలు పెంచఁ జూచితే నంతకంతకుఁ బెరుగు
వేసరి శాంతిఁబొందుటే వేడుకింతె కాని. ॥వట్టి॥

పనిగొంటేఁ బెనగొనుఁ బంచేంద్రియంబులు
వెనుకొంటేఁ జిమ్మిరేఁచు వేడుకలు
తనిసి శ్రీవేంకటేశు దాసానుదాసుఁడై
కొనకెక్కఁగ నాతనిఁ గొలువవలెఁ గాని. ॥వట్టి॥ 186

383-వ రేకు. రామక్రియ

ఏమని పొగడవచ్చు నీతని ప్రభావము
వేమరు నోపుణ్యులాల వినరో యీకతలు. ॥పల్లవి॥

అనంతసూర్యతేజుఁడట కాంతి చెప్పనెంత
దనుజాంతకుఁడట ప్రతాపమెంత
మనసిజగురుఁడట మరిచక్కఁదనమెంత
వనజజుఁ గనినట్టివాఁడట ఘనతెంత. ॥ఏమ॥

గంగాజనకుఁడట కడుఁ జెప్పే పుణ్యమెంత
చెంగట భూకాంతుఁడట సింగారమెంత
రంగగు లక్ష్మీశుఁడట రాజసములెంచ నెంత
అంగవించు సర్వేశుఁడట సంపదెంత. ॥ఏమ॥

మాయానాథుఁడట మహిమ వచించుటెంత
యేయెడఁ దా విష్ణుఁడట యిరవెంత
పాయక శ్రీ వేంకటాద్రిపతియై వరములిచ్చే
వేయిరూపులవాఁడట విస్తారమెంత. ॥ఏమ॥ 187

గౌళ

తలఁచరో జనులు యీతని పుణ్యనామములు
సులభమునవే సర్వశుభములు గలుగు. ॥పల్లవి॥

హనుమంతుఁడు వాయుజుఁడంజనాతనయుఁడు
వనధిలంఘన శీలనై భవ్యుఁడు
దనుజాంతకుఁడు సంజీవనీశైలసాధకుఁడు
ఘనుఁడగు కలశాపుర (కాంత?) హనుమంతుఁడు. ॥తలఁచ॥

లంకాసాధకుఁడు లక్ష్మణప్రబోధకుఁడు
శంకలేని సుగ్రీవసచివుఁడు
పొంకపురాముని బంటు భూమిజసంతోషదూత
కొంకినే కలశాపురి దేవహనుమంతుఁడు, ॥తలఁచ॥

చటులార్జునసఖుఁడు జాతరూపవర్ణుఁడు
ఇటమీఁద బ్రహ్మపట్టమేలేటివాఁడు
నటన శ్రీవేంకటేశు నమ్మిన సేవకుఁడు
పటు కలశాపురప్రాంత హనుమంతుఁడు. ॥తలఁచ॥ 188

### లలిత

ఇన్నాళ్ళునెఱఁగక యిందులోనే వోలాడితిమి
మన్నించఁగా నీవల్లనే మరిగితి నిన్నును. ॥పల్లవి॥

ముందు నేఁజేసినకర్మములు దొలఁకరాఁగాను
అంది మరఁగుఁ జొచ్చితి నందుకే నీకు
కందువఁ బంచేంద్రియాలు కదిమి పైకొనఁగాను
చందములనిట నీకు శరణంటిని. ॥ఇన్నా॥

వెనకటి సంసారము విడువకవుండఁగాను
వినయాన నీడాగు వేసుకొంటిని
ఘనమైన జన్మములు కాణాచియై తగఁగ
మొనసి నీపాదాలకు మొక్కితి నేను. ॥ఇన్నా॥

జీవులసంగాతాలు చిమ్మి రేఁచి యాఁకోఁగా
భావించి నీమీఁదటిబత్తి వట్టితి
శ్రీవేంకటేశుఁడవు నీదేవులలమేలుమంగ
నీవు నాకు బుద్ధియ్యఁగా నిన్నే పాడితిని. ॥ఇన్నా॥ 189

### దేవగాంధారి

ఎంతనినుతియింతు రామరామ యిట్టె నీప్రతాపము రామరామ
పంతాన సముద్రము రామరామ బంధించవచ్చునా రామరామ. ॥పల్లవి॥

4 బలుసంజీవనికొండ రామరామ బంటుచేఁదెప్పించితివి రామరామ
3 కొలఁదిలేని వాలిని రామరామ ఒక్కకోలనేసితివట రామరామ
1 వెలయనెక్కువెట్టి రామరామ హరువిల్లు విరిచితివట రామరామ
2 పెలుచు భూమిజను రామరామ పెండ్లాడితివట రామరామ. ॥ఎంత॥

శరణంటే విభీషణుని రామరామ చయ్యనఁ గాచితివట రామరామ
బిరుదుల రావణుని రామరామ పీఁచమడఁచితివట రామరామ
ధరలోఁ జక్రవాళము రామరామ దాఁటి వచ్చితివఁట రామరామ
సురలు నుతించిరట రామరామ నీ చొప్పయిఁక నదియెంతో రామరామ. ॥

సౌమిత్రి భరతులు రామరామ శత్రుఘ్నులుఁ(డుఁ?) దమ్ములట రామరామ
నీ మహత్త్వము రామరామ నిండె జగములెల్లా రామరామ
శ్రీ మంతుఁడవన్నిటాను రామరామ శ్రీ వేంకటగిరిమీఁది రామరామ
కామితఫలదుఁడవు రామరామ కౌసల్యానందనుఁడవు రామరామ. ॥ఎంత॥

లలిత

బిరుదు బంటితఁడు పెద్ద హనుమంతుఁడు
సిరులతో రామునికి సీతాదేవికిని. ॥పల్లవి॥

మూఁడులోకములుఁ దుదముట్టఁ బెరిగినవాఁడు
వాఁడె హనుమంతదేవరఁ జూడరో
పోఁడిమి దైత్యులగెల్చి పూఁచి చేయెత్తుకున్నాఁడు
వాఁడి ప్రతాపముతోడ వాయుజుఁడు. ॥బిరుదు॥

ధ్రువమండలము మోవఁ దోఁక యెత్తుకున్నవాఁడు
నవరన్నై పెనుజంగ చాఁచుకున్నాఁడు
భువిఁ గవచకుండలంబులతోఁ బుట్టినవాఁడు
వివరించ నేకాంత వీరుఁడైనవాఁడు. ॥బిరుదు॥

పెనచి పండ్లగోల పిసికిలించుకున్నాఁడు
ఘనుఁడిన్నిటా స్వామికార్యపరుఁడు
వినయపు శ్రీ వేంకటవిభునికి హితవరి
యెనసి మొక్కఁగదరో యెదుటనున్నాఁడు. ॥బిరుదు॥ 191

384-వ రేకు. దేవగాంధారి

నమ్మితిఁ జుమ్మీ వో మనసా నాకే హితవయి మెలఁగుమీ
మమ్మాటికి నేఁ జెప్పితిఁజుమ్మీ మురహరునామమె జపించుమీ. ॥పల్లవి॥

తలఁచకుమీ యితరధర్మములు తత్వజ్ఞానము మఱవకుమీ
కలఁగకుమీ తేపనికై నను కడుశాంతంబుననుండుమీ
వలవకుమీ వనితలకెప్పుడు వైరాగ్యంబుననుండుమీ
కొలువకుమీ యితరదైవముల గోవిందునినే భజించుమీ. ॥నమ్మి॥

కోరకుమీ దేహభోగములు గొనకొని తపమే చేకొనుమీ
మీరకుమీ గురువుల యానతి మెఱయఁ బురాణములే వినుమీ
చేరకుమీ దుర్జనసంగతి జితేంద్రియుఁడవై నిలువుమీ
దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ. ॥నమ్మి॥

వెఱవకుమీ పుట్టుకులకు నరి వివేకించి ధీరుఁడవగుమీ
మఱవకుమీ యలమేల్మంగకు మగఁడగు శ్రీ వేంకటపతిని
కెఱలకుమీ మాయారతులను కేవలసాత్వికుఁడవు గమ్మీ
తొఱలకుమీ నేరములను సింధురరక్షకునినె సేవించుమీ. ॥నమ్మి॥ 192

సాళంగనాట

దాసులపాలిటి సిద్ధాన్నమై వున్నాఁడిదిగో
ఆసాబాసా నిత్యుఁడే అహోబలేశుఁడు. ॥పల్లవి॥

నగె నదె వాఁడిగో నారసింహదేవుఁడు
పగదీర హిరణ్యాక్షుఁ బట్టి చించి
మృగరూపై గద్దెమీఁద మెఱసీ వాఁడదిగో
అగవ్రాఁ దగ వెత్తెఁగి యహోబలేశుఁడు. ||దాసు||

తేరి చూచీనదిగో దేవాదిదేవుఁడు
ఘోరపు నెత్తురు గోళ్ళఁ గురియఁగాను
నేరుపుతోఁ బేగుల జన్నిదాలవాఁడదిగో
ఆరితేరి కొలువున్నాఁడహోబలేశుఁడు. ||దాసు||

కరుణించీ వాఁడదిగో కమలాపతి దేవుఁడు
సురలు గొలువఁగాను సొంపుతోడను
ఇరవై లోకములెల్లా నేలుచున్నాఁడదిగో
హరి శ్రీవేంకటాద్రి యహోబలేశుఁడు. ||దాసు|| 193

సామంతం

సముఖా యెచ్చరిక వో సర్వేశ్వరా
అమరె నీ కొలువు ప్రహ్లాదవరదా. ||పల్లవి||

తొడమీఁదఁ గూచున్నది తొయ్యలి యిందిరాదేవి
బడిఁ జెలులు సోబానఁ బాడేరు
నడుమ వీణె వాయించీ నారదుఁడల్లవాఁడె
అడరి చిత్తగించు ప్రహ్లాదవరదా. ||సము||

గరుడోరగాదులూడిగములు నీకుఁ జేసేరు
ఇరుమేలాఁ గొలిచేరు యింద్రాదులు
పరమేష్ఠి యొకవంక పనులు విన్నవించీ
అరసి చిత్తగించు ప్రహ్లాదవరదా. ||సము||

పొదిగొని మిమ్ము నిట్టే పూజించేరు మునులెల్లా
కదిసి పాడేరు నిన్ను గంధర్వులు
ముదమున నహోబలమునను శ్రీ వేంకటాద్రి
నదె చిత్తగించుము ప్రహ్లాదవరదా. ॥సము॥ 194

మాళవిగౌళ

అవధారు చిత్తగించు హనుమంతుఁడు వీఁడె
భువిలోనఁ గలశాపుర హనుమంతుఁడు. ॥పల్లవి॥

రామ నీ సేవకుఁడీడె రణరంగధీరుఁడు
ఆముకొన్న సత్త్వగల హనుమంతుఁడు
దీమసాన లంకసాధించి వుంగరముదెచ్చె
కామితఫలదుఁడు యీఘనహనుమంతుఁడు. ॥అవ॥

జానకీరమణ సప్తజలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుఁడు
పూని చుక్కలెల్లా మొలపూసలుఁగాఁగఁ బెరిగి
భానుకోటికాంతితోఁ జొప్పడు హనుమంతుఁడు. ॥అవ॥

ఇనవంశ శ్రీ వేంకటేశ నీకరుణతోడ
అనుపమజయశాలి హనుమంతుఁడు
పనిపూని ఇటమీఁది బ్రహ్మపట్టమునకు నీ
యనుమతిఁ గాచుకున్నాఁడు హనుమంతుఁడు. ॥అవ॥ 195

పాడి

దేవదేవోత్తమ తే నమో నమో
రావణదమన శ్రీ రఘురామా. ॥పల్లవి॥

రవికులాంబుధిసోమ రామ లక్ష్మణాగ్రజ
భువి భరత శత్రుఘ్న పూర్వజ
సవనపాలక కౌసల్యానందవర్ధన
ధవళాబ్జనయన సీతారమణా. ॥దేవ॥

దనుజసంహారక దశరథనందన
జనకభూపాలకజామాత
వినమిత సుగ్రీవ విభీషణ సమేత
మునిజనవినుత సుముఖ సుచరిత్రా. ॥దేవ॥

అనిలజవరద యహల్యాశాపమోచన
సనకాదిసేవితచరణాంబుజ
ఘనతర శ్రీ వేంకటగిరినివాస
అనుపమోదారవిహార గంభీరా. ॥దేవ॥ 196

౩౭౫-వ రేకు. రామక్రియ

కొలువరో మొక్కరో కోరినవరములిచ్చీ
సులభుఁడిన్నిటా నిండెను సుగ్రీవనరహరి. ॥పల్లవి॥

కంబములోనఁబుట్టి కనకదైత్యునిఁగొట్టి
అంబరపు దేవతలకభయమిచ్చి
పంబి సిరిఁ దనతొడపైఁ బెట్టుక మాటలాడి
అంబుజాక్షుఁడై నట్టి యాదిమనరహరి. ॥కొలు॥

నానాభూషణములున్నతితోడ నిడుకొని
పూనికతో ప్రహ్లాదుని బుజ్జగించి
మానవులకెల్లను మన్నన చాలానొసఁగి
ఆనందముతో నున్నాఁడు అదిగో నరహరి. ॥కొలు॥

మిక్కిలి ప్రతాపముతో మించినకాంతులతోడ
అక్కజపు మహిమల నలరుచును
తక్కక శ్రీవేంకటాద్రిఁ దావుకొని వరాలిచ్చి
చక్కఁదనములకెల్లాఁ జక్కని నరహరి. ॥కొలు॥ 197

సాళంగనాట

ఈతనిదెంత ప్రతాపమీతనిదెంత పుడుటు
యీతఁడు రాముబంటు యీతని సేవించరో. ॥పల్లవి॥

ఉదయాస్తనగములకొనకు జంగ చాఁచినాఁడు
చదివె రవితో సర్వశాస్త్రములు
తుద బ్రహ్మాండము మోవఁ దోఁక మీఁదికెత్తినాఁడు
పెద పెదకోరల పెనుహనుమంతుఁడు. ॥ఈతని॥

కుడిచేత దనుజులఁ గొట్టనూఁకించినాఁడు
ఎడమచేఁ బండ్లగోల పిడికిలించె
ఉడుమండలము మోవనున్నతిఁ బెరిగినాఁడు
బెడితపుమేనితోడఁ బెనుహనుమంతుఁడు. ॥ఈతని॥

పుట్టుఁగవచకుండలంబుల తోడ నున్నవాఁడు
గట్టిగ బ్రహ్మపట్టానకుఁ గాచుకున్నాఁడు
ఇట్టె శ్రీవేంకటేశునెదుటఁ బనులు సేసీ
బెట్టిదపుసంతోసానఁ బెనుహనుమంతుఁడు. ॥ఈతని॥ 198

లలిత

నమోనమో జగదేకనాథ తవ సర్వేశ
విమల విశ్రుత లసద్విఖ్యాత కీర్తే. ॥పల్లవి॥

రామ రఘువర సితరాజీవలోచన
భూమిజారమణ త్రిభువనవిజయ
కోమలాంగశ్యామ కోవిద రణరంగ
భీమవిక్రమ సత్యబిరుద ప్రవీణ. ||నమో||

దళిత దైతేయ కోదండ దీక్షాదక్ష
జలజాప్తకుల విభీషణరక్షక
కలిత దశరథతనయ కౌసల్యానంద
సులభ వానరముఖ్య సుగ్రీవవరద. ||నమో||

చారులక్ష్మణ భరత శత్రుఘ్న పూర్వజ
తారకబ్రహ్మ నిత్యస్వరూప
ధీర శ్రీవేంకటాధిప భక్తవత్సల
భూరిగుణ సాకేతపురనివాసా. ||నమో|| 199

నాట

ఎక్కడఁ జొచ్చెదరింక రక్కసులు
చిక్కె నెటఁజూచిన నరసింహునిచేత. ||పల్లవి||

ఉడుగని కోపపుటుగ్రపుఁ జూపుల
మిడుఁగురులెగయఁగ మిన్నందీ
పిడుగుల వ్రేఁతలఁ బెళపెళ నార్చుచు
వెడలెఁ గంబమున వీరసింహుఁడు. ||ఎక్కడ||

కాలాగ్నికీలలు గక్కెడి చక్రము
కేలఁబూని కులగిరులదర
ఫాలలోచనము ప్రకటించుచు నదె
కాలుఁడై వెలసెఁ గడఁదీ సింహాకృతి. ||ఎక్కడ||

కుటిలనఖంబుల ఘోరాకారత
తొటతొట నెత్తురు దొరుగఁగను
చటులదానవులఁ జదుపుచు శ్రీ వేం
కటమున నిలిచె సాకారనరసింహుఁడు. ॥ఎక్కడ॥ 200

గుజ్జరి

కొండవంటి దేవుఁడు నేఁగొలిచే దేవుఁడు వీఁడే
నిండుకున్నాఁడు తలఁచు నిమ్మదినో మనసా. ॥పల్లవి॥

నన్నుఁ బుట్టించేదేవుఁడు నాలోనున్నాఁడు దేవుఁడు
కన్నచోటులనే వుండే కాచేదేవుఁడు
వెన్నతోఁ బెంచేదేవుఁడు వివేకమిచ్చేదేవుఁడు
యెన్నని పొగడవచ్చు యీతఁడే మాదేవుఁడు. ॥కొండ॥

సిరులిచ్చిన దేవుఁడు సేవగొనేటి దేవుఁడు
గురుఁడై బోధించి చేకొన్న దేవుఁడు
మరిగించిన దేవుఁడు మాటలాడించే దేవుఁడు
ఇరవై మాయింటనున్నాఁడీ దేవుఁడు. ॥కొండ॥

దాపుదండైన దేవుఁడు దరిచేర్చిన దేవుఁడు
రూపు చూపెనిదివో బోరున దేవుఁడు
శ్రీపతియైన దేవుఁడు శ్రీవేంకటాద్రిదేవుఁడు
చేపట్టి మమ్మేలినాఁడు చేచేతనే దేవుఁడు ॥కొండ॥ 201

సామంతం

ఔనయ్య జాణఁడవు ప్రహ్లాదవరదా
అనలు వెట్టకుము ప్రహ్లాదవరదా. ॥పల్లవి॥

వేసరక శ్రీసతితో వేడుక నవ్వులు నవ్వి
ఆసలు చూపేవు ప్రహ్లాదవరదా
నేస వెట్టిన చేతుల చెఱఁగువట్టి తీసేవు
ఆసుద్దులే చెప్పేను (వు?) ప్రహ్లాదవరదా. ॥ఔన॥

నంటునఁ దొడమీఁదను నలినాక్షి నెక్కించుక
అంటేవు సిగ్గులు ప్రహ్లాదవరదా
గెంటక యేపొద్దును కేలుగేలుఁ గీలించుక
అంటువాయవదివో ప్రహ్లాదవరదా. ॥ఔన॥

కందువతోఁ గాఁగిలించి కైవసము నేసుకొంటి
వందముగనికెను (?) ప్రహ్లాదవరదా
పొంది శ్రీవేంకటమున పొంచి యాభళములోనా
అంది వరాలిచ్చేవు ప్రహ్లాదవరదా. ॥ఔన॥ 202

## 386-వ రేకు. రామక్రియ

కంటిఁ గంటి వీఁడివో కని కృతార్థుఁడనైతి
వింటి నిందరిచేతా నీ విట్ఠలేశు సుద్దులు. ॥పల్లవి॥

ఈతఁడా గోవర్ధనమెత్తిన పసిబాలుఁడు
కాళరేఁడీతఁడా గోపికావల్లభుఁడు
పూతన నీతఁడా పట్టి పొరిగొన్నయట్టివాఁడు
చేత గచ్చకాయలాడీ శ్రీవిట్ఠలేశుఁడు. ॥కంటి॥

ఈ దేవుఁడా కుచేలునికిష్ట సంపదిచ్చినాఁడు
పోదిగొని యీ దేవుఁడా భూభారమడఁచినాఁడు
వేదమయుఁడీదేవుఁడా విశ్వరూపు చూపినాఁడు
సేదదేరీ మహిమల శ్రీవిట్ఠలేశుఁడు. ॥కంటి॥

ఈ మూరితా పాండురంగ మిరవై వుండినవాఁడు
కామించీమూరితి శ్రీ వేంకటగిరి నున్నవాఁడు
దోమటి నీమూరితే యాద్యులపాట మెచ్చినాఁడు
క్షేమముతో వరాలిచ్చీ శ్రీ విట్ఠలేశుఁడు. ॥కంటి॥ 203

నాట

సరిలేరితనికిని సాహసవిక్రముఁడీతఁ
డరయ కలశాపురహనుమంతుఁడు. ॥పల్లవి॥

ఉదధి లఘించినాఁడు వుబ్బున మైనాకముచే
పొదలి నట్టనడుమఁ బూజగొన్నాఁడు
సదరాననే లంక సాధించి వచ్చినాఁడు
అదివో కలశాపురహనుమంతుఁడు. ॥సరి॥

సంజీవి దెచ్చినాఁడు సమరరంగమందు
భంజించి వానరుల బదికించినాఁడు
అంజనీదేవికిఁ గొడుకై నాఁడు యేపనుల
నంజఁడు కలశాపురహనుమంతుఁడు. ॥సరి॥

బలురాకాసులనెల్లా పట్టి చదిపినవాఁడు
ఇల రామునికిఁ గడు హితుఁడై నాఁడు
చెలఁగి శ్రీ వేంకటేశు సేవ సేయుచున్నవాఁడు
అలరి కలశాపురహనుమంతుఁడు. ॥సరి॥ 204

సాళంగనాట

సేవించరో జనులాల చేతులెత్తి మొక్కరో
వావిరిఁ బ్రహ్లాదునికి వరదుఁడు వీఁడే. ॥పల్లవి॥

సేవింపరో జనులాల చేయెత్తి మొక్కరో
వావిరి ప్రహ్లాదునికి వరదుఁడు వీఁడె ॥పల్లవి॥



జగన్నాథుఁడు వీఁడే సర్వరక్షకుఁడు వీఁడే
నిగమవేద్యుఁడైన నిత్యుఁడు వీఁడే
సగుణవంతుఁడు వీఁడే సర్వకాముఁడు వీఁడే
నగుమొగము సుగ్రీవనరసింహుఁడు వీఁడే. ॥సేవిం॥

మరుజనకుఁడు వీఁడే మహిమాధికుఁడు వీఁడే
పరగ శ్రీలక్ష్మీపతి వీఁడే
సురలకేలిక వీఁడే శుభమూరితి వీఁడే
నరసఖుఁడు సుగ్రీవనరసింహుఁడు వీఁడే. ॥సేవిం॥

భువనాధిపతి వీఁడే పురుషోత్తముఁడు వీఁడే
వివిధప్రతాపకోవిదుఁడు వీఁడే
ఇవల శ్రీవేంకటాద్రిసిరవైనతఁడు వీఁడే
నవమూర్తి సుగ్రీవనరసింహుఁడు వీఁడే. ॥సేవిం॥ 205

## బౌళి

ఎంతని పొగడవచ్చు నితనిప్రతాపము
పంతములెల్లామెరసి ప్రతాపించీ వాఁడే. ॥పల్లవి॥

చేతులనే పెరికి సంజీవికొండ దెచ్చినాఁడు
అతఁడువో తొల్లి పెద్దహనుమంతుఁడు
ఘాతలఁ దానొక్కఁడే లంక సాధించి వార్ధిదాఁటి
యీతలికి వచ్చినాఁడు ఇదివో వాఁడే. ॥ఎంత॥

ముదమున బ్రహ్మలోకముదాఁకాఁ బెరిగినాఁడు
అదివో యిప్పుడు పెద్దహనుమంతుఁడు
వదలక తోఁక చక్రవాళపర్వతము వెంటా
వుదుటునఁ జుట్టుకొని వున్నాఁడు వాఁడే. ॥ఎంత॥

మెల్లనే జంగచాఁచి మెడ నిక్కించుకొన్నాఁడు
అల్లదివో మించే పెద్దహనుమంతుఁడు
వెల్లవిరై నాఁడు శ్రీ వేంకటేశ్వరుని బంట్లై
చల్లఁగా లోకములేలీ సంతతము వాఁడే. ॥ఎంత॥ 206

పాడి

ఎంతప్రతాపమువాఁడు యెంతటినేరుపరి
యెంతని పొగడవచ్చు నీరాముని. ॥పల్లవి॥

వాలినొక్క కోలనేసి వారిధి గట్టినవాఁడు
తాలిమితో సుగ్రీవుని లాలించినాఁడు
పాలించి విభీషణునిఁ బట్టముగట్టినవాఁడు
యేలుమని లంకకెల్లా నీరాముఁడు. ॥ఎంత॥

కుచ్చిపర (?) మొండెముగా కుంభకర్ణుఁ గొట్టినాఁడు
హెచ్చి రాకాసులఁ జంపె నీరాముఁడు
తచ్చి రావణాసురుని తలలు చెండాడినాఁడు
ఇచ్చకోలఁదుల నిట్టె యీ రాముఁడు. ॥ఎంత॥

సీతతో విమానమెక్కి చేరి యయోధ్యకు వచ్చి
యీతలఁ బట్టమేలినాఁడీరాముఁడు
శ్రీ తరుణితోఁగూడి శ్రీ వేంకటేశుఁడై నాఁడు
యీతఁడే దరిసించరో యీరాముఁడు. ॥ఎంత॥ 207

లలిత

సర్వరక్షకుఁడైన సర్వేశుఁడే కాక
ఉర్విమీఁద నందరిలో నొక్కఁడా రాముఁడు. ॥పల్లవి॥

కొండపాడవులైన ఘోరవానరబలము
గుండుగా వారిధిదండఁ గూడఁబెట్టి
నిండుజలనిధి గట్టి నిగిడి లంక సాధించె
అండనే రాముఁడు నరుఁడనవచ్చునా. ॥సర్వ॥

అన్నిటా దేవతలకు నసాధ్యమైన రావణు
నెన్నికగాఁ బుత్రమిత్రహితులతోడ
పన్నుకొని శస్త్రాస్త్రపంక్తులనె ఖండించె
సన్నుతినిట్టె రాముని జనుఁడనవచ్చునా. ॥సర్వ॥

చలపట్టి లంక విభీషణునికిఁ బాలించి
బలువుగ సీతఁగూడి పట్టమేలి
ఇలలో శ్రీ వేంకటాద్రినిరవై లోకముగాచీ
నలువంక రాముఁడు నరుఁడనవచ్చునా. ॥సర్వ॥ 208

387_వ రేకు. లలిత

కంటిమి నేఁడిదె గరుడాచలపతి
యింటివేలుపగు యీశ్వరుఁడితఁడు. ॥పల్లవి॥

శ్రీ నరసింహుఁడు చిన్మయకాంతుఁడు
దానవాంతకుఁడు దయానిధి
నానామహిమల నమ్మినవారిని
పూనుక కాచే పోషకుఁడితఁడు. ॥కంటి॥

దేవాదిదేవుఁడు దినకరతేజుఁడు
జీవాంతరంగుఁడు శ్రీవిభుఁడు
దైవశిఖామణి తలఁచినవారిని
సేవలుగొని కాచేవిభుఁడితఁడు. ॥కంటి॥

పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుఁడు
కరుణానిధి బుధకల్పకము
పరగు శ్రీవేంకటపతి తనదాసుల
సరుదుగఁ గాచే యనంతుఁడితఁడు. ॥కంటి॥ 209

## రామక్రియ

అల్లవాఁడే గద్దెమీఁద నోభళపు గుహలోన
యెల్లవారిఁ గరుణతో నేలుకొన్నాఁడు. ॥పల్ల॥

ఉక్కుఁగంభములోఁబుట్టి యుగ్రనారసింహుఁడు
మొక్కలపు హిరణ్యుని ముందలవట్టి
గక్కనఁ గడుపు చించి ఘనమైన పేగులు
వెక్కసపు జంద్యాలుగా వేసుకొన్నాఁడు. ॥అల్ల॥

కోరలు దీఁడుకొంటాను ఘోరనారసింహుఁడు
సారెసారె నెత్తురులు చల్లుకొంటాను
వీరులైన దానవుల వెదకి వెదకి కొట్టి
గోరికొనఁ గండలెల్లాఁ గోయుచున్నాఁడు. ॥అల్ల॥

విచ్చన విడిని శ్రీవేంకటనారసింహుఁడు
పచ్చిదేర నట్టే పకపక నవ్వి
కచ్చుపెట్టి దేవతలఁగాచి యభయమిచ్చి
పెచ్చురేఁగి సంతోసానఁ బెరుగుచున్నాఁడు. ॥అల్ల॥ 210

## మాళవిగౌళ

ఎంతని పొగడవచ్చు నితని సేవించరో
పొంతసిదే కలశాపుర హనుమంతుఁడు. ॥పల్లవి॥

పిడికిటఁ బట్టినవి పెద్దపండుల గొలలు
అడరి యెత్తినది మహావాలము
గుడిగొన రాకాసులఁ గొట్టినది వలకేలు
పొడసూపీఁ గలశాపుర హనుమంతుఁడు. ॥ఎంత॥

సందడి నమరానకు చాఁచినది పెనుజంగ
అందముగ నిక్కించినది వురము
కుందక వీరరసమే కురిసేటిది మొగము
పొందగువాఁడు కలశాపుర హనుమంతుఁడు. ॥ఎంత॥

ఉదుటున మెలఁగేవి వొద్దికైన పాదాలు
త్రిదశుల మెప్పించేది దివ్యరూపము
అదె శ్రీ వేంకటేశుబంటై నిలుచున్నాఁడు
వొదలుచుఁ గళశాపుర హనుమంతుఁడు. ॥ఎంత॥ 211

శంకరాభరణం

ఎంతభాగ్యవంతులమో యీతనిఁ బొడగంటిమి
చేతనుండి మమ్మునేలే శ్రీ విట్ఠలేశుఁడు. ॥పల్లవి॥

తుంగభద్రాతటమున తొంటిపరబ్రహ్మము
అంగవించి సాకారమైవున్నాఁడు
సంగడితో రుక్మిణియు సత్యభామల నడుమ
చెంగలించీ మహిమల శ్రీ విట్ఠలేశుఁడు. ॥ఎంత॥

అందపుఁ బైఁడిమేడలో నాదిమూర్తియైన దేవుఁ
డందరికిఁ బ్రత్యక్షమైయున్నాఁడు
సందడించి గోపికాజనములతోడుత
చెందివున్నాఁడిదివో శ్రీ విట్ఠలేశుఁడు. ॥ఎంత॥

వెలసి వనాలలోన వేదవేద్యుఁడైన హరి
అలరి కృష్ణావతారమై యున్నాఁడు
మెలమి శ్రీ వేంకటేశుఁడితఁడే పదారువేల
చెలులతోఁ గూడినాఁడు శ్రీ విట్ఠలేశుఁడు. ॥ఎం॥ 212

నాట

ఇట్టి సుద్దులితనివి యిదివో కొలువున్నాఁడు
నట్టనడుమ నీసుగ్రీవ నారసింహుఁడు. ॥పల్లవి॥

పగలూ రాతిరీఁ గాని పఁుసంధ్యాకాలమందు
మొగిఁ బచ్చి వెచ్చి గాని మొనగోళ్లచే
గగనమూ నేలాఁ గాని గనమైన తొడమీఁద
నగుతా హిరణ్యుఁ గొట్టె నరసింహదేవుఁడు. ॥ఇట్టి॥

వెలుపలా లోనాఁ గాని వెడఁగుఁగడపమీఁద
తలితండ్రి గానియట్టి తావునఁ బుట్టి
మొలచి చిగిరించని ముదురుఁగోరలతోడ
నలి హిరణ్యు జంకించె నరసింహదేవుఁడు. ॥ఇట్టి॥

మానిసీ మెకమూఁ గాని మంచియాకారముతోడ
పూని యిల్లూఁ బందిలీఁ గాని గుహాలో
ఆనుక హిరణ్యుని నడఁచి శ్రీ వేంకటాద్రి
నానాదిక్కుల నేలిన నరసింహదేవుఁడు. ॥ఇట్టి॥ 213

బౌళి

అదె చూడరయ్యా పెద్దహనుమంతుని
గుదిగొని దేవతలు గొనియాడేరయ్యా. ॥పల్లవి॥

ఉదయాస్తశైలములు వొకజంగగాఁ జాఁచె
అదివో ధ్రువమండలమందె శిరసు
చదివె సూర్యునివెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతనిమహిమేమని చెప్పేమయ్యా. ॥అదె

దండిగా బ్రహ్మాండముదాఁకఁ దోఁక మీఁదికెత్తె
మెండగు దిక్కులనిండ మేను వెంచెను
గుండుగూడ రాకాసులఁ గొట్టఁగఁ జేతులు చాఁచె
అండనీతని ప్రతాపమరుదరుదయ్యా. ॥అదె॥

దిక్కులు పిక్కటిలఁగ దేహరోమములు వెంచె
పక్కన లోకములకుఁ బ్రాణమై నిల్చె
ఇక్కడ శ్రీవేంకటేశు హితవరిబంటాయ
మిక్కిలి నీతనిలావు మేలు మేలయ్యా. ॥అదె॥ 214

ఠావ.నర్హ.

## రామక్రియ

నరులాల మునులాల నానాదేవతలాల
పరబ్రహ్మమీతఁడే ప్రత్యక్షమై వున్నాఁడు. ॥పల్లవి॥

భావించి చూడరో వీఁడె ప్రహ్లాదవరదుఁడు
సేవించరో తొడమీఁది శ్రీసతిని
వావిరి నుతించరో వరశంఖచక్రాలవే
కోవిదుఁడు గద్దెమీఁదఁ గొలువై వున్నాఁడు. ॥నరు॥

చెలఁగి మొక్కరో వీఁడె శ్రీనరసింహదేవుఁడు
తెలియరో యీతని తేజోరూపము
అలరి పూజించరో అనంతహస్తములవే
కొలఁదిమీరి విష్ణుఁడు కొలువై వున్నాఁడు. ॥నరు॥

ఇదె శరణనరో హిరణ్యదైత్యహరుని
అదన జపించరో యీ హరినామము
యెదుట శ్రీ వేంకటాద్రి నీయహోబలమునందు
కొదలేకాదిమూరితి కొలువై వున్నాఁడు. ॥నరు॥ 215

పాడి

ఇఁతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు
చెంత రమాదేవిఁగూడె శ్రీ నరసింహుఁడు. ॥పల్లవి॥

సరిఁ గొండలెక్కుకొని సరసములాడుకొంటా
సొరిది మోములు తొంగి చూచుకొంటాను
విరులచెండులఁగొని వేటులాడుకొంటాను
సిరితోడ విహరించీ శ్రీ నరసింహుఁడు. ॥ఇంతు॥

భవనాశిలోని నీరు పైఁ జల్లులాడుకొంటాను
నవకపు సిరులను నవ్వుకొంటాను
జవళిఁ గెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను
చివన నిందిరనంటె శ్రీ నరసింహుఁడు. ॥ఇంతు॥

వేమరుఁ దొడలెక్కక వీడుదోడులాడుకొంటా
ప్రేమమునఁ గౌఁగిళ్ళఁ బెనఁగుకొంటా
ఆముక శ్రీ వేంకటాద్రినోభళాన నిలిచిరి
శ్రీ మహాలక్ష్మి తోడ శ్రీ నరసింహుఁడు. ॥ఇంతు॥ 216

బౌళి

సులభుఁడై వున్నాఁడు సుగ్రీవనారసింహుఁడు
నెలకొన్న దాసులకు నిధానము వీఁడే ॥పల్లవి॥

తుంగభద్రాతటమున తోడపై నిందిరతోడ
సింగారించుకొన్న వేల్పుసింహము వీఁడే
సంగతిగా దేవతలు జయవెట్టి కొలువఁగా
చెంగటనే మహిమలఁ జెలరేఁగీ వీఁడే. ॥సుల॥

చలువబండలమీఁద చక్కనికొండలదండ
అలరీని వీరనరహరి వీఁడే
వెలయు శంఖచక్రాల వేవేలు హస్తములతో
బలవంతుఁడై వున్నాఁడు పంతముతో వీఁడే. ॥సుల॥

పువ్వులతోఁటల నీడ భువనేశ్వరములోన
జవ్వనపు మనుజకేసరి
ఇవ్వల శ్రీవేంకటాద్రినిరవై వరములిచ్చి
నవ్వుమోముతోడ భువనములేలీ వీఁడే. ॥సుల॥ 217

నాట

వినరయ్య నరసింహవిజయము జనులాల
అనిశము సంపదలు నాయువు నొసఁగును. ॥పల్లవి॥

మొదలఁ గొలువుకూటముననుండి కశిపుఁడు
చదివించెఁ బ్రహ్లాదుని శాస్త్రములు
అదన నాతఁడు నారాయణుఁడే దైవమనె
అదరిపడి దైత్యుఁడు అతనిఁ జూపుమనె. ॥వినర॥

అంతటఁ బ్రహ్లాదుఁడు అన్నిటానున్నాఁడనియె
పంతమున దానవుఁడు బాలునిఁ జూచి
యెంతయుఁ గడఁకతోడ ఇందులోఁ జూపుమని
చెంతనున్న కంబము చేతఁగొని వేసె. ॥వినర॥

అటమీఁదట బ్రహ్మాండంబదరుచు
కుటిలభయంకర ఘోషముతో
చిట చిట చిటమని పెట పెట పెటమని
పటపట మనుచును బగిలెఁ గంబము. ॥వినర॥

కులగిరులదరెను కుంభిని వడఁకెను
తలఁకిరి దైత్యులు తల్లడిలి
గుఁగెను జగములు కంపించె జగములు
ప్రళయకాలగతిఁ బాటిల్లినపుడు. ॥వినర॥

ఘననారసింహుఁడదె కంబమునందు వెడలె
కనుపట్టెనదిగో చక్రజ్వాలలు
మునుకొని వెడలెఁ గార్ముకము క్తళరములు
కనకకశిపునకుఁ గలఁగె గుండియలు. ॥వినర॥

అడరె సద్దేవ్రుఃకోపాగ్నులు బెడిదపు
మిడుఁగురులతోడుత మిన్నులుముట్టె
పిడుగులు రాలేటి భీకరనఖరములు
గడుసు రక్కసునికి గాలములై తగిలె. ॥వినర॥

తొడికిపట్టి విష్ణుఁడు తొడమీఁదనిడుకొని
కడుపు చించెను వానిగర్వమడఁగ
వెడలెఁ జిల్లున వానివేఁడినెత్తురు నింగికి
పొడి పొడియాయ శత్రుభూషణములెల్లను. ॥వినర॥

నెళ నెళన విరిచె నిక్కి-వానియెముకలు
పెళపెళ నారిచి పెచ్చుపెరిగె హరి
జళిపించి పేగులు జంద్యాలుగా వేసుకొనె
తళుకుఁగోరలు తళతళమని మెరిచె. ॥వినర॥

పెటలించి సరములు పెరికి కుప్పలువేసి
గుటగుటమని రొప్పె గోవిందుఁడు
చిటిలించి కండలు చెక్కులువారఁజెండి
కుటిలదానవుఁ జూచి ఖోయని యార్చెను. ॥వినర॥

తెంచి శిరోజములు దిక్కులకు వాని
పంచప్రాణములుగొనెఁ బరమాత్ముఁడు
అంచెల నీరీతిని ప్రహ్లాదునిపగ నీఁగె
మించి దేవతలు మిశిమీటి జయవెట్టిరి. ॥వినర॥

అప్పుడిందిరాదేవి యంకమునఁ గూచుండె
ఒప్పుగ శాంతమందె నహోబలేశుఁడు
తప్పక కోనేటిదండఁ దానై యిందును నందు
చిప్పిల వరములిచ్చీ శ్రీవేంకటేశుఁడు. ॥వినర॥ 218

38'.న ఘేశ. మాళవిగౌళ

అదె లంక సాధించె నవనిభారము దించె
విదితమై ప్రతాపము వెలయించె నితఁడు. ॥పల్లవి॥

రవివంశతిలకుఁడు రాముఁడితఁడు
భువిఁ బుట్టె దశరథపుత్రుఁడితఁడు
భవుఁడెంచేఁ దారకబ్రహ్మమీతఁడు
పవనజుకిచ్చినాఁడు బ్రహ్మపట్టమీతఁడు. ॥అదె॥

బలువుఁడు సీతాపతి యీతఁడు
తలకొన్న వాలిమర్దనుఁడితఁడు
విలసిల్లె నేకాంగవీరుఁడితఁడు
చలమరి కోదండదీక్షాగురుఁడితఁడు. ॥అదె॥

శరణాగత వజ్రపంజరుఁడీతఁడు
సరిలేని యసురభంజకుఁడీతఁడు
వరదుఁడు శ్రీ వేంకటేశ్వరుఁడితఁడు
అరయ విజయనగరాధీశుఁడితఁడు. ॥అదె॥ 219

రామక్రియ

రాముఁడు లోకాభిరాముఁడు వీఁడిగో
వేమారు మొక్కుచు సేవించరో జనులు. ॥పల్లవి॥

చెలువపు రూపమున జితకాముఁడు
మలసీ బిరుదున సమరభీముఁడు
పొలుపైన సాకేతపురధాముఁడు
ఇలలోఁ బ్రజలకెల్లా హితధాముఁడు. ॥రాము॥

ఘనకాంతుల నీలమేఘశ్యాముఁడు
అనిశము నుతుల సహస్రనాముఁడు
కనుపట్టు కపినాయకస్తోముఁడు
తనుఁ గొలిచితే దేవతాసార్వభౌముఁడు. ॥రాము॥

సిరుల మించిన తులసీదాముఁడు
కరుణానిధియైన భక్తప్రేముఁడు
ఉరుతరమహిమల నుద్దాముఁడు
గరిమల శ్రీ వేంకటగిరి గ్రాముఁడు. ॥రాము॥ 220

సామంతం

అదిగాన నీతి శాంతాలన్నిటికిఁ గారణము
పదిలమై వివేకించి బ్రదుకఁగ వలయు. ॥పల్లవి॥

తఱచు మాటలాడితే తప్పులెన్నైనాఁ దొరలు
పఱచై తిరిగితేను పాపమంటును
మెఱసి తిరిగాడితే మిక్కిలి దూరు ముట్టు
మొఱక గలవాఁడిందు నేమఱఁ డెప్పుడును. ॥అది॥

కన్నునెల్లాఁ జూచితే కడునాసలుప్పతిలు
కన్నెలు పెక్కుగూడితే కరఁగు మేను
సన్నలు సారెకున్నతే చవుకౌ దొరతనము
యిన్నిట నేర్పరైనవాఁడేమఱఁ డెప్పుడును. ॥అది॥

మట్టుమీరి నవ్వితే మచ్చరాలూరకే పుట్టు
గుట్టులేక నడచితేఁ గొంచపడును
నెట్టన శ్రీవేంకటేశ నీకు శరణుచొచ్చి
యిట్టె నీదాసుఁడైన వాఁడేమఱఁ డెప్పుడును. ॥అది॥ 221

సాళంగనాట

జయము మనది వనచరులాల
రయమున దర్మదారలు తుత్తుతూ. ॥పల్లవి॥

రక్కసులమీఁద రాముఁడలిగె నలు
దిక్కుల నడవుఁడు తిడిం తిడిం
యెక్కుఁడు సేనను యిటుమొరయింపుఁడు
ఢక్కానినదము ఢమఢమఢమం. ॥జయ॥

కుటిలదానవులఁ గొట్టుఁడు కోటలు
తటుకున దాటుఁడు ధణం ధణం
పటుగతినార్చుచు పట్టుఁడు లగ్గలు
పెటులు ఛూఁడుఁడదె పెట పెట పెటల్. ॥జయ॥

గుట్టుననుండక కూలె రావణుఁడు
పట్టుఁడు సంకులు భం భం భం
యిట్టె శ్రీ వేంకటేశుఁడు గెలిచెను
దిట్టలై యాడుఁడు ధిం ధిం ధిం. ||జయ|| 222

శంకరాభరణం

వినుఁడిదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షసబాధలుడిగెను. ||పల్లవి||

కులగిరులదరెను కుంభిని వడఁకెను
ఇల రాముఁడు రథమెక్కినను
కలఁగె వారిధులు కంపించె జగములు
బలువిలునమ్ములు వట్టినను. ||విను||

పిడుగులు దొరిగెను పెనుగాలి విసరె
తొడిఁబడ బాణము దొడిగినను
ముడివడె దిక్కులు మొగ్గె దిగ్గజములు
యెడపక రావణు నేసినను. ||విను||

చుక్కలు డుల్లెను స్రుక్కె భూతములు
తొక్కి యసురతల డుంచినను
గక్కన శ్రీ వేంకటగిరి నిలువఁగ
అక్కజమగు శుభ మందరికొదవె. ||విను|| 223

గౌళిరామక్రియ

ఇతఁడే పరబ్రహ్మమిదియె రామకథ
శతకోటివిస్తరము సర్వపుణ్యఫలము. ||పల్లవి||

ధరలో రాముఁడుపుట్టె ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసులకెల్లా నభయమిచ్చె
సారిది ముక్కుఁ జెవులు చుప్పనాతిని గోసె
ఖరదూషణులను ఖండించి వేసె. ||ఇతఁడే||

కినిసి వాలిఁజంపి కిష్కింధ సుగ్రీవుకిచ్చె
వనధి బంధించి దాఁటె వానరులతో
కనలి రావణకుంభకర్ణాదులను జంపి
వనితఁ జేకొని మళ్ళి వచ్చె నయోధ్యకును. ॥ఇతఁడే॥

సౌమిత్రియు భరతుఁడు శత్రుఘ్నుఁడుఁ గొలువఁగ
భూమి యేలె కుశలవ పుత్రులఁగాంచె
శ్రీమంతుఁడై నిలిచె శ్రీవేంకటాద్రిమీఁద
కామించి విభీషణు లంకకుఁబట్టము గట్టె. ॥ఇతఁడే॥ 224

390-వ రేకు. మాళవిగౌళ

రాముఁడు లోకాభిరాముఁడుదయించఁగాను
భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను. ॥పల్లవి॥

తటుకన మారీచుని తల్లపైఁ బోయఁ గర్మము
కుటిలశూర్పనఖ ముక్కునఁ బండెను
పటుకునఁ దెగె దైత్యభామల మెడతాళ్ళు
మటమాయదైత్యులకు మరి నూరూ నిండెను. ॥రాము॥

తరిగె రావణుపూర్వతపములయాయుష్యము
ఖరదూషణాదులకు కాలముదీరె
గరిమ లంకకు నవగ్రహాన్నులు భేదించె
సిరుల నింద్రజిత్తుకు ఛిన్నగె నంతటను. ॥రాము॥

పొరిఁ గుంభకర్ణునికి పుట్టినదినము వచ్చె
మరలి గండముదాఁకె మండోదరికి
పరగ (గ ?) నయోధ్యకు భాగ్యములు ఫలియించె
చిరమై శ్రీవేంకటేశుచేతలెల్లా దక్కెను, ॥రాము॥ 225

సాళంగనాట

జయము జయము ఇఁక జనులాల
భయములు వాసెను బ్రదికితిమిపుడు. ||పల్లవి||

ఘన నరసింహుఁడు కంభమున వెడలె
దనుజులు సమసిరి ధర వెలసె
పొసఁగె నధర్మము భూభారమడఁగె
మునులతపములిమ్ముల నీడేరె. ||జయము||

గరిమతో విష్ణుఁడు గద్దెపై నిలిచె
హిరణ్యకశిపుని నేపడఁచె
అరసి ప్రహ్లాదుని నన్నిటా మన్నించె
హరుఁడును బ్రహ్మయు నదె కొలిచేరు. ||జయము||

అహోబలేశుఁడు సిరినంకమున ధరించె
బహుగతి శుభములు పాటిల్లె
ఇహపరములొసఁగె నిందును నందును
విహరించెను శ్రీ వేంకటగిరిని. ||జయము|| 226

రామక్రియ

గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసఁగీఁ జూడరో చింతామణి యీపె. ||పల్లవి||

పాలజలధిఁ బుట్టిన పద్మాలయ యీపె
లాలిత శ్రీ నరసింహు లక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీలీల లోకములేలే యిందిర యీపె. ||గరు||

ఘనసంపదలొసఁగు కమలాకాంత యీపె
మనసిజుఁ గవిన రమాసతి యీపె
అనిశముఁ బాయని మహాహరిప్రియ యీపె
ధనధాన్యరూపపు శ్రీ తరుణి యీపె. ॥గరు॥

రచ్చల వెలసినట్టి రమావనిత యీపె
మచ్చిక గల యలమేల్మంగ యీపె
ఇచ్చటి వేంకటాద్రి నీ యహోబలమునందు
నిచ్చలూఁ దావుకొనిన నిధానమీపె. ॥గరు॥ 227

సామంతం

సమసె రావణుఁడు సమరములోపల
అమరులు కడు ముదమందిరి మెరసి. ॥పల్లవి॥

బెరగిరి రాముని శరముల కసురలు
సురిగిరి పోట్లచురుకునను
తొరిగిరి నెత్తుటఁ దునియలు సేసిన
తిరిగిరి తరుమఁగ దిక్కులకు. ॥సమసె॥

కూలిరి భల్లూ (క) కుల ఘోషములకు
వాలిరి వాయుజవాలహతి
వీలిరి యంగదు వివిధనాదముల
తూలిరి సుగ్రీవు దోర్బలమునను. ॥సమసె॥

దాఁగిరి లక్ష్మణుదాకకు నులుకుచు
వీఁగిరి వనచరవితతికిని
పాఁగి శ్రీ వేంకటపతి కృపారసమునఁ
దోఁగిరి జనులు సంతోసంబునను. ॥సమసె॥ 228

శంకరాభరణం

ఆదిమూర్తి యీతఁడు ప్రహ్లాదవరదుఁడు
యేదెసఁ జూచినాఁ దానె యీతఁడిది (?) దేవుఁడు. ||పల్లవి||

నవ్వులమోముతోడ నరసింహరూపుతోడ
జవ్వని తొడమీఁద సరసమాడ
పువ్వులదండలు యిరుబుజాలపై వేసుకొని
ఉవ్విళ్ళూరఁ గొలువై వున్నాఁడు దేవుఁడు. ||ఆది||

సంకుఁ జక్రములతోడ జమళికోరలతోడ
అంకెలఁ గటియభయహస్తాలెత్తి
కంకణాల హారాలతో ఘనకిరీటము వెట్టి
పొంకమైన ప్రతాపానఁ బొదలీనీ దేవుఁడు. ||ఆది||

నానాదేవతలతోడ నారదాదులతోడి
గానములు వినుకొంటా గద్దెపై నుండీ
అనుక శ్రీవెంకటాద్రి నహోబలమునందు
తానకమై వరాలిచ్చీ దాసులకు దేవుఁడు. ||ఆది|| 229

బౌళిరామక్రియ

వీఁడివో కలశాపుర వీరహనుమంతుఁడు
వాఁడిమి మెరసినట్టి వజ్రపాణి యితఁడు. ||పల్లవి||

చలపట్టి జంగచాఁచి జలధి దాఁటినవాఁడు
తలకొన్న రాముని ప్రతాపపువాఁడు
ఎలమి సీతకుంగరమిచ్చి మెప్పించినవాఁడు
కలగుండు వడ లంకఁ గాలిచినవాఁడు. ||వీఁడివో||

మగిడి రాఘవునకు మణి దెచ్చినట్టివాఁడు
గగనము మోచిన కాయమువాఁడు
మొగి సూర్యునిచే శాస్త్రములు చదివినవాఁడు
పగటున మీఁది బ్రహ్మపట్టమేలేవాఁడు. ॥వీఁడివో॥

ఇప్పుడూఁ బ్రాణములోనే యిల దేవుఁడైనవాఁడు
చెప్పఁ గొత్తైనమహిమఁ జెన్నొందువాఁడు
ముప్పిరి శ్రీ వేంకటేశు మూలబలమైనవాఁడు
ఒప్పగు వరాలిందరి కొసఁగేటివాఁడు. ॥వీఁడివో॥ 230

391-వ రేకు. రామక్రియ

వీఁడివో కొలువున్నాఁడు విట్ఠలేశుఁడు
మూఁడు మూర్తుల తేజపు మూలమీతఁడు. ॥పల్లవి॥

పంతముతో పాండవపక్షపాతి యీతఁడు
వింతలేని విదురుని విందు యీతఁడు
మంతుకెక్కిన ద్రౌపదీ మానరక్షకుఁడీతఁడు
చెంతనే వుద్ధవుపాలి చింతామణి యీతఁడు. ॥వీఁడివో॥

మందగొల్లెతల కెల్లా మంగళసూత్రమీతఁడు
కందువనక్రూరుని భాగ్యంబీతఁడు
నందగోపయశోదల నవనిధానమీతఁడు
అందపు రుక్మిణీమనోహరుఁడీతఁడు. ॥వీఁడివో॥

దేవకీవసుదేవుల దివ్యపదవీతఁడు
భావింపనందరి పరబ్రహ్మమీతఁడు
కైవశమై దాసులకు కల్పవృక్షమీతఁడు
శ్రీ వేంకటాద్రిమీఁది శ్రీ పతి యీతఁడు. ॥వీఁడివో॥ 231

లలిత

ఈతని మహిమలు యెంతని చెప్పెద
చేతుల మొక్కెదఁ జెలఁగుచు నేను. ॥పల్లవి॥

శ్రీ నరసింహుఁడు చిన్మయమూరితి
నానావిధకర నఖరుఁడు
దారుణదైత్యవిదారుఁడు విష్ణుఁడు
తానకమగు మాదైవంబితఁడు. ॥ఈతని॥

అహోబలేశుఁడు ఆదిమపురుషుఁడు
బహుదేవతా సార్వభౌముఁడు
సహజానందుఁడు సర్వరక్షకుఁడు
యిహపరములొసఁగు యేలిక యితఁడు. ॥ఈతని॥

కేవలుఁడగు సుగ్రీవనృసింహుఁడు
భావించ సుజనపాలకుఁడు
శ్రీ వెంకటేశుఁడు చిత్తజజనకుఁడు
వేవేలకు నిలువేలుపు యితఁడు. ॥ఈతని॥ 232

సాళంగనాట

పెరిగినాఁడు చూడరో పెద్దహనుమంతుఁడు
పరగి నానావిద్యల బలవంతుఁడు. ॥పల్లవి॥

రక్కసుల పాలికి రణరంగశూరుఁడు
వెక్కసపు యేకాంగ వీరుఁడు
దిక్కులకు సంజీవి దెచ్చినధీరుఁడు
అక్కజమైనట్టి యాకారుఁడు. ॥పెరి॥

లలి౹ మీరినయట్టి లావుల భీముఁడు
బలుకవికుల సార్వభౌముఁడు
నెలకొన్న లంకా నిర్ధూమధాముఁడు
తలఁపున రామునాత్మారాముఁడు. ॥పెరిగి॥

దేవకార్యముల దిక్కు వరేణ్యుఁడు
భావింపఁగల తపఃఫలపుణ్యుఁడు
శ్రీ వేంకటేశ్వరు సేవాగ్రగణ్యుఁడు
సావధానుఁడు సర్వశరణ్యుఁడు. ॥పెరిగి॥ 233

### దేసాక్షి

వెన్నముద్దకృష్ణుఁడు వేవేల చేఁతలవాఁడు
పిన్నవాఁడై వున్నవాఁడు బిరుదైన బాలుఁడు. ॥పల్లవి॥

పాలెంత చన్నుగుడిచి బండి విరుగఁగఁ దన్ని
గాలిరక్కసుని మలుగఁగ మోఁది
రోలఁ గట్టువడి యట్టె రూఢిగా మద్దిమాఁకులఁ
గూలదొబ్బె తొల్లి వీఁడె గుట్టుతోడి బాలుఁడు. ॥వెన్న॥

కొండ గొడుగుగఁ బట్టి గోకులమునెల్లఁగాచి
మెండగు గొల్లెతలతో నేలమాడి
అండనె నోరుదెరచి యశోదకు లోకములు
దండిగాఁ జూపె నితఁడె దంటయైన బాలుఁడు. ॥వెన్న॥

పరమేష్ఠికి మారొడ్డి పసిబాలకులఁ దెచ్చి
ధరఁ బదారువేలు కాంతలఁ బెండ్లాడి
ఇరవై శ్రీ వేంకటాద్రి నిందరికి వరాలిచ్చి
సిరితో వెలసెనిదే చెలువపుబాలుఁడు. ॥వెన్న॥ 234

### నాట

అదె వచ్చె రాఘవుఁడాతని దాఁడి ముట్టె
యెదిరించరాదు మీకు నేది దెరువిపుడు. ॥పల్లవి॥

భువిలోన రాముఁడై పుట్టెనట విష్ణుఁడు
అవల మీకు దిక్కేది యసురలాల
తివిరి మిమ్ము వెదకె దివ్యబాణాలాతఁడిది
రవళి నెందు చొచ్చేరు రాకాసులాల. ॥అదె॥
చలపట్టి కొండలచే సముద్రము గట్టెనట
తల చూపరాదు మీకు దైత్యులాల
వలగొని దేవతలు వానరులై వచ్చిరట
నిలువరాదిఁక మీకు నిశాచరులాల ॥అదె॥
రావణుఁ జంపెనట రణములోఁ జిక్కించుక
దావతిఁ బారరో మీరు దానవులాల
యీవేళ శ్రీవేంకటేశుఁడితఁడే విభీషణుని
లావున శరణన్నతో లంకావాసులాల, ॥అదె॥ 235

గుజ్జరి

ఏలికె చెప్పిన పనికెదురాడేనా
నీలీలలివియని నిండుకుండే నేను. ॥పల్లవి॥
నీవు నాలోనున్నాఁడవు నేనున్నాఁడ సముఖాన
కానరపుటింద్రియాలు కాకుసేసీని
దేవర నీయప్పణో తెలియనానతీ నాకు
ఆవిధమైతేనే అపరాధము లేదు. ॥ఏలికె॥
జగదీశుఁడవు నీవు శరణాగతుఁడ నేను
జిగిఁ గామక్రోధాలేల చిమ్మిరేఁచీని
నగుతా నప్పగించేవో నాకదిగాదనరాదు
తగునిట్లనే యైతే తప్పులేదు మాకును, ॥ఏలికె॥
పుట్టించేవాఁడవు నీవు పుట్టుగులు నాసొమ్ము
చుట్టి సుఖదుఃఖాలు సూడువట్టీని
నెట్టన శ్రీవేంకటేశ నీనటనో మంచిదాయ
యిట్టయితే మాకింక నిఁక నేరమి లేదు. ॥ఏలికె॥ 236

శ్రీః

శుభమస్తు

శ్రీ తాళ్ళపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు

## 2-వ భాగము.

( నిడురేకులలోని యధ్యాత్మసంకీర్తనలు )

---

4-వ రేకు. * **ఆహిరి**

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూఁగెఁగన
చెల్లుబడినూఁగీని శ్రీరంగ శిశువు. ॥పల్లవి॥

కలికి కావేరి తరగల బాహులతలనే
తలఁగకిటు రంగమధ్యపు తొట్టెలఁ
పలుమారుఁ దనునూఁచి పాడఁగానూఁగీని
చిలుపాల సెలవితో శ్రీరంగ శిశువు. ॥తొల్లి॥

అదివో కమలజుని తిరువారాధనంబనఁగ
అదనఁ గమలభవాండమనుతొట్టెలఁ
ఉదధులు తరంగములనూఁచఁగా నూఁగీని
చెదరని సిరులతోడ శ్రీరంగ శిశువు. ॥తొల్లి॥

వేదములె చేరులై వెలయంగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీదేవితోఁగూడి శ్రీవేంకటేశుఁడై
సేదదేరెడి వాఁడె శ్రీరంగశిశువు. ॥తొల్లి॥ 1

---

* ఈ సంకీర్తన 7-వ రేకునను గలదు.

13-వ రేకు. శ్రీరాగం

వెరపు దెలుపు నీ వేగిరమే నీ
వెఱఁగియు నెఱఁగక యేమంటివో. ॥పల్లవి॥

గోరపురుధిరము గురియు గోళ్ళ నీ
తోరమైన యా తొడమీఁద
గోరంటగోళ్ళ కోమలి నిలువఁగ
ఈరసమందక యేమంటివో. ॥వెరపు॥

నెత్తురుఁ బెదవుల నీ మొకమలరఁగ
చిత్తరి వీడెపుఁ బెదవులతో
మత్తకరిగమన మాటలాడఁగా
ఎత్తిన మదమున నేమంటివో. ॥వెరపు॥

ఆననరౌద్రము నట్టహాసమును
పూనిన నినుఁగని బొమముడితో
లేనగవుల నదలింపెడి సిరితో
హీనాధికముల నేమంటివో. ॥వెరపు॥

పెదపెద యూర్పుల పేగుల జందెపు
టుదరముతో నీవుండుచును
చెదరిన పయ్యెద చెరఁగు జారుసతి
యెదురెదురను నీవేమంటివో. ॥వెరపు॥

చింపి నెరుల నీ శిరసు ముడుచుకొని
కంపముడిగి వేంకటపతివై
లంపటమందుచు లక్ష్మీసతితో
ఇంపులు నెరపుచు నేమంటివో. ॥వెరపు॥ 2

16-వ రేకు. రామక్రియ

అందరి వసమా హరినెరుఁగ
కందువగ నొకఁడుగాని యెరఁగఁడు. ||పల్లవి||

లలితపు పదిగోట్లనొకఁడు గాని
కలుగఁడు శ్రీహరిఁ గని మనఁగ
ఒలిసి తెలియు పుణ్యులకోట్లలో
ఇలనొకఁడుగాని యెరఁగడు హరిని. ||అందరి||

శ్రుతి చదివిన భూసురకోట్లలో
గతియను హరినె యొకానొకఁడు
అతిఘనులట్టి మహాత్మకోటిలో
తతి నొకఁడుగాని తలఁచఁడు హరిని. ||అందరి||

తుదకెక్కిన నిత్యుల కోట్లలో
పొదుగునొకఁడు తలఁపున హరిని
గుదిగొను హరిభక్తుల కోట్లలో
వెదకు నొకఁడు శ్రీవేంకటపతిని. ||అందరి|| 3

ఆహిరి

మాయలకగపడి మతిచెడి ప్రాణులు
రోయఁ దలఁచియును రోయఁగలేరు. ||పల్లవి||

మినమిస మెరువఁగ మెల్లన చేరిరి
ముసిఁడిమాని ఫలములు చూచి
రసమని సంసారపుబాలకులిదె
విసిగి చేదుగని విరుగఁగలేరు. ||మాయ||

బలువిషమొలికెడి పాముఁ బట్టుకొని
అలరుచు నలుగడనాడేరు
పొలసి యూనలూర్పులు నిగుడించఁగ
తెలిసియు నింకాఁ దెలియఁగలేరు. ॥మాయ॥

తేనదెచ్చి కత్తికిక్కిదారఁ బెట్టి (న)
నానావిధముల నాఁకేరు
దీనతలఁణఁపెడి తిరువేంకటపతి
చేనిపంటలకుఁ జెయి చాఁచలేరు. ॥మాయ॥ 4

సాళి

కందర్పజనక గరుడగమన
నందగోపాత్మజ నమో నమో. ॥పల్లవి॥

వారిధిశయన వామన శ్రీధర
నారసింహా కృష్ణ నమో నమో
నీరజనాభ నిగమగోచర
నారాయణ హరి నమో నమో. ॥కంద॥

పరమపురుషా భవవిమోచన
వరద వసుధావధూవర
కరుణాకాంతా కాళిందీరమణ
నరసఖ శౌరీ నమో నమో. ॥కంద॥

దానవదమన దామోదర శశి
భానునయన బలభద్రానుజ
దీనరక్షక శ్రీ తిరువేంకటేశ
నానాగుణమయ నమో నమో. ॥కంద॥ 5

18-వ రేకు. ఆహిరి

ఏమి దిరిగేమెంద్దైనను ఊర
కోమితిమి దేహమోహో బదుకు. ॥పల్లవి॥

బ్రహ్మకల్పముదాఁక బ్రదికేమా, కాక
బ్రహ్మానందంబుఁ బడసేమా
బ్రహ్మ మీ దేహాలంపట మనుచు పరం
బ్రహ్మంబు వదలితిమి బావు బ్రదుకు. ॥ఏమి॥

ఒడలితో నిట్లనే వుండేమా, కాక
చెడని పుణ్యములెల్లఁ జేసేమా
యెడయక మరపదంబేలేమా, వృథా
చెడిపోయె దినములిన్నీ బదుకా. ॥ఏమి॥

ఆపదలు లేని సుఖమందేమా, కాక
పాపంబు లేని మతిఁ బరగేమా
ఏపు మీరిన వేంకటేశ్వరునిఁ గొలువ
నోపకిట్లితిమయ్యో బదుకా. ॥ఏమి॥ 6

19-వ రేకు. శ్రీరాగం

కప్పురమునకుఁ గప్పురమై
చిప్పిలుఁదావి మించె నితఁడు. ॥పల్లవి॥ *

బంగారమునకు బంగారమై
శృంగారమమరె శ్రీహరికి
అంగమయిన మొల పీతాంబరంబున
కొంగుబంగారై కూడె నితఁడు. ॥కప్పుర॥

* రేకులో ఈ పల్లవి మొదటి చరణమునకు తరవాత చెక్కఁబడియున్నది.

తట్టు పుణుఁగునకుఁ దట్టు పుణుఁగయి
ఘట్టిమేన మించెఁగా యితఁడు
నెట్టన నొసల నిండిన కస్తురి
బొట్టు చెమటతోఁ బొలెసిక (బొలిచెని ?) తఁడు. ||కప్పుర||

పన్నీటి పాదాన పన్నీరే తానయి
యిన్నిట శ్రీవేంకటేశుఁడిదే
ఉన్నతి జలధి నుదయమున (నందిన ?)
కన్నియకౌఁగిట ఘనుఁడితఁడు. ||కప్పుర|| 7

## 20-వ రేకు. లలిత (అవతారాలు)

అరుదైన భవదూరుఁడగు నీతఁడు
అరిది భవములందునతఁడు వో యితఁడు. ||పల్లవి||

కొడుకులెక్కుమరూపు కోరి కైకొని పెద్ద
కొడుకు కొరకుఁగా గోరపడి
కొడుకువైరి భక్తిఁ గూడిన యాతని
నడవిలోఁ జంపిన యతఁడు వో యితఁడు. ||అరు||

అలితమ్మునిరాకకలరి మెచ్చెడిచోట
అలుఁ దానును నుండి యందులోన
అలిచంటి కింద నడ్డమువడుకున్న
అలవాలమువంటి అతఁడు వో యితఁడు. ||అరు||

సవతి తమ్ముఁడు గోవుఁ జంపఁ బట్టుక పోయి
సవతి తమ్మునియింట సడిఁబెట్టఁగా
సవతులేనిపంటఁ జప్పరించివేసి
అవల యివల సేసి నతఁడు వో యితఁడు. ||అరు||

తొడ జనించిన యింతి దొరకొనావద సేయ (?)
దొలఁ (డ?) గి తోలాడెడి దొడ్డవాని
తొడమీఁద నిడి వానికడుపులో తొడవులే
యడియాలమగు మేని యతఁడు వో యితఁడు. ॥అరు॥

పదము దానొసఁగుచుఁ బదమడుగగఁ బోయి
పదము వదము మోవఁ బరగఁ జేసి
పదమునని దివ్యపదమిచ్చి మనుసుసి
నదిమి కాచినయట్టి అతఁడు వో ఇతఁడు. ॥అరు॥

అత్తకొడుకుపేరి యాతనిఁ దనకూర్మి
యత్తయింటిలోన నధికుఁ జేసి
మత్తిల్లు తనతోడ మలసిన యాతని
నత్తలిత్తల సేసినతఁడు వో యితఁడు. ॥అరు॥

పాముతోడుతఁ బోరి పంతముగొనువాని
పామునుఁ బ్రాణమై పరగువాని
ప్రేమపుఁ దనయుని బిరుదుగా నేలిన
ఆమాటనిజముల అతఁడు వో యితఁడు. ॥అరు॥

ఎత్తుక పురవడినేఁగెడి దనుజుని
మొత్తుకలుగు మద మిగుర మోఁది
మత్తిల్లు చదువుల మానిఁ జం.........
అత్తలేని యల్లుఁడతఁడు వో యితఁడు. ॥అరు॥

బిగిసి మేఁకమెడ పిసికెడి మాటలు
పగలుగాఁగ రేయివగలు సేసి

జగములోన నెల్ల జాటుచుఁ బెద్దల
అగడుసేయఁ బుట్టినతఁడు వో యితఁడు. ||అరు||

మెట్టసిచోట్ల మెట్టుచుఁ బరువులు
పెట్టెడిరాయ............ *
కట్టెడికాలము కడపట నదయుల (?)
నట్టలాడించిన అతఁడు వో యితఁడు. ||అరు||

తలఁకకిన్నియుఁ జేసి తనుఁగాని యాతని
వలెనె నేఁడు వచ్చి వసుధలోన
వెలుఁగొంది వేంకటవిభుఁడై వెలసిన
యలవిగాని విభుఁడతఁడు వో యితఁడు. ||అరు|| 8

22-వ రేకు. శ్రీరాగం

చండ ప్రచండాది జయ విజయులఁ
అండఁ బూజించి హరికటుగదా పూజ. ||పల్లవి||

కూర్మ భూమ్యాదులను గోరికఁ బ్రతిష్ఠించి
ధర్మముఖ్యంబుల నధర్మాదులఁ
కర్మగతిఁ జామర గ్రాహిణులఁ బూజించి
మర్మంబుగా హరికి మరికదా పూజ. ||చండ||

గరుడసేనేశులను ఘనుని శేషుని మరియు
వరమతులఁ బాదసంవాహినులను
కరమొప్ప శంఖచక్రగదాసి శార్ఙ్గముల
అరసి పూజించి హరికిన (రిక ?) పుడుగా పూజ. ||చండ||

---

* ఈ భాగములు రేకులో చిలుమడిన్నవి.

నవకిరీటమును గుండలహార కౌస్తుభము
లవిరళపుఁ బీతాంబరాదులలర
వివిధగతిఁ బూజించి వేంకటేశ్వరు పూజ
యిఁవదఁ (ల?) దళిగలు పెట్టుఁడిదిగదా పూజ. ॥చండ॥ 9

## ధన్నాసి

కాయముల కాణాచి కాఁపులము
చాయల మాసుఖము జయమేఁటిదయ్యా. ॥పల్లవి॥

పంచమహాపాతకాలఁ బైరు విత్తి దేహాల
కంచపుఁ గొలుచులుగా గాదెలఁబోసి
చంచలాలు జవ్వనాలు చవులైన కూరలుగా
నించి భుజియించే మానిజమేఁటిదయ్యా. ॥కాయ॥

ఉడివోని లంపటాన నూళ్ళుఁ బల్లెలు నెక్కి-
యిడుమల మమతల నిండ్లు గట్టి
గొడవలానానసల (?) కూరిమి సంపదల
పొడవైన మామతి పొందేఁటిదయ్యా. ॥కాయ॥

పసలేని మమతల్ల పాపములు బందాలు
గొనకొని ధనములు గూడపెట్టి
కని నేఁడు తిరువేంకటపతి కృపతోడ
తనియని మాతోడి తగువేఁటిదయ్యా. ॥కాయ॥ 10

## లలిత

ఇటువలెనె పో యింకా మాకు
వటపత్రశాయి నమ్ము వదలీనా, ॥పల్లవి॥

యన్నఁడు దెల్లవారెనో యాడఁ బొద్దు వొడచెనో
యన్నట్లనుండితి మహార్నిశము
యిన్నిటాఁ గడములేక యెక్కడ నెదురులేక
పన్నగశయనుని కృపనే కాదా. ॥ఇటు॥

ఏడ నోవువ్యాధులెటు వచ్చి నిలిచెనో
కూడిన యాలరులెల్ల కొండలవలె
నీడలే నిలువులెల్ల నెలవులై యున్నచోట
యీడులేనివివి హరి యీవులే కావా. ॥ఇటు॥

ఎవ్వరిచేత దాఁచితిమెచ్చట నిధానములు
ఇవ్వలా మాతలఁచిన యిన్నియు నబ్బె
రవ్వగు వెంకటగిరిరాయఁడు మాతలఁపులో
పువ్వక కాచి పండిన భోగమే కాదా. ॥ఇటు॥ 11

ముఖారి

ఎన్నటి కెవ్వరికితఁడే
అన్నిటానున్న అధికుఁడు. ॥పల్లవి॥

ఆతుమకంతర్యామీ స్వామీ
యేతరినైనా నితఁడే
పాతకశూరుఁడపారశరీరుఁడు
పూతన ప్రాణ ఘాతకుఁడు. ॥ఎన్న॥

అక్కర దీరచ నందాఁ జెందా
యెక్కడనైనా నితఁడే
పుక్కిటిలోకాలు పొందుగ నించి మా
దిక్కైనా పరదేవుఁడు. ॥ఎన్న॥

నేరమి నేరుపు నించాఁ బెంచా
నేరీతినైనా నితఁడే
కారుణ్యనిధి వేంకటవిభుఁడు మా
చేరువై యున్న చెలువుఁడు. ॥ఎన్న॥ 12

28-వ రేకు. భూపాళం

ఏమో తెలిసెఁ గాని యీజీవుఁడు
నేమపు నెరవిద్య నేరఁడాయ. ॥పల్లవి॥

కపటాలే నేరిచెఁ గాని జీవుఁడు
ఎపుడైన నిజసుఖంబెరఁగఁడాయ
కపురులే చవిగొనెఁ గాని జీవుఁడు
అపరిమితామృత మానఁడాయ. ॥ఏమో॥

కడలేక తిరిగీఁ గాని జీవుఁడీ
నడుము మొదలు చూచి నడవఁడాయ
కడుపుకూటికిఁ బోయీఁ గాని జీవుఁడీ
చెడని జీతముపొంతఁ జేరఁడాయ. ॥ఏమో॥

కనియుఁ గానక పోయెఁ గాని జీవుఁడు
దినము వేంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలకె చొక్కీఁ గాని జీవుఁడు
తనియ నిక్కమంచి దరిఁ జేరఁడాయ. ॥ఏమో॥ 13

సామంతం

ఏమనవచ్చును గొందరికింపౌఁ బులుసులుఁ దీపులు
సోమరితనమున నిన్నిటఁ జొరదీ నా తలఁపు. ॥పల్లవి॥

పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచిన మొక్కక పోరాదు
వదలక యిన్నిటను శ్రీవల్లభుఁడున్నాఁడుండిన
హృదయము చంచలమిన్నిట నెనయదు నామనసు. ॥ఏమన॥

ఎక్కడఁ జూచినఁ బ్రాణులకిన్నియు నాచారములే
చిక్కక యిన్నియుఁగైకొని చేయక పోరాదు
మక్కువ నిన్నియు శ్రీహరిమతములె కానీ అయినా
ఒక్కటియేచాలును నాకొడఁబడవితరములు. ॥ఏమన॥

పరీతులనటు చూచిన నిందరు బలుదైవములే
కూరిమినందరినటువలెఁ గొలువక పోరాదు
ధారుణి వేంకటపతిచేఁతలు ఇవియైనాఁగాని
కోరిక నా కితఁడే మరి కొరకొరలిన్నియును. ॥ఏమన॥ 14

ఆహిరి

ఓపనయ్యా వోపనయ్యా
వోపనయ్యా యీ వొప్పులే తప్పులు. ॥పల్లవి॥

ఎక్కడికి నెక్కడ యెక్కువే యెరవు
తక్కులే యీ మొక్కులు తక్కువే దారణ (?) ॥ఓప॥

ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తవ్వులే యీ రవ్వలు చివ్వలే సిగ్గులు. ॥ఓప॥

బొంకులే పొందులు కింకలే గిరులు (?)
వేంకటవిభుఁడ నీజంకెలే జంపులు. ॥ఓప॥ 15

29-వ రేకు. సామంతం

పాడైన యెరుకతో బంధమోక్షములొక్క
గాడిఁగట్టుట తెలివిగానకే కాదా. ॥పల్లవి॥

భావించి నినుఁ బరబ్రహ్మమని వేదములు
వేవేలు విధుల మొఱవెట్టఁగాను
కేవలపు నిన్నుఁ దక్కిన దైవములఁ గూర్చి
సేవింపుటిది తప్పు సేయుటే కాదా. ॥పాడై॥

సరిలేని నిను నుపనిషద్వాక్యములె పరా
త్పరుఁడవని నలుగడలఁ బలుకఁగాను
వరుసతోఁ జెక్కుదైవములు సంగడి నిన్ను
తొరలఁ గొలుచుట మహాద్రోహమే కాదా. ॥పాడై॥

ఎందుఁజూచిన పురాణేతిహాసములు నీ
చందమే యధికమని చాటఁగాను
కందర్పజనక వేంకటగిరిస్వామి నీ
కందువెఱఁగనిది యజ్ఞానమే కాదా. ॥పాడై॥ 16

సామంతం

కొంచపడితినొక కొన్నాళ్ళు
ఇంచుకించుకిపుడెరిఁగితి నేను. ॥పల్లవి॥

ముట్టుపాఁతవలె మురిగిన దేహము
గుట్టున దాఁచితిఁ గొన్నాళ్ళు
ఇట్టే సుఖమని యిన్నిటి యోనుల
ఒట్టుక కాఁపురముండితి నేను. ॥కొంచ॥

మురికి కడువలే ముంచిన హేయము
కురిసితి నేనొక కొన్నాళ్ళు
తెరపి లేక యీ దేహపురోఁతల
మొరఁగి దాఁచితిని మూలల నేను. ॥కొంచ॥

విప్పుచు మూడుచుచు వెంట్రుకతుట్టెల
కొప్పులె పెట్టితిఁ గొన్నాళ్ళు
అప్ప వేంకటనగాధిప మీకృప
యిప్పుడు వెలసితి నిదివో నేఁడు. ॥కొంచ॥ 17

నాట

తనకేఁటి యేతులిందరిలోన
పెనఁగుచు నూరక బిగిసీఁ గాక. ॥పల్లవి॥

మురచెనా తనపాటు మాలజీవుఁడు దొల్లి
కొరమాలి బహుయోనికూపముల
పొరలి హేయములోనె పుంగుడువడి వచ్చి
మొరఁగి తా దొరనంటు మురిసీఁ గాక. ॥తన॥

పాసెనా తనపాటు పాపదేహి తా
గాసిఁ బడిన భంగములెల్ల
చేసిన తనతొంటి చేఁతలన్నియును
మాసెననుచు నిట్టె మలసీఁ గాక. ॥తన॥

విడిచెనా తనపాపవిధులు ప్రాణుఁడు మున్ను
అడరి మానుషరూపమైనంతనే
చెడక వేంకటపతి సేవించి సకలము
కడుగుకొనెడి బుద్ధి కనవలెఁ గాక. ॥తన॥ 18

రామక్రియ

అంటుకోకురో యమ్మలాలా యీ
మంటవడ్డ కోరికల మాఁటు వారము. ॥పల్లవి॥

మాసిన యీఁసలనెడి మూలెత వెంట వెంటనే
వాసి వుండలేక బాధఁ బడ్డవారము
బేస బెల్లి యెంగిలైన పెదవినంజుడు నోరఁ
దీసి తీసి సారె సారెఁ దిన్నవారము. ॥అంటు॥

ఇట్టు నట్టు ముట్టరాని హేయమైన తోలుఁదోలు
కట్టి కట్టి సిగ్గులమ్ముకొన్నవారము
ముట్టు సేయుచోటనే మూలమూల సారె సారెఁ
బుట్టి పుట్టి యాపదలఁ బొందువారము. ॥అం॥

చంపి చంపి జీవులనే చవులంటఁ జెడ్డతోలుఁ
గొంపలోనఁ దెచ్చి పెట్టుకొన్నవారము
ఇంపుల నిప్పుడు వేంకటేశుఁజేరి భవముల
చింపి యింటి వారిభక్తి చరవారము (?) ॥అంటు॥ 19

30-వ రేకు. దేవగాంధారి *

ఇట్టి ముద్దులాఁడి బాలుఁడేడ వాఁడు - వాని
బట్టి తెచ్చి పొట్టనిండఁ బాలువోయరే. ॥పల్లవి॥

గామిడై పారితెంచి కాఁగెడి వెన్నలలోన
చేమపూవుకడియాల చేయిపెట్టి
చీమగుట్టెనని తనచెక్కిటఁ గన్నీరు జార
వేమరు వాపోయేవాని వెడ్డు వెట్టరే. ॥ఇట్టి॥

ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగఁ బెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార
వోచ్చెలి వాపోవువాని నూరడించరే. ॥ఇట్టి॥

* ఇది 38-వ రేకులోను గలదు. 3-వ చరణమున 'ఆసవాలకుఁడు' అనిపా.

ఎప్పుడు వచ్చెనో మాయిల్లుచొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయిపెట్టి
అప్పఁడైన వేంకటాద్రి అనవాలకుఁడు (?) గాన
తప్పకుండఁబెట్టె (బట్టె?) వాని తలకెత్తరే ||ఇట్టి|| 20

భూపాలం

* మేలుకొనవే
భూలలనాధిప భోగిశయన. ||పల్లవి||

లేదు వేదవిధి లేశమును
మేదిని భరమై మించినది
పాదుపడదు చూపరకు భువి
గాదిలిసుతుపై గనలె జనకుఁడు. ||మేలు||

కనకము చవి చెడెఁ గడుఁగడును
ఘనన్నృపబాధలు గదిమినవి
దనుజుల కతివలు దలఁకెదరు
ఎనయ ..లాధికులెవ్వరు లేరు. ||మేలు||

అసుర సతుల పుణ్యము ఘనము
కన (సి?) మసఁగెడి కలికాలమహిమ
పసగల వేంకటపతి యిఁకను
వసుధలోని నెవ్వగలుడుపఁగను. ||మేలు|| 21

34-వ రేకు. సామంతం

లోకములోపల లూటిబెట్టు - ఇది
కైకొని వారి యెరఁగవుగా నీవు. ||పల్లవి||

---

* ఇది 38-వ రేకునను గలదు.

ములుగుచు వెనకయు ముందరయును నొచ్చి
పలుమారుఁగుంటెడి పసురము
నెలకొని వెదకేము నిన్నమాపటినుండి
నలిననాభుఁడ కానవుగా నీవు. ॥లో॥

భంగించి తొల్లియుఁ బలుమారు గొనిపోయి
దొంగలు విడిచిన తురగము
ముంగిటలేదు యేమూల నొదిగినదో
అంగజపతి (పిత ?) అరయవుగా నీవు. ॥లో॥

కొంకక యడవి మాఁకులుఁ గంపలు మేసి
బింక మెడలి పారు పెనుమృగము
వెంకటపతి దీని వెదకి కానలేము
సంకె వాయఁ దేర్చవుగా నీవు. ॥లో॥ 22

35-వ రేకు. భూపాళం

అన్ని విభవముల అతఁడితఁడు
కన్నులు వేవేలు గల ఘనుఁడితఁడు. ॥పల్లవి॥

వేదాంతకోట్ల విభుఁడితఁడు
నాదబ్రహ్మపు నడుమితఁడు
ఆది నంత్యములకు నరుదితఁడు
శ్రీదేవుఁడు సరసిజనాభుఁడితఁడు. ॥అన్ని॥

భవములణఁచు యదుపతి యితఁడు
భువనములిన్నిటికిఁ బొడవితఁడు
దివికి దివమైన తిరమితఁడు
పవనసుతు నేలినపతి యితఁడు. ॥అన్ని॥

గరుడని మీఁదటి ఘనుఁడితఁడు
సిరులిందరికి నిచ్చే చెలువితఁడు
తిరువేంకటనగము దేవుఁడితఁడు
పరమపదమునకుఁ బ్రభుఁడితఁడు. ॥అన్ని॥ 23

బౌళి రామక్రియ

అదరీ బెదరీ నంతనంత
అదవదలై మాయామృగము. ॥పల్లవి॥

పొలసీ మలసీఁ బొదలీఁ గదలీ
నెలసీఁ బలుమారు నెలవులను
కలసీ మృగములఁ గ్రమ్మర బెదరీ
అలసీనటు మాయామృగము. ॥అదరీ॥

దాఁగీ లోఁగీఁ దటుకన వెనుకకు
వీఁగీ నేఁగీ విసవిసనై
రేఁగీగతి వచరింపుచుఁ జూపుల
నాఁగీనదె మాయామృగము. ॥అదరీ॥

వెంకటగిరి రఘువీర నీముందర
కొంకీఁ గొసరీఁ గొనగొనలఁ
జంకెల బాణాసన బాణంబున
నంకెలఁ బడె మాయామృగము. ॥అదరీ॥ 24

37-వ రేకు. సామంతం

ధనముగని మరికదా ధనికుఁడౌట-మొదల
తనుఁ దానెఱుఁగలేని తలపేటి తలఁపు. ॥పల్లవి॥

మచ్చికల నినుఁగొలిచి మరికదా సుఖులౌట
మెచ్చోట నేవేల్పులెవ్వరైన
అచ్చుపడ నటువంటి హరి నిన్నుఁ గొలిచి నీ
మెచ్చువడయఁగలేని మేలేఁటి మేలు. ॥ధనము॥

కందువగ నినుఁ గొలువఁగని కదా ఘనులౌట
మెందునరుదగు వేల్పులెందరైన
అందముగ పరదైవమని నిన్నుఁ గనలేక
గొందిఁబడి పొరలేటి కూడేఁటి కూడు. ॥ధనము॥

వేసరక నినుఁగొలిచి వేంకటనగేశ నీ
దాసులై మరికదా ధన్యులౌట
వాసి వట్టముకొరకు వదలి దినములచేతఁ
బాసి పోయినవెనక పరమేడ పరము. ॥ధనము॥ 25

42-వ రేకు. ఆహిరి

ఇట్టె సంసారికేదియు లేదాయ
తట్టువడుటే కాని దరిచేరలేదు. ॥పల్లవి॥

ములిగి భారపుమోపు మోఁచేటివాఁడు
అలసి దించుకొను నాడాడను
అలరు సంసారికి నదియు లేదాయ
తొలఁగని భారమెందును దించలేదు. ॥ఇట్టె॥

తడవి వేపచేఁదు త్రావెడివాఁడు
ఎడయెడఁ దినుఁ దీపేమైనను
అడరు సంసారికి నదియు లేదాయ
కడుఁ జేఁదెకాని యొక్కడఁ దీపులేదు. ॥ఇట్టె॥

దొరకొని హేయమే తోడేటివాఁడు
పరితవించును మేనఁ బరిమళము
అరిది సంసారికి నదియు లేదాయ
ఇరవు వేంకటపతి నెఱుఁగలేఁడు. ॥ఇట్టి॥ 26

46.వ రేకు. ఆహిరి

చాలదా నా సంసారము
గాలియుయ్యేలలఁ దొలఁగక యూఁగవలసె. ॥పల్లవి॥

పాపపుణ్యములనెడి బల్లిదుల వెంటనే
దీపించు బంటనై తిరిగి తిరిగి
పైపైనె దేహంపుఁ బల్లెలొనఁగిన నరక
కూపముల మడి దున్నుకొని బ్రదుకవలసె. ॥చాల॥

చిత్తమను విభుఁజేరి చెలఁగి విషయంబులకు
కొత్తగమికాఁడనై కొలిచి కొలిచి
హత్తుకొని మోహంబులను ప్రధానుల యెదుట
గత్తంపు మొగసాలఁ గలదించవలసె (?) ॥చాల॥

గాటంపు దురితములకై జీతగాఁడనై
చేటైన కోరికలఁ జేరిచేరి
ఈటాడఁ దిరువేంకటేశుఁ గనకిన్నాళ్ళు
కోటకొమ్మలకెగసి గుంపించవలసె. ॥చాల॥ 27

47.వ రేకు. శోకవరాళి

వేంకటగిరి గోవిందుఁడా
యింకా నొకరో యిద్దరో మీరు. ॥పల్లవి॥

పచ్చలు దాచిన బాహాపురులతో
అచ్చపుఁ గరముల అందముతో
అచ్చలు నిచ్చలు నలను (రు?) దురిదివో
నిచ్చలు (నిచ్చలు) నీవో నీవో కాని. ॥వేంక॥

నిలుచుండుటయును నెరిఁ బవళింపుచు
నలరుటయును మీరటు నిటును
జలజాక్షులు దోడ చరచఁగ నారపుల
వెలయఁగ నిద్రో విభవమిదో. ॥వేంక॥

తిరువేంకటగిరి దిగువతిరుపతిని
పరమానందపు బహుసిరులు
అరుదుగఁ బొందుచు అధికములందుచు
ఉరగశయనుఁడవో నొడయఁడవో. ॥వేంక॥ 23

48-వ రేకు. సామంతం

ఏమిసేయవచ్చుఁ గర్మమిచ్చినంత కాని లేదు
తాముసేసినంత పట్టు తమకుఁ బోరాదు. ॥పల్లవి॥

ఇట్టు నట్టు మిట్టిపడ్డ నించుకంతా లేదు-వీఁపు
పట్టగట్ట మోఁపు మోఁచి పాటువడ్డ లేదు
తట్టువడ లోకమెల్లఁ దవ్వుకొన్న లేదు
తెట్టతెరువున నోరుదెరచిన లేదు. ॥ఏమి॥

అడిగిపరుల బతుకాసపడ్డ లేదు-భీతి
విడిచి నెత్తుటఁ దోఁగి వీరుఁడైన లేదు
అడవులెల్లఁ దిరిగి అలమటించిన లేదు
ఇడుమపాటుఁజొచ్చి యియ్యకొన్న లేదు. ॥ఏమి॥

వచ్చి వచ్చి వనితల వలపించుకొన్న లేదు
మెచ్చుల గుఱ్ఱమునెక్కి మేటియైన లేదు
ఎచ్చరికఁ దిరువేంకటేశుఁ గొలువకుంటే
ఇచ్చటచ్చట సుఖమించుకంత లేదు. ॥ఏమి॥ 29

కాంబోది

వాగె బలువు దైవపురాయా-నీ
రాగె జతనము పరాకెచ్చరికె. ॥పల్లవి॥

మించులఁ దురగము మిన్నులు మోవఁగ
నంచలఁ గురుచల నాడఁగను
కంచు మించుగా గక్కునఁ దోలితి
పంచాస్త్రగురుఁడ పాదెచ్చరికె. ॥వాగె॥

పెక్కువతేజిటు పేరెమువారఁగ
తొక్కనిచోట్లు దొక్కఁగను
చుక్కలు మోవఁగ సొంపుగఁ దోలితి
తొక్కుల దేవరదేవెచ్చరికె. ॥వాగె॥

అంకవన్నె పాదాబ్జము పదిలము
వేంకటేశ తిరువీధులను
సంకెలేక శ్రీసతితోఁ జెలఁగెడి
లంకెలఁ జాఁగు భళా యెచ్చరికె. ॥వాగె॥ 30

49-వ రేకు. కాంబోది

తల్లిఁ బాసి బిడ్డలెల్లఁ దల్లడించినట్లు నా
పల్లదాలెవ్వరి పాలయ్యీనో తాము. ॥పల్లవి॥

మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలి కువిటులెల్లఁ గుల్లినయట్టు
ఆదిగొని నేఁబోయి హరిఁ గొలువఁగ నా
గాదిలి కర్మములేడఁ గంటినో (దీనో?) తాను. ॥తల్లి॥

కాఁపుటూరి మంగలోజు గడిమీఁది రాజుగాఁగ
కాఁపులెల్లాఁ బనిమాసి కందినయట్టు
ఆఁపలేక నేఁబోయి హరిఁ గొలువఁగ నా
పాపములెవ్వరి పంచపాలయ్యీనో తాము. ॥తల్లి॥

ఒట్టిన మోఁపులు మోవనోపక వూరువిడిచి
వెట్టివాఁడు పారిపోఁగా వెదకినట్టు
ఇట్టె నేను శ్రీ వేంకటేశుఁ గొలువఁగ నా
చుట్టములిందరు నేడఁ జొచ్చేరో తాము. ॥తల్లి॥ 31

## పాడి

నారాయణ తే నమో నమో
నారదసన్నుత నమో నమో. ॥పల్లవి॥

మురహర భవహర ముకుంద మాధవ
గరుడగమన పంకజనాభ
పరమపురుష భవబంధ విమోచన
నరమృగశరీర నమో నమో. ॥నారా॥

జలధిశయన రవిచంద్రవిలోచన
జలరుహాభవనుత చరణయుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో. ॥నారా॥

ఆదిదేవ సకలాగమపూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీ వేంకటనాయక
నాదప్రియ తే నమో నమో ॥నారా॥ 32

50-వ రేకు. శ్రీరాగం

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా. ॥పల్లవి॥

వాసుదేవ కృష్ణ వామన నరసింహా
శ్రీ సతీశ సరసిజనేత్ర
భూసురవల్లభ పురుషోత్తమ పీత
కౌశేయవసన జగన్నాథా. ॥త్వమే॥

బలభద్రానుజ పరమపురుష దుగ్ధ
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రా సుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా. ॥త్వమే॥

వటపత్రశయన భువనపాలన జంతు
ఘటకార కరుణ శృంగారాధిప (?)
పటుతర నిత్యవైభవరాయ తిరువేం
కటగిరినిలయ జగన్నాథా. ॥త్వమే॥ 33

పళమంజరి

పాలజలనిధిలోఁ బాయని
నీలవర్ణుఁడవట నీవా యిపుడు. ॥పల్లవి॥

పాలజలనిధిలో బాయని
నీలవర్ణుడవట నీవా యిపుడు ॥ పల్లవి



వెదచల్లుమణుల వేయిపడగలను
చెదరని కుఱుఁగుల శేషునిపై
మృదువుఁ బరపుగా మెల్లనె పొరలుచు
నిదురవోదువట నీవా యిపుడు. ॥పాల॥

పరమ మునీంద్రులుఁ బద్మభవాదులు
ఇరువంకల నుతియించఁగను
అరవిరిమోమున నల్లన నవ్వేడి
నిరతమూర్తివట నీవా యిపుడు. ॥పాల॥

పగటున సిరియునుఁ బరగిన ధరణియు
బిగియుచు నడుగులు పిసుకఁగను
తగువేంకటగిరిఁ దనరుచుఁ జెలఁగెడి
నిగమమూర్తివట నీవా యిపుడు. ॥పాల॥ 34

53_వ రేకు. సామంతం

* సంతత దుఃఖపు జడులాల శ్రీ
కాంతుని మరవక కనరాదా. ॥పల్లవి॥

మలజలధులఁ బలుమరుఁ దేలుచుఁ గడు [1]
దలఁకుచు నొరలుఁ బాతకులార
నలువున శ్రీహరి నామామృతమే
కొలఁది మీరఁ [2] జేకొనరాదా. ॥సంతత॥

భవపంకములోపలఁ బడి మునుఁగుచు [3]
చవి దలఁచెడి [4] దుర్జనులాల

* ఇది 61_వ రేకులోను గలదు. 1. లుచును. 2. దిప్పైన. 3. పొరలుచు. 4. వెదకెడి.

భవరోగములకుఁ బరిడితుఁడగు మా
ధవుని నాత్మఁ జెందఁగరాదా [5]. ॥సంతత॥

కడుఘోరపు మార్గంబున [6] నలయుచు
వడినేఁగెడి తెరువరులాల
చెడని పదవొసఁగు శ్రీ వేంకటపతిఁ
దడవి సుఖముఁ జెందఁగరాదా. ॥సంతత॥ 35

54-వ రేకు. సామంతం

బొడ్డు తామెరలోన గడ్డివయసు పెద్ద
బిడ్డఁ గన్నట్టివాఁడు పిన్నవాఁడు. ॥పల్లవి॥

బిరుసైనదొకకొండ పెనుఁబాముతోఁ జుట్టి
బిరబిరనె త్రిప్పె పిన్నవాఁడు
గురుతైనదొకకొండ గొడగుగా నొకచేత
పెరికి పట్టేవాఁడు పిన్నవాఁడు. ॥బొడ్డు॥

బెడిదంపు శిశుపాలు పెనుమోఁతతోఁగూడ
పెడచేతనే వేసెఁ (వేసెపి?) బిన్నవాఁడు
పడవేసి చాణూరుఁ బట్టి యురము దొక్కి-
పిడికిటనే చంపె పిన్నవాఁడు. ॥బొడ్డు॥

ఎక్కడఁ జూచినఁ నింతటఁ దానై
పెక్కురూపములైన పిన్నవాఁడు
ఇక్కడఁ దిరువెంకటేశుఁడై జగమెల్ల
చిక్కటిల్లినవాఁడు పిన్నవాఁడు. ॥బొడ్డు॥ 36

---

5. నాత్మలోఁ దలఁచఁగరాదా. 6. బుల.

56_వ రేకు. నాట

ఆదిపురుషా అఖిలాంతరంగా
భూదేవతారమణ భోగీంద్రశయనా. ॥పల్లవి॥

భవ పాథోనిధి బాడబానల
భవజీమూత ప్రభంజనా
భవపర్వత ప్రళయ భయదనిర్ఘాత దు
ర్భవ కాలకూటభవ బహువిశ్వరూప. ॥ఆది॥

భవఘోరతిమిరదుర్భవకాలమార్తాండ
భవభద్రమాతంగపంచానన
భవ కమలభవ మాధవరూప శేషాద్రి
భవన వేంకటనాథ భవరోగవైద్య. ॥ఆది॥ 37

58_వ రేకు. సాళంగం

నీవు తురగముమీఁద నేర్పు మెరయ
వేవేలురూపులై వెదచల్లితపుడు. ॥పల్లవి॥

పదిలముగ నిరువంకఁ బసిఁడి పింజల యంప
పొద (దు ?) ల తరకసములొరపులు నెరపఁగా
గదయు శంఖంబు చక్రము ధనుః ఖడ్గములు
పదివేలు సూర్యబింబములైనవపుడు. ॥నీవు॥

సారిది శేషుని పెద్దచుట్టు పెనుఁగేవడము
సిరి దొలఁక నొకచేతఁ జిత్తగించి
దురమునకుఁ దొడనైన ధూమకేతువు చేత
ఇరవై నబల్లెమై యేచెనందపుడు. ॥నీవు॥

కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌఁగిట నిన్నుఁ దొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువుమని
మెరుఁగుఁగుచకుంభముల మిసిమితో నపుడు. ॥నీవు॥ 38

మలహారి

నిద్దిరించీఁ బాలజలనిధివలెనే
ఒద్దిక శ్రీరమణునికి నొత్తరే పాదములు. ॥పల్లవి॥

వేఁగుదాఁకఁ జిత్తగించి విద్దెలెల్లనాదరించి
బాగుగాఁ గృపారసము పంచి పంచి
యేగతిఁ బవళించెనో యెట్ల భోగించెనో
యోగీంద్రవరదుని నూఁచరే వుయ్యాలను. ॥నిద్ది॥

వాలుఁగన్నుల రెప్పల వడదాఁకి తను తావి
చాలుకొన నూర్పుకలు చల్లి చల్లి
నీలవర్ణపుగుణము నెరపుచు నొకయింత
కాలము కన్నులఁ దిప్పీఁ గప్పరే దోమతెర. ॥నిద్ది॥

నరగున యోగనిద్ర చాలించి లోకమెల్ల
కరుణించఁ దలఁచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్యుఁడాయె మించి
విరివి నాలవట్టాలు విసరరే సతులు. ॥నిద్ది॥ 39

66-వ రేకు. శంకరాభరణం

దురితమృత్యువట దొంగలట ॥
సిరివరుఁడట దయసేసీనా. ॥పల్లవి

మలయుచునె చేరిన మధుకైటభులను
సెల నెత్తురు వడిచినయట్ల
ఖలులఁ బిడిచి రక్తము వడిఁగ్రోలక
విలయాంతకుఁడట విడిచీనా. ॥దురి॥

కారించి కనకకసిపుని నఖములఁ
జీరి కడుపు చించిన యతఁడు
ఈరసపసురల యెముకలు విరువక
వీరసింహుఁడట విడిచీనా. ॥దురి॥

చెనకి దశముఖుని చేతులుఁ దలలును
చినికండలు గోసిన యతఁడు
ఘనుఁడట తిరువేంకటపతి దుష్టుల
తనువులఁ జెండక తడసీనా. ॥దురి॥ 40

శ్రీరాగం

ఒక్కఁడవె లోకానకొడయఁడవు నీవె
దిక్కుగా నెవ్వరులేరు తిమ్మనాయఁడా. ॥పల్లవి॥

బొడ్డుచెర్ల బొమ్మిరెడ్డి పొలమెల్లఁ జేడవెట్టి
గడ్డనుండి పైరువిత్తి కాచుకుండఁగా
దొడ్డగాఁ బండఁగఁ జూచి దోసకారి మొండిదొర
దిడ్డిఁదీసి కొంటఁబోయె తిమ్మనాయఁడా. ॥ఒక్క॥

పాలకొల్ని చందిరెడ్డి పంటసేయఁ బొద్దులేక
గాలివీటి కాఁపురానఁ గసుగందఁగా
కోలుపుచు దినమూ నీకొండమీఁది నాయకులు
తెలుపరచేరు గదే తిమ్మనాయఁడా. ॥ఒక్క॥

కామకొల్ని మారిరెడ్డి కనుచూపువారినెల్ల
కోమలపు చెలుపలు (?) గోరు మొత్తఁగా
ప్రేమముతోఁ గేదారి పెరిగి పండిన పంట
తేమ రేఁగి ఊటువట్టె తిమ్మినాయఁడా. ॥ఒక్క॥

గుండుఁగంటి దేవిరెడ్డి కొలిచిన వండిపెట్టు
కుండఁ గాపరింటనింట కూడుమోయఁగా
పండినబండ్లఁగొట్టి పంటలెల్ల నానాఁటి
తిండికొక్క కొలఁదాయ తిమ్మినాయఁడా. ॥ఒక్క॥

వెలిగొండ కాపిరెడ్డి వేఁకపు జీవనమెల్ల
తలమోఁచి తిరిపెమై తల్లడించఁగా
తెలిసి యాతనితో నొక్కటిగాఁగ నీగుట్టు
తెలిసె వేంకటగిరి తిమ్మినాయఁడా. ॥ఒక్క॥ 41

69-వ రేకు. కన్నడగౌళ

త్వమేవ శరణం త్వామేవ మే
భ్రమణం ప్రసరతి ఫణీంద్రశయన. ॥పల్లవి॥

కదావా తవ కరుణా మే
సదా దైన్యం సంభవతి
చిదానందం శిథిలయతి
మదాచరణం మధుమథన. ॥త్వమే॥

మయా వా తవ మధురగతి (?)
భయాదికి (దివా ?) విభ్రాంతోఽహం
తయా విమలం (?) దాతవ్యా
దయా సతతం ధరణీరమణ. ॥త్వమే॥

ఘనం వా మమ కలుషమిదం
అనంతమహిమాయతస్యతే
జనార్దన ఇతి సంచరసి
ఘనాద్భుత వేంకటగిరిరమణ. ॥త్వమే॥ 42

74-వ రేకు. లలిత

భవములు వీడఁగఁ బాలించి
చవి మరపెను మోక్షముతెరువు. ॥పల్లవి॥

కర్మకోట్లకు గడిచీటిచ్చెను
నిర్మలమతులకు నేఁడిపుడే
ధర్మమార్గమునఁ దడవి నడచుటకు
నర్మిలిఁ బుణ్యములందుటకు. ॥భవ॥

ముంజేతద్దము మూలదాముగా (?)
సంజీవని సరసత నొసఁగె
గొంజ సుకృతములు కుమ్మరించి హరి
రంజించెను సర్వజనులకు. ॥భవ॥

పట్టముగట్టెను ప్రాణులకెల్లను
గట్టిగఁ దిరువేంకటవిభుఁడు
బట్టిన యాపదలూడఁదోలి జను
లిట్టె నిజసుఖమిచ్చుటకు. ॥భవ॥ 43

ఆహిరి

నన్నునింత సేయుకంటె నవ్వులున్నవా వంట
మన్నుపైఁడిముద్దగాఁగ మన్నువూసె (?) నితఁడు. ॥పల్లవి॥

పంచమహాపాతకులఁ బరమపావనులఁ గా
వించఁ బూనె నిందుకంటె విద్యలున్నవా
ఇంచుకంత హరినామమింతలోననె ముట్టు
పెంచు దెచ్చి మాణికపుబిల్ల సేసె నితఁడు. ॥నన్ను॥

మాలవాని కష్టవిద్య మందవెట్టి బ్రహ్మవిద్య
పాలుసేసె నిందుకంటె బ్రతుకున్నదా
నాలుకందునున్న విష్ణునామమంత్రము చెప్పు
తోలుబిల్ల మాడకంటె దొడ్డసేసె నన్నును. ॥నన్ను॥

కుక్కఁ దెచ్చి గంగిగోవు కొదమగాఁగ భూమిలోన
ఒక్కమాట యింతసేయ నోపవచ్చునా
దిక్కులందు వేంకటేశు దివ్యనామము రోఁత
కక్కఁగూటి నమృతజలధిఁ గానించె నన్నును. ॥నన్ను॥ 44

భూపాళం

ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయమలర భజింపరో మీ
రిటు ధనుర్మాసముల విధులఁ. ॥పల్లవి॥

వేగ నాలుగు ఘడియలనఁగా
వేద వేద్యులు లేచి సరగున
నాగమోక్తవిధులను తమదేహానుగుణములుగా
వేగమున సంధ్యాదులొగిఁ గా
వించి విమలాంభోధిశయనుని
బాగుగాఁ బూజించరో యెడ
పక ధనుర్మాసముల విధులనె ఘనులు. ॥ముద॥

* పరగు చీనాంబరములను నతి
పరిమళమ్ముల< బుష్పముల కడు
వెరవుగా వేంకటపతి (కి నై ?) వేద్యసంగతుల
అరుదుగా ధూపముల బహుదీ
పాదులను తాంబూల విధులను
పరగ< బూజింపుడు సమస్త
ప్రభు ధనుర్మాసమున విధులగు ఘనులు. ॥ముద॥ 45

## మేచ బౌళి

అచ్చపు రాల యమునలోపల
ఇచ్చగించి భుజియించితి కృష్ణ. ॥పల్లవి॥

ఊరు<గాయలును నొద్దికచద్దులు
నారగింపుచు నందరిలో
సారె బాలుల సరసాలతోడ
కోరి చవులు గొంటివి కృష్ణా. ॥అచ్చ॥

ఆకసంబున కావుర ముఖ్యులు
నాకలోకపు నాందులును (?)
కైకొని యజ్ఞకర్త యాతే<డని
జోక< గొనియాడ< జొక్కితి కృష్ణా. ॥అచ్చ॥

పేయలు లేవు పిలువు<డనుచు
కోయని నోర< గూ<తలను

* ఈ రెండు చరణముల నడుమ మఱొక్క చరణము వ్రాయుటకు వలసిన చోటు రేకులో విడువ<బడినది. ఈ రెండు చరణములందు కడపటి పాడిగింపు తాళ మితిని మీరినట్లు వింతగానున్నది.

మాయల బ్రహ్మము మతము మెచ్చుచు
చేయని మాయలు సేసితి కృష్ణా. ॥అచ్చు॥ * 46

75-వ రేకు. ( రాగము పేరునకు చోటు విడువఁబడినది. )

ఈతఁడే హరుఁడు యీతఁడే యజుఁడు
ఈతనికి నీచేఁతలెంత ఘనమటుగాన. ॥పల్లవి॥

కడుఁ బెక్కు బ్రహ్మాండకటకములు సుడివడిన
కడుపులో నిడుకొన్న ఘనుఁడు
వెడలి ప్రాఁతకిచంటివిషము దాఁగినయంత
వడిఁ దనకు నేమాయ వట్టిబూమెలు గాక. ॥ఈత॥

ఎల్లజలధులు మిగిలి యేకమై పబ్బినపు
డుల్లసిల్లుచు నీతఁడుండు
మల్లాడి యొక రెండు మద్దులు విరచినట్టి
బల్లిదుఁడవని నిన్నుఁ బరిణమింతురు గాన (క ?). ॥ఈత॥

తిరువేంకటేశ్వరుఁడు దేవదేవోత్తముఁడు
పరిపూర్ణుఁడచ్యుతుఁ డభవుఁడు
శరణాగతుల రక్ష సేయు(వా?)ఁడను మాఁటి (?)
గురుతుగాఁ దలపోసి కొనియాడఁగా వలసె. ॥ఈత॥ 47

( రాగము పేరునకు చోటు విడువఁబడినది )

నీ కథామృతము నా నిరత సేవన నాకు
చేకొనుట సకలసుఖసేవనంబటు గాన. ॥పల్లవి॥

---

* కడపటి చరణమున వేంకటేశ ముద్రలేదు గనుక మఱికొన్ని చరణము లీసంకీర్తనమునుండి ఏకారణముచేతనో రేకులో వదలఁబడినవని యూహింపవలసి యున్నది.

ఇదియె మంత్రరాజము నాకు నే్ప్రొద్దు
నిదియె వేదసంహిత పాఠము
ఇదియె బహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు
ఇదియె సంధ్య నాకిదియె జపమటు గాన. ॥నీక॥

ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహితమార్గము
ఇదియె బహులోకహితభేషజము నాకు
ఇదియె వుపనిషద్వాక్యపద్ధతి గాన. ॥నీక॥

ఇదియె దానఫలమియ్యఁ జాలును నాకు
ఇదియె తపవిరహిత కర్మము (?)
ఇదియె తిరువేంకటేశ్వరుని సంస్మరణ
ఇదియె యిదియె యిన్నియును నటు గాన. ॥నీక॥ * 43

79-వ రేకు. దేశాక్షి

ఎవ్వరు గలరెవ్వరికి
ఇవ్వల నవ్వల నితఁడే కాక. ॥పల్లవి॥

ముద్ద సేసినటు మొదలఁ గడుపులోఁ
బెద్దగాఁ దాఁ బెరుగునాఁడు
ఒద్దనెవ్వరుండిరొకరైనా
ఒద్దికైన బంధుఁడొకఁడే కాక. ॥ఎవ్వ॥

వరతఁ బోవునట్టి వడి సంసారపు
తెరలఁ దగిలి తాఁ దిరుగునాఁడు

* ఈ సంకీర్తన కొన్ని పాదములలో యతి గానరాదు. అన్నమాచార్యుల రచనలో ఇది చాల వింత.

వెరవకుమని భావించువారెవరు
తరితోడ నీతఁడె కాచుఁగాక. ॥ఎవ్వ॥

ఉడుకఁ బెట్టినట్టి వుడివోయిన నరకాల
నుడుకుచుఁ దానుండునాఁడు
తడవువారెవ్వరంతటఁ దన్ను
కడువేగ వేంకటపతి గాక. ॥ఎవ్వ॥ 49

80_వ రేకు. ముఖారి

కనుఁగాక పుణ్యాలు కడఁబడినా
తనువు లేదో చేతనము లేదో. ॥పల్లవి॥

మోసపోతిననేల మురుగ వగవనేల
చేసుఁగాక పుణ్యాలు చీమ దుమ్మినా
దాసుఁడుగాఁ దా లేఁడా తలఁప శ్రీహరి లేఁడా
వీసమంతగాలమైన విధిలేదో. ॥కను॥

తల్లడించి పడనేల దైవము దూరనేల
చెల్లఁబో నేఁడే పండి పొల్లవోయెనా
ఉల్లములో హరి లేఁడో ఒద్దికతోఁ దా లేఁడో
కొల్లలాడఁ బుణ్యములకోరిక లేదో. ॥కను॥

చచ్చి చచ్చి పుట్టనేల జముబారిఁ బడనేల
నొచ్చి నొచ్చి మరుచేత నొగులనేల
యిచ్చలేదా తిరువేంకటేశుఁడొద్దనె లేఁడో
నిచ్చ నిచ్చఁ దనకింత నేరుపు లేదో. ॥కను॥ 50

పాడి

కలుషపు చీఁకటి గలుగఁగను
వెలుఁగు లోకముల వెలసిన యట్లు. ॥పల్లవి॥

మునుకొని పాతకములు గలుగఁగఁబో
జనులకుఁ బుణ్యము చవులాయ
ఇనుము గలుగఁగా ఇందరి యెదిటికి
కనకము ప్రమోదకరమైనట్లు. ॥కలుష॥

జగములోపల విషముగ గలుగఁ బో
మిగులఁగ నమృతము మేలాయ
వగపు గలుగఁగఁగా వడి సంతోషం
బగపడుటిందరి కబ్బురమాయ. ॥కలుష॥

బహుదైవంబుల ప్రపంచవిదులఁ బో (?)
మహిమల శ్రీహరి మనసాయ
విహగగమనుఁడగు వేంకటేశ్వరుఁడు
ఇహామియ్యఁగఁ బరమిచ్చినట్లు. ॥కలుష॥ 51

(రాగము పేరు లేదు)

ఓపనయ్య వోపనయ్య
ఓపనయ్య యీ యొప్పులే తప్పులు. ॥పల్లవి॥

ఎక్కడికి నెక్కడ - యెక్కువే యెరవు
తక్కులే యీ మొక్కులు - తక్కువే దారణ. ॥ఓప॥

ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తవ్వులే యీరవ్వలు - చివ్వలే సిగ్గులు. ॥ఓప॥

బొంకులే పొందులు - కింకలే గిరులు
వేంకటవిభుఁడ నీ - జంకెలే జంపులు. ॥ఓప॥ 52

82-వ రేకు. శంకరాభరణం

అధమునికి (ఁడగు?) నను విధాయకులు విధియించరో
విధిలోనఁ గొంత దుర్విధి నెరపినాఁడ. ॥పల్లవి॥

పాతకుని పాపాలు పరిహారింపించరో
భూతంబులాల తోఁబుట్టులాల
యేతులకు హరిఁ దలఁచి యిటువంటి యీ మేన
బూతుఁజేఁతలనె వోరపులు నెరపినాఁడ. ॥అధ॥

పాపకర్మునికి భృగుపతనంబు చూపరో
తాపత్రయములాల తమ్ములాల
దీపించు హరిఁ దలఁచి ధృతిలేక మరి మనో
వ్యాపారములు గొన్ని వడిఁ దలఁచినాఁడ. ॥అధ॥

చంచలునకేది నిశ్చయవిధి విధించరో
పంచేంద్రియములాల బంధులాల
ఎంచనరుదగు వేంకటేశ్వరుఁ బొగడునోర
కాంచి యితరుల నాలికకుఁ జేర్చినాఁడ. ॥అధ॥ 53

లలిత

హితమిదియే కాకిఁక లేదు - మా
గతిఁ జెరి (?) నీకృపె కలదిది యెల్లా. ॥పల్లవి॥

పాతకకోట్లం బాయునుపాయం
బేతరిఁ జూచిన నిఁక లేదు
చైతన్యాత్మక సకలేశ్వర నీ
చేతిదె ప్రాణుల జీవనమెల్లా. ॥హిత॥

భవబంధంబులఁ బాయునుపాయం
బివల నవల మారి (కిఁ?) క లేదు
ధ్రువవరదుఁడ కౌస్తుభధర నీకృప
చవిచేతివె మాసంపదలెల్ల. ॥హిత॥

పరమ పదంబగపడు విభవము నీ
కరుణే కానిఁకఁ గడలేదు
తిరువేంకటగిరి దేవుఁడ నీకే
భరము జంతువుల పనులివి యెల్లా. ॥హిత॥ 54

## గుండక్రియ

పాయమంట ముదిమంటా బహురూపము - యిఁక
నేయెడఁ గాచెదు మము నిందిరారమణ. ॥పల్లవి॥

అన్నలంటా తమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
పన్నుకొని తిరిగేరు బహురూపాలు
ఎన్నిక దినములలో నెవ్వరికి నేమేమి గల
రిన్నిటికి నీవె నాకు నిందిరారమణ. ॥పాయ॥

చుట్టలంటా పక్కమంటా సుఖమంటా దుఃఖమంటా
పట్టులేక తెచ్చుకొన్న బహురూపము
వట్టివెతలఁ బడి వాడు దేరేము
ఎట్టు సేసినను జేయుమిందిరారమణ. ॥పాయ॥

తల్లులంటాఁ దండ్రులంటా తప్పులంటా నొప్పులంటా
బల్లిదులఁ జేయలేని బహురూపాలు
వెల్లిగొన్న కృపతోడి వేంకటేశుఁడ నాకు
నెల్లనాఁడు నీవే కలవిందిరారమణ. ॥పాయ॥ 55

84-వ రేకు. దేవగాంధారి

ఈజీవునకు నేది గడపల తనకు
నేజాతియును లేక యిట్లున్నవాఁడు. ‖పల్లవి‖

బహుదేహకవచములఁ బారవేసినవాఁడు
బహుస్వతంత్రముల నాపదనొందినాఁడు
బహుకాలముల మింగి పరవశంబైనాఁడు
బహుయోనికూపములఁ బడి వెడలినాఁడు. ‖ఈజీ‖

పెక్కుబాసలు నేర్చి పెంపు మిగిలినవాఁడు
పెక్కునామములచే బిలువఁబడినాఁడు
పెక్కుకాంతలతోడ పెక్కుపురుషులతోడ
పెక్కులాగులఁ బెనఁగి బెండుపడినాఁడు. ‖ఈజీ‖

ఉండనెన్నఁడుఁ దనకు ఊరటెన్నఁడు లేక
యెండలకు నీడలకు యెడతాఁకినాఁడు
కొండ (ల) లో నెలకొన్న కోనేటిరాయని
యండ చేరెదననుచు నాసపడినాఁడు. ‖ఈజీ‖ 56

వరాళి

దిక్కులేకపోయె నిట్టె దినదినము
వెక్కసపు లోకమేలే విభుఁడెవ్వఁడో. ‖పల్లవి‖

గుత్తముగ నెల్లవారు కుడిచేటి కంచము
ఎత్తుక లోఁబెట్టుకొనె నెవ్వఁడో దొంగ
కొత్తగానే యింతి గట్టుకొని బయటవేసిన
మెత్తనిదంటాఁ బట్టి మింగె నెవ్వఁడో (?). ‖దిక్కు‖

బంతిగాఁగ నెల్లవారు పండేటిమంచము
గుంతలో విరుగఁదోసెఁ గూళఁడెవ్వఁడో
దొంతుల కడవలోన శౌరలి దాచిన పెద్ద
పొంతకూటికుండఁ గొంటఁ బోయెనెవ్వఁడో. ॥దిక్కు॥

సారిది సంతలలోని సుద్దులెల్ల విని విని
విరసములెల్లఁ బాపే విభుఁడెవ్వఁడో
తిరువేంకటగిరి దేవుఁడై యిందరికిఁ
గరుణ లోకము గాచే ఘనుఁడెవ్వఁడో. ॥దిక్కు॥ 57

దేశాక్షి

కంటి నఖిలాండ (తతి ?) కర్తనధికుని గంటి
కంటి నఘనుఁలు వీడుకొంటి - నిజమూర్తిఁ గంటి. ॥పల్లవి॥

మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజనవరత్న కాంచన వేదికలు గంటి
రహి వహించిన గోపురంబులవె కంటి. ॥కంటి॥

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగ గంటి
దైవికపుఁ బుణ్యతీర్థములెల్లఁ బొడగంటి
కోవిదులు గొనియాడు కోనేరిఁ గంటి. ॥కంటి॥

పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపుఁ జూడఁగంటి. ॥కంటి॥ 58

86-వ రేకు. దేసాళం

* ఎన్నాళ్ళున్నా నిట్టె[1] కదా
విన్నని వెరగులె వేడుకలాయ. ||పల్లవి||

భువి నెట్టున్నాఁ బోయేదే కా
చవులకుఁ జనియగు శరీరము
ధ్రువమని యీ సుఖదుఃఖ రోగములు
భవములకిదియే బంధములాయ. ||ఎన్నా||

ఎంత వారలినా నిదే తాఁగద (?)
కంతల కంతల కాయమిది
బొంత దగులుచుక పోరలఁగఁ బోరలఁగ
సంతకూటములె సరసములాయ. ||ఎన్నా||

కై పుసేసినా [2] ఘనమానే కా
పాపముఁ బుణ్యముఁ బైపై నే
యీ పుట్టుగునకు ఈ వెంకటపతి
దీపించఁగఁ బెనుఁదెరువొకటాయ. ||ఎన్నా|| 59

ఆహిరి

కలియుగంబునకుఁ గలదిదియే
వెలసిన పంచమవేదమె కలిగె. ||పల్లవి||

బోధల హరినుతి పాడమెను శూద్ర
స్సాధని కలిదోషము మాన్ప
రాధా మాధవరచన సకలజన
సాధువేదమే జగమునఁ గలిగె. ||కలి||

---

* ఈ పాట 3౮-వ రేకునను గలగ, అందు దీని రాగము 'దేసి' } 2. ఇదేకదా. 1. సీనను.

పరమగు వేదము బహుళము చదివియు
హరినెఱిఁగిన వారరుదనుచు
తిరువాముడియై దివ్యమంత్రమై
వెలసిన (?) పంచమ వేదమె కలిగె. ॥కలి॥

బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకె దీరదెచ్చట ననుచు
సంకీర్తనమే సకలలోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె. ॥కలి॥ 60

87-వ రేకు. శ్రీరాగం

కత్తరాలు చిమ్ముచుండేఁ గదలుచుండె
చిత్త (జ?) జనకుఁడైన శ్రీ మూరితి ॥పల్లవి॥

కన్నులఁ జొక్కుచునుండె కంపితము మీఱుచుండె
నన్నపు సొలపు నిగ్గు నఖుపుచుండె
అన్నువ నడిమి యింతి నక్కున నొత్తుచునుండె
ఉన్నతిఁ గోనేటిదరినున్న మూరితి. ॥కత్త॥

మేనులు ముట్టుచునుండె మేడమీఁద నిలుచుండె
కీసిన గోక గిలిగింపుచునుండె (?)
నేసకొప్పురమణికి చెక్కులు నొక్కుచునుండె
తీసిన లంఘితముల దివ్యమూరితి. ॥కత్త॥

కిలకిల నవ్వుచుండె కిన్నెరవట్టుచునుండె
పలుమెఱుఁగులు దోఁపఁ బాడుచుండె
అలమేలుమంగమీఁద నలరి యొరగి యుండె
వెలయ వేంకటగిరి వేదమూరితి. ॥కత్త॥ 61

105-వ రేకు. ముఖారి

మొక్కరో మీరు మోసపోక - మీకు
దిక్కైన ఆదిదేవునికి. ॥పల్లవి॥

(మారుచే?) తులియవద్దు మారుగాళ్ళియవద్దు
బీర (రా?)న గుండెలు గోసి పెట్టవద్దు
గోరపడి చిచ్చులోన కొండాలు చొఱవద్దు
ఊరకే మీవారమని వున్నఁ జాలు ॥మొక్క॥

సిడిదలలియ్యవద్దు జీవాలఁ జంపవద్దు
బడి బడి వగ్గాలఁ బారవద్దు
సిడిమీఁద బిత్తరపు చిమ్ములు చిమ్మఁగవద్దు
కడనుం......దారిఁ గన్నఁ జాలు. ॥మొక్క॥

బగ్గన యెక్కడ డొక్కపడునో యేమరవద్దు
బగ్గివడ్డ యమబాధఁ బడవద్దు
ఎగ్గు సిగ్గులేక వేంకటేశుని దాసులఁజేరి
అగ్గలపు పాదరేణువైనఁ జాలు. ॥మొక్క॥ * 62

106-వ రేకు. శ్రీరాగం

ఎవ్వరిఁ దలఁపఁడు ఎవ్వరి నొల్లఁడు
నవ్వుల తెరువులె నడచీఁ బ్రాణి. ॥పల్లవి॥

కలుషముఁ బుణ్యము కర్మపుఁ జేనను
వెలయఁగ జీవుఁడు విత్తుచును
కలిగిన సుఖదుఃఖములను గాదెల
కొలుచులు నించుక కుడిచీఁ బ్రాణి. ॥ఎవ్వరి॥

* ఈ పాటలో చుక్కలువేసిన చోట రేకు విరిగి పోయినది.

చెడని ప్రపంచము శేశెదిదిలో ?
నిడుపు గురుచలుగ నేసినది
వడి దేహములను వన్నెల వన్నెల
గడనల చీరలె కట్టీఁ బ్రాణి. ॥ఎవ్వరి॥

కూరిమిఁ గామక్రోధాదులు మతి
చూరలఁ గొనియెడి చుట్టములే
గారవముల వేంకటపతిఁ గొలువక
చేరి కాఁపురము సేసీఁ బ్రాణి. ॥ఎవ్వరి॥ 63

108 వ రేకు. ధన్నాసి

ఏలయ్య పరమాత్మ యేలికవు మాకునై
నాలినే పెట్టితివి నాడూను
కాలునికి మమ్ము నరిగాఁపులే నమ్మనుచు
నేలనే తిప్పేవు నేఁడూను. ॥పల్లవి॥

భారమగు నీటిలోఁ బవళించి నీ వాది
నారాయణుఁడవైతి నాఁడూను
పైరుగా నిందరిని ప్రకృతిలోపలఁ దెచ్చి
నారుగాఁ బోసితివి నాఁడూను
నారపేరిడి తండ్రి నందనుని బిలువఁ గరు
ణారసము నించితివి నాఁడూను
చేరి కడు మమ్ము రక్షింపనోపక వట్టి
నేరములె యెన్నేవు నేఁడూను. ॥ఏలయ్య॥

దట్టముగఁ జొచ్చి యిందరిదేహములలోన
నట్టనడుమెక్కితివి నాఁడూను

అట్టలుగ బ్రహ్మాండమవియించి జంతువుల
నట్టేట ముంచితివి నాఁడూను
ఒట్టి యిందరికి సరయూ (యువు?) దరిని మోక్షంబు
నట్టు కొట్టితి గొంత నాఁడూను
పొట్ట పొరుగునఁ దెచ్చి భూతముల మెడగట్టి
నిట్టి (ట్ట?) పిడినేఁపేవు నేఁడూను. ॥ఏలయ్య॥

పొలుపుగా మమ్మిట్లఁ బుట్టించుకొరకునే
నలినహాభుఁడవై తి నాఁడూను
పలువేలుపులకెల్ల పదవులిన్నియు నొసగి
నలుగడల నునిచితివి నాఁడూను
చలముకొని దానవులఁ జక్కాడి దేవతల
నలఁకువలు దీర్చితివి నాఁడూను
చెలఁగి యిందరిఁగావ శ్రీవేంకటాద్రిపై
నెలకొనిటు నిలిచితివి నేఁడూను. ॥ఏలయ్య॥ 64

సామంతం

గద్దరి జీవుఁడు కామధేనువు వంటి
యెద్దుఁ బిదుకఁ జొచ్చె నేది దెరఁగు ॥పల్లవి॥

మటమాయములఁ దనమనసె చంచలమంది
ఇటునటుఁ దిరిగిన నేది దెరఁగు
కటకట ప్రారేలు కత్తే దొంగలఁగూడి
మెటువలెఁ జేసిన నేది దెరఁగు. ॥గద్దరి॥

కల్లలాడఁగఁ జొచ్చెఁ గలుషపుమతి సత్య
మిల్లు వెడలఁగొట్టె నేది దెరఁగు

చెల్లఁబో నోరే చేఁదుమేయఁగఁ జొచ్చె
నెల్లవారికి నింక నేదిదెరఁగు. ॥గద్దరి॥

తియ్యని వెంకటాధిపుఁ బాసి పరసేవ
కియ్యకొనెడిఁ జిత్తమేది దెరఁగు
అయ్యో చక్కనిపతి నాలు విడిచిపోయి
యెయ్యెడఁ దిరిగిన నేదిదెరఁగు. ॥గద్దరి॥ 65

భూపాళం

నందకధర నందగోపనందన
కందర్పజనక కరుణాత్మక. ॥పల్లవి॥

ముకుంద కేశవ మురహార
సకలాధిప పరమేశ్వర దేవేశ *
శుకవరద సవితృ సుధాంశులోచన
ప్రకటవిభవ నమొ పరమాత్మక. ॥నంద॥

ధ్రువ పాంచాలీ స్తుతివత్సల మా
ధవ మధుసూదన ధరణిధరా
భువనత్రయపరిపోషణతత్పర
నవనీతప్రియ నాదాత్మక. ॥నంద॥

శ్రీమన్ వేంకటశిఖరనివాస మ
హామహిమన్ నిఖిలాండపతే
కామితఫలభోగప్రద తే నమో
స్వామిన్ భూమన్ సర్వాత్మక. ॥నంద॥ 66

---

* రేకులోని పాఠమిది. లయ యతులను బట్టి 'ముకుంద కేశవ - మురహార సకలా - ధిక పరమేశ్వర - దేవేశ' అని సరియైన పాఠము గావలయును.

111-వ రేకు. ముఖారి

నెరబిరుదిన్నిటాను నీ బంటు
వోరసె గగనమదివో నీ బంటు. ||పల్లవి||

ముంచిన చుక్కలు మొలపూసలుగాఁ
బెంచె మేను పెళపెళనార్చి
అంచులు మోఁవఁగ నబ్జభవాండము
నించె నార్భటమున నీ బంటు. ||నెర||

గగనలోకములు గడగడ వణఁకఁగ
నెగసె హుటూహుటి నీ బంటు
మగటిమి మెరయఁగ మందులకొండకు
నిగిడి కోయనుచు నీ బంటు. ||నెర||

ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు
నెమ్మన మలరిన నీ బంటు
కమ్మర నిదె వేంకటేశ నీచే
నిమ్మపండైన నీ బంటు. ||నెర|| 67

116-వ రేకు. ముఖారి

నేర్పుకంటెఁ బెన్నిధి గద్దా
ఓర్పుకంటె సుఖమొకటికఁ గద్దా. ||పల్లవి||

కరుణకు నెక్కుడు గతి యిఁకఁ గద్దా
సరసతకెక్కుడు సరిగద్దా
గురుమతిఁ జిత్తము కూరిమి నిలిపిన
నెరవుకంటె * విధమిఁకఁ గద్దా. ||నేర్పు||

* ఈ చోట రెండుమాత్రల పదమొకటి లోపించినట్లున్నది.

కలిమికంటెఁ జీఁకటి మరి కద్దా
బలిమికంటె నాపద గద్దా
గెలుపు (గఁ) దెలిసి లంకించిన మతితోఁ
జెలఁగుకంటె నిజసిరి యిఁకఁ గద్దా. ॥నేర్పు॥

పాయముకంటె నపాయము గద్దా
కాయపు రోఁతకుఁ గడ గద్దా
పాయక వేంకటపతికృప గోరిన
యీయభిమతమునకెదురిఁకఁ గద్దా. ॥నేర్పు॥ 68

సామంతం

మునుకలుగఁ బిలిచీ మూఁడులోకాలు
ధనము బండెలచేతఁ దగనందుకొనుచు. ॥పల్లవి॥

పరుసవారిఁ బిలువ (బీలువ ?) బడిబడిఁ బారితెంచి
ఒరసుదై వాల మిండఁడూళ్ళ వెంట
సిరసు పింఛెముపాగఁ జెరిగిన చుంగులతో
గరుసుమీరిన యీవిఁ గప్పములు గొనుచు. ॥మునుక॥

లాట భోట కుకుర మరాట దేశాల ఘనుల
కూటువలు గూడించి కోట్లసంఖ్య
పేటలుఁ బేటలు పెనుఁగూటములుగాఁ దెచ్చి
చాటువై న వరములు చల్లువెదలాడుచు. ॥మునుక॥

గక్కన నెదురువచ్చి కనిపించుకొను వాఁడె
వెక్కసపు మహిమల వేంకటేశుఁడు
పక్కల వనములెల్లఁ బసిఁడిగాదెల నించి
మొక్కులు గై కొని వరములు గోకొండనుచు. ॥మునుక॥ 69

## శ్రీరాగం

ఇందిరకు నురమునిచ్చిన నాఁడు
విందువలె హరి యిందు విచ్చేసె నాఁడు. ॥పల్లవి॥

పరమపదమునందు బహుదివ్యవరణాలు
హరి గరిమలు పొలుపలరు నాఁడు
గరుడఁడు ననంతుఁడుఁ గదిసి సేనేశుఁడు
హరి నిత్యసేవకులై రిందు నాఁడు. ॥ఇందిర॥

పాలజలధిలోనఁ బవళించి హరి వచ్చి
భూలోకమింతయుఁ జూచి పొగడునాఁడు
పాలించి నేలయు మిన్ను బహుదివ్యదేశాలు
గాలించి కోనేటిదరి గైకొంట నాఁడు. ॥ఇందిర॥

నరసురోరగులెల్ల నలువంకఁ గొలువంగ
పురవైన వేడుకలఁ బొదలునాఁడు
విరజానదియుఁ దాను వేంకటపతి వచ్చి
పరమపదమిదని పాలించె నాఁడు. ॥ఇందిర॥ 70

## దేవగాంధారి

కలిగి (న?) మతి వృథ గాకుండా
అలరుటె పుణ్యంబగు ఫలము. ॥పల్లవి॥

ఒనరిన యీ భవమునురనకుండ
ఘనుఁడీ జీవుఁడు గలఫ (లము?)
తనువు మోచి చైతన్యాత్ముని మతిఁ
గనుటె వివేకము గలఫలము. ॥కలిగి

చేసిన పుణ్యము చెడిపోకుండ
శ్రీ సంపద మెరసిన ఫలము
ఈసుల రేసుల యితరదూషణలఁ
బాసుటె అపురూపపు ఫలము. ॥కలి॥

హరిఁ గొలిచియు మిథ్య గాకుండ
విరసముడిగి చదివిన ఫలము
తిరువేంకటగిరి దేవుని సరిగా
పరులఁ గొలువనిదె బహుఫలము. ॥కలి॥ 71

117-వ రేకు. పాడి

పృథుల హేమ కౌపీనధరః
ప్రథితవటుర్మే బలం పాతు. ॥పల్లవి॥

సూపానక్తః శుచిస్సులభః
కోపవిదూరః కులాధికః
పాపభంజనః పరాత్పరోయం
గోపాలో మే గుణం పాతు. ॥పృథుల॥

తరుణః ఛత్రీ దండకమండలు
ధరః పవిత్రీ దయాపరః
సురాణాం సంస్తుతిమనోహరః
స్థిరస్సుధీర్మే ధృతిం పాతు. ॥పృథుల॥

త్రివిక్రమః శ్రీ తిరువేంకటగిరి
నివాసోయం నిరంతరం
ప్రవిమల మసృణ కబళప్రియో మే
దివా నిశాయాం ధియం పాతు. ॥పృథుల॥ 72

### కేదారగౌళ

నారాయణుని శ్రీ నామమిది
కోరినవిచ్చీఁ గోవో మనసా. ॥పల్ల॥

శుకవరదుని సొంపుగఁ దలఁచుటె
సకలభవ విజయము
అకలంకము మహాభయహరణ
మొకటి నొకటి వోహో మనసా. ॥నారా॥

పక్షిగమను శుభము (పదము?) దలఁచుటే
అభయభోగ విహారమ్ము
వక్షపు లక్ష్మీవరుసే (చే?) సిరులు
లక్షలు గోట్లాల్లవో మనసా. ॥నారా॥

ఇంకా నీతలఁపులెన్ని గలిగిన
వేంకటాధిపు సేవించఁగదో
అంకెలకిన్నియునైన యీ (?)
మంకవు గాక నమ్మవో మనసా. ॥నారా॥ 73

### శ్రీరాగం

పొలమెల్లఁ దిరిగిన బోడెద్దు
గరిమెలో (తో?) నెవ్వరికి దగ్గరి గాని యెద్దు. ॥పల్లవి॥

పురములు సాధించఁ బూనినప్పుడు భూమి
భరమెత్తి నిలిచిన బండెద్దు
పరివోని మందల పసులఁ బోఁడోలి శ్రీ
వరుఁడై రోలఁ గట్టువడినెద్దు. ॥పొల॥

ఒడలెత్తి నాలుగుయుగముల బడిఁ
బడి ధర్మదేవతై పరగినెద్దు
తడవి దేవరలను దామెర (న ?) లనుఁ గట్టఁ
గడఁగి మానిసిరూపు కపిలెద్దు. ॥పొల॥

గోవైన భూదేవిఁ గూరిమిఁ జేకొని
లావైన వృషభాచలపులెద్దు
మోపఁగ వేదాలు మొల్లమై సిరితోడ
శ్రీ వేంకటాద్రి మించిన మాయలెద్దు. ॥పొల॥ 74

లలిత

అన్నిటాఁ దాము నతిశయులే
యెన్నఁగ నధికులె యెనఁగఁగను. ॥పల్లవి॥

పరంపరలగు భవములఁ బొడమియు
చిరంతనులే జీవులిదే
ధురంధరులే దురిత సుకృతముల
జరామరణ విశారదులే. ॥అన్ని॥

సదా బహాల విషయమత్తులయ్యు
మదాతురులే మనుజులిదే
ముదాసక్తులే మోహవిదూరులె
చిదానందులే చిరయతులే. ॥అన్ని॥

భృశం సుఖులే పుణ్యులందరు
నుశాంతాత్ములే శుభమతులే
విశారదులే వేంకటరమణుని
వశంవదులే వరిష్ఠులే. ॥అన్ని॥ 75

రామక్రియ

ఓయమ్మ యెట్టుసేసె నొకటొకటే
మాయలెల్లఁ జేసినాఁడు మరియింకనెట్టో. ॥పల్లవి॥

చన్నుదాగి పూతనను సగ్గుడుగాఁ జప్పరించె
మిన్నుదాఁకే సుడిగాలి కొడ దొక్కెను
వెన్న ముచ్చిరిం (లిం?) చి గొల్లవెలఁదులనెల్ల మెచ్చి
పిన్ననాఁడె యింతసేసెఁ బెద్దయైన నెట్టో. ॥ఓయమ్మ॥

మద్దిమాఁకులు విరిచె మామయింటికేఁగి పెద్ద
యెద్దులఁ బీఁచమణఁచె నేమి వెప్పరు (సెప్పను?)
చద్దికూటి ముద్దలోనె జలజాసనుని మాయ
వద్దనక పతిసేసె వాఁడివో నేఁడెట్టో. ॥ఓయమ్మ॥

కొండవంటి పామునోరు కొచ్చి కొచ్చి చంపి చంపి
మెండుకొని వుక్కణంచె మేనమామను
కొండల వేంకటపతి కోనేటిరాయఁడు
నిండుకృప మముఁ గాచేనేరుపిఁక నెట్టో ॥ఓయమ్మ॥ 76

121-వ రేకు. ఆహిరి

కటకటా మీరితివి కలికాలమా - పుణ్య
ఘటన గరివై పోయెఁ గలికాలమా. ॥పల్లవి॥

భూసురుల కామినులు బోయల నామి (య?) కులఁ
జేసుకొని యాం జ్ఞ చిచ్చురికిరి
యీసునను నీవలన నెకు వకులములెల్ల,
తాను నేయకపోయెఁ గలికాలమా, ॥కట॥

అన్నలును జెల్లెండ్లు నాండ్లు మగలునునైరి
వన్నె సెడి యతులు ధనవంతులైరి
ఇన్నియును జేసితివి యింకనైనా నీకు
కన్నీరు రాదుగా కలికాలమా. ||కట్ట||

అరుదగుఁ బతివ్రతలు అభిమానవతులు పలు
దొరలకమ్ముడువోయి తొత్తులైరి
చిరకాల సుకృ...... త్తమునఁ గొంతైన
కరుణమాల్పితివిగా కలికాలమా. ||కట||

కోవిదులమనుదొరల కులరాణివాసములు
త్రోవలనె లంజలై తుదిమీఱిరి
ఏవంకఁ జూచినా యిట్లనే ధర్మంబు
గావువట్టితివిగా కలికాలమా. ||కట||

పట్టభద్రుల సతులు పలుమారు నింద...
......రిపెంబులై దీనులైరి
ది (ఇ?) ట్టినఁ దిరువేంకటేశుదాసులు నిన్నుఁ
గట్టి వేతురు సుమీ కలికాలమా. ||కట|| 77

* ఈ రేకు ఎడమప్రక్క పాతికభాగమునఁ జిగినది. రెండుతునకల నడుమ సుమారు ¼ అంగుళమంత రేకుభాగము ఎట్లో నశించినది.

శ్రీః

శుభమస్తు

శ్రీ తాళ్ళపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు

## 3-వ భాగము. *

11-వ రేకు. ఆహిరి

అలరఁ జంచలమైన ఆత్మలందుండ నీ
యలవాటు సేసెనీ ఉయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ
భావంబు దెలిపె నీ ఉయ్యాల. ॥పల్లవి॥

ఉదయాస్త శైలంబులొనరఁ గంభములైన
వుడుమండలము మోఁచె నుయ్యాల
అదన నాకాశపదమడ్డదూలంబైన
అఖిలంబు నిండె నీ ఉయ్యాల
పదిలముగ వేదములు బంగారుచేరులై
పట్టె వెరపై తోఁచె నుయ్యాల
వదలకిటు ధర్మదేవతపీఠమై మిగుల
వర్ణింప నరుదాయె నుయ్యాల. ॥అలర॥

మేలుకట్లయి మీకు మేఘమండలమెల్ల
మెఱుఁగునకు మెఱుఁగాయ నుయ్యాల

---

* తాళ్ళపాకవాఁ రచనలు 2-వ సంపుటమందలి అన్నమాచార్యుల అధ్యాత్మ కీర్తనలు మాత్రము రేకులతో మరల సంప్రతించి సాధుపాఠములతో ఇందు ప్రకటింపఁ బడినవి. వివరణకు పీఠిక చూడుఁడు.

నీలశైలమువంటి నీమేనికాంతికిని
నిజమైన తోడవాయ నుయ్యాల
పాలిండ్లు గదలఁగాఁ బయ్యెదలు రాఁపాడ
భామినులు వడినూఁచునుయ్యాల
ఓలి బ్రహ్మాండములు వోరగునో యని భీతి
నొయ్య నొయ్యన వూఁచిరుయ్యాల. ॥అలర॥

కమలకును భూసతికి కదలు కదలుకు మిమ్ముఁ
గాఁగిలింపఁగఁ జేసెనుయ్యాల
అమరాంగనలకు నీహావభావవిలాస
మందంద చూపె నీ వుయ్యాల
కమలాసనాదులకుఁ గన్నులకు పండుగై
గణుతింప నరుదాయ నుయ్యాల
కమనీయమూర్తి వేంకటశైలపతి నీకు
కడు వేడుకై యుండె నుయ్యాల. ॥అలర॥ 1

నాట

ఘోరవిదారణ నారసింహా నీ
వీరూపముతో నెట్లుండితివో. ॥పల్లవి॥

ఉడికెడి కోపపుటూర్పులఁ గొండలు
పొడి పొడియై నభమున కెగయ
బెడిదపు రవమున పిడుగులు దొరుగఁగ
ఎడనెడ నీవపుడెట్లుండితివో. ॥ఘోర॥

కాలానలములు గక్కుచు నయన
జ్వాలల నిప్పులు చల్లుచును

భాలాక్షునుతో బ్రహ్మాండకోట్ల
కేలికవై నీవెట్లుం[1] డితివో. ॥ఘోర॥

గుటగుటరవములు కుత్తికఁ గులుకుచు
గిటగిటఁ బండ్లు గీటుచును
తటతటఁ బెదవులు దవడలు వణఁకఁగ
ఇటువలె నీవపుడెట్లుండితివో. ॥ఘోర॥

గోళ్ళుమెఱుఁగుల కొంకుల పెదపెద
వేళ్ళ దిక్కులు వెదకుచును
నీళ్ళతీగెలు నిగుడఁగ[2] నోరను
చ్చిళ్ళు (?) గమ్మఁగ[3] నెట్లుండితివో. ॥ఘోర॥

హిరణ్యకశిపుని నేపడఁచి భయం
కరరూపముతోఁ గడు మెరసి
తిరువేంకటగిరి దేవుఁడ[4] నీవిఁక
యిరవుకొన్న నాఁడెట్లుండితివో. ॥ఘోర॥ 2

గౌళ

నేల మిన్నునొక్కటైన నీ బంటు ఒక్క
వేలనే యక్షునిఁ దెగవేసెఁగా నీ బంటు. ॥పల్లవి॥

ఉంగరమెగరవేసి యుదధిలోఁ బక్షకుండ
నింగికిఁ జెయి చాఁచె నీ బంటు
చంగున జలధిదాఁటి జంబుమాలి నిలమీఁద
కుంగఁదొక్కి పదములఁ గుమ్మెఁగా నీ బంటు. ॥నేల॥

---

నిడురేకు 11 లోని పాఠములు. 1. నాఁడెట్లుండి. 2. నిగిడి నోర. 3. గారఁగ. 4. డవై యిందిరవుకొంటి. ఇందు 2 3 చరణములు వ్యత్యస్తముగాఁ గలవు. దీని రాగము 'ఆహిరి' గా ఇందున్నది.

వెట్టగా రావణుకొమ్మ విఱుగఁ జేతనే గుద్దె
నిట్టతాఁడువంటి వాఁడు నీ బంటు
దిట్టయై మందులకొండ తేజమున నడురేయి
వట్టవగలుగఁ దెచ్చె బాపురే నీ బంటు ॥నేల॥

అలర నన్నియుఁ జేసి అజునిపట్టానకు
నిలుచున్నాఁడదివో నీ బంటు
బలువేంకటేశ యీ [1] పవన నందనుఁడు
కలిగి లోకములెల్లఁ గాచెఁగా నీ బంటు. ॥నేల॥ 3

దేవగాంధారి

తలఁచినవిన్నియుఁ దనకొరకే - వెలి
దెలియుట తనలోఁ దెలియుటకొరకే ॥పల్లవి॥

ఉదయమందుట భవముడుగుటకొరకే
చదువుట మేలు విచారించుకొరకే
బ్రదుకుట పురుషార్థపరుఁడౌటకొరకే
యెదిరిఁ గనుట తన్నెఱుఁగుటకొరకే. ॥తలఁచి॥

తగులుట విడివడఁ దలఁచుటకొరకే
నొగులుట కర్మమనుభవించుకొరకే
చిగురొట కొమ్మయి చెలఁగుటకొరకే
బెగడుట దురితము పెడఁబాయుకొరకే. ॥తలఁచి॥

ఈవలఁ జేయుట ఆవలికొరకే
ఆవలనుండుట యీవలికొరకే
ఈవల నావల నెనయఁ దిరుగుటెల్ల
శ్రీ వేంకటేశ్వరుఁ జేరుటకొరకే. ॥తలఁచి॥ 4

---

రేకు 2   1. నీపవన.

కన్నడగౌళ

ఎంతసేసినా నెడయకే పోయ
ముంతలోని నీట మునిఁగి లేచుట. ॥పల్లవి॥

ఉట్టిపై చెరలాటమూరఁ బొత్తులకూడు
పట్టుచాలని కొమ్ము (మ్మ?) బవాసనాయకము
వెట్టిమోపరిలాగు వెత్తివోయిన పోక
నట్టెంటివైరంబు నగుఁబాటు బ్రదుకు. ॥ఎంత॥

రాకపోకలచేఁత రాగిన పెనుఁబుండు
నాకులేనివరము వలవని వలపు
ఏకాలము వెంకటేశునికృపలేక
ఆకడీకడ నడయాడెడి నడపు. ॥ఎంత॥ 5

12వ రేకు. బౌళి

పరదేశి పట్టణమున పమగురు నేగురుఁ గూడుక
తరఁగఁగ వరిచెడ నూదర బలిసినయట్లాయ. ॥పల్లవి॥

ఊరేలెడి యతఁడలసతె నూరకయుండఁగ నడుముల
వారలు నిక్కపుఁగర్తలవలె నుండినగతిని
ధీరత చెడి తను జీవుఁడు తెలియఁగనేరక యుండిన[1]
ధారుణిలోపల దొంగల ధర్మాసనమాయ. ॥పరదేశి॥

ఒడలంతంతకుఁ జిక్కఁగ నుబ్బిన రోగము సుఖమున
కెడమీయక నానాఁటికి నేఁచినచందమున
తడఁబడు విజ్ఞానము గతిదప్పఁగ బలువగు పట్నము
కడుఁ జెడఁగా మాలవాడ ఘనమైనట్లాయ. ॥పరదేశి॥

---

౧డు రేకు ౮౬. 1. యుండఁగ.

పొసఁగఁగ నిదిగని యధికుఁడవు పుక్కట[1] కాండ్లనందరిఁ
బనమారిచి[2] మొదలికర్తఁ బాలించినగతిని
పసగల తిరువేంకటగిరిపతి నాదేహపుఁబురి నీ
వసమై వెన్న (న్న ?) కుఁ బండ్లు వచ్చినయట్లాయ. ॥పరదేశి॥ 6

వరాళి

పోరో పోరో యమ్మలాల బొమ్మలాటవారము
యీరసాన మమ్మునిట్టే యేమిసేసేరు. ॥పల్లవి॥

ఊరులేని పొలమేర వోడలు మోచుకొని నేము
తేరదేహమెక్కుకొని తిరిగేము
వారు వీరనుచు వట్టివావులు సేసుక లేని
పేరువెట్టుకొని లోలోఁ బిరువీకులయ్యేము. ॥పోరో॥

బుద్ధిలేని బుద్ధితోడ పొందు సేసుకొని వట్టి
యెద్దుబండికంటి నీఁగేము
నిద్దురలో తెలివంటా నీడలోనియెండంటా
వృద్ధువృద్ధులై లేనివోద్దికనున్నారము. ॥పోరో॥

మాటులేని మాటు దెచ్చి మరఁగు వెట్టుక వట్టి
నేటానమేట్లవలె మీరనేము
గాటమైన తిరువేంకటగిరి నిలయుని
నాటకమే నిజమని నమ్మికనున్నారము. ॥పోరో॥ 7

రామక్రియ

ఎవ్వఁడో కాని యెరఁగరాదు కదు[3]
దవ్వులనే వుండు తలఁపులోనుండు. ॥పల్లవి॥

1. పుక్కటి. 2. మరిచి. నిఘంటువు 43. 3. కడుఁగడు.

ఎడయవు తనరెక్క లెగసి పోలేఁడు
కడు దాఁగుఁగాని దొంగయుఁ గాఁడు
వడిఁ గిందుపడును సేవకుఁడునుఁగాఁడు
వెడఁగుగోళ్ళు వెంచు విటుఁడును గాఁడు. ॥ఎవ్వఁడో॥

మిగులఁ బొట్టివాఁడు మింటికిని బొడవు
జగడాలు తపసివేషములును
మగువకై పోరాడు మరి విరక్తుండును
తగుఁ గాఁపుఁబనులు నెంతయుఁ దెల్లఁదనము. ॥ఎవ్వఁడో॥

తరుణుల వలపించుఁ దగిలి పైకొనఁడు
తురగముఁ దోలు రాతునుఁ గాఁడు
తిరువేంకటాద్రిపైఁ దిరుగు నెప్పుడును
పరమమూర్తియై పరగు నీ ఘనుఁడు. ॥ఎవ్వఁడో॥ 8

శ్రీరాగం

నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు
సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం
స్తుత్యుఁడీ తిరువేంకటాద్రివిభుఁడు. ॥పల్లవి॥

ఏమూర్తి లోకంబులెల్ల నేలెడు నాతఁ
డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడు నాతఁ
డేమూర్తి నిజమోక్షమియ్యఁజాలెడు నాతఁ
డేమూర్తి లోకైకహితుఁడు
ఏమూర్తి నిజమూర్తి యేమూర్తియునుఁగాఁడు
యేమూర్తి త్రైమూర్తులేకమైన యాతఁ

దేమూర్తి సర్వాత్ముఁడేమూర్తి పరమాత్ముఁ
డామూర్తి తిరువేంకటాద్రివిభుఁడు. ॥నిత్యా॥

ఏదేవు దేహమున నిన్నియుఁ జన్మించె
నేదేవు దేహమున [1] నిన్నియు నణంగె నరి
యేదేవు విగ్రహంబీ సకలమింతయును
యేదేవు నేత్రంబులినచంద్రులు
ఏదేవుఁడీజీవులిన్నింటిలోనుండు
నేదేవు చైతన్యమిన్నిటికి నాధార
మేదేవుఁడవ్యక్తుఁడే దేవుఁడద్వంద్వుఁ
డా దేవుఁడీ వెంకటాద్రివిభుఁడు. ॥నిత్యా॥

ఏవేల్పు పాదయుగమిలయు నాకాశంబు
యేవేల్పు పాదకేశాంతంబనంతంబు
యెవేల్పు నిశ్వాసమీ మహామారుతము
యేవేల్పు నిజదాసులీపుణ్యులు
ఏవేల్పు సర్వేశుఁడేవేల్పు పరమేశుఁ
డేవేల్పు భువనైకహిత మనోభావకుఁడు
ఏవేల్పు కడు సూక్ష్మమేవేల్పు కడు ఘనము
ఆవేల్పు తిరువేంకటాద్రి విభుఁడు. ॥నిత్యా॥ 9

దేసాక్షి ([2])

ఎంతైన దొలఁగవై తేదైన నామదికి
వింతచవి సేతుగా విషయబుద్ధి. ॥పల్లవి॥

---

పెద్దరేకు 2. 1. మేనిలో; 2. నిడురేకు 34. ధన్యాసి.

ఎనసి జన్మముల నేచెట్లనుండినఁ బోక
వెనకఁ దిరుగుదువు [1] గా విషయబుద్ధి
అనువైన యనుభవనలనుభవించఁగఁ జేసి [2]
వెనక మఱపింతుగా విషయబుద్ధి. ॥ఎంతైన॥

కెఱలి కాంతలు [3] నేనుఁ గినిసినను బొలయలుక
విఱిచి కలపుదువుగా విషయబుద్ధి
తఱితోడ వావివర్తన దలంచిన నన్ను
వెఱపు దెలుపుదువుగా విషయబుద్ధి. ॥ఎంతైన॥

ఎడలేని యాపదలనెల్ల వొరలిన నన్ను
విడిచి పోవైతిగా విషయబుద్ధి
నడిఁబెట్టి వేంకటస్వామికృపచే నిన్ను
విడిపించవలసెఁగా విషయబుద్ధి. ॥ఎంతైన॥ 10

18-వ రేకు. గుండక్రియ

ఏఁటివిజ్ఞాన [4] మేఁటి చదువు
గూఁటఁబసి వెడలు గతి గురుతు గనలేదు. ॥పల్లవి॥

ఏడు మడుకల చర్మమింతయునుఁ దూంట్లై [5]
గాడఁ బెట్టుచుఁ జీము గారఁగాను
పాడైన యిందులోఁ బ్రదుకుగోరీఁ బ్రాణి [6]
వీడఁ దన్నుక చనెడి వెరవు గనలేదు. ॥ఏటి॥

కడుపునిండిన మహాకష్టంబు నలుగడల
వెడలుచును బెనుమురికి వేయఁగాను

నిడురేకు 34. 1. దిరిగితివి; 2. వించిన నన్ను; 3. కాంతల; 4. నిడురేకు 4. నుజ్ఞాన; 5. దూంట్లను; 6. దేహంబు బ్రదుకఁగోరీఁ గాని.

ఇడుమఁ బొందుచు సుఖంబిందుకే వెదకీని
ఒడలు మోవఁగ జీవుఁడోపననలేఁడు. ॥ఏఁటి॥

ఉదకమయమగు కన్నులురికి యేమైనఁగని
మదవికారము మతికి మరపఁగాను
ఇది యెరిఁగి తిరువేంకటేశుఁగని జీవుఁడా
సదమలానందంబుచవి గానలేఁడు. ॥ఏఁటి॥ 11

ఆహిరి

అతిదుష్టుఁడనే నలసుఁడను
ఇతర వివేకంబిఁక నేది. ॥పల్లవి॥

ఎక్కడ నెన్నిట యేమి సేసితినో
నిక్కపుఁదప్పులు నేరములు
గక్కన నిన్నిట కలిగిన నీవే
దిక్కుగాక మరి దిక్కేది. ॥అతి॥

ఘోరపుఁ బాపము కోట్లసంఖ్యలు
చేరువనివె నాచేసినవి
నీరసునకు నిటు నీకృప నాకిఁక
కూరిమి నాయెడ గుణమేది. ॥అతి॥

ఎఱిఁగి చేసినది యెఱుఁగక చేసిన
కొఱతలు నాయెడఁ గోటులివే
వెఱపుదీర్చి శ్రీవేంకటేశ్వర కావు[1]
మఱవక నాగతి మరి యేది. ॥అతి॥ 12

---

నిడురేకు. 29. 1 వేంకట కావుము.

### కన్నడగౌళ

దైవకృతంబట చేఁతట తనకర్మాధీనంబట
కావలసిన సౌఖ్యంబులు కలుగక మానీనా. ॥పల్లవి॥

ఎక్కడిదుఃఖపరంపర లెక్కడి సంసారంబులు
యెక్కడి జన్మము ప్రాణుల కేలా కలిగినది
యెక్కడి మోహావిడంబన మెక్కడి యాశాబద్ధ (ంధ?) ము
యెక్కడి కెక్కడ నిజమై యివి దానుండీనా. ॥దైవ॥

ఈ కాంతలు నీద్రవ్యములీకన్నుల వెడయాసలు
యీ కోరికె లీతలఁపులు యిట్టే వుండీనా
యీ కాయంబస్థిరమనకీదుర్దశలకు లోనై
యీ కల్మషములఁ బొరలఁగ నివి గడతేరీనా. ॥దైవ॥

దేవశిఖామణి తిరుమలదేవుని కృపగల చిత్తము
పావనమై దురితంబులఁ బొయక మానీనా
ఆవిభుకరుణారసమున నతఁడే తను మన్నించిన
ఆ వేడుకలీవేడుకలాసలు నేసీనా. ॥దైవ॥ 13

### శంకరాభరణం [1]

ఆదిమ పూరుషుఁడచ్యుతుఁడచలుఁడనంతుండమలుఁడు
ఆ దేవుఁడీతఁడే పో హరి వేంకటవిభుఁడు. ॥పల్లవి॥

ఏకార్ణవమై యుదకము లేచిన బ్రహ్మాండములోఁ
బైకొని యుండఁగ నొకవటపత్రము లోపలను
చేకొని పవళించుచు నొకశిశువై వడిఁ దేలాడిన
శ్రీ కాంతుఁడీతఁడే పో శ్రీ వేంకటవిభుఁడు. ॥ఆదిమ॥

1. పెద్దరేకులో దీనిరాగము సామంతము.

అరుదుగ బలిమదనుడడుగఁగ నాకసమంటిన రూపము
సరుగన భూమింతయు నొక చరణంబునఁ గొలిచి
పరగిన పాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన
పరమాత్ముఁడీతఁడే పో పతి వేంకటవిభుఁడు. ॥ఆదిమ॥

క్షీరపయోనిధిలోపల శేషుఁడు పర్యంకముగా
ధారుణియును సిరియునుఁ బాదములొత్తఁగను [1]
చేరువఁ దను బ్రహ్మాదులు సేవింపఁగఁ జెలువొందెడి [2]
నారాయణుఁడితఁడే వున్నత వేంకటవిభుఁడు. ॥ఆదిమ॥ 14

## దేసాళం

అప్పులవారే అందరును
కప్పఁగఁ దిప్పఁగఁ గర్తలు వేరీ. ॥పల్లవి॥

ఎక్కడఁ జూచిన నీ ప్రపంచమునఁ
జిక్కులు సిలుగులుఁ జింతలునే
దిక్కెవ్వరు యీ తీ దీవులలోఁ
దిక్కుమొక్కులకు దేవుఁడె కాక. ॥అప్పు॥

యేది దలంచిన నేకాలంబును [3]
సూదుల మూఁటల సుఖములివి
కాదన నౌనన గడ గనిపించఁగ [4]
పోదికాఁడు తలఁపునఁ గలఁడొకఁడే. ॥అప్పు॥

ఎన్నఁడు వీడీ [5] నెప్పుడు వాసీఁ
బన్నిన తమతమ బంధములు
ఉన్నతి సేయఁగ వొప్పులు నెరపఁగ
వెన్నుఁడు వేంకటవిభుఁడే కలఁడు. [6] ॥అప్పు॥ 15

---

1. నిడురేకు ౧౧. పాదంబులఁగుద్దగను. 2 వెలుఁగొందెడి. 3. ఏదిచూచి నను ఇటువలె సేపో. 4. నౌననఁ గర్తలు వేరీ. 5. ఎన్నడు దీసి. 6. దేకాక.

### శంకరాభరణం

పాపములే సంబళమెపుడు - యీ
యాపదఁబడి నేనలసేనా. ॥పల్లవి॥

ఎన్నిపురాణములెటువలె విన్నా
మన్న మనువు దిమ్మరితనమే
నన్ను నేనె కానఁగ లేనట నా
విన్న వినుకులకు వెఱచేనా. ॥పాప॥

ఎందరు పెద్దలనెట్లఁ గొలిచినా
నిందల నామతి నిలిచీనా
కందువెఱిఁగి చీఁకటికిఁ దొలఁగనట
అందపుఁ బరమిఁక నందేనా. ॥పాప॥

తిరువేంకటగిరిదేవుఁడె పరమని
దరిగని తెలివిఁక దాఁగీనా
తిరముగ నినుఁ జింతించిన చింతే
నిరతము ముక్తికి నిధిగాదా. ॥పాప॥ 16

14-వ రేకు. ముఖారి

ఎందుఁ బొడమితిమో యెఱఁగము - మా
కందువ శ్రీహరి కరుణే కాక. ॥పల్లవి॥

ఏఁటిజన్మమో యెఱఁగము - పర
మేఁటిదో నేమెఱఁగము
గాఁటపు కమలజుఁ గాంచిన యీ
నాఁటకుఁడే మానమ్మిన విభుఁడు, ॥ఎందు॥

ఎవ్వారు వేల్పులో యెఱఁగము - సుర
లెవ్వరో నేమెఱఁగము
రవ్వగు శ్రీసతిరమణుఁడు మా
కవ్వనజోదరుఁడంతరియామి. ॥ఎందు॥

ఇంకానేటిదో యెఱఁగము - యీ
యంకెలబాముల నలయము
జంకెల దనుజులఁ జదిపిన తిరు
వేంకటేశుఁడు మావిడువని విభుఁడు. ॥ఎందు॥ 17

రామక్రియ

వెలయు నిన్నియును వృథా వృథా
తలఁపున శ్రీహరిఁ దడసినను. ॥పల్లవి॥

ఎడయని పుణ్యములెన్నైనా
విడువక చేయుట వృథా వృథా
బడిబడినే శ్రీపతినాత్మలోఁ
దడవక యితరము దడవినను. ॥వెలయు॥

ఎరవుల తపముల నెంతైనా
విరవిర వీఁగుట వృథా వృథా
హరినచ్యుతుఁ బరమాత్ముని
మరిగి తలఁచక మఱచినను. ॥వెలయు॥

దైవముఁ దెలియక తమకమున
నేవేలైన వృథావృథా
శ్రీవేంకటగిరి చెలువునిని
సేవించక మతిఁ జెదరినను. ॥వెలయు॥ 18

నాట

ఇలయును నభమును నేకరూపమై
జలజల గోళ్ళు జళిపించితివి. ॥పల్లవి॥

ఎడసిన నలముక హిరణ్యకశిపునిఁ
దొడికి పట్టి చేతుల బిగిసి
కెడపి తొడలపై గిరిగొన నదుముక
కడుపు చించి కహకహ నవ్వితివి. ॥ఇల॥

రొప్పుల నూర్పుల రొచ్చుల కసరులు
గుప్పుచు లాలలు గురియుచును
కప్పిన బెబ్బులి కసరు హుంకృతుల
దెప్పరపసురల ధృతి [1] యణఁచితివి. ॥ఇల॥

పెళపెళనార్చుచుఁ బెడబొబ్బలిడుచు
థళథళ మెఱువఁగ దంతములు
ఫళఫళ వీరవిభవరసరుధిరము
గుళగుళ దిక్కుల గురియించితివి. ॥ఇల॥

చాతిన శ్రేవుల జన్నిదములతో
వాతెరసింహపు వదనముతో
చేతులు వేయిటఁ జెలఁగి దితిసుతుని
పోతరమణఁపుచు భువి మెఱసితివి. ॥ఇల॥

అహోబలమున నతిరౌద్రముతో
మహామహిమల మలయుచును
తహతహ మెదుపు [2] చుఁ దగు వెంకటపతి
యిహముఁ బరము మాకిపుడొసఁగితివి. ॥ఇల॥ 19

నిడురేకు. 10. 1. జిటమున. 2. లెడపుచు.

### సామంతం

ఇతరములిన్నియు నేమిటికి
మతిచంచలమే మానుట పరము. ||పల్లవి||

ఎక్కడి సురపురమెక్కడి వైభవ
మెక్కడివిన్నియు నేమిటికి
ఇక్కడనే పరహితమును బుణ్యము
గక్కునఁ జేయఁగఁ గలదిహపరము. ||ఇతర||

ఎవ్వరు చుట్టములెవ్వరు బంధువు
లెవ్వారిందరును నేమిటికి
రవ్వగు లక్ష్మీరమణునిఁ దలఁపుచు
యివ్వలఁ దా సుఖియించుట పరము. ||ఇతర||

ఎందరు దైవములెందరు వేల్పులు
యెందరిందరును నేమిటికి
కందువెఱఁగి వేంకటగిరిరమణుని
చిందులేక కొలిచినదిహపరము. ||ఇతర|| 20

### భూపాళం

పారితెంచి మొత్తివేసి పారవెళ్ళితిని (వి?)
నీరసపుటెద్దవైన నీకు నేముద్దా. ||పల్లవి||

ఎద్దవై నన్నేల తొక్కి యేమిగట్టుకొంటివి
ఒద్దనైన వచ్చి పూరకుండవైతివి
కొద్దిక భూమెత్తిన యీయెద్దుకు నేముద్దుగాక
సద్దురచిత్తముతోడి నీకు నే ముద్దా. ||పారి||

కాఁపురపుఁ బాపపు నాకర్మమునుద్ధరించి
వీఁపు వగులఁదాఁకి విజ్ఞవీఁగితి
ఆఁపఁగ నెద్దేమెఱుఁగు నడుకులచవి మూట
మోపరివి నీకు నా ముదము ముద్దా. ॥పారి॥

మచ్చరించి అల్లనాఁడు మాలవాఁడు కాలఁదన్ని
తెచ్చినయప్పటి ధర్మదేవతవు
మెచ్చరించి తిరువేంకటేశు దాసుఁడని నన్ను
మెచ్చి తాఁకితివి నామేను నీకు ముద్దా. ॥పారి॥ 21

## శ్రీరాగం

ఎందాఁక నేచిత్తమేతలఁపో
ముందుముందు వేసారితి ములిగి వేసరితి. ॥పల్లవి॥

ఏమిసేతు నేడఁజొత్తు నేమిని బోధింతును
నామాఁట వినదిదే నావిహారము
ఏమరినాఁ దలఁపించీ నేమైనా గడించీ
సాముసేసి వేసారితి జడిసి వేసారితి. ॥ఎందాఁక॥

ఏడ చుట్టాలేడ బంధులేడ పొందులెవ్వరూ
తోడై నవారుఁగారు దొంగలుఁగారు
కూడుచీరగానిచోట్లై కొరగానిపాట్లై
వాడివాడి వేసారితి వదలి వేసారితి. ॥ఎందాఁక॥

ఎందునున్నాఁడేమి సేసీ నెక్కడ భోగించీని
విందులకు విందయిన వెంకటేశుఁడు
ఇందరిహృదయములో నిరవై యున్నాఁడతఁడు
పొంది నన్నుఁ గాచుఁగాక చెనకి వేసారితి. ॥ఎందాఁక॥ 22

15-వ రేకు. ఆహిరి

ఊరికిఁ బోయెడి వోతఁడ కడు
చేరువ తెరువేఁగి చెలఁగుమీ. ||పల్లవి||

ఎడమ తెరువువంక కేఁగిన దొంగలు
తొడిఁబడఁ గోకలు దోఁచేరు
కుడితెరువున కేఁగి కొట్టువడక మంచి
నడిమితెరువున నె నడవుమీ. ||ఊరికి||

అడ్డపుఁదెరువుల నటునిటు చుట్టాలు
వెడ్డువెట్టుచు నిన్ను వేఁచేరు
గొడ్డేరే చిన్న దిడ్డితెరువు వోక
దొడ్డతెరువువంక తొలఁగుమీ. ||ఊరికి||

కొండతెరువు కేఁగి కొంచెపుసుఖముల
బండై తిరుగుచు బడలేవు
అండనుండెడి పరమాత్ముని తిరుమల
కొండతెరువు తేఁకువనేఁగుమీ. ||ఊరికి|| 23

ఆహిరి

అక్కడ నా పాట్లువడి యిక్కడ నీ పాటుపడి
కుక్కనోట కళాసమై కొల్లఁబోయ బదుకు. ||పల్లవి||

ఎండచేత నీడచేత నెల్లనాఁడు నిట్లానే
బండుబండై యొందుఁ గడపల గానక
ఉండగిలి నరకాల నుడుకఁ బోయెదమింక
వండఁదరిగిన కూరవలె నాయ బదుకు. ||అక్కడ||

పంచమహా పాతకాల బారిఁబడి భవములఁ
దెంచి తెంచి ముడివేయఁ దీదీపులై
పొంచిన యాసలవెంటఁ బొరలఁబోయెదమింక
దంచనున్న రోలిపిండితలఁపాయ బదుకు. ॥అక్కడ॥

ఈదచేత వానచేత నెల్లనాఁడుఁ బాయని
బాదచేత మేలెల్ల బట్టబయలై
గాదిలివేంకటపతిఁ గనఁగఁబోయెదమింక
బీదగరచిన బూరె ప్రియమాయ బ్రదుకు. ॥అక్కడ॥ 24

### సామంతం

నాఁటికి నాఁడే నా చదువు
మాటలాడుచును మఱచేటి చదువు. ॥పల్లవి॥

ఎనయ నీతని నెఱుఁగుటకే పో
వెనకవారు చదివిన చదువు
మనసున నీతని మఱచుటకే పో
పనివడి యిప్పటి ప్రౌఢల చదువు. ॥నాఁటి॥

తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుతఁ గృతయుగాదుల చదువు
కలిగిన యీతనిఁ గాదననే పో
కలియుగంబులోఁ గలిగిన చదువు. ॥నాఁటి॥

పరమని వెంకటపతిఁ గనుటకె పో
దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరుల నితని మఱచెడి కొరకే పో
విరసపు జీవుల విద్యల చదువు. ॥నాఁటి॥ 25

నాట

ఇటు గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁ బగిలె. ॥పల్లవి॥

ఎగసిన గరుడని ఏపున ధాయని
జిగిదొలఁక చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమసంఘములు
గగనము జగములు గడగడ వడఁకె. ॥ఇటు॥

బిరుసుగ గరుడని పేరెము దోలుచు
వెరసి నీవు గోపించినను
సరుస నఖిలములు జర్జరితములై
తిరుపున నలుగడ దిరదిరఁ దిరిగె. ॥ఇటు॥

పల్లించిన నీ పసిఁడి గరుడనిని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝల్లనె రాక్షససమితి నీ మహిమ
వెల్లి మునుఁగుదురు వెంకటరమణా. ॥ఇటు॥ 26

నాదరామక్రియ

ఈసురలీమునులీ చరాచరములు
ఈసకలమంతయు నిదియెవ్వరు. ॥పల్లవి॥

ఎన్నికనామములిటు నీవై యుండఁగ
ఇన్నినామములవారిది యెవ్వరు
ఉన్నచోటనే నీవుండుచుండఁగ మరి
యిన్నిటాఁ దిరుగువారిది యెవ్వరు. ॥ఈసుర॥

ఒక్క-రూపై నీవు వుండుచుండఁగ మరి
తక్కిన యీ రూపములు తామెవ్వరు
ఇక్కడ నక్కడ నీవు యిటు ఆత్మలలోనుండ
మక్కువనుండువారు మరియెవ్వరు. ॥ఈసుర॥

శ్రీ వేంకటాద్రిపై చెలఁగి నీ వుండఁగా
దైవంబులనువారు తామెవ్వరు
కావలసినచోట కలిగి నీవుండఁగా
ఈవిశ్వపరిపూర్ణులిది యెవ్వరు. ॥ఈసుర॥ 27

## లలిత

తాప లేక మేడలెక్కఁ దలఁచేము
యేపు లేని చిత్తముతో యీహీహీ నేము. ॥పల్లవి॥

ఎఱుక మాలినబుద్ధి యె (నె?) వ్వరైనాఁ బతులంటా
తెఱఁగెఱఁగక వీధిఁ దిరిగేము
పఱచైన జవరాలు పరులెల్లా మగలంటా
ఒఱపు నిలిపినట్లోహోహో నేము. ॥తాప॥

ఇందరును హితులంటా యెందైనా సుఖమంటా
పొందలేని బాధఁ బొరలేము
మందమతివాఁడు యెండమావులు చెరువులంటా
అందునిందుఁ దిరిగినట్లాహాహా నేము. ॥తాప॥

మేటి వెంకటేశుఁ బాసి మీఁద మీఁదఁ జవులంటా
నాటకపు తెరువుల నడిచేము
గూటిలో దవ్వులవాఁడు కొండలెల్ల నునుపంటా
యేటవెట్టి యేఁగినట్లీహీహీ నేము. ॥తాప॥ 28

16-వ రేకు. శ్రీరాగం

ఏది చూచినఁ దమకు యిన్నియును నిటువలెనె
వేదు విడిచినకూడదు వెదకినను లేదు. ॥పల్లవి॥

ఏకాంతసౌఖ్యంబులెక్కడిది ప్రాణులకు
పైకొన్నదుఃఖముల పాలుపడెఁ (డి?) గాక
యేకముగు పుణ్యంబులేడఁ గలవిందరికి
కైకొన్నదురితములు కలపాటి గాక. ॥ఏది॥

హితవైన మమకారమెందుఁగలదిందరికి
ప్రతిలేని విరహతాపముకొలఁది గాక
మతిలోని వేడుకలు మరియేవి మనుజులకు
జితమైన దైవమిచ్చినపాటి గాక. ॥ఏది॥

ఇరవైన దైవకృప యేల దొరకునుఁ దమకు
పరమైన కర్మంబు పరిపాటి గాక
యెరవైన పెనుబంధమేల వీడెడు నాత్మఁ
దిరువేంకటేశుకృప తిరమైనఁ గాఁక. ॥ఏది॥ 29

శాళి

చూడరెవ్వరు దీని సోద్యంబు పరికించి
చూడఁజూడఁగఁ గాని సుఖమెఱుఁగరాదు. ॥పల్లవి॥

ఎడతెగని మమత వేయుఁగరాని పెనుమోపు
కడలేనియాస చీఁకటిదవ్వుకొనుట
నిడివైన కనుచూపు నీడనుండిన యెండ
విడిచెడని తమకంబు వట్టితాపంబు. ॥చూడ॥

బుద్ధిమానినచింత పోనియూరికిఁ దెరువు
పొద్దువోవని వలపు పొట్టపొంకంబు
ఎద్దుబట్టిన సివంబెఱుక మాలిన ప్రియము
ఒద్దిక విహారంబులుబ్బుఁగవణంబు. ॥చూడ॥

తీపులోపలి తీపు తిరువేంకటేశ్వరుని
చూపు తనుఁబొడగనని చూపు లోచూపు
ఆపదలు వాయు నెయ్యపుఁదలఁపులీ (లో?) తలఁపు
రూపైన రుచిలోని రుచి వివేకంబు. ॥చూడ॥ 30

నాట

ఎవ్వరెవ్వరివాఁడో యీ జీవుఁడు - చూడ
నెవ్వరికి నేమౌనో యీ జీవుఁడు. ॥పల్లవి॥

ఎందరికిఁ గొడుకు గాఁడీ జీవుఁడు - వెనక
కెందరికిఁ దోఁబుట్టఁడీ జీవుఁడు
ఎందరిని భ్రమయించఁడీ జీవుఁడు - దుఃఖ
మెందరికిఁ గావింపఁడీ జీవుఁడు. ॥ఎవ్వ॥

ఎక్కడెక్కడఁ దిరుగఁడీ జీవుఁడు - వెనక
కెక్కడో తనజన్మమీ జీవుఁడు
ఎక్కడిచుట్టము తనకు నీ జీవుఁడు - యెప్పు
డెక్కడికి నేఁగునో యీ జీవుఁడు. ॥ఎవ్వ॥

ఎన్నఁడును చేటులేనీ జీవుఁడు - వెనక
కెన్ని తనువులు మోవఁడీ జీవుఁడు
ఎన్నఁగల తిరువెంకటేశుమాయలఁ గగిలి
యెన్నిపదవులఁ బొందఁడీ జీవుఁడు. ॥ఎవ్వ॥ 31

సామంతం

ఎంత చేసిన తనకేది తుద
చింత శ్రీహరిపైఁ జిక్కితే చాలు. ॥పల్లవి॥

ఎడపక పుణ్యాలెన్ని చేసినాఁ
గడమే కాకిఁక గడయేది
తడఁబడ హరియే దైవమనుచు మది
విడువక వుండిన వెరవే చాలు. ॥ఎంత॥

ఎన్ని తపములివి యెట్లఁ జేసినా
అన్నువకధికము కలవేది
వన్నెలఁ గలఁగక వనజాక్షునిపై
నున్నచిత్తమది వొక్కటె చాలు. ॥ఎంత॥

ఇందరివాదములెట్ల గెలిచినా
కందే కాకిఁక గరిమేది
ఇందరినేలిన యీ వేంకటపతి
పొందగు మహిమల పొడవే చాలు. ॥ఎంత॥ 32

(పుణ్యాంగవరాళి) నారణి ఘంటాబాపు

ఏణనయనల చూపులెంత సొబగై యుండు
ప్రాణసంకటములగు పనులు నట్లుండు. ॥పల్లవి॥

ఎడలేని పరితాపమేరీతిఁ దానుండు
అడియాసకోరికెలు నటువలెనెయుండు
కడలేని దుఃఖసంగతి యెట్లఁ దానుండు
అడరు సంసారంబు నట్లనే వుండు. ॥ఏణ॥

చింతాపరంపరలఁ జిత్తమది యెట్లుండు
వంతఁదొలఁగని మోహావశమునట్లుండు
మంతనపుఁ బనులపయి మనసు మరి యెట్లుండు
కంతుశరమార్గముల గతియట్లనుండు. ॥ఏణ॥

దేవుఁడొక్కఁడె యనెడి తెలివి దనకెట్లుండు
శ్రీ వేంకటేశుకృపచేఁతలట్లుండు
భావగోచరమైన పరిణతది యెట్లుండు
కైవల్యసౌఖ్యసంగతులు నట్లుండు. ॥ఏణ॥ 33

## గీతం - నాట

ఏదైవము శ్రీపాదన్న (న?) ఖమునఁ బుట్టినగంగ
త్రిలోకపావనము చేయను త్రిపథగామిని యాయెను
ఏదైవము నాభినలినంబున జనియించిన అజుండు
అఖిలాండంబులు సృజియింప నధిపతి యాయెను
ఏదైవంబు వురస్థలంబు తనకును మందిరమైన యిందిర
మాతయయ్యె యీ జగంబులకెల్లను
ఏదైవము అనలోకనమింద్రాది దివిజగణంబుల
కెల్లప్పుడును సుఖంబులాపాదించును
ఏదైవము దేహవస్తు (వస్తు) వని అనిమిషులందరుఁ గూడి
శ్రీ నారాయణదేవుండని నమ్మియుండుదురు
ఆదేవుఁడే సిరులకనంతవరదుఁడు తిరువేంకట
గిరినాథుఁడుభయవిభూతినాథుఁడే నానాథుఁడు. ॥ఏదై॥ 34

17-వ రేకు. అహిరి

ఏఁటికిఁ దలఁకెదరిందరును
గాఁటపు సిరులివి కానరో ప్రజలు. ॥పల్లవి॥

ఎండలఁ బొరలక యేచిన చలిలో
నుండక చరిలోనుడుకక
అండనున్న హరినాత్మఁ దలఁచిన
పండిన పసిఁడే బ్రతుకరో ప్రజలు. ॥ఏఁటికి॥

అడవులనలయక ఆకునలముఁ దిని
కడుపులు గాలఁగఁ గరఁగక
బడిబడి లక్ష్మీపతికిదాసులై
పొడవగు పదవులఁ బొందరో ప్రజలు. ॥ఏఁటికి॥

పొక్కటికాళ్ళ పుండ్లు రేఁగఁగ
దిక్కులనంతటఁ దిరుగక
గక్కన తిరువేంకటపతిఁ గని
వొక్కమనసుతో నుండరో ప్రజలు. ॥ఏఁటికి॥ 35

బౌళి

ఏది తుద దీనికేది మొదలు
పాదుకొను హరిమాయఁ బరగు జీవునికి. ॥పల్లవి॥

ఎన్నిబాధలు తనకు నెన్నిలంపటములు
యెన్ని వేదనలు మరి యెన్నిదుఃఖములు
ఎన్నిపరితాపంబు లెన్ని తలపోఁతలు
ఎన్ని చూచిన మరియు నెన్నైనఁ గలవు. ॥ఏది॥

ఎన్ని కొలువులు దనకు నెన్ని యనుచరణలు
ఎన్ని యాసలు మరియు నెన్ని మోహములు
ఎన్ని గర్వములు దనకెన్ని దైన్యంబులివి
ఇన్నియును దలఁప మరి యెన్నైనఁ గలవు. ॥పది॥

ఎన్నిటికిఁ జింతించు నెన్నిటికి హర్షించు
నెన్నిటికి నాశించు నెన్నిటికిఁ దిరుగు
ఇన్నియును దిరువేంకటేశులీలలు గాఁగ
నెన్ని చూచినను దానెవ్వఁడును గాఁడు. ॥పది॥ 36

సామంతం

చక్కఁదనముల వారసతులాల
యిక్కువతెక్కువల మీరేమి సేసెదరిఁకను[1]. ॥పల్లవి॥

ఒప్పుగా నరకము మాకుంబలిచ్చి మనమెల్ల
కప్పము గొంటిరిగా యంగనలార
అప్పుడే గోవిందునికి ఆహివెట్టితిఁ జిత్తము
ఇప్పుడు యెమ్మెల మీరేమి సేసే(?) రిఁకను[2]. ॥చక్క॥

పంచమహాపాతకాల బారిఁదోసి మాసిగ్గులు
లంచము గొంటిరిగా నెలఁతలార
వంచనతోఁదుత హరివారమైతిమిఁక మీ
యించుక గుట్టుల(లు?) మీరెందు [3] చొచ్చేరిఁకను. ॥చక్క॥

దొంగిలి మాగుట్టులెల్లా దోవవేసి మరుబారి
భంగపెట్టితిరిగా వో భామలార
చెంగలించి వేంకటేశు సేవకుఁ జొచ్చితి మీ
యెంగిలిమోవులును మీరేడఁ బడేరిఁకను. ॥చక్క॥ 37

నిడురేకు 26. 1. యెక్కువ తెక్కువలు మీరు యెందుఁబోయేరిఁకను.
2. యెమ్మెలు మీరు సేడఁ జొచ్చేరిఁకను ; 3. గుట్టును మీరు యెందు.

బౌళి

ఎట్టుచేసినఁ జేసె నేమినేయఁగ వచ్చు
చుట్టపువిరోధంబు సూనాస్త్రుచెలిమి. ॥పల్లవి॥

ఒడలిలోపలిరోగమొనరఁ బరితాపంబు
కడుపులోపలిపుండు కడలేని యాస
తడిపాఁత మెడగోఁత తలఁపు విషయాసక్తి
గుడిమీఁది తరువు అలకులము (అలుగులము?)ప్రాణులకు ॥ఎట్టు॥

నీడలోపలయెండ నెలకొన్న బంధంబు
గోడపై సున్నంబు కొదలేని మెలుక
పాడూరిలో బ్రదుకు పాపకర్మపుబుద్ధి
తాడుపై తపసు తమధనము ప్రాణులకు. ॥ఎట్టు॥

మంటఁ జేసినబొమ్మమనికి సంసారంబు
రెంటికిని గాని పీరిడికొలువు బ్రదుకు
ఇంటివేలుపు వేంకటేశుఁ గొలువక పరుల
వెంటఁ దిరుగుట వోడ విడిచి వదరిడుట. ॥ఎట్టు॥ 38

వరాళి

తలఁపు కామాతురత్వము మీఁద నలవడిన
నిల నెట్టివారైన నేలాగు గారు. ॥పల్లవి॥

ఓలి నిరువుర సతులనాలింగనము సేయ
లోలుఁడటుగాన నాలుగుచేతులాయ
వేలసంఖ్యల రతుల వేడుకల రమియింపఁ
బాలుపడెఁగాన రూపములు పెక్కాయ. ॥తలఁపు॥

పొలయలుకకూటముల భోగి దానటుగాన
మలసి యొక్కొకవేళ మారుమొగమాయ
లలితలావణ్యలీలావిగ్రహము గాన
కొలఁదివెట్టఁగ రాని గోళ్ళు నిడుపాయ. ॥తలఁపు॥

చిరభోగసౌఖ్యములఁ జెందననుభవిగాన
తిరువేంకటాచలాధీశ్వరుండాయ
పరగ సంసారసంపదకు బద్ధుఁడు గాన
అరుదుగా సకలాంతరాత్మకుండాయ. ॥తలఁపు॥ 39

లలిత

ఎక్కడి దురవస్థలేఁటి దేహము లోనఁ
జిక్కి జీవుఁడు మోక్షసిరిఁ జెందలేఁడు. ॥పల్లవి॥

ఒడలు మాంసపుపూరకెముకపూఁటయిన మీఁదు
గడుగకున్నఁ గోరగాదు
కడలేని మలమూత్రగర్హితమిది లోను
గడుగరాదు యెంతగడిగినఁ బోదు. ॥ఎక్కడి॥

అలర చిత్తము చూడ నతిచంచలము దీనఁ
గలసిన పెనుగాలి గనము
మెలుపు లేని చిచ్చు మీఁద మిక్కిలి గొంత
నిలుపు లేదు పట్టి నిలుపఁగ రాదు. ॥ఎక్కడి॥

తిరువేంకటాచలాధిపుఁడు నిత్యానంద
కరుఁడు జీవునకు రక్షకుఁడు
కరుణించి యొకవేళఁ గాచినఁగాని మేను
చొరక మానెడు బుద్ధి చోఁక జివ్వారికి. ॥ఎక్కడి॥ 40

18-వ రేకు సాళంగం [1]

పుట్టుమాలిన బరుబోఁకివి నన్నుఁ
దిట్టవదేమోసి దిమ్మరిమాయ. ॥పల్లవి॥

ఒరపులాడకు పోవె వోసి మాయ నాతోఁ
దొరలేవు నిను ముట్ట దోసము
వెరపించేవేమోసి విష్ణుభక్తినంటా
నెరఁగనటే నీ యేతులిన్నియును. ॥పుట్టు॥

ఉదుటు చెల్లదు పోపో వోసి మాయ నా
యెదుర మాటలు నీకు నికనేలే
వదరేవు హరిభక్తివనిత తెలియరు నే
నిదురవుచ్చినవారు నీవు నాకెదుగా. ॥పుట్టు॥

ఒల్లవటే జీవమోసి మాయ నీ
కల్లలిన్నియును లోకమెఱుఁగును
నల్లని విభుని మన్ననభక్తినంటాఁ
జెల్లఁబో పాపపుచేఁదు మేయకువే. ॥పుట్టు॥

ఊరకుండవుగా ఓసి మాయ నిన్నుఁ
చేరఁ బిలువము గుంపెనలాడేవు
నారాయణభక్తినాతి నన్నును నిన్నుఁ
గోరి యిందరు నెఱుఁగుదురేల పోవె. ॥పుట్టు॥

ఓవవు నినుఁజూచి వోసి మాయ నా
తోవ వచ్చినను నొత్తువు నీవు
శ్రీవేంకటగిరిదేవుని భక్తి నా
పావళికే నిన్ను నలమిరిందరును. ॥పుట్టు॥ 41

నిడురేకు 82. 1. సాళంగనాట.

### గుజ్జరి

నాపాలిఘన నిధానమవు నీవే నన్ను
నీపాల నిడుకొంటి నీవే నీవే. ||పల్లవి||

వోలిసి నన్నేలే దేవుఁడవు నీవే యెందుఁ
దోలఁగని నిజబంధుఁడవు నీవే
పలుసుఖమిచ్చే సంపదవు నీవే యిట్టె
వెలయ నిన్నియును నీవే నీవే. ||నాపాలి||

పొదిగి పాయని యాప్తుఁడవు నీవే నాకు
నదనఁ దోడగు దేహమవు నీవే
మదసు వాపెడి నా మతియు నీవే నాకు
వెదకనన్నియును నీవే నీవే. ||నాపాలి||

ఇంకా లోకములకు నెప్పుడు [1]నీవే యీ
పంకజభవాది దేవపతివి నీవే
అంకిలి వాపఁగ నంతకు నీవే తిరు
వేంకటేశ్వరుఁడవు నీవే నీవే. ||నాపాలి|| 42

### వరాళి

పుడమి నిందరిఁ బట్టె భూతము కడు [2]
బొడవైన నల్లనిభూతము. ||పల్లవి||

కినిసి వోడ మిఁగెడి భూతము
పునుక వీఁపు పెద్దభూతము
కనలి కవియు చీఁకటిభూతము
పొనుగు సోమపు మోము భూతము. ||పుడమి||

నిడురేకు 50. 1. నెక్కుడు; 2. వాఁడే.

చేటకాళ్ళ మించిన భూతము
పోటు దారల పెద్దభూతము
గాటపు జడల బింకపు భూతము
జూటరి నల్లముసుఁగు భూతము. ॥పుడమి॥

కెలసి బిత్తలే తిరిగేటి భూతము
పొలుపుదాంట్ల పెద్దభూతము
బలుపు వేంకటగిరి పయిభూతము
పులుగు మీఁది మహాభూతము. ॥పుడమి॥ 43

సామంతం

చాలదా మా జన్మము నీ
పాలింటివారమై బ్రతుకఁగఁ గలిగె. ॥పల్లవి॥

కమలాసనాదులు గానని నీపై
మమకారము సేయ మార్గము గలిగె
అమరేంద్రాదులకందరాని నీ
కొమరైన నామము కొనియాడఁ గలిగె. ॥చాలదా॥

సనకాదులును గానఁ జాలని నిన్నుఁ
తనివోవ మతిలోనఁ దలపోయఁ గలిగె
ఘనమునీంద్రులకు నగమ్యమై వున్న
నిను సంతతమును వర్ణింపఁగలిగె. ॥చాలదా॥

పరమమై దివ్యమై పరఁగిన నీ
యిరవిట్టిదని మాకు నెఱుఁగంగఁ గలిగె
తిరువేంకటాచలాధిప నిన్ను యీ
ధరమీఁదఁ బలుమారు దరిసింపఁ గలిగె. ॥చాలదా॥ 44

ఆహిరి

దిక్కెందరికినైన దేవుఁడు కడుఁ
దెక్కలికాఁడైన దేవుఁడు. ॥పల్లవి॥

కొత్తపెండ్లికూఁతుఁ గోరి చూడఁబోయి
యెత్తి తేరిమీఁద నిడుకొని
నెత్తికన్ను మానిన వాని పెండ్లికి
దెత్తిగొన్నయట్టి దేవుఁడు. ॥దిక్కెం॥

గొప్పయిన పెద్దకొండమీఁదనుండి
దెప్పరమ్ముగా దిగఁబడి
కప్పి రెండు దునుకలు గూడినవాని
తిప్పఁదీరులాడే దేవుఁడు. ॥దిక్కెం॥

బెరసి మేనమామబిడ్డకునై పోయి
నిరతంపుబీరాలు నెరపుచు
ఇరవైన మాయపుటెద్దులఁ బొరిగొన్న
తిరువేంకటగిరి దేవుఁడు. ॥దిక్కెం॥ 45

శ్రీరాగం

ఏమిగలదిందు నెంతగాలంబైన [1]
పామరపుభోగమాపదవంటిదరయ. ॥పల్లవి॥

కొండవంటిది యాస గోడ[2]వంటిది తగులు
బెండువంటిది లోనిపెద్దతనము
పుండువంటిది మేను పోలించినను మేడి
పండువంటిది సరసభావమింతయును. ॥ఏమి॥

నిడురేకు 49. 1. లముపడిన. 2. గోడవ.

కంచువంటిది మనసు కలిమిగలదింతయును
మంచువంటిది రతి భ్రమతవంటిది
మించువంటిది రూపు మేలింతయును ముట్టు
పెంచువంటిది దీని ప్రియమేమి భ్రాంతి. ॥ఏమి

ఆఁకవంటిది జన్మమడవివంటిది చింత
పాఁకువంటిది కర్మబంధమెల్ల
యేఁకటను దిరువేంకటేశుఁ దలఁచిన కోర్కి-
కాఁక (?) సౌఖ్యములున్న గనివంటిదరయ. ॥ఏమి॥ 46

19-వ రేకు ఆహిరి

ఎన్నాళ్ళదాఁకఁ దానిట్టివుండుట బుద్ధి
కన్నపోవుట పూర్వకర్మశేషం.[1] ॥పల్లవి॥

కలకాలమెల్ల దుఃఖమెకాఁగఁ బ్రాణికిని
వలదా సుఖము కొంతవడియైనను
కలుషబుద్ధులఁ బ్రజ్ఞగలదింతయును మంటఁ
గలసిపోవుటె పూర్వకర్మశేషం. ॥ఎన్నా॥

జాలి తొల్లియుఁ బడ్డ జాలె నేఁడునుగాక
మేలు వద్దా యేమిటనైనను
తాలిమి లో హరిఁ దలఁచక యెఱుకెల్ల
గాలిఁబోవుట పూర్వకర్మశేషం. ॥ఎన్నా॥

తరగని నరకబాధయు నేఁడును గాక
దరిచేరవలదా యింతటనైనను
తిరువేంకటాద్రిపై దేవునిఁ గొలువక
గరివడే (?) భవమెల్ల కర్మశేషం. ॥ఎన్నా॥ 47

---

నిమురేకు 38. 1. అంతటను 'కర్మశేషము' అనియే. కాని యది లయ విరుద్ధముగాఁ దోఁచెడిని.

గుజ్జరి [1]

అప్పులేని సంసారమైన పాటే చాలు
తప్పులేని జీతమొక్క తారమైనఁ జాలు. ॥పల్లవి॥

కంతలేని గుడిసొక్క గంపంతయినఁ జాలు
చింతలేని యంబలొక్క చేరెఁడే చాలు
జంతగాని తరుణి యేజాతైన నదె చాలు
వింతలేని సంపదొక్క వీసమే చాలు. ॥అప్పు॥

తిట్టులేని బ్రదుకొక్క దినమైన నదె చాలు
ముట్టులేని కూడొక్క ముద్దెఁడే చాలు
గుట్టుచెడి మనుకంటె కొంచెపునేమైనఁ జాలు
వట్టిజాలిఁ బడుకంటె వచ్చినంతే చాలు. ॥అప్పు॥

లంపటపడని మేలు లవలేశమే చాలు
రొంపికంబమౌకంటె రోయుటే చాలు
రంపపుఁ గోరికకంటె రతి వేంకటపతి
పంపున నాతనిఁ జేరే భవమే చాలు. ॥అప్పు॥ 48

శ్రీరాగం [2]

కూడు వండుట గంజికొరకా - తనకు
వేడుకలు గల సుఖము వెదకుటకుఁ గాక. ॥పల్లవి॥

కుప్ప నురుచుట [3] కసవుకొరకా - తనువు
గొప్పయవుటిది మదముకొరకా
ఒప్పయిన వేడుకల నొరసి - మనసు
నెప్పునకు రాఁదివియ నేరవలెఁ గాక. ॥కూడు॥

1 దేసాళం. నిడుఁదకు 18. 2. దేసాళం. 3. వేయుట.

కొలుచు దంచుట పొట్టకొరకా - తాఁ
గులజుఁడై మూఢుఁడౌ[1] కొరకా
తలపోసి యిన్నిటఁ దగిలి - మీఁదు
తెలిసి సుఖదుఃఖములఁ దెలియవలె[2] గాక. ॥కూడు॥

కొండ దవ్వుట యెలుకకొరకా - తాఁ
గొండ యెక్కుట దిగుటకొరకా
కొండ(ల) [3] కోనేటిపతిఁ గొలిచి - తనకు
నిండి - నాపదలెల్ల నీఁగవలెఁ గాక. ॥కూడు॥ 49

శుద్ధవసంతం

ఘనుఁడీతఁడొకఁడు గలుగఁగఁ గదా వేదములు
జనములుఁ గులములాచారములుఁ గలిగె. ॥పల్లవి॥

కలుషభంజనుఁడితఁడు గలుగఁగఁ గదా జగతిఁ
గలిగె నిందరిజన్మగతుల నెలవు
మలసి యితఁడొకఁడు వొడమఁగఁ గదా యిందరికి
నిలువ నీడలు గలిగె నిధినిధానములై. ॥ఘను॥

కమలాక్షుఁడితఁడు గలుగఁగఁ గదా దేవతలు
గమిగూడిరిందరును గండిగడచి
ప్రమదమున నితఁడు నిలుపఁగఁ గదా సస్యములు
అమర ఫలియించె లోకానందమగుచు. ॥ఘను॥

గరిమె వేంకటవిభుఁడొకఁడు గలుగఁగాఁ గదా
ధరయు నభమును రసాతలము గలిగె
పరమాత్ముఁడితఁడు లోపల గలుగఁగాఁ గదా
అరిది చవులును హితవులన్నియును గలిగె. ॥ఘను॥ 50

---

1. కులజుఁడౌటది ఫలముకొరకా. 2. సుఖదుఃఖవ ; తెలుపుగవలెక.
3. కొండలకోనేటి.

### భైరవి

చూడుఁడిందరికి సులభుఁడు హరి
తోడునీడయగు దొరముని యితఁడు. ॥పల్లవి॥

కైవల్యమునకుఁ గనకపుతాపల
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావనమొకరూపంబై విరజకు
నావై [1] యున్నాఁడిదె యితఁడు. ॥చూడు॥

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన
దీపమై [2] జగతికిఁ దేజమై
పాపాలడఁపఁగ భయపయోధులకుఁ
దేపై [3] యున్నాఁడదే యితఁడు. ॥చూడు॥

కరుణానిధి రంగపతికిఁ గాంచీ
వరునకు వేంకటగిరిపతికి
నిరతి నహోబలనృకేసరికిఁ ద
త్పరుఁడగు శఠగోప(ం) ముని యితఁడు. ॥చూడు॥ 51

### సామంతం

కలలోని సుఖమే [4] కలియుగమా - వెన్న
కలిలో నెక్కడిదె కలియుగమా. ॥పల్లవి॥
కడిగడిగండమై కాలము గడపేవు
కడుఁగఁ గడుగ కొంపి కలియుగమా

రేకు 88. 1. భువినున్నాఁడిదె. 2. ంబై జగతికిఁ దొడవై. 3. జగములఁ దిరిగి వితఁడు. (యచ్చానాధికారముతో యుక్తములు.) 4. సుఖమై

బడలికె వాపవు పరమేదో చూపవు
గడిచీటియును నీవు కలియుగమా. ॥కల॥

కరపేవు కఱతలే మఱపేవు మమతలే
కరకఱ విడువవు కలియుగమా
తెరచీర మఱఁగింతే తెరువేల మూసేవు
గరుసేల దాఁటేవో గలియుగమా. ॥కల॥

కానిదె మెచ్చేవు కపటాలే యిచ్చేవు
కానీలే కానీలే కలియుగమా
పై నిదే వేంకటపతిదాసులుండఁగ
కానవా నీవిదేమి కలియుగమా. ॥కల॥ 52

20_వ రేకు. ఆహిరి

తోరణములే దోవెల్లా
మూరట బారట ముంచిన లతల. ॥పల్లవి॥

కూరిమి మటములు గోపురంబులును
తేరుపడగలే తెరువెల్లా
కోరినపండ్లు గురిసేటి తరువులు
తోరములైన వెదురుజొంపములు. ॥తోర॥

ఆటలు దిరువులు నందపుటురుపులు
పాటలు వనవై భవమెల్లా
కూటువ నెమళ్ళ కోవిలగుంపుల
పేటలఁ దేటల పెనుగూటములు. ॥తోర॥

వింజామరలును విసనకఱ్ఱలును
గొంజెగొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయఁడు వేంకటపతి
సంజీవని తిరుమలకొడవఁగను. ॥తోర॥ 53

### మాళవి

బాపు దైవమా మాపాలి భవమా
తీపు రాకాసినెత్తురు డీం దోందోం దోందోం దోందోం. ॥పల్లవి॥

కాలనేమి పునుకిది కంచువలె లెస్స వాఁగీ
తాళమొత్తరే తత్త తత తత్తత్త [1]
కాలమెల్ల మాభూతగణమెల్ల వీఁడె కాచె
నేలఁబడి నేఁడును ధీం ధీం ధీం ధీం ధీం ధీం ధీం. [2] ॥బాపు

పగఁగొని మానక [3] పచ్చినెత్తురెప్పుడును
తెగి కొనుఁ దానె తిత్తి తిత్తి [4] తిత్తితి
తగు మహోదరు వీఁపు ధణధణమని వాఁగీ
బిగియించరే తోలు బిం భిం బిం భిం బిం భిం భిం. ॥బాపు

మురదనుజుని పెద్ద మొదలిమెనుకఁ దీసి
తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు [5]
తిరువేంకటగిరి దేవుఁడు గెలిచిన స
మరమునను మమ్మ మమ్మ మమ్మ మమ్మమా. ॥బాపు॥ 54

### భూపాళం

వాఁడె వేంకటేశుఁడనే వాఁడె వీఁడు
వాఁడి చుట్టుఁ గైదువ వలచేతివాఁడు. ॥పల్లవి॥

కారిమారసుతుని చక్కనిమాటలకుఁ జొక్కి
చూరగా వేదాలగుట్టు చూచినవాఁడు
తీరని వేడుకతో తిరుమంగయాళువారి
ఆరడి ముచ్చిమిగూటికాసపడ్డవాఁడు. ॥వాఁడె॥

---

నిడు రేకు 120. 1. తత్తత తత్తతా. 2. ధీం. 3. మా[illegible] 4. తిత్తి.
(ఇందు రెండవచరణము పూర్వోత్తరార్ధములు వ్యత్యస్తములు) 5. తుత్తుతూ.

పెరియాళ్వువారిబిడ్డ పిసికి పై వేసిన
విరులదండల మెడ వేసినవాఁడు
తరుణి చేయివేసిన దగ్గరి బుజము చాఁచి
పరవశమై చొక్కి పాయలేనివాఁడు.
పామరులఁ దనమీఁదిపాటలెల్లాఁ బాడుమంటా
భూమికెల్లా నోరనూరి పోసినవాఁడు
మామకూఁతురలమేలుమంగనాచారియుఁ దాను
గీముగానే వేంకటగిరి నుండేవాఁడు. ॥వాఁడె॥ 55

ఆహిరి

అంటఁబారి పట్టుకోరె అమ్మలాల యిదె
వెంటఁబారనీదు నన్ను వేడమాయ తురుము. ॥పల్లవి॥

కాఁగెడు పెరుగుచాడె కవ్వముతోఁ బొడిచి
లేఁగలఁ దోలుకొని అలిగి పోయీని
రాఁగతనమున వాఁడె రాతిరినారగించఁడు
ఆఁగి నన్నుఁ గూడడిగె నయ్యో యిందాఁకను. ॥అంట॥

కొలఁదిగాని పెరుగు కొసరికొసరి పోరి
కల వూరుగాయలెల్లఁ గలఁచి పెట్టె
పలుకఁడు చేతిచట్టి [1] పారవేసి పోయీనదె
తలఁగుచు మూఁటగట్టెఁ జెల్లఁబో యిందాఁకను. ॥అంట॥

మట్టుపడకిటు నూరుమారులైనా నారగించు
ఇట్టె యిందరిలోన నిన్నాళ్ళను
వెట్టికి నాకొరకుఁగా వేంకటేశుఁడారగించె [2]
యెట్టు నేఁడాఁకట ధరియించెవో యిందాఁకను. ॥అంట॥ 56

రేకు 3. 1. చద్ది. 2. గించు.

భూపాళం

ఏమో తెలిసెఁ గాని యీజీవుఁడు
నేమంపు నెరవిద్య నేరఁడాయె. ॥పల్లవి॥

కపటాలె నేరిచెఁ గానీ జీవుఁడు
యెపుడైనా నిజసుఖమెఱఁగఁడాయ
కపురులే చవిగొనెఁగానీ జీవుఁడు
అపరిమితామృతమానఁడాయ. ॥ఏమో॥

కడలనే తిరిగీఁ గానీ జీవుఁడు
నడుము మొదలు చూచి నడవఁడాయ
కడుపుకూటికె పోయీఁ గానీ జీవుఁడు
చెడని జీతము పొంతఁ జేరఁడాయ ॥ఏమో॥

కనియుఁ గానక పోయెఁ గానీ జీవుఁడు
దినము వెంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలనె చొక్కీఁ గానీ జీవుఁడు
తనియ నిట్టె మంచిదరిఁ జేరఁడాయ. ॥ఏమో॥ 57

సామంతం — అటతాళం

తనదిఁ గాక యిందరిదిఁ గాక
తనువెల్ల బయలై దరిచేరదు. ॥పల్లవి॥

కడుపూ నిండదు కన్నూఁ దనియదు
కడఁగి లోని యాఁకలియుఁ బోదు
సడిఁబడి కుడిచిన కుడుపెల్ల నినుము
గుడిచిన నీరై కొల్లఁబోయె. ॥తనదీ॥

చవియూఁ దీరదు చలమూఁ బాయదు
లవలేశమైన నొల్లక పోదు
చివచివ నోటికడవలోని నీరై
కవకవ నవియుచుఁ గారీని. ॥తనదీ॥

అలవుఁ దోఁపదు అడవీ నెండదు
యెలయించు భంగమయినఁ బోదు
తెలిసి వేంకటగిరి దేవునిఁ దలఁపించు
తలఁపైనఁ దనకు ముందర నబ్బదు. ॥తనదీ॥ 58

31.వ రేకు. ఆహిరి

పారకుమీ వోమనసా పంతము విడువకుమీ మనసా
పారిన నీవే బడగయ్యేదవు చేరువ నాఁడే చెప్పనె మనసా. ॥పల్లవి॥

చింతించకుమీ శివునివైరిచే చిక్కువడకుమీ వో మనసా
కంతువారకము వయసుఁ బ్రాయములు కావటికుండలు వో మనసా
యెంతో మేలూఁ గీడేకాలము ఎప్పుడునుండదు వో మనసా
సంతరించుకో ఘనిని మనసున సంతోషముగా వో మనసా. ॥పార॥

ఎన్నికలే తలపోయకుమీ యేమరకుండుమి వో మనసా
కన్నవిన్నవారిలో నెప్పుడూ కాకువడకుమీ వో మనసా
పున్నమమాసలు పుడమిలో బదుకులు పోయివచ్చేవి వో మనసా
మిన్నోనేలని మన్నదినములో మీఁదు చూడకుమి వోమనసా. ॥పార॥

కన్నుల సంగాతము సేయకుమీ కళవళించకుమి వో మనసా
వన్నెల మాటల చెవులఁ బెట్టక వాసి విడువకుమి వో మనసా
మున్నిఁటి సురలు బ్రహ్మాదులకైనను ముక్తిసాధనము వో మనసా
నెన్నని వేంకటగిరిపతిఁ దలఁచుమను వేసారకుమీ వోమనసా. ॥పార॥ 59

ముఖారి

ఏల పోరలేవు లేవే యింతలోనివనికి
మూలయింటితోలుకప్పు మాయలిటువంటివి. ॥పల్లవి॥

చిక్కుల తమకముల చీఁకటి గప్పిన నాఁడు
ఎక్కువ వాసనలా [1] హేయపు మేను
వెక్కసపు ప్రియ [2] మది విరిగితే రోఁతలా
లక్కపూఁతకపురులీలాగులిటువంటివి. ॥ఏల॥

మించిన చిత్తములో మేలుగలిగిన నాఁడు
యెంచరాని చవులా నెంగిలిమోవి
పెంచుకంటే కష్టమా ప్రియముదీరిన నాఁడు
చంచలపు చిత్తముల చందమిటువంటిది. ॥ఏల॥

వెల్లిగాను సురతపువేళ [3] మరపుల యింపు
కొల్లలాడఁజా కొనగోరితాఁకులు
నల్లితిండా [4] మరి మీఁద మరగితే రోఁతలా (?)
వుల్లమిచ్చే వేఁకటేశు వొద్దికిటువంటిది. ॥ఏల॥ 60

ముఖారి

ఎట్టు దరించీ నిదె యీ జీవుఁడు
బట్టబయలుగాఁ బరచీ నొకటి. ॥పల్లవి॥

చెడనిమంటిలోఁ జేసినముద్దే
నడుమ ముంచుకొన్నది వొకటి
తడియని నీరై తడివొడమింపుచు
వడినీని వేవురవడితో నొకటి. ॥ఎట్టు॥

---

నిడురేకు 63. 1. సనబోను. 2. ప్రేమ మని. (1-2 చరణములు వెనుక ముందై కలవు) 3. విడమర. 4. డోఁగాక నలగిన నింతలోనే.

పాయని తను దీపనములుగా నటు
చేయుచు మది వేఁచీ నొకటి
కాయపు చుట్టరికమ్ములు సేయుచు
రేయుఁబవలు విహరించీ నొకటి. ॥ఎట్టు॥

ఇన్నియుఁ దానే యేచి కపటములు
పన్నీ నిదె లోపల నొకటి
వెన్నెలచూపుల వేంకటేశ నిను
యెన్నికతోఁ గడు నెదిరీ నొకటి. ॥ఎట్టు॥ 61

ముఖారి

బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దానె నీ పాదము. ॥పల్లవి॥

చెలఁగి వసుధ గొలిచిన నీ పాదము
బలితల మోపినపాదము
తలఁకక గగనము దన్నినపాదము
బలరిపుఁ గాచిన పాదము. ॥బ్రహ్మ॥

కామిని పాపము గడిగిన పాదము
పాముతలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి [1] తురగపుఁ బాదము. ॥బ్రహ్మ॥

పరమయోగులకుఁ బరిపరివిధముల
పరమొసఁగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము. ॥బ్రహ్మ॥ 62

[illegible] ప్రా. 1. బాడిదె.

## సామంతం — అవతారాలు

తానే కాకెవ్వరు మాకు దాతయు దైవము తన
లోనఁ బెట్టుకొని మాకు లోనైనవాఁడు. ॥పల్లవి॥

చదివించి కూడువెట్టి జారకుండ నిల్లుగట్టి
బెదరులేనిబుద్ధి పిన్ననాఁడే చెప్పి
యెదిరినడిగి ద్రవ్యమిదిగోమ్మనుచు నిచ్చి
పదిలమై తమ్ముఁ బాలించువాఁడు. ॥తానే॥

మోహవియోగమ్ము మోహానురాగమ్ము
దేహవిభాగంబు దెలిసిన కలికి
ఐహికమున వేంకటాధీశుఁడై సర్వ
దేహరక్షకుఁడై తిరుగుచున్నాఁడు. ॥తానే॥ 63

## బౌళి

చెదఱక వెలుఁగే చేనుమేయఁగఁ జొచ్చె
అదరించి తగదు నీకనువారు వేరి. ॥పల్లవి॥

చిత్తమింద్రియములచేఁ జిక్కి కడు మద
మెత్తిన వద్దన నిఁక వేరి
హత్తినమనసు మోహాదులతోఁ గూడి
తత్తరించిన మాన్పఁ దగువారు వేరి. ॥చెదఱ॥

జీవుఁడిన్నిటికిఁ దాఁ జిక్కి పోయినత్రోవఁ
బోవఁ జొచ్చిన బుద్ధిపాలమేది
శ్రీవేంకటేశుని చింతాపరతఁ గాని
కావఁగ నాత్మకుఁ గతి దానేది. ॥చెదఱ॥ 64

కన్నడగౌళ

పోయఁ గాలంబడవికిఁ గాయువెన్నెల కరణిని
శ్రీయుతుఁ దలఁచుఁడీ నరులు మాయఁబడి చెడక. ॥పల్లవి॥
చిత్తము చేకూరుచుకొని చిత్తైకాగ్రతను
చిత్తజగురునిఁ దలఁచుఁడీ చిత్తజుఁ జొరనీక. ॥పోయ॥
బూరుగుమాఁకునఁ జెందిన కీరముచందమున
ఆరయ నిష్ఫలమగు మఱియున్యులఁ జేరినను. ॥పోయ॥
కూరిమి మా తిరువేంకటగిరి గురు శ్రీపాదములు
చేరినవారికి భవములు చెందవెపుడు నటుగాన. ॥పోయ॥ 65

32-వ రేకు. పాడి

ఏఁటికి నెవ్వరిపొందు యిస్సిరో చీచీ
నాటకములాల చీచీ నమ్మితిఁగా మిమ్మును. ॥పల్లవి॥
జవ్వనమదమ చీచీ చక్కఁదనమరో చీచీ
రవ్వైన రాజసగర్వమరో చీచీ
కొవ్వినమదమ చీచీ కూరిమియాసరో చీచీ
నవ్వులదేహమ చీచీ నమ్మితిఁగా మిమ్మును. ॥ఏఁటికి॥
ముచ్చట మమత చీచీ ముచ్చుమురిపెమ చీచీ
బచ్చురిపణములోని బచ్చన చీచీ
తెచ్చుకోలు తాలిముల దిట్టతనమ చీచీ
పుచ్చినపోకరో చీచీ పోయెఁగా మీ కాలము. ॥ఏఁటికి॥
సిరుల చీఁకటి చీచీ సిలుగు సంపద చీచీ
వరవిభవమ చీచీ వాసిరో చీచీ
కరుణించెఁ దిరువేంకటగిరిపతి నన్ను
విరసవర్తన చీచీ వీడెఁగా మీ భారము. ॥ఏఁటికి॥ 66

### సామంతం [1]

మనుజుఁడై పుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖమందనేలా. ॥పల్లవి॥

జుట్టెఁడు గడుపుకై చొరనిచోట్లు చొచ్చి
పట్టెడు గూటికై బతిమాలి
పుట్టినచోటికే పొరలి మనసువెట్టి
వట్టిలంపటము వదలనేరఁడు గాన. ॥మను॥

అందరిలోఁ బుట్టి అందరిలోఁ జేరి
అందరిరూపములటు దానై
అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించి
అందరానిపద మందెనటు గాన [2] ॥మను॥ 67

### నాట [3]

లంకెలూడుటే లాభము - యీ
కింకిరులను నలఁగెడికంటెను. ॥పల్లవి॥

జంపులఁ జంపక [4] సరుగనఁ బాసేటి
లంపటమే పో లాభము
[5] కంపమోపుతోఁ గనలి శరీరపు
కొంపలోన వేఁగుటకంటెను. ॥లంకె॥

ఈవల నావల నేచేటి యాసల [6]
లావు దిగుటె పో లాభము
పవగింతలకు నిరవగు నరకపు
కోవులఁ బడి మునుఁగుటకంటెను. ॥లంకె॥

---

నిడురేకు 34. 1. గుండక్రియ. 2 పదిమందరాదా. నిడురేకు 29. 3. సామంతం. 4. [illegible]. 5. గంటమోపు. నిడురేకు 29. 6. [illegible].

తివిరి వేంకటాధిపు దాసులకృప
లవలేశమె పో లాభము
చవులని [1] నోరికి సకలము దిని తిని
భవకూపంబులఁ బడుకంటెను. ||లంకె|| 68

నాట

తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు చంచలబుద్ధి మానీనా. ||పల్లవి||

జడ్డుమానవుఁడు చదువఁ జదువ నాస
వడ్డినారుఁ గాక వదలీనా
గుడ్డికుక్క సంతకుఁ బోయి తిరిగిన
దుడ్డుపెట్లే కాక దొరకీనా. ||తన||

దేవదూషకుఁడై తిరిగేటి వానికి
దేవతాంతరము తెలిసీనా
శ్రీవేంకటేశ్వరు సేవాపరుఁడు గాక
పావనమతియై పరగీనా. ||తన|| 69

భైరవి

సడిఁ బెట్టె గటకటా సంసారము - చూడ
జడధిలోపలి యీఁత సంసారము. ||పల్లవి||

జమునోరిలో బ్రదుకు సంసారము - చూడ
చమురుదీసిన దివ్వె సంసారము
సమయించుఁ బెనుదెవ్వులు సంసారము - చూడ
సమరంబులో నునికి సంసారము. ||సడి||

1. చవికొని.

సంది గట్టిన తాడు సంసారము - చూడ
సందికంతలత్రోవ సంసారము
చందురుని జీవనము సంసారము - చూడ [1]
చందమేవలెనుండు సంసారము. ॥నడి॥

చలువలోపలి వేఁడి సంసారము - చూడ
జలపూఁతబంగారు సంసారము
ఇలలోనఁ దిరువేంకటేశ నీ దాసులకు
చలువలకుఁ గడుఁ జలువ సంసారము. ॥నడి॥ 70

ధన్నాసి

సామాన్యమా పూర్వసంగ్రహంబగు ఫలము
నేమమునఁ బెనగొనియె నేఁడు నీవనక. ॥పల్లవి॥

జగతిఁ బ్రాణులకెల్ల సంసారబంధంబు
తగుల బంధించు దురితంపుఁ గర్మమున
మగుడ మారుకుమారు మగువ నీ వురముపై
తెగి కట్టిరెవ్వరో దేవుండవనక. ॥సామా॥

పనిలేక జీవులను భవసాగరంబులో
మునుఁగ లేవఁగఁ జేయు మోహదోషమున
పనిపూని జలధిలోఁ బండఁబెట్టిరి నిన్ను
వెనకెవ్వరో మొదలివేలుపనక. ॥సామా॥

ఉండనీయక జీవనోపాయమున మమ్ము
కొండలకు గొబల తతిగొని త్రిప్పుఫలము
కొండలను నెలకొన్న కోనేటిపతివనఁగ
నుండవలసెను నీకు నోపలేననక. ॥సామా॥ 71

నిడుకేకు 60. 1. గాక.

దేవగాంధారి

ఎందరివెంట నెట్లఁ దిరుగవచ్చు
కందువెఱఁగి చీఁకటి దవ్వుకొనుఁగాక.[1] ॥పల్లవి॥

తల రాయిగాఁగ నెందరికి మొక్కెడిని
తెలివిమాలినయట్టి దేహి
కొలఁదిమీరిన దేవకోట్లు తనలోన
కలవాని నొక్కనినే కొలుచుఁ గాక. ॥ఎంద॥

కాలీఁచపడఁగ నెక్కడికి నేఁగెడిని
పాలుమాలినయట్టి ప్రాణి
మేలిమి జగములు మేనిలోఁ గలవాఁడు
పాలిటివాఁడై ప్రణుతికెక్కుఁ గాక. ॥ఎంద॥

నూరేండ్ల[2] నెందరి నుతియింపఁగలవాఁడు
చేరఁ దావులేని జీవి
శ్రీరమణీశుఁడు శ్రీవేంకటేశుని
కోరికెఁ దలఁచి నతి[3] కొల్లగొనుట గాక. ॥ఎంద॥ 72

33_వ రేకు. శ్రీరాగం

వెన్నవట్టుక నేయి వెదకనేలా మరియు
నెన్నివలసినను ధమ యేలెటివె[4] కావా. ॥పల్లవి॥

తలఁపునకు విష్ణుచింతన నిమిషమాత్రంబు
కలుగుటే కలుగవలెఁ గాక
వలనైన భోగములు వైభవంబులు మరియు
కలవెల్లఁ దమయెదుటఁ గలిగినవె కావా. ॥వెన్న॥

---

నిడురేకు 47. 1. జీఁకటికి. దొలఁగుఁ. 2. నోరెంక 3. ముక్తి.
నిడురేకు 84 4. యెడిటివే.

పదిలముగ హరినామపఠన [1] మంత్రము నోరు
కదియుటే కలుగవలెఁ గాక
తుదలేని సంపదలు తొలఁగనిముదంబులును
కదలకెప్పుడుఁ దమకుఁ గలిగినవె కావా. ॥వెన్న॥

ఇంచుకైనను వేంకటేశుగిరిశిఖరంబు
కాంచుటే కలుగవలెఁ గాక
అంచితంబైన నిత్యానందపదవులును
మించి తమయెదుటఁ బ్రభవించినవె కావా. ॥వెన్న॥ 73

ముఖారి

పసలేని యీ బ్రదుకు
అసలు చొచ్చి చొచ్చి అలసినట్టాయె. ॥పల్లవి॥

తొల్లిటిజన్మాదులఁ గాని నరరూపు
పల్లించుకొన్న యీ బ్రదుకు
కల్లసుఖములచే కసలి కమ్మర
ముల్లుదీసి కొర్రు మొత్తినట్టాయ. ॥పస॥

బూటకములనెల్ల బొరలి సంసారంబు
పాటుదెచ్చిన యీ బ్రదుకు
నీటుగ నెద్దు దన్నీనని గుఱ్ఱము
చాటుకేఁగినయట్టి చందమాయ. ॥పస॥

పగగొన్న పొగకోపక మంటఁ బడిపడి
పగలు రేలైన యీ బ్రదుకు
తగు వేంకటేశ్వరుఁ దలఁచి నేలనుండి
యెగసి మేడమీఁదికేఁగినట్లాయె. ॥పస॥ 74

1. పరమ మంత్ర.

### ముఖారి

ఎంత మానుమన్నఁ జింతలేల మానునే [1]
పంతపు మనసు హరిపై నుంటేఁ గాక. ॥పల్లవి॥

తీరని బంధాలు నేఁడే తెగుమంటే నేల తెగు [2]
భారపుమమతఁ బెడఁబాసినఁగాక
ఊరటగా మమత నేనొల్లనంటే నేలమాను
ఓరుపుతో లంపటములొల్లకుంటేఁ గాక. ॥ఎంత॥

వేఁకపుఁ గోపము నేఁడే విడుమంటే నేలవిడు
తోఁకచిచ్చయిన యాసఁ దుంచినఁగాక
ఆఁకట నాసేలమాను అన్నిటాను యిందరికి
మాఁకుపడి తత్తరము మఱచుంటేఁగాక. ॥ఎంత॥

పెట్టనిది దైవమిట్టె పెట్టుమంటే నేల పెట్టు
యిట్టె వేంకటపతి యిచ్చినఁగాక
యిట్టు నట్టు నీతఁడు దానిందరికినేల యిచ్చు
వొట్టిన విరక్తి నేమీ నొల్లకుంటేఁగాక. ॥ఎంత॥ 75

### సామంతం

చాలదా హరిసంకీర్తనఁగల
మేలిది దీననే మెరసిరి ఘనులు. ॥పల్లవి॥

తలఁప వేదశాస్త్రములు గానక
అలరుచు వాల్మీకాదులు
తలకొని హరిమంత్రమె దగఁబేర్కొని
అలవి మీరఁగడు నధికములైరి. ॥చాల॥

---

నిడురేకు. 42 83. 1. మానును. 83. 2. తీరుమంటే నేల తీరు.

ఇతరదైవముల నెఱఁగ నేరక
ప్రతిలేని మహిమఁ బార్వతి
మతిఁ దలఁపుచు హరిమంత్రమె పేర్కొని
సతతము హరులో సగమై నిలిచె. ॥చాల॥

చదువులుఁ బలుమరుఁ జదువనోపక
అదివో నారదాదులు
పదిలపు వేంకటపతి హరినామమె
నదలకిదియ జీవనమై మనిరి. ॥చాల॥ 76

## సామంతం

పోయఁబోయఁ గాలమెల్ల పూఁటపూఁటకు
చేయి నోరు నోడాయ చెల్లఁబో యీ రోఁతలు. ॥పల్లవి॥

తిప్పన తొప్పన కేతు [1] దేవన భావన గన్న [2]
పప్పన బొప్పనగారిఁ బాడిపాడి
కుప్పలుఁ దెప్పలు [3] నైన కోరికెలు మతిలోన
యెప్పుడుఁ బాయకపోయె నిన్నిలేవు రోఁతలు. ॥పోయ॥

కాచన పోచన మాచు [4] కల్లప బొల్లప మల్లు
బాచన దేచనగారిఁ బాడిపాడి
యేచిన పరసుఖము నిహమును లేకపోయె
చీచీ విరిగితిమి చెప్పనేల రోఁతలు. ॥పోయ॥

బుక్కన తిక్కన చెల్లు బ్రాహ్మన కామన పేరి
బక్కల నిందరి నోరఁ బాడి పాడి

విఘ్నేశు. 81. 1. మా[illegible] 2. గంగు. 3. దిప్పలు. 4. [illegible].

యెక్కువైన తిరువేంకటేశునిఁ దలఁచలేక
కుక్కకాటుఁ జెప్పుటా(టే?)పై కూడెనిన్ని రోఁతలు. ॥పోయె॥ 77

సాళంగనాట

పటుశిష్టప్రతిపాలకుఁడవనఁగ
ఘటన నఖిలమును గాతువుగా. ॥పల్లవి॥

తుత్తుమురుగ దైత్యుల దనుజుల నని
మొత్తి మోఁది చలమునఁ జెలఁగి
జొత్తుపాపలుగ సారిధి విరోధుల
నెత్తురు వడుతువు నీవేకా. ॥పటు॥

తళతళ మెఱుచు సుదర్శనాయుధం
బలరుచు నొకచే నమరఁగను
బలుదైత్యుల దొబ్బలుఁ బేగులు నని
నిలువునఁ జెండుదు నీవేకా. ॥పటు॥

దిట్టవు సూత్రవతీపతి వసురలఁ
బట్టలు చీరఁగఁ జతురుఁడవు
రట్టడి వేంకటరమణుని [illegible]
పట్టవు సేనాపతివటకా. ॥పటు॥ 78

౩౪ వ రేకు. దేసాళం

పోఁడుఁ బోయఁ గాలమెల్ల పూఁట పూఁటకు [1]
రోయని రోఁతలు చూచి రుచి చూడఁబోదు. ॥పల్లవి॥

---

నిఘంటుకు. [illegible] 1. పోయెడా యీ కాలము [illegible] పొద్దు పొద్దుకు.

తాడిమానెక్కేటివాని తడయక పట్టి పట్టి
తోడఁ దోడ నెందాఁకాఁ దోయవచ్చును
కాడువడ్డ చిత్తమిది కలకాలమునిట్టె
ఆడికెలకులోనై * తనియక [1] పోయ. ||పోయ||

మన్ను దినియేటి దూడ మానువంటా మొత్తి మొత్తి
కన్నిగట్టి యెందాఁకఁ గాయవచ్చును
నన్నఫుటాసల మీఁదిచరిఁ బడ్డ దేహమిది
కన్నపుఁగత్తుల చూపు కట్టరాక పోయ. ||పోయ||

హేయము దొక్కకుమన్న యేచి తినేననేవాఁడు
చాయకు రాకున్న నేమి సేయవచ్చును
మాయల వేంకటపతి మచ్చు చల్ల నాయాత్మ
పాయక యీతనిఁజేరి భయమెల్లఁబోయ. ||పోయ|| 79

మాళవిగౌళ

పాప మెరఁగని బ్రాహ్మఁడు - యెందుఁ
జూపరానిచోటు చూపీనయ్యా. ||పల్లవి||

తనివోక జీవము తలకాయ నంజుడు
పనివడి తిని తిన్న బ్రాహ్మఁడు
యెనసి యెదిరిఁ దన్ను నెఱఁగక విభుఁడై
ఘనవంశము మంటఁ గలపీనయ్యా. ||పాప||

* ఇందు 'నైత' అనునక్షరముల నడుమ మరిరెండక్షరములు చెక్కి తరువాత రాచి చెఱచినట్లున్నది. ఛందోరీతి నూహించి చూడఁగా, నై-య అను రెంటిలో ఏది యతిస్థానముగాఁగొన్నను, రెండక్షరములు కావలయునేమో అని పించుచున్నది. 1. తనియుకే

ఎవ్వారు నెఱఁగని యెముకల యింటిలో
పవ్వళింపుచునున్న బ్రాహ్మఁడు
జవ్వనమదమున జడిసేటి కోమలిఁ
బువ్వల తోఁటలోఁ బొదిగీనయ్యా. ॥పాప॥

చెలఁగి కన్నెరికము చెడని పడుచుఁదెచ్చి
పలువేదనలఁ బెట్టె బ్రాహ్మఁడు
తెలిసి వేంకటాధిపుని దాసుఁడై
పులుగు పంజరానఁ బొదిగీనయ్యా.[1] ॥పాప॥ 80

## శంకరాభరణం

ఇన్ని చేఁతలును దేవుఁడిచ్చినవే
ఉన్నవారి యీవులెల్ల నొద్దికయ్యీనా. ॥పల్లవి॥

తెగని యాపదలకు దేవుఁడే కలఁడుగాక
వగలుడుపఁ బరుల వసమయ్యీనా
నొగిలి యితరులకు నోళ్ళుదెరచిన
నగుఁబాటేకాక మానఁగఁ బొయ్యీనా. ॥ఇన్ని॥

అగ్గలపుదురితాలు హరియే మానుపుఁగాక
బగ్గన నొక్కరు వచ్చి పాపఁ బొయ్యేరా
తగ్గు ముగ్గులైనవేళ తలఁచినవారెల్ల
సిగ్గుఁబాటేకాక తమ్ముఁ జేరవచ్చేరా. ॥ఇన్ని॥

ఎట్టునేసినను వెంకటేశుఁడే నేరుచుఁగాక
కట్టకడ వారెల్లఁ గరుణించేరా[2]
యిట్టే యేమడిగిన నితఁడే యొసఁగుఁగాక
పుట్టిపడి యెవ్వరైనా నూరడించేరా. ॥ఇన్ని॥ 81

నిడురేకు. ౬౦. 1. పంజరము పుడికీనయ్యా. 2 గావఁబోయేరా.

ఆహిరి

ఎటువంటిరౌద్రమో యెటువంటికోపమో
తటతట నిరువంక దాఁటీ వీఁడే.[1] ||పల్లవి||

తోరంపుఁ జెనుచేతుల మల్లచఱచి
దారుణలీలఁ బెదవులవ్రుడు కఱచి
కారించి చాణూరుఁ గడు భంగపఱచి
వీరుఁడై యెముకల విఱచీ వీఁడే. ||ఎటు||

పిపిఁ గదచినయట్టు పెడచేతనడిచి
పడనీక పురములోపలఁ జొరఁబొడిచి
తొడికి చాణూరునెత్తుక దయ విడిచి
వడివెట్టి నెత్తురు వడిచీ వీఁడే. ||ఎటు||

బుసకొట్టుచును వ్రాఁతపులఁ జెమరించి
ముసిగాఁగ బెద పెదమల్లుల దంచీ
నెసగి శ్రీ తిరువేంకటేశుఁడై మించి
ముసిముసి నవ్వుల ముంచీ వీఁడే. ||ఎటు|| 82

ఆహిరి

ఆసమీఁద విసుపౌ (వౌ?)[2] దాఁక, యీ
గాసిఁబరచు తన కపటమే సుఖము. ||పల్లవి||

తిరమగుఁగర్మము తెగుదాఁక, తన
గరిమ సుఖము పొగడు నందాఁక[3]
పరమార్గంబగపడుదాఁక, తన
పరితాపపులంపటమే సుఖము. ||ఆస||

---

ని రేకు. 48. 1. కడపటి చరణములో మాత్రము 'వీఁడే' తక్కినవాట్నెల్ల 'వాఁడే'. ని రేకు. 56. 2 విసుపౌదాఁక. 3. పొడగనుదాఁక.

కాయము గడపల గనుదాఁక, యీ
మాయదన్నుఁ బెడమరు దాఁక
రాయడి మదము గరఁగుదాఁక, యీ
రోయఁదగిన తనరూపమే సుఖము. ॥ఆస॥

లంకెలఁ బొరలి నలఁగుదాఁక, యీ
యంకెల భవములెరవౌ దాఁక
వేంకటపతిఁ దడవినదాఁక యీ
కింకురువా [1] నాపు గెలుపే సుఖము. ॥ఆస॥ 83

సాళంగం

తనకర్మమెంత చేఁతయు నంతే
గొనకొన్న పనియెంత కూలీ నంతే. ॥పల్లవి॥

తలఁపులో హరినెంత దలఁచె నేఁడే వాని
కలిమియు సుఖమును గలదంతే
తులఁదూఁచఁ బైఁడెంత తూఁకమునంతే
నెలకొన్న పిండెంత నిప్పటీనంతే. ॥తన॥

సిరివరు పూజెంతసేసె నేఁడే వాని
దరియును దాపునెంతయు నంతే
పురిగొన్న యీవెంత పొగడూనంతే
నరపతి చనవెంత నగవూ నంతే. ॥తన॥

శ్రీ వేంకటపతి చింత యెంత నేఁడే
భావపరవశము పలుకూ నంతే
దైవము కృపయెంత తానూనంతే
యేవంక జయమెంత యిరవూనంతే. ॥తన॥ 84

1. కుర్వాణ.

35-వ రేకు. ✓ పాళి

ఎండగాని నీడగాని యేమైనఁ గాని
కొండలరాయఁడే మాకులదైవము.[1] ॥పల్లవి॥

తేలుగాని పాముగాని దేవపట్టయినఁగాని
గాలిగాని ధూళిగాని కాని యేమైనా
కాలకూటవిషమైన గ్రక్కున మ్రింగిన నాఁటి
నీలవర్ణుఁడే మా నిజదైవము. ॥ఎండ॥

చీమగాని దోమగాని చెలఁది యేమైనఁగాని
గాముగాని నాముగాని కాని యేమైనా
పాములనిన్నిటి మ్రింగే బలుతేజిపై నున్న
ధూమకేతువే మాకు దొరదైవము. ॥ఎండ॥

పిల్లిగాని నల్లిగాని పిన్నయెలుకైనఁగాని
కల్లగాని పొల్లగాని కాని యేమైనా
బల్లిదుఁడై వేంకటాద్రిపై నున్న యాతఁడే మ
మ్మెల్లకాలమును నేలే యింటిదైవము. ॥ఎండ॥ 85

ఆహిరి

ఇందు నందుఁ దిరుగుచు నెవ్వరివాఁడవుగాక
బందె పసురవువైతి బాపు జీవుఁడా. ॥పల్లవి॥

తోలుబొక్కలోనఁ జొచ్చి తూలేటి యాఁకలిచేత
పాలుమాలి యిందరికి బంటు బంటవై
యేలినవానిఁ గానక యేచిన యాసలవెంట
కూలికిఁ బో దొరకొంటి కూళజీవుఁడా. ॥ఇందు॥

---

నిడురేకు 111. 1. గురుదైవము.

తీఁటమేనిలోనఁ జొచ్చి దిమ్మరి దొంగలచేత
మూఁట గట్టించుక [1] నీవు మూలదొరవై
గాఁటపు విభునిచేతి ఘనతకోరికలకు
వేఁటకుక్కవై తివి వెట్టిజీవుఁడా. ॥ఇందు॥

చీమలింటిలోనఁ జొచ్చి చిక్కువడి అందరిలో
దోమకరకుట్లకు తోడిదొంగవై
యేమరి వేంకటవిభునెఱుఁగక జాడుఁజొప్పు
నాము మేయు దొరకొంటి నాలిజీవుఁడా. ॥ఇందు॥ 86

శ్రీరాగం

వేదనఁ బొరలే వెరవేలా
యీదయ విధి దనకీయదా. ॥పల్లవి॥

తత్తరపాట్ల తనువికారముల
చిత్తము దెంచే చెలువేలా
బత్తితో దాఁచిన పరధనంబుగొని
సత్తయి వుండుట చాలదా. ॥వేదన॥

ఎక్కువ తమకపుటింతులఁ బొందక
వక్కుచు వాడే వయసేలా
మొక్కుచు దాఁచిన మూలధనము గన
నెక్కువ దైవంబియ్యదా. ॥వేదన॥

చేఁతలఁ బొరలెడి చిక్కులఁ గెరలెడి
రోఁతల యీనేరుపులేలా
ఖాఁతిగ వేంకటపతి రతిఁ జిత్తపు
టూఁతలఁ గోరికలూనవా ॥వేదన॥ 87

నిడురేకు. ౪౪. 1. గడించుక.

ముఖారి

వెరపులు నొరపులు [1] వృథా వృథా
ధరపై మరియంతయును వృథా. ॥పల్లవి॥

తడయక చేసిన దానంబులు వృథ
యెడనెడ నెఱిఁగిన యెఱుక వృథా
ఒడలిలోని హరినొనరఁగ మతిలోఁ
దడవని జీవము తనకు వృథా. ॥వెరపు॥

జగమునఁ బడసిన సంతానము వృథ
తగిలి గడించిన ధనము వృథా
జగదేకవిభుని సకలాత్ముని హరిఁ
దెగి కొలువని బుద్ధియును వృథా. ॥వెరపు॥

పనివడి కూడిన పరిణామము వృథ
వొనరఁగ నుండిన వునికి వృథా
ఘనుఁడగు తిరువేంకటగిరి హరిఁగని
మననేరని జన్మములు వృథా. ॥వెరపు॥ 88

ఆహిరి

ఏమికలిగెను మాకిందువలన
వేమారుఁ బొరలితిమి వెట్టిగొన్నట్లు. ॥పల్లవి॥

తటతటన నీటిమీఁదట నాలజాలంబు
లిటునటుఁ జరించవా యీఁది యీఁది
అటువలెనె పో తమకమందె సంసారంబు
ఘటనకై తిరిగితిమి కడగానలేక. ॥ఏమి॥

---

రాఁతరేకు 18 1 మరపులు.

దట్టముగఁ బారావతములు మిన్నుల మోవ
కొట్టఁ గొనకెక్కవా కూడి కూడి
వట్టియాసలనె యిటువలెనె పో యిన్నాళ్ళు
బట్టబయలీఁదితిమి పనిలేని పాట. ॥ఏమి॥

బెరసి కుమ్మరపురువు పేఁడలోపల నెల్ల
పొరలవా పలుమారుఁ బోయి బోయి
వరుస జన్మముల నటువలెనె (పో?) పొరలితిమి
తిరువెంకటాచలాధిపుఁ దలఁచలేక. ॥ఏమి॥ 89

## ఆహిరి

హరినెఱఁగని పుణ్యమంటేరు గాన
దురితాలే దురితాలే దురితాలే సుండీ. ॥పల్లవి॥

దొడ్డపుణ్యములుసేసి తుదలేని సంపదలు
అడ్డగించుకొని రాసులగు గురుతు
జడ్డులేని హరికథ చవిలేకుండున నిట్టె
గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుండీ. ॥హరి॥

వలెనని మేలెల్ల వడిఁజేసి కైవల్య
మలమి చేతికిలోన నగు [1] గురుతు
తలపు వైష్ణవభక్తిఁ దగులకుండిన నంతా
అలయికే అలయికే అలయికే సుండీ. ॥హరి॥

తిరమైన తీర్థాలు దిరిగి యందరిలోన
ధరఁ బుణ్యుఁడవుట యంతకు గురుతు
తిరువేంకటపతిఁ దెలియకుండిన నంతా
విరసాలే విరసాలే విరసాలే సుండీ. ॥హరి॥ 90

---

నిడురేకు. 34. 1. చేతానిలోనగు.

36-వ రేకు. నాట

ఏడ వలపేడ మచ్చికేడ సుద్దులు
ఆడుకొన్న మాటలెల్ల నవి నిజాలా. ॥పల్లవి॥

తొలుకారు మెఱుపులు తోఁచి పోవుఁగాక
నెలకొని మింటనవి నిలిచీనా
పొలఁతుల వలపులు పొలసి పోవుఁగాక
కలకాలంబవి కడతేరీనా. ॥ఏడ॥

ఎండమావులు చూడనేరులై పారుఁగాక
అండకుఁ బోవ దాహమణఁగీనా
నిండి నట్టే మోహము నెలఁతల మదిఁజూడ
ఉండినట్టే వుండుఁగాక వూఁతయ్యీనా. ॥ఏడ॥

కలలోని సిరులెల్ల కనుకూర్కు-లే కాక
మెలఁకువఁ జూడనవి మెరసీనా
అలివేణుల మేలు ఆసపాటే కాక
తలఁపు వెంకటపతిఁ దగిలీనా. ॥ఏడ॥ 91

ఆహిరి

ఏమి సేయఁగవచ్చు నీశ్వరాధీనంబు
తామనపు బుద్ధి కంతలు దూరవలసె. ॥పల్లవి॥

తెగి దురాపేక్షఁబడ తివియ గతిలేదు గన
పగగొన్న వగలకూపములఁ బడవలసె
తగుమోహసలిలంబు దాఁట మతిలేదు గన
మగుడఁబడి భవముతో మల్లాడవలసె. ॥ఏమి॥

పాపకర్మములఁ జంపఁగ శక్తిలేదు గన
కోపబుద్ధులచేత కొరమాలవలసె
రూపములఁ బొడగాంచి రోయఁ దరిలేదు గన
తాపములచేఁ బొరలి తగులు గావలసె. ॥ఏమి॥

తిరువేంకటాచలాధిపుఁ గొలువలేదు గన
గరిమె చెడి విషయకింకరుఁడు గావలసె
పరతత్త్వమూర్తిఁ దలఁపఁగఁ బ్రొద్దులేదు గన
దొరతనంబుడిగి యాతురుఁడు గావలసె. ॥ఏమి॥ 92

### వరాళి

తనవారని యాసఁ దగిలి భ్రమయనేల
తనువుఁ బ్రాణునికంటె తగులేది. ॥పల్లవి॥

తనువుఁ బ్రాణుఁడు రెండు తగిలి గర్భమునందు
ఒనర నేకమై యుదయించి
దినములు చెల్లిన తివిరి యాప్రాణుఁడు
తనువు విడిచి పోయ దయలేక. ॥తనవా॥

ప్రాణికై దేహము పాపపుణ్యము సేయు
ప్రాణి వెంటనె పొందిపాసుండదు
ప్రాణి యెచ్చటనైన బాధలఁ బడకుండ
ప్రాణిరక్షించు బొందిబడి దాఁబోయనా. ॥తనవా॥

ఎరవుల దేహాలివి నిజమని నమ్మి
మెరిఁగి నెఱుఁగలేరిది యేలా
అరయఁ బరమునకు నాదిపురుషుఁడై
పరగు శ్రీ వేంకటపతి గలిగుండఁగా. ॥తనవా॥ 93

సామంతం

సకలభూతదయ చాలఁగఁ గలుగుట
ప్రకటించి దేహసంభవమైన ఫలము. ॥పల్లవి॥

తలకొన్న ఫలవాంఛఁ దగులకుండఁగఁ జిత్త
మలవరించుట కర్మియైన ఫలము
పలుకర్మములలోన బ్రహ్మార్పణపుబుద్ధి
గలుగుట హరికృప గలిగిన ఫలము. ॥సకల॥

ఎప్పుడుఁ దిరువేంకటేశు సేవకుఁడౌట
తప్పక జీవుఁడు దానైన ఫలము
కప్పిన సౌఖ్యదుఃకర్మము (ఖమ్ము?)లు సమముగా
నొప్పుట విజ్ఞానమొదవిన ఫలము. ॥సకల॥ 94

వరాళి

అన్నలంటాఁ దమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
వన్నెల నప్పులుగొన్న వారువో వీరు. ॥పల్లవి॥

తెగనీక అప్పులెల్లాఁ దీసి తీసి - వారు
తగిలినఁ బెట్టలేక దాఁగి దాఁగి
వెగటునఁ బారిపోఁగా వెంట వెంట - పెక్కు
వగల నప్పులుగొన్న వారువో వీరు. ॥అన్న॥

చేయరాని పనులెల్లఁ జేసి జేసి - తమ
రాయడికి లోలోనే రాసి రాసి
కాయములో చొచ్చి చొచ్చి కాఁచి కాఁచి - మున్ను
వ్రాయని పత్రాలకాఁగే వారువో వీరు. ॥అన్న॥

దొరలై యప్పులవారిఁ దోసి తోసి - యీ
పరిభవములనెల్ల బాసి పాసి
సిరుల వెంకటపతిఁ జేరి చేరి - యిట్టి
వరుసనే గెలిచిన వారువో వీరు. ॥అన్న॥ 95

కన్నడగౌళ

ఏదికడ దీనికేది మొదలు - వట్టి
వేదనలు తన్ను విడుచుటెన్నఁడు. ॥పల్లవి॥

తొడరిన హృదయమే తోడిదొంగయై
వడిగొని తన్ను వలబెట్టఁగాను
కడఁగి కర్మములఁ గడచుటెన్నఁడు
నిడివిబంధముల నీఁగుటెన్నఁడు. ॥ఏది॥

తతిగొన్న తలఁపులే దైవయోగమై
మతినుండి తన్ను మరిగించఁగాను
ప్రతిలేని యాపదఁ బాయుటెన్నఁడు
ధృతిమాలిన యాస దీరుటెన్నఁడు. ॥ఏది॥

పొదలిన మమతయే భూతమై తన్నుఁ
బొదిగొని బుద్ధి బోధించఁగాను
కదిసి వేంకటపతిఁ గనుట యెన్నఁడు
తుదలేని భవములఁ దొలఁగుటెన్నఁడు. ॥ఏది॥ 96

శుద్ధవసంతం

కడలుడిపి నీరాడఁగాఁ దలఁచువారలకు
కడలేని మనసునకుఁ గడమ యెక్కడిది. ॥పల్లవి॥

దాహమణఁగిన వెనక తత్వమెరిఁగెదనన్న
దాహమేలణఁగు తా తత్వమేమెరుగు
దేహంబుగలయన్ని దినములకుఁ బదార్థ
మోహమేలుడుగు దా ముదమేల కలుగు. ॥కడలు॥

ముందరెరిఁగిన వెనక మొదలు మరచెద నన్న
ముందరేమెరుఁగుఁ దా మొదలేల మరచు
అందముగఁ దిరువేంకటాద్రీశు మన్ననల
కందువెరిఁగిన మేలు కలనైన లేదు. ॥కడలు॥ 97

61-వ రేకు. ఛాయానాట

తలఁప వెనక నుయ్యి తగరు ముందట (?) దీనఁ
దొలఁగ నాకుఁ దెరువు దోఁపదేమి సేతు. ॥పల్లవి॥

మమకార (ము ?) విరక్తిమార్గదూరము నీపై
మమతసేయక నాకు మానరాదు
మమత మేలో నిర్మమత మేలో దీని
క్రమము నక్రమము నేఁగాన నేమిసేతు. ॥తలఁప॥

కర్మమార్గము జన్మగతికిఁ జేరువ ని
ష్కర్మము పాతకమునకుఁ దొడవు
కర్మి గావలెనో నిష్కర్మిగావలెనో యీ
మర్మంపు మదము మానదేమి సేతు. ॥తలఁప॥

శరణాగత రక్షకుడవై నయట్టి
తిరువేంకటగిరిదేవుఁడా
పరిపూర్ణుఁడవో నీవు పరిచ్ఛిన్నుఁడవో ని
న్నరసి భజింపలేనైతి నేమిసేతు. ॥తలఁప॥ 98

### మలహరి

పాలదొంగవద్ద వచ్చి పాడేరు తమ
పాలిటి దైవమని బ్రహ్మాదులు. ॥పల్లవి॥

రోలఁ గట్టించుక పెద్దరోలలుగా వాపోవు
బాలునిముందరవచ్చి పాడేరు
ఆలకించి వినుమని యంబరభాగమునందు
నాలుగుదిక్కులనుండి నారదాదులు. ॥పాల॥

నోరునిండా జొల్లుగార నూఁగి [1] ధూళి మేనితో
పారేటి బిడ్డని వద్దఁ బాడేరు
వేరులేని వేదములు వెంట వెంటఁ జదువుచు [2]
జేరి చేరి యింత నంత శేషాదులు. ॥పాల॥

ముద్దులు మోముననఁగార మూఁటముూలల దాఁగే
బద్దుల బాలునివద్దఁ బాడేరు
అద్దివో శ్రీ తిరువేంకటాద్రీశుఁడితఁడని
చద్దికి వేఁడికి వచ్చి సనకాదులు. ॥పాల॥ 99

### ధన్నాసి

నంద నందన వేణునాదవినోదక్షేమ
కుంద, కుంద దంతహాస గోవర్ధనధరా. ॥పల్లవి॥

రామ రామ గోవింద రవిచంద్రలోచన
కామకామ కలుషవికారవిదూరా
ధామ [3] ధామ విభవత్ర్పతాపరూప (?) దనుజ ని
ర్ధూమ ధామకరణచతుర భవభంజనా. ॥నంద॥

నిడుకేసు. 48. 1. నోరజొల్లుగారఁగను నూఁగుధూళి. వినుతి 2. నేరుచుచునుండే.
నిడుకేసు. 50. 3. ధామ విభవ ప్రతాపరూప.

కమల కమలవాస కమలారమణ దేవో
త్తమ తమోగుణసతతవిదూర
ప్రమదప్రమదా [1] నుభవభావకరణ [2] (?)
సుముఖ సుధానంద శుభరంజనా. ॥నంద॥

పరమ పరాత్పర పరమేశ్వరా [3]
వరద వరదామల వాసుదేవ
చిరచిర ఘననగ శ్రీ వేంకటేశ్వర
నర [4] హరినామ పన్నగశయనా. ॥నంద॥ 100

కన్నడగౌళ

వెలికీ వెళ్ళఁడు చలికీ వెరవఁడు
ఉలికీ నులికీ నలికీ నయ్యా. ॥పల్లవి॥

రోగియై తా రుచులఁ బాయఁడు
భోగియై రతి పొందొల్లఁడు
వేగి మిగిలిన వెడచీఁకటి నీరు
తాగీఁ దాగీఁ దాగీ నయ్యా. ॥వెలికీ॥

తొడికీఁ దొడుకఁడు వుడికీనుడుకఁడు
కడికీఁ గసరఁడు కడుఁజేరఁడు
మడికీ గుడికీ మానినమమతలఁ
బుడికీఁ బుడికీఁ బుడికీనయ్యా. ॥వెలికీ॥

నిండీ నిండఁడు నెరసీ నెరయఁడు
పండీ బండఁడు మాయలీలలా
అండనె తిరువెంకటాధిపుఁ దలఁపుచు
నుండీ నుండీ నుండీనయ్యా. ॥వెలికీ॥ 101

---

1. ప్రమద ప్రమదా. 2. కారణ. 3. శ్రీపరాత్పర వరదా. 4. నరనామ పన్నగశాయ.

## ధన్నాసి

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రణపుంగవం. ॥పల్లవి॥

రాజవరశేఖరం రవికులసుధాకరం
ఆజానుబాహు నీలాభ్రకాయం
రాజారి కోదండరాజ దీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం. ॥దేవ॥

నీలజీమూతసన్నిభశరీరం ఘనవి
శాలవక్షం విమల జలజనాభం
తాలాహినగహరం ధర్మసంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం. ॥దేవ॥

పంకజాసనవినుత పరమనారాయణం
శంకరార్జిత జనక చాపదళనం
లంకావిశోషణం లాలితవిభీషణం
వెంకటేశం సాధు విబుధవినుతం. ॥దేవ॥ 102

## ఆహిరి

ఎడమపురివెట్టి పరహిత వివేకము లోన
గుడుసువడఁ జదువు మెరుఁగులువారెఁ జలము. ॥పల్లవి॥

లంపు మేయఁగఁ దొణఁగె లలితంపుమతి లోన
తెంపుదిగపడిచె నెడతెగని మానంబు
చంప దొరకొనియె వేసటలేని తమకంబు
యింపు ఘనమాయ నేనింకనేమి సేతు. ॥ఎడమ॥

బయలు వందిలి వెట్టు (ట్టె?) పనిలేని లంపటము
దయవిడువఁ దొడఁగె చిత్తములోనికాంక్ష
పయికొన్న మోహంబు పడనిపాట్లఁ బరచె
లయమాయ శాంతి మెల్లనె తీరె నెరుక. ॥ఎడమ॥

చావుఁ బుట్టువు మఱచె సంసారబంధంబు
దైవమును నిడిచె యా (నే?) తరికంపుఁ బ్రియము
శ్రీ వేంకటేశ్వరుఁడు చిత్తరంజకుఁడు యికఁ
గావలసినది యతని కరుణ ప్రాణులకు. ॥ఎడమ॥ 103

62-వ రేకు. శ్రీరాగం

ఎంతగాలమొ కదాయీదేహధారణము
చింతాపరంపరలఁ జిక్కువడవలసె. ॥పల్లవి॥

వడిగొన్న మోహంబువలలఁ దగులై కదా
కడలేని గర్భనరకములీఁద [1] వలసె
నడిమి సుఖములచేత నను పు సేయఁగఁ గదా
తొడరి హేయపుదిడ్డిఁ దూరాడవలసె. ॥ఎంత॥

పాపపుంజములచేఁ బట్టువడఁగాఁ గదా
ఆపదలతోడి దేహము మోవవలసె
చూపులకు లోనైన సుఖముగానక [2] కదా
దీపనభ్రాంతిచేఁ దిరిగాడవలసె. ॥ఎంత॥

హితుఁడైన తిరువేంకటేశుఁ గొలువక కదా
ప్రతిలేని నరకకూపమునఁ బడవలసె
అతనికరుణారసంబబ్బకుండఁగఁ గదా
బతిమాలి నలుగడలఁ బారాడవలసె. ॥ఎంత॥ 104

---

తా. వేం. శేషాచార్యుల వ్రాతప్రతిలో. (34) 1. నరకగర్భమునఁ బడవలసె.
1-వ రేకు. 18. 2. గోరఁగఁగదా.

నాట[1]

తెలిసినఁ దెలియుఁడు తెలియనివారలు
తొలఁగుఁడు బ్రహ్మాదులె మెరుఁగుదురు. ॥పల్లవి॥

వరదుఁ డఖిలదేవతలకు వంద్యుఁడు
గరదుఁ డ (కరదుట?) సురులకుఁ గంటకుఁడు
పరమాత్ముఁడంబుజ (డబ్జ?) భవశివాదులకుఁ
బరులకెల్ల ముప్పురలో నొకఁడు. ॥తెలిసి॥

దేవుఁడు సనకాదిమునులకునుఁ బర
దైవమఖిలవేదములకును
కైవల్యమొసఁగు ఘననిధి విధికి మ
హావిధి జడులకు[2] యాదవకులుఁడు. ॥తెలిసి॥

ఆద్యుఁడచలుఁడు మహాభూతమితఁడ
భేద్యుఁడసాధ్యుఁడు భీకరుఁడు
సద్యః ఫలదుఁడు సకలమునులకును
వేద్యుఁడితఁడె పో వేంకటవిభుఁడు. ॥తెలిసి॥ 105

సామంతం ✓

ఎక్కువకులజుఁడైన హీనకులజుఁడైన
నిక్కమెరిఁగిన మహానిత్యుఁడే ఘనుఁడు. ॥పల్లవి॥

వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి[3]
యాదరించని సోమయాజికంటె
యేదియును లేని కులహీనుఁడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుఁడే ఘనుఁడు.[4] ॥ఎక్కువ॥

---

ఆ రేకు. 86. 1. శ్రీరాగం; 2 జనులకు. నిడు రేకు. 70. 3. హరికథల.
4. పాదసేవకుఁడె పో బ్రాహ్మణోత్తముఁడు.

పరమమగు వేదాంతపఠన దొరకియు సదా
హరిభక్తి లేని సంన్యాసికంటె
నరవిమాలిన యంత్యజాతికులజుఁడైన
నరిసి విష్ణుని వెదకునాతఁడే ఘనుఁడు. ॥ఎక్కు-వ॥

వినియుఁ జదివియును శ్రీవిభుని దాసుఁడుగాక
తనువు వేఁపుచునుండు తపసికంటె
ఎనలేని తిరువేంకటేశు ప్రసాదాన్న
మనుభవించిన యాతఁడప్పుడే ఘనుఁడు. ॥ఎక్కు-వ॥ 106

శ్రీరాగం

కనుఁగొనఁగ [1] జీవుఁడెరఁగఁడు గాక యెరిఁగినను
అనవరతవిభవంబులప్పుడే రావా. ॥పల్లవి॥

విసుగకెవ్వరినైన వేఁడనేర్చిన నోరు
దెసలకును బలుమారుఁ దెరచు నోరు
వసుధాకళత్రుఁ దడవదుగాక తడవినను
యెసఁగఁ గోరికలు తన [2] కిప్పుడే రావా. ॥కను॥

ముదమంది యెవ్వరికి [3] మ్రొక్కనేర్చిన చేయి
పొదిగి యధములనడుగఁ బూనుచేయి
అదన హరిఁ బూజసేయదుగాక చేసినను
యెదురెదురఁ గోరికలు యిప్పుడే రావా. ॥కను॥

తడయ కేమిటికైనఁ దమకమందెడి మనసు
అడరి యేమిటికైన [4] నలయు మనసు
వడి వేంకటేశుఁ గొలువదుగాక కొలిచినను
బడిబడినె చెడని సంపదలిట్లు రావా. ॥కను॥ 107

నిడురేకు. 121. 1. ఘనముఖుఁడు జీవు. 2. విభవములెల్ల నిప్పు 3. యింద ఱికి. 4. యెందుకునైన నల.

ముఖారి

జనులు నమరులును జయలిడఁగా
ఘనుఁడదె వుయ్యాలగంభముకాడ. ॥పల్లవి॥

వదలక వలసినవారికి వరములు
యెదురెదురై తానిచ్చుచును
నిదురలేక పెనునిధినిధానమై
కదలఁడదె గరుడగంభముకాడ. ॥జనులు॥

కోరినవారికిఁ గోరినవరములు
ఓరంత(ప్రొద్దు)నొసఁగుచును
చేరువమై కృపసేసీ నిదివో
కూరిముల నడిమిగోపురమాడ. ॥జనులు॥

వడి వేంకటపతి వరముల రాయఁడు
నుడుగఁ (గు?) గాళ్ళఁ గన్నులు సుతుల
బడిబడి నొసఁగుచు (ను?) బాణచారులకు
కడిమి నీడదిరుగని చింతాడ. ॥జనులు॥ 108

భవుళి

కొండ దవ్వట మొలుకగోరి పట్టుట దీన
బండాయ సంసారబంధము. ॥పల్లవి॥

వెలయఁ జిత్తంబునకు వేరుపురువై బుద్ధిఁ
గలఁగించె మోహ వికారము
కలకాలమునకు లింగమువీఁది మొలుకయె
తలకొనియె నాత్మపరితాపము. ॥కొండ॥

అరయఁ జంచలముచే నాలజాలంబువలెఁ
దిరుగ దొరకొనియెఁ దనదేహము
తిరువేంకటాచలాధిపుని మన్ననఁగాని
పరిపాటిఁ బడదు తనభావము. ॥కొండ॥ 109

63-వ రేకు. భైరవి

వీఁడివో యిదె [1] వింత దొంగ
వేఁడి పాలు వెన్న [2] వెరఁజిన దొంగ. ॥పల్లవి॥
వెలయ నీటఁ జొప్పు వేసేటి [3] దొంగ
తల గానరాక దాఁగు దొంగ
తలఁకక నేల దవ్వేటి దొంగ
తెలిసి సందెకాడఁ దిరిగేటి [4] దొంగ. ॥వీఁడి॥
అడుగుకింద లోకమడఁచేటి [5] దొంగ
అడరి తల్లికినైన నలుగు దొంగ
అడవిలో నెలవై యున్న దొంగ
తొడరి నీలికాసెతోనుండు దొంగ ॥వీఁడి॥
మోసమింతులఁ జేయు మునిముచ్చు దొంగ
రాసికెక్కిన గుఱ్ఱంపు దొంగ
వేసాలకిటువచ్చి వేంకటగిరిమీఁద
మూసినముత్యమై ముదమందు దొంగ. ॥వీఁడి॥ 110

శ్రీరాగం

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా. ॥పల్లవి॥

---

నిడురేకు. పాఠ. 1. వోయమ్మ. 2. వెన్నలుఁ బాలు. 3. వేసిన. 4. తిరుగాడు. 5. మఱఁచిన.

వాసుదేవ కృష్ణ వామన నరసింహా
శ్రీ సతీశ సరసిజనేత్రా
భూసురవల్లభ పురుషోత్తమ పీత
కాశేయవసన జగన్నాథా. ॥త్వమే॥

బలభద్రానుజ పరమపురుష దుగ్ధ
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రా సుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా. ॥త్వమే॥

వటపత్రశయన భువనపాలన జంతు
ఘటకారకరణ శృంగారాధిపా
పటుతర నిత్యవైభవరాయ తిరువేం
కటగిరినిలయ జగన్నాథా. ॥త్వమే॥ 111

## సామంతం

ఆదిదేవుఁడనఁగ మొదల నవతరించి జలధి సొచ్చి
వేదములును శాస్త్రములును వెదకి తెచ్చె నీతఁడు. ॥పల్లవి॥

వాలితిరుగునట్టి దైత్యవరుల మోహావతులనెల్ల
మూలమూలఁ ద్రోసి ముసుఁగుపాలు సేసెనీతఁడు
వేలసంఖ్యలైన సతుల వేడుకలరఁ జేసి యొంటి
యాలిమగని రీతిఁగూడి యనుభవించె నీతఁడు. ॥ఆది॥

కడుపులోని జగములెల్లఁ గదలకుండఁ బాపరేని
పడుకనొక్క మనసుతోడఁ బవ్వళించె నీతఁడు
అడుగుకింద లోకమెల్ల నడఁచఁదలఁచి గుఱుతుమీర
పొడవు పెరిగి మిన్నుజలము పొడిచి తెచ్చె నీతఁడు. ॥ఆది॥

కోడెవయసునాఁడు మంచి గోపసతుల మనసులెల్ల
ఆడికెలకు నోపి కొల్లలాడి బ్రదికె నీతఁడు
వేడుకలర వెంకటాద్రి వెలసి భూతకోటి దన్నుఁ
జూడుఁడనుచు మోక్షపదము చూఱవిడిచె నీతఁడు. ॥ఆది॥ 112

## ముఖారి

మాదృశానాం భవామయదేహినాం
ఈదృశం జ్ఞానమితి యేపి నవదంతి. ॥పల్లవి॥

వాచామగోచరం వాంఛా సర్వత్ర
నీచకృత్యైరేవ నిబిడీకృతా
కేచిదపివా విష్ణుకీర్తనం ప్రీత్యా
సూచయంతో వా శ్రోతుం నసంతి. ॥మాదృ॥

కుటిలదుర్బోధనం కూ (కు ?) హకం సర్వత్ర
విటవిడంబనమేవ వేద్మ్యధీతం
పటువిమలమార్గ సంభావనం పరసుఖం
ఘటయితుం కష్టకలికాలే నసంతి. ॥మాదృ॥

దురితమిదమేవ జంతూనాం సర్వత్ర
విరసకృత్యైరేవ విశదీకృతం
పరమాత్మానం భవ్యవేంకటనామ
గిరివరం భజయితుం కేవా నసంతి. ॥మాదృ॥ 113

## శ్రీరాగం

కాకున్న సంసారగతులేల
లోకకంటకమ్ములగు లోభంబులేల. ॥పల్లవి॥

వినికి గనవలసినను విష్ణుకీర్తన చెవికి
వినికి చేసిన నదియె వేదాంతబోధ
మనికి గనవలసినను మధువైరిపై భక్తి
వునికి ప్రాణులకు బ్రహ్మోపదేశంబు. ॥కాకున్న॥

చదువు గనవలసినను శౌరినామము దిరుగఁ
జదువుటే సకలశాస్త్రముల సమ్మతము
నిదుర గనవలసినను నీరజాక్షునికిఁ దన
హృదయమర్పణ సేయుటిది యోగనిదుర. ॥కాకున్న॥

ఆస వలసిన వేంకటాధీశ్వరుని కృపకు
నాస సేయుటె పరమానందసుఖము
వాసి గనవలసినను వైష్ణవాగారంబు
వాసి సేయుట దనకు వైభవస్ఫురణ. ॥కాకున్న॥ 114

దేశి

జీవుఁడెంతటివాఁడు చిత్తమెంతటిది తన
దైవికము గడవ నెంతటివాఁడు దాను. ॥పల్లవి॥

విచిడిపోవని యాస విజ్ఞానవాసనలఁ
గడచి మున్నాడె నెక్కడి వివేకములు
ఉడుగనియ్యని మోహామబ్ధి పరమార్థముల
మొదవట్టి నూకె నేమిటికింక నెరుక. ॥జీవు॥

పాయనియ్యని మహాబంధమధ్యాత్మతో
రాయడికిఁ దొడఁగె సైరణలేల కలుగు
మాయ నియ్యని కోపమహిమ కరుణామతిని
వాయెత్తనియ్య దెవ్వరికిఁ జెప్పదను. ॥జీవు॥

సరిలేని యాత్మచంచలమంతరాత్మకుని
నెరఁగ నియ్యదు తనకు నేఁటి పరిణత (తు?)లు
తిరువేంకటాచలాధిపుని మన్ననఁగాని
వెరసి యిన్నిటిగెలువ వెరవు మఱిలేదు. ॥జీవు॥ 115

64-వ రేకు. వరాళి

ఏమిగలదిందు నెంత పెనఁగిన వృథా
కాముకపు మనసునకు కడమొదలు లేదు. ॥పల్లవి॥

వత్తిలోపలి నూనెవంటిదీ జీవనము
ఐత్తు మీఁదటి పొల్లువిధము దేహంబు
బత్తిసేయుట యేమి పాసి పోవుటయేమి
పొత్తుల సుఖంబులకు పొరలుటలుగాక. ॥ఏమి॥

ఆకాశపాకాశమరుదైన కూటంబు
లోకరంజకము తమలోని సమ్మతము
చాకిమణుఁగులజాడ చంచలపు సంపదలు
చేకొనిననేమి యివి చెదరినను నేమి. ॥ఏమి॥

గాదెఁబోసిన కొలుచు కర్మిసంసారంబు
వేదు విడువనికూడు వెడమాయబదుకు
వేదనల నెడతెగుట వేంకటేశ్వరుకృపా
మోదంబు వడసినను మోక్షంబు గనుట. ॥ఏమి॥ 116

శ్రీరాగం

* కొంచెమును ఘనముఁ గనుఁగొననేల హరిఁదలఁచు
పంచమహాపాతకుఁడె బ్రాహ్మణోత్తముఁడు. ॥పల్లవి॥

* ఈ సంకీర్తన ౧౦౮వ సంకీర్తనకు అత్యల్ప భేదముతోడి యనువాదము.

వేదములు చదివియును విముఖుఁడై హరికథల
నాదరించని సోమయాజికంటె
ఏదియును లేనికులహీనుఁడైనను విష్ణు
పాదసేవకుఁడువో బ్రాహ్మణోత్తముఁడు. ॥కొంచె॥

పరమమగు వేదాంతపఠన దొరకియు సదా
హరిఁ దలఁచలేని సన్న్యాసికంటె
మరిగి పసురముఁ దినెడి మాలయైనను వాఁడె
పరమాత్ముఁ గొలిచినను బ్రాహ్మణోత్తముఁడు. ॥కొంచె॥

వినియుఁ జదివియు రమావిభునిఁ దలఁపక వృథా
తనువు వేఁపుచుఁ దిరుగుతపసికంటె
చనవుగల వేంకటేశ్వరు దాసులకు వెంటఁ
బనిదిరుగునధముఁడే బ్రాహ్మణోత్తముఁడు. ॥కొంచె॥ 117

బౌళి

తెలిసియు నత్యంతదీనుఁడై తన్నుఁ
దెలియఁగఁ గోరెడి తెలివె పో తెలివి. ॥పల్లవి॥

వలచిన సతి దన్ను వడిఁగాలఁ దన్నిన
అలరి యెట్లానుబ్బు నటువలెనే
తలఁక కెవ్వరు [1] గాలఁదన్నినా మతిలోన
అలుగక ముదమందునదివో తెలివి. ॥తెలిసి॥

అరిదిమోహపు [2] వనిత అలిపైఁ దిట్టిన
నరవిరై చొక్కినయటువలెనే [3]
పరులు దన్ను వెలుపలనిట్లఁ బలికిన
అరలేక రతిఁ జొక్కునదివో తెలివి. ॥తెలిసి॥

నిడుశేకు. 1. కెవ్వఁడు. 2. ఘనవనిత. 3 చొక్కునట్లనే.

తనివోక ప్రియకాంతతమ్ములపురసమాన
ననయమును నటుగోరుసటువలెనే
తనర వెంకటపతిదాసుల ప్రసాదంబు
అనిశము [1] ను గొనఁగోరునదివో తెలివి. ॥తెలిసి॥ 118

గుండక్రియ

పోరాకపోయి తలఁపుననున్న దైవంబుఁ
జేరనొల్లక పరులఁ జేరఁ దిరిగెదము. ॥పల్లవి॥

వడిఁబారు పెనుమృగము వలలలోపలఁ దగులు
వడి వెడల గతిలేక వడఁకుచున్నట్లు
చెడనికర్మములలోఁ జిక్కి భవములబాధఁ
బడియెదముగాక యేపనికిఁ దిరిగెదము. ॥పోరా॥

నీరులోపలిమీను నిగిడియామిషముకై
కోరి గాలము మ్రింగి కూలఁబడినట్లు
జారిపోయిన నేల సంసారసౌఖ్యవి
కారంపు మోహములఁ గట్టువడియెదము. ॥పోరా॥

శ్రీ వెంకటేశు నాశ్రితలోకరక్షకుని
భావింప దేవతాపతియైనవాని
సేవించుభావంబు చిత్తమొడఁబడక నే
మీవలావలిపనుల నిట్లఁ దిరిగెదము. ॥పోరా॥ 119

శ్రీరాగం

సకలసందేహమై జరుగుచున్నది యొకటి
ప్రకటింప జీవమో బ్రహ్మమో కాని. ॥పల్లవి॥

1. అనయము.

వసుదేవు జఠరమను వననిధికిఁ జంద్రుఁడై
అసమానగతిఁ బొడమినాఁడీతఁడు
వసుధఁ జంద్రుఁడు నీలవర్ణుఁడేఁటికినాయ
కసరెత్తి నునుఁగందు గలయఁగొనఁబోలు ॥సకల॥

ఇనవంశమున లోకహితకల్పభూజమై
అనఘుఁడై జనియించినాఁడీతఁడు
ననుపైన సురతరువు నల్లనేఁటికినాయ
పెనుఁగొమ్మలో చేఁగ పెరిగి రాఁబోలు. ॥సకల॥

తిరువేంకటాద్రిపైఁ దెలియఁ జింతామణై
అరిదివలెఁ బొడచూపినాఁడీతఁడు
గరిమెనది యిపుడు చీఁకటివర్ణమేలాయ
హరినీలమణుల ప్రభలలమి కొనఁబోలు. ॥సకల॥ 120

ముఖారి

చిరంతనుఁడు [1] శ్రీవరుఁడు
పరమం భవ్యం పావనం. ॥పల్లవి॥

వేదమయుఁడు కోవిదుఁడవాలుఁడు పరుఁ [2]
డాదిపురుషుఁడు మహామహుఁడు
ఏదెసనేమని యేదిదలఁచిన న
ఖేదమవాదమఖిల సమ్మతం. ॥చిరం॥

నిఖిల నిలయుఁడు మునివరదుఁడధికుఁడు
మఖముఖ శుకాభిమతరతుఁడు (?)
శిఖరం శివం సుశీలన మతిశయ
ముఖరం ముఖ్యం మూలమిదం. ॥చిరం॥

---

నిడురేకు. 66 1. చిరతరుండు శ్రీధరుఁడు. 2 డవగుఁడా.

అనేకప్రదుఁడనాది నిధనుఁడు
ఘనుఁడీతిరువేంకటవిభుఁడు
దినందినం సముదితరవికోటి భ
జనం (?) సిద్ధాంజనం ధనం. ॥చిరం॥ 121

65-వ రేకు. సామంతం

ఇందరికి నభయంబులిచ్చుఁ జేయి
కందువగు మంచిబంగారుచేయి. ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకుగుబ్బలికిందఁ జేర్చు చేయి
కలికియగు భూకాంతఁ గాఁ (గా ?) గిలించిన చేయి
వలనైన కొనగోళ్లవాఁడిచేయి. ॥ఇంద॥

తనివోక బలిచేత దానమడిగిన చేయి
ఒనరంగ భూదానమొసఁగు చేయి
మొనసి జలనిధి యమ్ముమొనకుఁ దెచ్చినచేయి
యెనయ [1] నాగేలు ధరియించు చేయి. ॥ఇంద॥

[illegible]

పురసతుల మానములు పొల్ల [2] సేసిన చేయి
తురగంబుఁ బరపెడి దొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుఁడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్లఁ దెలిపెడి చేయి. ॥ఇంద॥ 122

పాడి

అందరిబ్రదుకులు నాతనివే
కందువెల్ల శ్రీకాంతునిదే. ॥పల్లవి॥

---

నిడురేకు. 48. 1. మొనసి. 2. పొల్లు.

[illegible]

వేమరుఁ జదివెడి విప్రుల వేదము
సోము (మ ?) కవైరి యశోవిభవం
శ్రీ మించునమరుల జీవనమెల్ల సు
ధామథనుని సంతతకరుణే. ॥అందరి॥

హితవగు నిలలో నీసుఖమెల్లను
దితిసుతదమనుఁడు దెచ్చినదే
తతి తల్లిదండ్రి తానై కాచిన
రతి ప్రహ్లాదవరదునికృపే. ॥అందరి॥

అలరిన యమరేంద్రాదుల బ్రదుకులు
బలిబంధనుకృపఁ బరఁగినవే
బలసి మునులయాపదలు వాపుటకు
బలు నృపభంజను పరిణతలే. ॥అందరి॥

పూని యనాథుల పొందుగఁ గాచిన
జానకీవిభుని సరసతలే
నానాభూభరణంబులు నందుని
సూనుఁడు చేసిన సుకృతములే. ॥అందరి॥

తలకొని ధర్మము తానై నిలుపుట
కలుషవిదూరుని గర్వములే
నిలిచి లోకములు నిలిపిన ఘనుఁడగు
కలియుగమున వేంకటపతివే. ॥అందరి॥ 123

కన్నడగౌళ

పాయక మతినుండి పరగ మేలుఁగీడును
చేయించి కర్మిఁ దాఁజేయుటెప్పుడు. ॥పల్లవి॥

వెలయఁ జరాచరవిభుఁడైన విభునాత్మ
దలఁచుఁగాక ప్రాణి దానేమిసేయు
తెలిపి నిర్మలభక్తి దీపించి తనుఁజేరఁ
గొలిపించుకొనలేమి కొరత యెవ్వరిది. ॥పాయ॥

కొందరు సుఖులై కొదలేక మెలఁగఁగ
కొందరి దుఃఖవుకొరత యెవ్వరిది
అందరిమతి వేంకటాద్రివల్లభ నీవు
చెంది కర్మములఁ జేయు చేఁతయెవ్వరిది. ॥పాయ॥ 124

ఆహిరి

ఎండలోని నీడ యీమనసు
పండు గాయసేయఁ బనిలేదు మనసు. ॥పల్లవి॥

వాన చేతకములవలె నాయ మనసు
గోనఁబట్టిన బంకగుణమాయ మనసు
మానఁజిక్కినకోల మతమాయ మనసు
తేనెలోపలి యీఁగ తెఱఁగాయ మనసు. ॥ఎండ॥

గడిరాజు బదుకాయ కడలేని మనసు
నడివీది పెసరాయ నయమైన మనసు
గడకుఁ గట్టిన పాఁతగతి దోఁచె మనసు
అదుసులోపలికంబమై తోఁచె మనసు. ॥ఎండ॥

తెరువుచూపినజాడఁ దిరుగు నీ మనసు
మరుగఁజేసినచోట మరుగు నీ మనసు
తిరువేంకటేశుపైఁ దిరమైన మనసు
సిరిగలిగినచోటఁ జేరు నీ మనసు. ॥ఎండ॥ 125

## భూపాళం

అలర నుతించరో హరిని
యెలయించి మిము భ్రమయించీనిఁగాలము. ॥పల్లవి॥

చేయరో మనుజులార చింత హరినీకన్నైన
రోయరో మీభుజియించు రుచులమీఁద
కాయమస్థిరము యీ కలిమ(?)ధ్రువము చాలఁ
బోయెఁబో యెందుకుఁ గాక పోయఁ గాలము. ॥అలర॥

మెచ్చరో మనుజులార మీరే హరికథలు
పుచ్చరో మీమదిలోని పొరలెల్లాను
కొచ్చరో మనుజులార కోరికలెల్లను మీకు
నిచ్చీని శుభములు యివి యెల్లకాలము. ॥అలర॥

కనరో వేంకటపతిఁ గన్నులుదనియఁగా
వినరో యీతనిస్తుతి వీనులు నిండ
మనరో శ్రీ హరిచేతి మన్ననలు (ల ?) మీరు
తనమీఁదిమది బుద్ధి దాఁచీనిఁగాలము. ॥అలర॥ 126

## ధన్నాసి [1]

చదివెఁ బో ప్రాణి సకలము-యీ
చదువుమీఁది చదువు చదువఁడాయఁగాని. ॥పల్లవి॥

సిరులు చంచలమని చేఁతలధ్రువమని
పరగుసంసారము బయలని
తొరలినసుఖమెల్ల దుఃఖమూలమని
యెరిఁగి లోభము వీడ నెరఁగఁడాయఁ గాని. ॥చదివె॥

నిడురేకు. 34. 1. దేవగాంధారి.

తలకొన్న ధర్మమె [1] తలమీఁది మోఁపని
వలసి నొల్లమి దైవవశమని
కలిమియు లేమియుఁ గడవఁగ [2] రాదని
తెలిసి లోభము వీడఁ దెలియఁడాయఁ గాని. ॥చదివె॥

ఏచిన పరహితమెంతయుఁ దమ [3] దని
వాచవులిన్ని [4] నెవ్వగలని
యీ చందమున వేంకటేశుచేతలని [5]
చూచి లోభము వీడఁ జూడఁడాయఁ గాని. ॥చదివె॥ 127

6౧_వ రేకు. శుద్ధవసంతం

ఎందుఁ జూచినఁ దనకు నిన్నియును నిట్లనే
కందు లేని సుఖము కలనైన లేదు. ॥పల్లవి॥

సిరులు గలిగిన ఫలము చింతఁ బొరలనె కాని
సొరిది సంతోషమించుకయైన లేదు
తరుణి గలఫలము వేదనలఁ బొరలుటె కాని
నెరసు లేని సుఖము నిమిషంబు లేదు. ॥ఎందు॥

తనువు గలఫలము పాతకము సేయనె కాని
అనువైన పుణ్యంబు అదియింతలేదు
మనసు గలఫలము దుర్మతిఁ బొందనేకాని
ఘనమనోజ్ఞాన సంగతి గొంతలేదు. ॥ఎందు॥

చదువు గలిగిన ఫలము సంశయంబేకాని
సదమలజ్ఞాన నిశ్చయమింతలేదు
ఇది యెఱిఁగి తిరువేంకటేశ్వరుని గొలిచినను
బ్రదుకు గలుగును భవము ప్రాణులకులేదు. ॥ఎందు॥ 128

1. కర్మమే. 2. గడపఁగ. 3. దనదని. 4. తెల్ల. 5. లన్ని చూచి యాతుమఁ దన్నుఁ గూడ.

### ఆహిరి

సతతము నేఁజేయుననాచారములకుఁ గడ యెక్కడి
మతి నన్నుఁగని కావుము రామా రామా రామా. ॥పల్లవి॥

చేసిన నా బ్రహ్మహత్యలు శిశుహత్యలు గోహత్యలు
ఆసలనెన్నో యెన్నో ఆయాజాడలను
ఈసున నేనిపుడెరిఁగియు నెరఁగక చేసే దురితపు
రాసులకును గడలేదిదె రామా రామా రామా. ॥సతత॥

నమలెడి నావాచవులకు నానావిధభక్షణములు
కమిలిన దుర్గంధపు శాకమ్ములు దొమ్ములును
జముబాధల నరకంబుల సారెకు నన్నె (కునెటు?)టువలె శ్రీ
రమణుఁడ నన్నుఁగాచేవిటు రామా రామా రామా. ॥సతత॥

కపటపు నాధనవాంఛలు కలకాలముఁ బరకాంతలఁ
జపలపుఁ దలఁపుల చేఁతలసంఖ్యములరయఁగను
ఎపుడును నిటువలెనుండెడు హీనుని నన్నిటు గాచెదొ
రపమున శ్రీ వేంకటగిరి రామా రామా రామా. ॥సతత॥ 129

### కన్నడగౌళ

కరుణానిధిం గదాధరం
శరణాగతవత్సలం భజే.. ॥పల్లవి॥

శుకవరదం కౌస్తుభాభరణం
అకారణప్రియ [1] మనేకదం
సకలరక్షకం జయాధికం సే
వకపాలకమేవం భజే. ॥కరు॥

నిడురేకు. 70. 1. అకారణద మనేక.

ఉరగశయనం మహోజ్జ్వలం తం
గరుడారూఢం కమనీయం
పరమపదేశం పరమం భవ్యం
హరిం దనుజభయదం [1] భజే. ॥క రు॥
లంకాహరణం లక్ష్మీరమణం
పంకజసంభవ భవ ప్రియం
వేంకటేశం వేదనిలయం శు
భాంకం లోకమయం భజే. ॥కరు॥ 180

సామంతం

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడఁగించు సంకీర్తనం. ॥పల్లవి॥
సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమణఁగించు సంకీర్తనం [2]
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలఁచుఁడీ సంకీర్తనం. ॥చాలా॥
సామజముఁ గాచినది సంకీర్తనం
సామమునకెక్కుడీ సంకీర్తనం
సామీప్యమిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణుసంకీర్తనం. ॥చాల॥
జముబారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
జమళి సౌఖ్యములిచ్చు సంకీర్తనం
శమదమాదులఁ జేయు సంకీర్తనం. ॥చాల॥

1. దనుజహరం. (భయహరం అని సరియైన పాఠమేమో).
నిడురేకు. 91. 2 (రెండవ మూఁడవ పాదములు వ్యత్యస్తములు).

జలజాసనుని నోరి సంకీర్తనం
చలిగొండసుత దలఁచు సంకీర్తనం
చలువ గడు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలఁచుఁడీ సంకీర్తనం. ॥చాలు॥

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేనిదిదియ పో సంకీర్తనం
సరుస వేంకటవిభుని సంకీర్తనం
సరుగననుఁ దలఁచుఁడీ సంకీర్తనం ॥చాలు॥ 131

శుద్ధవసంతం

ఎదుటి నిధానమవెటుచూచిన నీ
వదె వేంకటగిరి యనంతుఁడా. ॥పల్లవి॥

సొగిసి భాద్రపదశుద్ధచతుర్దశి
తగువేడుకనిందరు గొలువ
పగటు సంపదలు బహుళమొసఁగు నీ [1]
వగు వేంకటగిరి యనంతుఁడా. ॥ఎదుటి॥

తొలుత సుశీలకు దుశ్శీలవలన
వెలయ సంపదల విముఖుఁడవై
వలెనిన కొలిచిన వడిఁగాచిన మా
యల వేంకటగిరి యనంతుఁడా. ॥ఎదుటి॥

కరుణఁ గాచితివి కౌండిన్యుని మును
పరగిన వృద్ధబ్రాహ్మఁడవై
దొరవులు మాపులు ధ్రువముగఁ గాచిన
హరి వేంకటగిరి యనంతుఁడా. ॥ఎదుటి॥ 132

నిడురేకు. 42. 1. సఁగినిధివగు (సగునిధి ?).

### శుద్ధవసంతం

ఏమి వొరలేరు యేమి మరలేరు
యీ మాయలంపటంబీఁద మోఁదనె కాని. ||పల్లవి||

సతులు గల మేలు దా సడిఁబొరలనే కాని
సతమైన సౌఖ్యస్వస్థానంబు లేదు
హితులు గలమేలు తానిదుమఁ బొరలనె కాని
హితవివేకము నరులకెంతైన లేదు. ||ఏమి||

తనువులెత్తిన మేలు తగులాయమే కాని
కనుఁగొనఁగ యోగభోగము గొంతలేదు
ఘనము గలమేలు తా గర్వాంధమే కాని
ఘనుఁడైన శ్రీనాథుఁ గనుఁగొనఁగలేదు. ||ఏమి||

చింతగలిగిన మేలు చివుకఁబట్టనె కాని
చింత వేంకటవిభునిఁ జింతించలేను
సంతు గలిగినమేలు సంసారమే కాని
సంతతముఁ జెడని సద్గతిఁ జేరలేదు. ||ఏమి|| 133

67-వ రేకు. ఆహిరి (ప్రచురితం)

నానాదిక్కుల నరులెల్లా
వానలలోననె వత్తురు గదలి. ||పల్లవి||

సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్రయోజనవాసులు సు
వ్రతములతోడనె వత్తురు గదలి. ||నానా||

ముదుపులు జాళెలు-మొగిఁ దలమూఁటలు
కడలేని ధనముఁ-గాంతలును
కడుమంచి మణులు-శరులుఁ దురగములు
వడిగొని చెలఁగుచు-వత్తురు గదలి. ॥నానా॥

మగ-టవర్ధనులు-మండలేశ్వరులు
జగదేకపతులుఁ-జతురులును
తగు వేంకటపతి-దరుశింపఁగ బహు
వగల సంపదల-వత్తురు గదలి. ॥నానా॥ 134

నాట

ఎంత బోధించి యేమి సేసినఁ దన
దొంతికర్మములు తొలఁగీనా. ॥పల్లవి॥

సతత దురాచార జడునకుఁ బుణ్యాసం
గతి దలపోసినఁ గలిగీనా
అతిపాపకర్మబోధకుఁడై వెలయు దుష్టు
మతిఁ దలపోసిన మరి కలిగీనా. ॥ఎంత॥

బహుజీవహింసాపరుఁడై నవానికి
ఇహపరములు దైవమిచ్చీనా
విహితకర్మములు విడిచినవానికి
సహజాచారము జరిగీనా. ॥ఎంత॥

దేవదూషకుఁడై తిరిగేటివానికి
దేవతాంతరము దెలిసీనా
శ్రీ వేంకటేశ్వరుఁ జింతింపకుండిన
పావనమతుఁడై (మతియై?) ప్రబలీనా. ॥ఎంత॥ 135

శ్రీరాగం

ఏటి బ్రదుకు - యేటి బ్రదుకు వొక్క-
మాటలోనే యటమటమైన బ్రదుకు. ॥పల్లవి॥

సంతకూటములే చవులయిన బ్రతుకు
దొంతిభయములతోడి బ్రదుకు
ముంతనీళ్ళనే మునిఁగేటి బ్రదుకు
వంతఁ బొరలి కడవరలేని బ్రదుకు. ॥ఏఁటి॥

మనసు చంచలమే మనువయిన బ్రదుకు
దినదినగండాలఁ దీరుబ్రదుకు
తనియకాసలనె తగిలేటి బ్రదుకు
వెనక ముందరి చూడ వెరపైన బ్రదుకు. ॥ఏఁటి॥

చెడి చేఁదె తీపయి తినియేటి బ్రదుకు
పగవారి పంచల పాలైన [1] బ్రదుకు
తగు వేంకటేశ్వరుఁ దలఁచని బ్రదుకు
పొగకు నోపక మంటఁ బొగిలేటి బ్రదుకు. ॥ఏఁటి॥ 136

లలిత

సకల సంగ్రహము సకల సంచయము
అకృత సుకృతమిది హరినామం. ॥పల్లవి॥

సకల వేదశాస్త్రముల సారమిది
సకల మంత్ర రాజంబునిది
సకల పురాణరసముల మనురమిది
అకుటిల పావనం [2] హరినామం. ॥సకల॥

---

నిడురేకు. 53 1. పాలిబ్రదుకు. నిడురేకు. 108. 2. అఖిలపాపఘ్నం.

సకల తత్త్వసంశయ ఖండనమిది
సకలకర్మ నిశ్చయమునిది
సకలవిధి రహస్యప్రధానమిది
అకారణహితం హరినామం. ॥సకల॥

సకలదేవతాస్వామి ప్రియంబిది
సకలలోకరక్షమునిది
ప్రకటం వేంకటపతి నామాంకిత
మకించనధనం హరినామం. ॥సకల॥ 137

పాడి

కటకటా జీవుఁడా కాలము దోలుకరాఁగ
సటవటలనే పొద్దు జరపేవుగా. ॥పల్లవి॥

సమతనన్నియును జదివి కడపటను
కుమతివై అందరిఁ గొలిచేవు గా
తమి గొని ప్రేమనెంతయును గంగకుఁబోయి
తమకించి నూతినీరు దాగేవుగా. ॥కటకటా॥

తనువుఁ బ్రాయము నమ్మి దానధర్మముమాని
చెనటివై కర్మలు సేసేవుగా
ఒనరఁగ మీఁద నొడ్డిన మొగులు నమ్మి
దొనల నీరు వెళ్ళఁదోసేవుగా. ॥కటకటా॥

ఎలమితోఁ దిరువేంకటేశుఁ గొలువలేక
పాలము రాజులవెంటఁ బొయ్యేవుగా
చిలుకకువలె బుద్ధి చెప్పినఁ గానలేక
పలుమారుకే తోఁకఁ బాడేవుగా. ॥కటకటా॥ 138

సామంతం

అందరికాధారమైన ఆదిపురుషుఁడీతఁడు
విందై మున్నారగించె విదురునికడ నీతఁడు. ॥పల్లవి॥

సనకాదులు గొనియాడెడి సర్వాత్మకుఁడితఁడు
వనజభవాదులకును దైవంబై నతఁడితఁడు
ఇనమండలమునఁ జెలగెడి హితవై భవుఁడితఁడు
మును పుట్టిన [1] దేవతలకు మూలభూతి యితఁడు. ॥అందరి॥

సిరులొసఁగి యశోదయింట శిశువై నతఁడితఁడు
ధరనావుల మందలలో తగఁ జరించె నితఁడు
సరసతలను గొల్లెతలకుఁ జనవులొసఁగె నితఁడు
అరసి కుచేలుని యడుకులా [2] రగించె నితఁడు. ॥అందరి॥

పంకజభవునకును బ్రహ్మపదమొసఁగెను యీతఁడు
సంకీర్తనలాద్యులచే జట్టిగొనియె నీతఁడు
తెంకిగ నేకాలముఁ బరదేవుఁడయిన యీతఁడు
వేంకటగిరి మీఁదఁ బ్రభల వెలసిన ఘనుఁడీతఁడు. ॥అందరి॥ 139

68వ రేకు. నాట

కాయము జీవుఁడు గలనాఁడె తెలియవలె
ఈ యన్నములు దన కెన్నఁడు. ॥పల్లవి॥

సతతము సంసారజడుఁడు దానట యాత్మ
హితవు దెలుసు కాలమెన్నఁడు
రతిసరసముల వూరకె ప్రాయమెడలంగ
ఇతరసుఖము దన కెన్నఁడు. ॥కాయ॥

---

నిడురేకు. 70. 1. ముట్టిన. 2. కులుహార.

ఎడపక ద్రవ్యమోహితుఁడై తిరుగఁ దన
యిడుమపాటు మానుటెన్నఁడు
కడలేని పొలయలుకలచేతఁ దనదేహ
మిడియఁగ నిజసుఖమెన్నఁడు. ||కాయ||

శ్రీ వేంకటేశునిఁ జేరి తక్కినసుఖ
మేవగించు కాలమెన్నఁడు
శ్రీ వల్లభుని కృప సిరిగాఁ దలఁచి జీవుఁ
డీ వైభవముఁ గాంచుటెన్నఁడు. ||కాయ|| 140

## సామంతం

అతఁడే సకలవ్యాపకుఁడతఁడే యాతురబంధువుఁ
డతఁడు దలంపుల ముంగిట నబ్బుట యెన్నఁడొకో. ||పల్లవి||

సారెకు సంసారంబను జలనిధులీఁదుచు నలసిన
వారికినిఁక దరిదాపగు వాఁడిఁక నెవ్వఁడొకో
వేరిన యజ్ఞానంబను పెనుఁజీఁకటి తనుఁ గప్పిన
చేరువ వెలుఁగై తోఁపెడి చెలియిఁక నెవ్వఁడొకో. ||అతఁడే||

దురితపుకాననములలో త్రోవటు దప్పినవారికి
తెరువిదె కొమ్మని చూపెడి దేవుఁడి (డ?) దెవ్వఁడొకో
పెరిగిన యాశాపాశము పెడగేలుగఁ దనుఁ గట్టిన
వెరవకుమని విడిపించెడి విభుఁడిఁక నెవ్వఁడొకో. ||అతఁడే||

తగిలిన యాపదలనియెడి దావానలములు చుట్టిన
బెగడకుమని వడినార్పెడి బిరుదిఁక నెవ్వఁడొకో
తెగువయుఁ దెంపును గలిగిన తిరువేంకటవిభుఁడొక్కఁడె
సొగసి తలంచినవారికి సురతరువగువాఁడు. ||అతఁడే|| 141

ముఖారి

ఎక్కడనున్నా నీతఁడు
దిక్కయి మాదెసఁ దిరిగీఁ గాక. ॥పల్లవి॥

సరసుఁడు చతురుఁడు జగదేకగురుఁడు
పరమాత్ముఁడఖిల బంధువుఁడు
హరి లోకోత్తరుఁడతఁడే నామతి
సిరితోఁ బాయక చెలఁగీఁ గాక. ॥ఎక్కడ॥

ఉన్నతోన్నతుఁడుజ్జ్వలుఁడధికుఁడు
పన్నగశయనుఁడు భవహరుఁడు
ఇన్నిటఁ గలిగిన యిందిరా (ర?) రమణుఁడు
మన్ననతో మము మనిసీఁ గాక. ॥ఎక్కడ॥

మమతల నలమేల్మంగకు నంతత
రమణుఁడు వేంకటరాయఁడు
జమళిసంపదల సరస విభవముల
తమకంబున మముఁ దనిపీఁ గాక. ॥ఎక్కడ॥ 142

కన్నడగౌళ

విశ్వప్రకాశునకు వెలియేడ లోనేడ
శాశ్వతునకూహింప జన్మమికనేడ. ॥పల్లవి॥

సర్వపరిపూర్ణునకు సంచారమికనేడ
నిర్వాణమూర్తికిని నిలయమికనేడ
ఉర్వీధరునకుఁ గాలూఁద నొకచోటేడ
పార్వతీస్తుత్యునకు భావమికనేడ. ॥విశ్వ॥

నానాప్రభావునకు నడుమేడ మొదలేడ
అననసహస్రునకు నవ్వులివలేడ
మానివ్యాదయస్థునకు మాటేడ పలుకేడ
జ్ఞానస్వరూపునకుఁ గానవినవేడ. ॥విశ్వ॥

పరమయోగీంద్రునకు పరులేడ తానేడ
దురిత దూరునకు సంస్తుతినిందలేడ
తిరువేంకటేశునకు దివ్యవిగ్రహమేడ
హరికి నారాయణునకవుఁగామలేడ. ॥విశ్వ॥ 143

## వసంతం

తలఁపులోపలి తలఁపు దైవమితఁడు
పలుమారుఁ బదియును బదియైన తలఁపు. ॥పల్లవి॥

సవతైన చదువులు సరుగఁ దెచ్చిన తలఁపు
రవళిఁ దరిగుబ్బలిని రంజిల్లు తలఁపు
కవగూడఁ గోరి (రు?) భూకాంతముంగిటి తలఁపు
తివిరి దూమకు గోళ్ళఁ దెగటార్చు తలఁపు. ॥తలఁపు॥

గొడగు వట్టినవానిఁ గోరి యడిగిన తలఁపు
తడఁబడక విప్రులకు దానమిడు తలఁపు
ఒడిసి జలనిధిని గడకూర్చి తెచ్చిన తలఁపు
జడియక హలాయుధము జళిపించు తలఁపు. ॥తలఁపు॥

వలపించి పురసతుల వ్రతము చెరిచిన తలఁపు
కలికితనములు చూపఁగలిగున్న తలఁపు
ఇల వేంకటాద్రిపై నిరవుకొన్న తలఁపు
కలుషహరమైన మోక్షగతి చూపు తలఁపు. ॥తలఁపు॥ 144

## పాడి

* అస్మదాదీనాం అన్యేషాం
తస్మిన్ తస్మిన్ తత్రచ పునశ్చ. ॥పల్లవి॥

సతతాధ్యయననిష్ఠావరాణాం దృఢ
వ్రతినాం యతీనాం వనవాసినాం
గతిరిహ స్మర్తుం కా జగత్యాం పర
స్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ. ॥అస్మ॥

మోహినామత్యంత ముమ్క్షురాణాం గుణ
గ్రాహిణాం భువనైకకరినానాం
దేహసంక్షాళన విదేశ కోవా సదా
శ్రీహరిస్మరణవిశేషః పునశ్చ. ॥అస్మ॥

కింకుర్వాణాదుఃఖిత జీవినాం
పంకిలమనోభయ భ్రాంతానాం
శంకాం నిరురుతి స్వరసాకా శ్రీ
వేంకటాచలపతేర్వినుతిః పునశ్చ. ॥అస్మ॥ 145

6 -వ రేకు. సామంతం

దొరకునా యితనికృప తుదిపదంబు
అరిది విభవములొల్ల మునినాఁ బొదలు. ॥పల్లవి॥

---

* ఈకీర్తన సమగ్రముగా లేదు. ఇందలిది యథామూలపాఠము. నిడురేకు 2 లో రెండవచరణపు మూడవపాదమున 'సంక్షాళనవిధిశ్చ కోవా' అని కొంత మేలైన పాఠము కలదు.

సొంపలర నితఁడు కృపఁజూచుటరుదని కాక
యింపు సామాన్యమా యితనికరుణ
లంపటము ఘనమైన లక్ష్మీకటాక్షములు
సంపదలు తోడనే చల్లువెదలాడు. ॥దొరకు॥

తగ నితనిపై భక్తి తగులుటరుదని కాక
నగుట సామాన్యమా ననిచి యితఁడు
జగదేక హితములుగ సరసతలు సౌఖ్యములు
దిగులువాయఁగ నితఁడు దిప్పుదీరాడు. ॥దొరకు॥

తిరువేంకటాద్రి సిద్ధించుటరుదని కాక
[1] మరుగఁ దనువిచ్చునా మరియొకరిని
ఇరవైన భోగములు ఇష్టసామ్రాజ్యములు
విరివిగొని యితని దయ వెంటనే తిరుగు. ॥దొరకు॥ 146

## బౌళి

ఎక్కడ చొచ్చెడిదీభవమేదియుఁ గడపల గానము
ఉక్కునఁ బరితాపానలమూదక మండెడిని. ॥పల్లవి॥

హృదయవికారము మాన్పఁగ నేతెరఁగును సమకూడదు
మదనానందము చెరుపఁగ మందేమియు లేదు
పొదలిన దేహగుణంబులఁ బోనడువఁగ గతిగానము
బ్రదికించిన కోరికెలకుఁ బ్రాయము దిరిగినది. ॥ఎక్కడ॥

కమలిన యజ్ఞానంబిది కన్నులముందరఁ గానదు
తిమిరము పొదిగొని చూడ్కికిఁ దెరువేమియు లేదు

---

నిడురేకు 2. 1. ఇరవు సామాన్యమా యిందరికిని, సరిలేని విభవములు సరసతలు సౌఖ్యములు అరిది నీతనిమహిమ నండ నేవుండు.

తెమలని యాశాపాశము తెంపఁగ సత్వము చాలదు
మమకారము వెడలింపఁగ మతి యెప్పుడు లేదు. ॥ఎక్కడ॥

దురితంబులు పుణ్యంబులు తోడిఁబడనాత్మను బెనగొని
జరగఁగ శరీరధారికి సత్కర్మము లేదు
తిరువేంకటగిరిపతియగు దేవశిఖామణిపాదము
శరణని బ్రదుకుట దప్పను సన్మార్గము లేదు. ॥ఎక్కడ॥ 147

గుండక్రియ

ప్రాణుల నేరమి గ దిది బహుజన్మపరంపరచే
ప్రాణులు సేసిన తమతమ పాపఫలము గాని. ॥పల్లవి॥

హరి సకలవ్యాపకుఁడని అందరుఁ జెప్పఁగ నెరిఁగియు
పరదైవంబులఁ గొలువక పాయరు మానవులు
నరపతి భూమేలఁగ భూవరు భజియింపఁగ నొల్లక
పరిసరవర్తుల బెంబడిఁ బనిసేసిన యట్లు. ॥ప్రాణు॥

పొందుగఁ దమతమ చేసిన పూజలు మ్రొక్కులు గైకొను (న?)
అందముగాఁ బురుషోత్తముఁడాతఁడె కలఁడనియు
అందరు నెరిఁగియు ఇతరులఁ జెందుదురున్నతశైలము
నందక చేరువతరువుల నందుకొనినయట్లు. ॥ప్రాణు॥

శ్రీ వేంకటపతి యొక్కఁడె చెప్పఁగ జగములకెల్లను
దైవము నాతుమలోపలి ధనమనఁగా విని యు
సేవింపరు పామరులీదేవుని మధురంబొల్లక
వావిరిఁ బులుసులు చేఁదులు వాలెనని కొనునట్లు. ॥ప్రాణు॥ 148

ధన్యాసి

ఘోరదురితములచే గుణవికారములచే
నీరీతిఁ బడు నాకు నేది దెరువు ॥పల్లవి॥

హరి జగన్నాథు * లోకారాధ్యు
నెరఁగ నేరని వానికేది దెరువు
పరమపురుషుని జగద్భరితు నంతర్వ్యాప్తి
నిరవుకొలుపని వానికేది దెరువు. ॥ఘోర॥

శ్రీ వేంకటేశుఁ దలఁచిన వెనక సకలంబు
నేవగింపని వానికేది దెరువు
దేవోత్తముని మహిమ దెలిసి తెలియఁగలేని
యీ వివేకంబునకు నేది దెరువు. ॥ఘోర॥ 149

7_వ రేకు. ఆహిరి

ఏపనులు సేసినా నిటువలెనె పో
యీ పనికిఁ జొరనిపని యేటిలో పైరు. ॥పల్లవి॥

హరికథలమీఁది ప్రియమబ్బు (బ్బె?) నా తొంటితమ
పరిపక్వమగు తపః ఫలము గాక
గరిమె నివిలేకున్నఁ గలకాలములుఁజేయు
నిరతంపుఁదపమెల్ల నీటిలో [1] వ్రాఁత. ॥ఏపను॥

నారాయణుని భక్తి ననిచెనా ధనమెల్లఁ
బారఁజల్లిన దానఫలమదియు పో

---

* ఇందు 'అఖిలాత్మ' వంటి పదమొకటి నైదుమాత్రలది లోపించినది గాఁబోలును. నిడురేకు. 47. 1. నీటిపై.

కోరి యివి [1] లేకున్న కోటిదానములైన
పేరుకొని [2] వరత{ గలిపిన చింతపండు. ॥ఏపను॥

వదలకిటు వేంకటేశ్వరుడె దైవంబనుచు{
జదువ{గలిగిన మంచి చదువదియె పో
పదిలముగ నీవిధము పట్టీయకుండినను
చదువులసురులు మన్ను చదివేటిచదువు. ॥ఏపను॥ 150

శ్రీరాగం - జంపె

అణురేణు పరిపూర్ణుడైన శ్రీ వల్లభుని{
బ్రణుతించువారువో బ్రాహ్మలు. ॥పల్లవి॥

హరినామములనె సంధ్యాదివిధులొనరించు
పరిపూర్ణమతులువో బ్రాహ్మలు
హరిమంత్ర వేదపారాయణులు హరిభక్తి
పరులైనవారువో బ్రాహ్మలు. ॥అణు॥

ఏవిచూచినను హరి యిన్నిటా{ గల{డనుచు
భావించువారువో బ్రాహ్మలు
దేవకీనందనుడె దేవుడని మతి{ దెలియు
పావనులు వారువో బ్రాహ్మలు. ॥అణు॥

ఆదినారాయణుని ననయంబు{ దమయాత్మ{
బాదుకొలిపినవారు బ్రాహ్మలు
వేదరక్షకుడైన వేంకటగిరీశ్వరుని
పాదసేవకులువో బ్రాహ్మలు. ॥అణు॥ 151

1. యిది. 2. కొన.

## దేశాక్షి

సీతా శోక విఘాతక వో
పాతాళలంకాపతి విభాళా. ॥పల్లవి॥

హనుమంతరాయా అంజనీతనయ వో
వనధిలంఘనగాత్ర వాయుపుత్రా
ఇనకులాధిప నిజహిత జగన్నుత
వనజోదరసేవక సత్వధనికా. ॥సీతా॥

ప్రళయాంతకరూప బలదీప రవిఫల
గిళన ప్రతాప సుగ్రీవప్రియా
కుళకదానవ సంకుల విదారణ
భళిభళి జగత్పతి బలువంటా. ॥సీతా॥

పంకజాసను దివ్యపదవై భవ వో
లంకిణీప్రాణ విలంఘన
వేంకటేశ్వరు సేవావీర మహాధీర
కింకరరాయ సుఖిభవా. ॥సీతా॥ 152

## శ్రీరాగం

ఇన్ని జన్మములేటికి హరిదాసు
లున్నవూరఁ దాముండినఁ జాలు. ॥పల్లవి॥

హరిభక్తుల యింటి యన్నము గొనువారి
వరుసవృషై యుండవలెనన్నఁ జాలు
పరమభాగవతభవనంబులఁ జెడ్డ
పురువు దానయి పొడమినఁ జాలు. ॥ఇన్ని॥

వాసుదేవుని భక్తవరుల దాసులు మున్ను
రోసిన యెంగిలి రుచిగొన్నఁ జాలు
శ్రీ సతీశునిఁ దలఁచినవారి దాసాన
దాసుఁడై వుండఁ దలఁచినఁ జాలు. ॥ఇన్ని॥

శ్రీ వేంకటేశుఁ జూచినవారి శ్రీ పాద
సేవకుఁడై యుండఁ జేరినఁ జాలు
ఈ విభుదాసుల హితుల పాదధూళి
పావనమై సోఁకి బ్రదికినఁ జాలు. ॥ఇన్ని॥ 153

ముఖారి

భోగీంద్రులును మీరుఁ బోయి రండు
శ్రీగగ మీఁదటి విభవాలకు. ॥పల్లవి॥

హరుఁడ పోయిరా అజుఁడ నీవునుఁ బోయి
తిరిగి రా మీఁదటి తిరుణాళ్ళకు
సురలు మునులును భూసురలుఁ బోయి రండు
అరవిరినిన్నాళ్ళ నలసితిరి. ॥భోగీం॥

జముఁడ పోయిరా శశియు [1] నీవును బోయి
సుముఖుఁడవై రా సురలఁ గూడి
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయి రండు
ప్రమదాన నిన్నాళ్ళు బడలితిరి. ॥భోగీం॥

నారద సనకసనందనాదులు
భూరివిభవములఁ బోయి రండు
దూరముగాఁ బోకిట్టె [2] తొరలి వేంకటగిరిఁ
జేరి నన్నిట్లనే సేవించుఁడీ. ॥భోగీం॥ 154

---

నిడురేకు. 53. 1 శని సీ. 2 దూరంగాకిట్టే.

సామంతం

అతనికెట్ల సతమైతినో కదు
హితవో పొందుల హితవో యెఱఁగ. ॥పల్లవి॥

హృదయము తలఁపున నిరవయినఁ గదా
పదిలమాను లోపలిమాట
వెదకిన చిత్తము వెరవెఱఁగదు నే
నెదిరి నెఱఁగ నేనేమియు నెఱఁగ. ॥అతని॥

కాలూఁద మనసు గలిగి కదా నా
తాలిమి మతిలోఁ దగులాట
మేలిమి పతితో మెలఁగుటేదో నే
నేలో నేనిపుడెక్కడో యెఱఁగ. ॥అతని॥

నేఁడని రేపని నేనెఱిఁగి కదా
పోఁడిమి మతిలో పొలుపాట
వాఁడె వేంకటేశ్వరుఁడు రాఁగలిగె
ఆఁడుజన్మమేనాటిది యెఱఁగ. ॥అతని॥ 155

78-వ రేకు. శ్రీరాగం

ఎట్టు వేగించేదిందుకేగురే సితరకాండ్లు
వెట్టివేమీ సేయుమంటా వెన్నడించే రిపుడు. ॥పల్లవి॥

ఒంటికాలఁ గుంటికుంటి ఊరిబందెలకుఁ జిక్కి
పంటదాఁకా దున్ని నొక్క పసురము
గంటు గంటులాకలొత్తి కల్లల నడిమిపంట
కుంటివాఁడు గావలుండి కుప్పలేర్పవరచె. ॥ఎట్టు॥

కలది కుక్కివాంచము కన్నవారెల్లాఁ బండేరు
తలెతో దొగ్గినంబలి దావకూళ్ళు
వెలిఁ గంతలకొంపలు వీడుఁబట్లు చూపేరు
తలవరులెందులోనాఁ దప్పు వెదకేరు. ॥ఎట్టు॥

ఒళ్ళుచెడ్డ వాఁడొకఁడు ఉభయమార్గము గొని
కల్లదొర పుట్టుబడి కడుఁగట్టీని
చల్లని శ్రీ వేంకటేశ సకలలోకపతివి
ఇల్లిదే నీశరణంటిమిందరిని గావవే. ॥ఎట్టు॥ 156

## లలిత

తప్పదు తప్పదు దైవముకృప యిది
ముప్పిరినింతా ముకుందుఁడే. ॥పల్లవి॥

వెక్కసపుమతి వెలుతులు దీరిన
నెక్కడఁ జూచిన నీశ్వరుఁడే
గుక్కక యాసలు గోసివేసినను
నిక్కమడుగడుగు నిధానమే. ॥తప్ప॥

పొంచి శరీరపు భోగములుడిగిన
చుంచుఁ బాపములు సుకృతములే
దంచెడి విషయపు తగులమిఁ (ము?) బాసిన
ఎంచి చూచినను యిహామే పరము. ॥తప్ప॥

శ్రీ వేంకటపతి సేవే కలిగిన
వేవేలు వగలు వేడుకలే

చేవదీరె సందియము లేదిదే *
భావము నమ్మిన ప్రపన్నులకును. ॥తప్ప॥ 157

బౌళి

దేవ నీవిచ్చేయందుకు దీనికేఁగా నింతయేల
యేవేళ మాయెరుకలు యెందుకుఁ గొలుపును. ॥పల్లవి॥

ఎవ్వరి వసములు బుద్ధెరిఁగి నడచేమన
యివ్వల నారాయణ నీవియ్యకలేదు
దవ్వుచేరువమనను తనయిచ్చయితేఁ గనక
రవ్వగ మృగాదులెల్ల రాజ్యమేల నేరవా. ॥దేవ॥

సారెకు నిన్నుఁ దలఁపించ జంతువుల వసమా
కేరి నీవు జిహ్వఁ బలికించఁగాఁ గాక
యీరీతి లోకమెల్లాఁ దమయిచ్చకొలఁదులనయితే
దూరానఁ గొక్కెగలు చదువవా వేదాలు. ॥దేవ॥

ఇందరి పాపపుణ్యాలు ఇన్నియు నీచేఁతలే
కందువ స్వతంత్రులు గారు గాన
చందపు శ్రీ వేంకటేశ శరణంటి నిదె నీకు
చెంది నీవేకాతుగాక చేఁతలూను వలెనా. ॥దేవ॥ 158

సామంతం

పరుస మొక్కటేకాదా పయిఁడిగాఁ జేసేది
అరయ లోహమెట్టున్నా నందుకేమీ. ॥పల్లవి॥

* ఈ పాదమున యతిలేదు. 'చావదీరె సంశయము లేదిదే' అని పాఠము గాఁబోలును. 'చేవ' యే 'చావ' గా వ్రాఁతలోనుండుట సామాన్యము.

వనజనాభుని భక్తి వదలకుండినఁ జాలు
మనసు యెందు దిరిగినా మరియేమి
మొనసి ముద్రలు భుజముల నుండితేఁ జాలు
తను వెంత హేయమైనా దానికేమి. ॥పరుస॥

శ్రీకాంతు నామము జిహ్వఁ దగిలితేఁ జాలు
ఏకులజుఁడైనాను హీనమేమి
సాకారుఁడైన హరి శరణుచొచ్చినఁ జాలు
చేకొని పాపములెన్ని చేసినానేమి. ॥పరుస॥

జీవుఁడెట్టున్నానేమి జీవునిలో యంతరాత్మ
శ్రీవేంకటేశునకా చింతయేమి
యేవలనఁ బరమైన యిహమైన మాకుఁ జాలు
కైవశమాయ నతఁడు కడమలింకేమిరా. ॥పరుస॥ 159

## భూపాళం

మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగనిద్ర చాలు మేలుకోవయ్యా. ॥పల్లవి॥

ఆవులు పేయలకుఁగా నఱచీ బిదుకవలె
గోవిందుఁడ యిఁక మేలుకోనవయ్యా
ఆవలీవలి పడుచులాటలు మరిగి వచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా. ॥మిన్నక॥

వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడఁ
గూడి యున్నారిదే మేలుకోనవయ్యా
తోడనె యశోద గిన్నెతోఁ బెరుగు వంటకము
ఈడకుఁ దెచ్చిపెట్టె నిఁక మేలుకోవయ్యా. ॥మిన్నక॥

పిలిచీ నందగోపుఁడు పేరుకొని యదె కన్నుఁ
గొలుకులు విచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీ వెంకటాద్రిమీఁది బాలకృష్ణ
యిల మామాటలు వింటివిఁక మేలుకోవయ్యా. ॥మిన్నక॥ 160

పాడి

ఇందునుండ మీకెడలేదు
సందడి సేయక చనరో మీరు. ॥పల్లవి॥

నాలుక శ్రీ హరి నామంబున్నది
తూలుచుఁ బారరో దురితములు
చాలి భుజంబున చక్రంబున్నది
తాలిమి భవబంధములటు దలరో. ॥ఇందు॥

అంతర్యామై హరి వున్నాఁడిదె
చింతలు వాయరో చిత్తమున
వింతలఁ జెవులను విష్ణుకథలివిగో
పొంతఁ గర్మములు పోరో మీరు. ॥ఇందు॥

కాపయి శ్రీ వేంకటపతిపేరిదె
నాపై నున్నది నయమునను
కోప (పు) కామాదిగుణములాల మీ
రేపున కడఁగడ నెందైనఁ బోరో. ॥ఇందు॥ 161

79.వ రేకు. రామక్రియ

నీయాజ్ఞ దలమోచి నీదేహధారినై తి
ఈయెడ గోవిందుఁడ నేనీడేరేదెట్లో. ॥పల్లవి॥

తనువు వేసరినాను తలఁపు వేసరదు
ధనము గడించెడి తరితీపున
చెనకి మగఁడు విడిచిన మ్రాను విడువని
పనియాయ వారి నాబదుకుజాడ యెట్లో. ॥నీయా॥

పాయము ముదిసినాను భావము ముదియదు
వేయైనా సంసారవిషయాలను
ఓయయ్య కలివోసినా ఉట్లదిక్కు చూచేది
మాయదాయ నీకనా మనసుజాడెట్లో. ॥నీయా॥

కడలేని నావిధులు కన్నులారఁ జూచి నీవు
నడుమ శ్రీ వేంకటేశ నన్ను నేలితి
నొడుగులు దప్పినాను నోముఫలము దప్పని
అడియాల మబ్బె నాకు నానతిచ్చితెట్లో. ॥నీయా॥ 102

భూపాళం

మేదిని జీవులఁ గావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష నిద్రమేలుకోవయ్యా. ॥పల్లవి॥

తగు గోపికల కన్నుఁదామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుఁడ మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనే తిమిరము విరియఁగ
నెగడిన పరంజ్యోతి నిద్రమేలుకోవయ్యా. ॥మేది॥

ఘనదురితపు నల్లఁగలువలు వికసించె
మినుకు శశివర్ణుఁడ మేలుకోవయ్యా.
పనివడి వేదాలనే పక్షులెల్లాఁ బలుకఁగ
జనక (?) యాశ్రితపారిజాత మేలుకోవయ్యా. ॥మేది॥

వరలక్ష్మికుచ చక్రవాకములొండొంటి రాయ
మెరయు దోషారహిత మేలుకోవయ్యా
పొరసి నీవు నిత్యభోగములు భోగించ
నిరతి శ్రీ వేంకటేశ నేఁడు మేలుకోవయ్యా. ॥నేఁది॥ 163

## లలిత

ఆతుమ సంతసపెట్టుటది యెఱుక, తా
నే తెరువు నొల్లకుండుటిదియే యెఱుక. ॥పల్లవి॥

ముంచిన బంధములలో మునుఁగుడువడక తా
నంచల విడఁదన్నుటది యెఱుక
చంచలపు విషయాల సగ్గుడు ముగ్గుడు గాక
యెంచిఁ హరిఁ దలపోయుటిదియే యెఱుక. ॥ఆతుమ॥

పాయని యర్థములకు బంటుబంటై తిరుగక
ఆయతమై మోనపోనిదది యెఱుక
పాయపుఁ గామినులతోఁ బలుమారుఁ జేయు పొందు
హేయమని తలపోయుటిదియే యెఱుక. ॥ఆతుమ॥

ధరమీఁదఁగల ప్రాణితతుల నొప్పించక
అరయఁగ సముఁడగుటది యెఱుక
గరిమల శ్రీ వేంకటపతి దాసుఁడై
ఇరవొంద సుఖించుటిదియే యెఱుక. ॥ఆతుమ॥ 164

## రామక్రియ

ఇందిరానాయక యిదివో మాపాటు
చెంది నీవేగతి చేకొనవయ్యా. ॥పల్లవి॥

తీసీఁ గోరిక తీదీపులోకవంక
లాసీ సంసారలంపటము
మూసీఁ గర్మము మునుకొని పరచింత
నేనేదేమిఁకఁ జెప్పేదేమి. ॥ఇంది॥

వంచీనానలు వలసిన చోటికి
పొంచీ దుర్గుణభోగములు
ముంచీ యౌవన మోహాంధకారము
ఎంచేదేమి సోదించేదేమి. ॥ఇంది॥

ఎటిఁగీఁ జిత్తము ఇంచుకించుక నిన్ను
మఱవని నీపై భక్తి మతినుండఁగా
నెటి శ్రీ వేంకటపతి నీవే కాతువుగాక
వెఱచి నేఁజేసే విన్నపమేమి. ॥ఇంది॥ 165

### రామక్రియ

నారాయణాయ నమో నమో నానాత్మనే నమో నమో
ఈరచనలనే యెవ్వరు దలఁచిన ఇహపరమంత్రము లిందరికి. ॥పల్లవి॥

గోవిందాయ నమో నమో గోపాలాయ నమో నమో
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో యనుచు
ఈవరుసలనే యెవ్వరు దలఁచిన ఇహపరమంత్రములిందరికి. ॥నారా॥

దామోదరాయ నమో నమో ధరణీశాయ నమో నమో
శ్రీ మహిళాపతయే నమో శిష్టరక్షిణే నమో నమో
వామనాయతే నమో నమో వనజాక్షాయ నమో నమో
యీ మేరలనే యెవ్వరు దలఁచిన ఇహపరమంత్రములిందరికి. ॥నారా॥

పరిపూర్ణాయ నమో నమో ప్రణవగ్రాయ (?) నమో నమో
చిరంతన శ్రీ వేంకటనాయక శేషశాయినే నమో నమో
నరకధ్వంసే (?) నమో నమో నరసింహాయ నమో నమో
ఇరవుగ నీగతి నెవ్వరు దలంచిన యిహపరమంత్రము లిందరికి. ॥నారా॥ 166

లలిత

అంతర్యామీ అలసితి సొలసితి
ఇంతట నీశరణిదె చొచ్చితిని. ॥పల్లవి॥

కోరిన కోర్కులు కోయనికట్లు
తీరవు నీవవి తెంచక
భారపు బగ్గాలు పాపపుణ్యములు
నేరుపులం బోనీవు నీవు వద్దనక. ॥అంత॥

జనుల సంగములం జక్కరోగములు
విను విడువవు నీవు విడిపించక
వినయపుదైన్యము విడువనికర్మము
చనదది నీవిటు సంతపరచక. ॥అంత॥

మదిలో చింతలు మయిలలు మణుగులు
వదలవు నీవని వద్దనక
యెదుటనె శ్రీ వేంకటేశ్వర నీవదె
అదనం గాచితివి అట్టిట్టనక. ॥అంత॥ 167

80-వ రేకు. ఆహిరి

దేవ నీమాయ తిమిరమెట్టిదో నా
భావము చూచి కొంచ్చనం గావవే. ॥పల్లవి॥

వెడ దుఃఖమపుడెల్లా వేసరుచుండుదుఁ గాని
తడవి విరతిఁ బొంది తలఁగలేను
అడియాసలఁ దిరిగి అలయుచుండుదుఁ గాని
మడి దొసకు (గు?) లనివి మాన లేను. ॥దేవ॥

హేయము శ్రీ (స్త్రీ?) సుఖముఁ యెఱుఁగుచుండుదుఁ గాని
పాయపుమదము చేతఁ బాయలేను
పాయని పాపాలు చూచి భయమందుచుండుఁ గాని
ఓయయ్య యివి సేఁకుండలేను. ॥దేవ॥

కలకాలమిన్నియును గందు విందుఁ గాని మఱి
యెలమినొక్కటనైన నెచ్చరలేను
బలిమి శ్రీ వేంకటేశ బంధముక్తునిఁ జేసి
తలఁపులో నెలకొని దయఁ జూడవయ్యా. ॥దేవ॥ 168

పాడి

అభయ మభయమో హరి నీకు (వు?)
విభుఁడ వింతటికి వెరవిఁక నేది. ॥పల్లవి॥

జడిగొని మదిలో శాంతము నిలువదు
కడుఁ గడు దుస్సంగతివలన
ఇడుమలేని సుఖమించుక కానము
అడియాసల నాయలమటవలన. ॥అభయ॥

తలఁపులోన నీతత్త్వము నిలువదు
పలులంపటముల భ్రమవలన
కలిగిన విజ్ఞాన గతియు దాఁగెను
వెలివిషయపు పిరివీకులవలన. ॥అభయ॥

పక్కన పాపపుబంధములూడెను
చిక్కక నినుఁ దలఁచినవలన
చిక్కులు వాసెను శ్రీ వేంకటపతి
నిక్కము నాకదె నీ కృపవలన. ॥అభయ॥ 169

## బౌళి

కొందరికివి సమ్మతివైతే కొందరికవి గావు
ఇందరిలోపల నీ వెడమాయలు యెగతిఁ దెలిసే నేనయ్యా. ॥పల్లవి॥

దూరము కర్మమునకు జ్ఞానము తోడనె (తోడుసే?) వొండొకటికిని
దూరము పరమునకుఁ బ్రపంచము తొలుత విరుద్ధంబు
దూరము విరతికి సంసారము తుదమొదలే లేదు
ఈ రీతుల నీ వెడమాయలు యెగతిఁ దెలిసెద నే నయ్యా. ॥కొంద॥

కూడదు దేహమునకు నాత్మకు గోత్రవిరోధంబెన్నఁడును
కూడదు కోపమునకు శాంతము గుణావగుణములను
కూడదు బంధమునకు మోక్షము కోరికలే కట్లుగాన
యేకఁగాలఁదిగా శ్రీహరిమాయలు యెగతిఁ దెలిసెద నేనయ్యా. ॥కొంద॥

శ్రీ వేంకటపతి నన్నిగతిఁ జిక్కించితివీజగమునను
భావింపఁగరాదు నీ మహిమ బహుముఖములయర్థము గాన
యేవిధమును నేఁటికి నాకిఁక యెందెందని తగిలెద నేను
దైవికమగు నీ దాసానుదాస్యము దక్కినదే నాకు. ॥కొంద॥ 170

## పాడి

అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీ రఘురామా. ॥పల్లవి॥

కులమును నీవే గోవిందుఁడా నా
కలిమియు నీవే కరుణానిధీ
తలఁపును నీవే ధరణీధరా నా
నెలవును నీవే నీరజనాభా. ॥అంత॥

తనువును నీవే దామోదరా నా
మనికియు నీవే మధుసూదనా
వినికియు నీవే విఠ్ఠలుఁడా నా
వెనక ముందు నీవే విష్ణుదేవుఁడా. ॥అంత॥

పుట్టుగు నీవే పురుషోత్తమా కొన
నట్టనడుమ నీవే నారాయణా
యిట్టె శ్రీ వేంకటేశ్వరుఁడా నాకు
నెట్టన గతియింక నీవే నీవే. ॥అంత॥ 171

బౌళి

అన్నిటా నీ వంతర్యామివి అవుట ధర్మమే అయినాను
ఎన్నఁగ నీ వొక్కఁడవే గతియని మెంచి కొలుచుటే ప్రపన్న సంగతి. ॥పల్లవి॥

ఏకాంతంబున నుండిన పతిని యెనసి రమించుటె సతి ధర్మంబు
లోకము రచ్చలలోనుండిన పతి లోఁగొని పైకొని (న?) రానట్లు
ఈ కొలఁదులనే సర్వదేవతల యిన్నిరూపులై నీ వున్నప్పుడు
కైకొని నిను బహుముఖములఁ గొలుచుట గాదు పతివ్రతధర్మంబు. ॥అన్ని॥

పూనిన బ్రాహ్మణులలోపలనె నినుఁ బూజించుట వేదోక్త ధర్మము
శ్వానకుక్కుటాదులలోపల నిను సరిఁ బూజించఁగ రానట్లు
ఈ నియమములనె ప్రాకృతజనులను ఈశ్వర నీ శరణాగత జనులను
కానక వొక్కట సరిగాఁ జూచుట కాద (ది?) వివేక ధర్మంబు. ॥అన్ని॥

శ్రీ వేంకటపతి గురువనుమతినే సేవే నాకును శిష్యధర్మము
అవల నీవల నితరమార్గములు ఆత్మలోన రుచిగానట్లు
భావింపఁగ సకల ప్రపంచమును బ్రహ్మం సత్యజ్ఞానమనంతము
కై వశమై యిన్నిటా వెనుతగులు కాద(ది?) వివేకధర్మంబు. ॥అన్ని॥ 172

ఆహిరి

కోరు వంచరో కోటారు
ఆరసి మనసా అంతరాత్మకు. ॥పల్లవి॥

కొండల పొదవులు కోరికకుప్పలు
పండిన పంటలు భవములివి
నిండినరాసులు నిజకర్మంబులు
అండనె యివె మాయారంభములు. ॥కోరు॥

వెలిధాన్యంబులు విషయపురాసులు
పొలివారేటి వూరుపు గములు (?)
కలుషపు మదమున కాపుగప్పినవి
అలవి మీఱ మాయారంభములు. ॥కోరు॥

బడినింద్రియముల బంతులు నురివి
కడు రతుల దండగట్టలతో
ఎడనెడ శ్రీ వేంకటేశు మహిమలవె
అడియాలపు మాయారంభములు. ॥కోరు॥ 173

# సూచిక 1

## సంకీర్తన రాగముల అకారాది సూచిక

| రాగములు. | సంకీర్తన సంఖ్యలు. |
|---|---|
| ఆహిరి | (i) 48, 72. (ii) 1, 4, 6, 15, 26, 27, 44, 60, 67. (iii) 1, 12, 23, 24, 35, 45, 47, 53, 56, 59, 82, 83, 86, 89, 90, 92, 103, 125, 129, 134, 150, 168, 173. |
| కన్నడగౌళ | (i) 61, 73, 125, 186. (ii) 42. (iii) 5, 13. 65, 96, 101, 124, 130, 143. |
| కాంబోధి | (i) 12, 94 (ii) 30, 31. |
| కేదారగౌళ | (i) 6. (ii) 73. |
| గుండక్రియ | (i) 20, 22, 23, 29, 3 , 37, 44, 75, 106, 109, 113, 122, 153. (ii) 55. (iii) 11, 119, 148. |
| గుజ్జరి | (i) 79, 104, 138 155, 178, 201, 236. (iii) 42, 48. |
| గౌళ | (i) 156, 188. (iii) 3. |
| ఛాయానాట | (iii) 98. |
| తెలుగు కాంబోధి | (i) 105. |
| తోండి | (i) 136, 174. |
| దేవగాంధారి | (i) 82, 115, 126, 170, 190, 192. (ii) 20, 56, 71. (iii) 4, 72. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| దేశి | (i) 146, (iii) 115. |
| దేసాక్షి | (i) 85, 168, 234. (ii) 49, 58. (iii) 10, 79, 152. |
| దేసాళం | (ii) 59. (iii) 15. |
| ధన్నాసి | (i) 83, 180. (ii) 10, 64. (iii) 71, 100, 102, 127, 149. |
| నాట | (i) 200, 204, 213, 218, 235. (ii) 18, 37. (iii) 2, 9, 26, 31, 34, 68, 69, 91, 105, 135, 140. |
| నాదరామక్రియ | (iii) 27. |
| నారాయణి | (i) 84. (iii) 33. |
| పళవంజరం | (i) 2. (ii) 34. |
| పాడి | (i) 66, 90, 103, 159, 167, 196, 207, 216. (ii) 32, 51, 72. (iii) 66, 123, 138, 145, 161, 169, 171. |
| బౌళి | (i) 24, 49, 53, 67, 98, 102, 121, 135, 141, 142, 157, 161, 165, 169, 176, 206, 214, 217. (ii) 5. (iii) 6, 30, 36, 38, 64, 85, 109, 118, 147, 158, 170, 172. |
| బౌళి రామక్రియ | (i) 4, 54, 124, 224, 230. (ii) 24. |
| భల్లాటి | (i) 13. |
| భూపాళం | (i) 7, 110, 116, 130. (ii) 13, 21, 23, 45, 66. (iii) 21, 55, 57, 126, 160, 163, |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| భైరవి | (i) 10, 91, 114, 151, 154. (iii) 51, 70, 110. |
| మంగళకౌశిక | (i) 59, 87. |
| మలహరి | (i) 89, 108. (ii) 39. (iii) 99. |
| మాళవ శ్రీ | (i) 5, 76. |
| మాళవి | (i) 74, 175. 183. (iii) 54. |
| మాళవిగౌళ | (i) 107, 148, 195, 211, 219, 225. (iii) 80. |
| ముఖారి | (i) 14, 30, 32, 43, 51, 57, 58, 92, 97, 140, 145, 158 (ii) 12, 50, 62, 67 68 (iii) 17, 60, 61, 62, 74, 75, 88, 108, 113, 121, 142, 154. |
| మేచబౌళి | (ii) 46. |
| రామక్రియ | (i) 19, 41, 45, 46, 47, 63, 70, 96, 131, 133, 163, 187, 197, 203, 210, 215, 220, 227, 231. (ii) 3, 19, 76. (iii) 8, 18, 162, 165, 166. |
| లలిత | (i) 16, 21, 26, 27, 34, 39, 42, 50, 53, 56, 63, 65, 68, 80, 81, 93, 100, 101, 111, 117, 119, 123, 129, 134, 143, 147, 152, 166, 173, 183, 185, 189, 191, 199, 209, 232. (ii) 8, 11, 43, 54, 75. (iii) 28, 40, 137, 157, 164, 167. |
| వరాళి | (i) 11, 33, 71, 132, 144, 160, 184. (ii) 57. (iii) 7, 39, 43, 93, 95, 116. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| వసంతం | (i) 3, 8. (iii) 144. |
| శంకరాభరణం | (i) 88. 120, 150, 164, 212, 223, 229. (ii) 40, 53 (iii) 14, 16, 81. |
| శుద్ధవసంతం | (i) 99, 171. (iii) 50, 97, 128, 132, 183. |
| శోకవరాళి | (i) 139 (ii) 28. |
| శ్రీరాగం | (i) 1, 81, 78, 127. (ii) 2, 7, 9, 33, 41, 61, 63, 70, 74. (iii) 9, 22, 29, 46, 49, 73, 87, 104, 107, 111, 117, 120, 136, 151, 153, 156. |
| సామంతం | (i) 15, 18, 34, 55, 60, 64, 69, 77, 95, 112, 118, 128, 137, 149, 162, 172, 179, 194, 202, 221, 228. (ii) 14, 16, 17, 22, 25, 29, 35, 36, 65, 69. (iii) 20, 25, 32, 37, 44, 52, 58, 63, 67, 76, 77, 94, 106, 112, 122, 131, 139, 141, 146, 155, 159. |
| సాళంగ | (i) 25. (ii) 38. (iii) 41, 84. |
| సాళంగనాట | (i) 17, 23, 40, 177, 181, 193, 198, 205, 222, 226, 233. (iii) 78. |
| హిందోళం | (i) 9, 86. |

# సూచిక 2

## సంకీర్తనల అకారాది సూచిక


| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| అంటిఁబొరి పట్టు | ఆహిరి | 255 |
| అంటుకోకురో | రామక్రియ | 174 |
| అంతయు నీవే | పాడి | 33 |
| అంతర్యామీ | లలిత | 329 |
| అందరికాధార | సామంతం | 310 |
| అందరిబ్రదుకులు | పాడి | 298 |
| అందరివసమా | రామక్రియ | 165 |
| అంది చూడఁగ నీకు | గుండక్రియ | 24 |
| అక్కడ నా పాట్లువడి | ఆహిరి | 2 8 |
| అచ్చపురాల యమున | మేచబౌళి | 193 |
| అడియనడియనయ్య | బౌళి | 81 |
| అణురేణుపరి | శ్రీరాగం | 318 |
| అతఁడే యెక్కుడు | ముఖారి | 62 |
| అతఁడే యెరుఁగును మము | లలిత | 99 |
| అతఁడే రక్షకుఁడంద | దేసాక్షి | 57 |
| అతఁడే సకల | సామంతం | 311 |
| అతనికెట్ల సత | సామంతం | 331 |
| అతిదుష్టుఁడ నే | ఆహిరి | 225 |
| అదరీ బెదరీనంత | బౌళిరామక్రియ | 178 |
| అదిగాన నీతి కాంతా | సామంతం | 150 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| అది బ్రహ్మాండంబిది | శ్రీరాగం | 52 |
| అదె చూడరయ్యా | బౌళి | 144 |
| అదె లంక సాధించె | మాళవిగౌళ | 149 |
| అదె వచ్చె రాఘవు | నాట | 159 |
| అధమునికి నను | శంకరాభరణం | 198 |
| అన్నలంటాఁ దమ్ము | వరాళి | 280 |
| అనాది నిమత్తువిహారము | భైరవి | 102 |
| అన్నిటాఁ దాము | లలిత | 213 |
| అన్నిటా నీ వంతర్యా | బౌళి | 332 |
| అన్నిటికి నిదిపర | లలిత | 42 |
| అన్నిమంత్రములు నిందే | లలిత | 97 |
| అన్నివిభవముల | భూపాళం | 177 |
| అప్పులవారే అందరును | దేసాళం | 227 |
| అప్పులేని సంసార | గుజ్జరి | 250 |
| అభయ మభయ | పాడి | 330 |
| అమ్మెదొకటియును | పాడి | 69 |
| అయమేవ అయమేవ | సాళంగనాట | 12 |
| అరుదీకపీంద్రుని | మాళవి | 118 |
| అరుదైన భవదూరు | లలిత | 166 |
| అలరఁ జంచలమైన | ఆహిరి | 216 |
| అ[illegible]ర నుతించరో | భూపాళం | 301 |
| అల్లదెకో విజయధ్వజము | సామంతం | 46 |
| అల్లవాఁడే గద్దెమీఁద | రామక్రియ | 142 |
| అవధారు చిత్తగించు | మాళవిగౌళ | 132 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| అస్మదాదీనామన్యే | పాడి | 314 |
| ఆంజనేయ యనిలజ | రామక్రియ | 110 |
| ఆచార విచారాలవి | లలిత | 67 |
| ఆడరమ్మ పాడరమ్మ | లలిత | 54 |
| ఆతుమ సంతస | లలిత | 327 |
| ఆదిదేవుఁడనఁగ | సామంతం | 291 |
| ఆదిపురుషా అఖి | నాట | 187 |
| ఆదిమపూరుషు | శంకరాభరణం | 226 |
| ఆదిమూర్తి యీతఁడు | శంకరాభరణం | 156 |
| ఆ రూపమునకె హరి | సామంతం | 109 |
| ఆలించు పాలించు | ముఖారి | 29 |
| ఆనమీఁద విసు | ఆహిరి | 272 |
| ఇంతులాల చూడరమ్మ | పాడి | 146 |
| ఇందరికి నభయం | సామంతం | 298 |
| ఇందరిని గాచిన | సామంతం | 37 |
| ఇందిరకు నురమమీఁ | శ్రీరాగం | 310 |
| ఇందిరా నాయక | రామక్రియ | 327 |
| ఇందిరారమణుఁదెచ్చి | బౌళి | 91 |
| స్వతంత్రుఁడవు నీవు | తోండి | 92 |
| ఇందుకుఁగా నాయెఱ | మాళవశ్రీ | 51 |
| ఇందుకు ధ్రువాదు | దేవగాంధారి | 77 |
| ఇందుకు విరహితము | ముఖారి | 34 |
| ఇందునందుఁ దిరుగుచు | ఆహిరి | 274 |
| ఇందునుండ మీఁకెడ | పాడి | 325 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఇటు గరుడని నీ | నాట | 235 |
| ఇట్టిదివో హరికృప | సామంతం | 52 |
| ఇట్టి ముద్దులాడిబాలు | దేవగాంధారి | 175 |
| ఇట్టి సుద్దులితనివి | నాట | 144 |
| ఇట్టి సంసారికే | ఆహిరి | 179 |
| ఇటువలెనె పో | లలిత | 169 |
| ఇతఁడే పరబ్రహ్మ | బౌళిరామక్రియ | 152 |
| ఇతఁడే యతఁడు గాఁబో | మాళవిగౌళ | 100 |
| ఇతఁడొకఁడే | పళవంజరం | 2 |
| ఇతరములన్నియు | గుజ్జరి | 70 |
| ఇతరములన్నియు | సామంతం | 231 |
| ఇతరమెరఁగ గతి | లలిత | 53 |
| ఇదివో తెరమరఁగివా | ముఖారి | 98 |
| ఇదియే వేదాంత | మాళవి | 50 |
| ఇదియే సాధనిమిహ | మలహరి | 60 |
| ఇన్నాళ్ళు నెఱఁగక | లలిత | 128 |
| ఇన్ని చేఁతలును | శంకరాభరణం | 271 |
| ఇన్ని జన్మములే | శ్రీరాగం | 319 |
| ఇన్నిటా నింతటా | సామంతం | 13 |
| ఇన్నిటికి నోపునా | సాళంగనాట | 27 |
| ఇన్ని విధాలు ఇఁక | సామంతం | 86 |
| ఇలయును నభము | నాట | 2[illegible]0 |
| ఇనియె పో ప్రద్యుమ్న | భూపాళం | 74 |
| ఈజీవునకు నేది | దేవగాంధారి | 200 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఈతఁడు విష్ణుఁడు | భైరవి | 7 |
| ఈతఁడే హరుఁడు | ? | 194 |
| ఈతనిదెంత ప్రతాప | సాళంగనాట | 134 |
| ఈతని మహిమలు | లలిత | 158 |
| ✓ ఈసుగలీమునులీ | నాదరామక్రియ | 255 |
| ఊరికిఁ బోయెడి వో | ఆహిరి | 233 |
| ✓ ఎండగాని నీడగాని | బౌళి | 274 |
| ✓ ఎండలోని నీడ | ఆహిరి | 300 |
| ✓ ఎంత గాలమొకదా | శ్రీరాగం | 286 |
| ✓ ఎంత చేసిన తనకేది | సామంతం | 239 |
| ఎంతని నుతియింతు | దేవగాంధారి | 128 |
| ఎంతని పొగడవచ్చు | బౌళి | 139 |
| ఎంతని పొగడవచ్చు | నూళవిగాళ | 142 |
| ఎంతభాగ్యవంతులమో | శంకరాభరణం | 143 |
| ఎంతప్రతాపమువాఁడు | పాడి | 140 |
| ఎంతబోధించి | నాట | 307 |
| ఎంత మానుమన్న | ముఖారి | 267 |
| ఎంతలేమ చిత్తమా | రామక్రియ | 88 |
| ఎంతవెత్రిఁ గొండ | బౌళి | 33 |
| ఎంతసేసినా నెడ | కన్నడగౌళ | 220 |
| ✓ ఎంతైనఁ దొలఁగవై | దేసాక్షి | 223 |
| ✓ ఎందరివెంట | దేవగాంధారి | 265 |
| ఎందరు సతులో | రామక్రియ | 14 |
| ఎందలిసారమో | సామంతం | 121 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఎందాఁక నే చిత్త | శ్రీరాగం | 232 |
| ఎందుఁ జూచిన | శుద్ధవసంతం | 302 |
| ఎందుఁ బొడమితివో | ముఖారి | 228 |
| ఎందును బోరాదీ | బౌళి | 114 |
| ఎక్కడ చొచ్చెడిదీ | బౌళి | 315 |
| ఎక్కడఁ జొచ్చెదరింక | నాట | 135 |
| ఎక్కడ నీవుద్యోగ | గామక్రియ | 47 |
| ఎక్కడనున్నా | ముఖారి | 312 |
| ఎక్కడి దురవస్థ | లలిత | 244 |
| ఎక్కువకులజుఁడైన | సామంతం | 287 |
| ఎటువంటి రౌద్రమో | ఆహిరి | 272 |
| ఎట్టుచేసినఁ జేసె | బౌళి | 243 |
| ఎట్టు దరించీ నిద | ముఖారి | 258 |
| ఎట్టు వేగించేరిందు | శ్రీరాగం | 321 |
| ఎడమ పురివెట్టి | ఆహిరి | 285 |
| ఎదుటి నిధాన | శుద్ధవసంతం | 305 |
| ఎన్నటికెవ్వరికితఁడే | ముఖారి | 170 |
| ఎన్నఁడు నేఁగందు | బౌళి రామక్రియ | 36 |
| ఎన్నఁడొకో సుజ్ఞాన | బౌళి | 112 |
| ఎన్నాళ్ళదాఁకఁదా | ఆహిరి | 249 |
| ఎన్నాళ్ళున్నా నిట్టె | దేసాళం | 202 |
| ఎన్నిటికెన్నిటికని | గుండక్రియ | 30 |
| ఎన్నఁడు విజ్ఞానమీఁక | ఆహిరి | 32 |
| ఎన్నఁడొకో నే నీచెర | కాంబోది | 8 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఎప్పటి జీవుఁడె యెప్పటి | బౌళి | 96 |
| ఎప్పుడేబుద్ధి పుట్టునో | శంకరాభరణం | 59 |
| ఎరిఁగీ నెరఁగఁడు | వరాళి | 108 |
| ఎఱఁగఁడు పరసుఖ | గుండక్రియ | 78 |
| ఎల్లలోకములవారి | సామంతం | 43 |
| ఎవ్వఁడో కాని | రామక్రియ | 221 |
| ఎవ్వరిఁ దలఁచఁడు | శ్రీరాగం | 204 |
| ఎవ్వరు గలరెవ్వరికి | దేశాక్షి | 195 |
| ఎవ్వరెవ్వరివాఁడో | నాట | 233 |
| ఏగతి నుద్ధరించేవో | లలిత | 11 |
| ఏఁటికిఁ దలఁకెద | ఆహిరి | 241 |
| ఏఁటికి నెవ్వరిపొందు | పాడి | 251 |
| ఏఁటిబ్రదుకు | శ్రీరాగం | 308 |
| ఏఁటి విజ్ఞానమేఁటి | గుండక్రియ | 224 |
| ఏడవలపేడ | నాట | 278 |
| ఏణనయనలచూ | నారణి | 239 |
| ఏదికడ దీని | కన్నడగౌళ | 281 |
| ఏది చూచినఁ దమకు | శ్రీరాగం | 237 |
| ఏది తుద దీని | బౌళి | 241 |
| ఏదియుఁగానఁడు | వరాళి | 23 |
| ఏదైన దేవుఁడు ప్రా | దేవగాంధారి | 55 |
| ఏదైనా సుఖమే | లలిత | 124 |
| ఏదైనను శ్రీపాద | నాట | 240 |
| ఏపనులు సేసినా | ఆహిరి | 317 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| ఏమనవచ్చును | సామంతం | 171 |
| ఏమని చెప్పెదనిట | శుద్ధవసంతం | 66 |
| ఏమని పొగడవచ్చు | రామక్రియ | 126 |
| ఏమరక తలంచరో | దేసాళి | 114 |
| ఏమికలిగెను మాకు | ఆహిరి | 276 |
| ఏమిగలదిందు | శ్రీరాగం | 248 |
| ఏమిగలదిందు | వరాళి | 294 |
| ఏమిటివాఁడఁగాను | లలిత | 112 |
| ఏమి దిరిగేమెందైన | ఆహిరి | 165 |
| ఏమివొరలేరు | శుద్ధవసంతం | 306 |
| ఏమిసేయఁగవచ్చు | ఆహిరి | 278 |
| ఏమిసేయవచ్చు | గుజ్జరి | 53 |
| ఏమిసేయవచ్చు | సామంతం | 181 |
| ఏమిసేయుదు నింతయు | బౌళి | 36 |
| * ఏమో తెలిసెఁగాని | భూపాళం | 256 |
| ఏల పొరలేవులేవే | ముఖారి | 258 |
| ఏలయ్య పరమాత్మ | ధన్నాసి | 205 |
| ఏలవయ్య లోకమెల్ల | శంకరాభరణం | 111 |
| ఏలిక చెప్పినవని | గుజ్జరి | 160 |
| ఏలోకో కర్మమా | గుండక్రియ | 20 |
| ఒకరిబుద్ధులు వే | సామంతం | 64 |
| ఒక్కఁడవె లోకాన | శ్రీరాగం | 189 |
| ఒక్కఁడే యేకాంగ | పాడి | 113 |


* ఈ కీర్తన 171_వ పుటలో పునరుక్తమగుట పొరపాటు.

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
| --- | --- | --- |
| ఒక్కటి కొకటి వి | భైరవి | 104 |
| ఓలపతము లేనా | ముఖారి | 65 |
| ఒనగితివిన్నియు | సాళంగనాట | 16 |
| * ఓపనయ్యా వోపనయ్యా | ఆహిరి | 172 |
| ఓపవనాత్మజ | శ్రీరాగం | 22 |
| ఓయమ్మ యెట్టు | రామక్రియ | 214 |
| ఓహో యెంతటివాఁడే | బౌళి | 66 |
| ఔనయ్యా జాణఁడవు | సామంతం | 136 |
| కంటిఁ గంటి వీఁడివో | రామక్రియ | 187 |
| కంటి నఖిలాండ | దేశాక్షి | 201 |
| కంటిమి నేఁడిదె | లలిత | 141 |
| కందర్పజనక | బౌళి | 164 |
| కటకట హరిమాయా | గుండక్రియ | 14 |
| కటకటా జీవు | పాడి | 309 |
| కటకటా మీఁదితివి | ఆహిరి | 214 |
| కడలుడిపి నీరాడ | శుద్ధవసంతం | 281 |
| కత్తరాలు చిమ్ముచుండె | శ్రీరాగం | 203 |
| కదిసి యాతఁడు మమ్ము | శంకరాభరణం | 101 |
| కనుఁగాక పుణ్యాలు | ముఖారి | 196 |
| కనుఁగొనఁగ జీ | శ్రీరాగం | 288 |
| కన్ను లెదుటిదే | లలిత | 74 |
| కప్పురమునకుఁ గప్పుర | శ్రీరాగం | 165 |
| కరుణానిధిం | కన్నడగౌళ | 303 |


* ఇదే కీర్తన పొరపాటున 197-వ పుటయందు పునరుక్తమైనది.

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| కరుణానిధివి | హిందోళం | 6 |
| కరుణించవె నిజ | హిందోళం | 58 |
| కర్మమెంత మర్మమెంత | కాంబోది | 63 |
| కలకాలము నిట్టె | పాడి | 44 |
| కలలోని సుఖమే | సామంతం | 252 |
| కలశాపురముకాడ | సామంతం | 116 |
| కలిగిన మతి వృథ | దేవగాంధారి | 210 |
| కలిగె మాకిదె కైవల్య | బౌళిరామక్రియ | 83 |
| కలియుగంబునకు | ఆహిరి | 202 |
| కలుషపు చీకటి | పాడి | 197 |
| కాకున్న సంసార | శ్రీరాగం | 292 |
| కాయము జీవుడు | నాట | 310 |
| కాయముల కాణాచి | ధన్నాసి | 169 |
| కావంగ నీకే పోదు | నారాయణి | 56 |
| కూడుదురూరకె | గుజ్జరి | 93 |
| కూడువండుట గంజి | శ్రీరాగం | 250 |
| కొంచపడితి నాక | సామంతం | 173 |
| కొంచెమును ఘన | శ్రీరాగం | 294 |
| కొండ దవ్వుట | భవుళి | 289 |
| కొండవంటి దేవుడు | గుజ్జరి | 136 |
| కొందరికి సమ్మతి | బౌళి | 331 |
| కొలువరో మొక్కరో | రామక్రియ | 133 |
| కోరువంచరో | ఆహిరి | 333 |
| గద్దరి జీవుడు | సామంతం | 206 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| గరుడాద్రి వేదాద్రి | రామక్రియ | 154 |
| ఘనుఁడీతఁడొకఁడు | శుద్ధవసంతం | 251 |
| ఘోరదురితముల | ధన్యాసి | 317 |
| ఘోరవిదారణ నార | నాట | 217 |
| చండ ప్రచండాది | శ్రీరాగం | 168 |
| చక్కఁదనముల వార | సామంతం | 242 |
| చదివెఁ బో ప్రాణి | ధన్నాసి | 301 |
| చవి నోరికేడఁ దెత్తు | ముఖారి | 21 |
| చాలదా నాసంసా | ఆహిరి | 180 |
| చాలదా బ్రహ్మమిది | సామంతం | 304 |
| చాలదా మా జన్మము | సామంతం | 247 |
| చాలదా హరిసంకీ | సామంతం | 267 |
| చిక్కవద్దు చొక్కవద్దు | భూపాళం | 78 |
| చిత్తా అవధారు | సాళంగనాట | 120 |
| చిరంతనుఁడు శ్రీ | ముఖారి | 297 |
| చూడరెవ్వరు దీని | బౌళి | 237 |
| చూడుఁడిందరికి | భైరవి | 252 |
| చెదఱక వెలుఁగే | బౌళి | 260 |
| చెప్పితే నాశ్చర్యము | మాళవి | 128 |
| చెల్లె నీచేఁతలు | సామంతం | 79 |
| చేకొన్న భక్తుల పాలి | శుద్ధవసంతం | 116 |
| చేరి కొల్వరో | శ్రీరాగం | 1 |
| జనులును నమరులు | ముఖారి | 289 |
| జయము జయము ఇఁక | సాళంగనాట | 154 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| జయము మనది | సాళంగనాట | 151 |
| జీవుఁడించుకంత | వరాళి | 8 |
| జీవుఁడెంతటివాఁడు | దేశి | 293 |
| జీవుఁడు నిత్యుఁడు | గుండక్రియ | 50 |
| తలిగాని యీ పాటు | రామక్రియ | 89 |
| తథా కురుష్వముదా | లలిత | 86 |
| తనకర్మమెంత | సాళంగం | 273 |
| తన కేఁటి యేతులింద | నాట | 174 |
| తన కేడ చదువులు | నాట | 268 |
| తనదీఁ గాక యింద | సామంతం | 256 |
| తనవారని యాస | వరాళి | 279 |
| తప్పదు తప్పదు | లలిత | 322 |
| తలఁచరో జనులు | గౌళ | 127 |
| తలఁచిన విన్నియు | దేవగాంధారి | 249 |
| తలఁప వెనక నుయ్యి | ఛాయానాట | 282 |
| తలఁపు కామాతుర | వరాళి | 243 |
| తలఁపులోపలి | వసంతం | 313 |
| తలపోఁత చిత్తమున | గుండక్రియ | 25 |
| తలలేదు తోఁకలేదు | కన్నడగౌళ | 49 |
| తల్లిబాసి బిడ్డ | కాంబోధి | 182 |
| తల్లియాపె కృష్ణునికి | వసంతం | 6 |
| తానె కాకెవ్వరు | సామంతం | 260 |
| తానె తానె యిందరి | సామంతం | 40 |
| తావ లేక మేడలెక్క | లలిత | 236 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| తెగఁగోయుటకు హరి | తెలుఁగు కాంబోది | 70 |
| తెలియఁడుగాక | భూపాళం | 5 |
| తెలియని వారికి | గుండక్రియ | 20 |
| తెలిసినఁ దెలియుఁడు | నాట | 287 |
| తెలిసియుఁ దెలియదు | లలిత | 19 |
| తెలిసియు నత్యంత | బౌళి | 295 |
| తోరణములే | ఆహిరి | 253 |
| తొల్లియును మఱ్ఱాకు | ఆహిరి | 161 |
| త్వమేవ శరణం | శ్రీరాగం | 184 |
| త్వమేవ శరణం | శ్రీరాగం | 290 |
| త్వమేవ శరణం త్వా | కన్నడగౌళ | 190 |
| దాసులపాలిటి నిధాన | సాళంగనాట | 180 |
| దిక్కిందరికినై స | ఆహిరి | 248 |
| దిక్కులేక పోయె | వరాళి | 200 |
| దిక్కులేనివారు | ముఖారి | 22 |
| దురితమృత్యువట | శంకరాభరణం | 198 |
| దేవతలఁ గాచిన | బౌళిరామక్రియ | 8 |
| దేవదేవం భజే | ధన్నాసి | 285 |
| దేవ దేవోత్తమ | పాడి | 132 |
| దేవ దేవోత్తముని | బౌళి | 17 |
| దేవ నీమాయ | ఆహిరి | 329 |
| దేవ నీవిచ్చేయం | బౌళి | 323 |
| దేవుని మరవకు | లలిత | 28 |
| దైవకృతంబట చేతట | కన్నడగౌళ | 296 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
| --- | --- | --- |
| దైవమే నేరుచుఁగాక | లలిత | 38 |
| దైవమొక్కఁడే | సామంతం | 40 |
| దొరకినయప్పుడె | లలిత | 18 |
| దొరకునా యితని | సామంతం | 314 |
| ధనముగని మరి | సామంతం | 178 |
| ధరలోను జనహిత | కన్నడగౌళ | 84 |
| ధ్రువవరదునివలె | లలిత | 35 |
| నందకధర నంద | భూపాళం | 207 |
| నంద నందన వేణు | ధన్నాసి | 288 |
| నగవులు నిజమని | ముఖారి | 39 |
| నటనల భ్రమయకు | లలిత | 15 |
| నడవరో జడియక | శోకవరాళి | 94 |
| నన్నునింత సేయుకంటె | ఆహిరి | 191 |
| నమో నమో జగదేక | లలిత | 134 |
| నమో నమో దశరథ | మాళవశ్రీ | 4 |
| నమో నమో రఘుకుల | శాళి | 119 |
| నమ్మితిఁ జుమ్మీవో | దేవగాంధారి | 130 |
| నమ్మితే నితఁడే | రామక్రియ | 28 |
| నమ్మినదిదివో | పాడి | 60 |
| నరసింహా రామకృష్ణ | పాడి | 107 |
| నరులార నేఁడువో | ముఖారి | 10 |
| నరులాల మునులాల | రామక్రియ | 145 |
| నాటకమింతా | గుండక్రియ | 30 |
| నాఁటికి నాఁడే నా | సామంతం | 234 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| నానాదిక్కుల నరు | ఆహిరి | 306 |
| నాపాలి ఘననిధా | గుజ్జరి | 246 |
| నారాయణతే నమో | పాడి | 183 |
| నారాయణ నీ నామ | లలిత | 62 |
| నారాయణాయ నమో | రామక్రియ | 328 |
| నారాయణుని శ్రీ | కేదారగౌళ | 212 |
| నిండెను లోకములెల్ల | వసంతం | 2 |
| నిఖిలమింతయు మేలు | లలిత | 198 |
| నిచ్చలూ లోకము | బౌళి | 68 |
| నిత్యాత్ముఁడై యుండి | శ్రీరాగం | 222 |
| నిద్దరించీఁ బాల | మలహరి | 188 |
| నిలిచినవాఁడవు | కేదారగౌళ | 4 |
| నిశ్చింతం పరమంసుఖ | గుండక్రియ | 16 |
| నీ కథామృతము నా | ? | 194 |
| నీగుఱుతులు చూచుకో | సాళంగనాట | 122 |
| నీచనైన నావల్ల | గుండక్రియ | 82 |
| నీ నామమే మాకు | భూపాళం | 87 |
| నీయాజ్ఞ దలమోచి | రామక్రియ | 325 |
| నీవు తురగముమీఁద | సాళంగం | 187 |
| నీవు నాసొమ్మవు | లలిత | 91 |
| నీవే కాచుటగాక | లలిత | 34 |
| నెరబిరుదిన్నిటాను | ముఖారి | 203 |
| నేనవగుణినైన | ఆహిరి | 48 |
| నేనై విడువవద్దు | లలిత | 80 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| నేర్పుకంటెఁ బెన్నిధి | ముఖారి | 208 |
| నేల మిన్ను నొక్కటైన | గౌళ | 218 |
| పటుశిష్టప్రతి | సాళంగనాట | 269 |
| పట్టిన వ్రతము నీవే | ముఖారి | 107 |
| పనిలేదేమియు నాకు | లలిత | 68 |
| పరగీనదివో గద్దె | శంకరాభరణం | 80 |
| పరదేశి పట్టణము | బౌళి | 220 |
| పరమవివేకులాల | ధన్నాసి | 122 |
| పరమాత్ముఁడవు | కన్నడగౌళ | 41 |
| పరుసమొక్కటే | సామంతం | 323 |
| పసలేని యీ బ్రదుకు | ముఖారి | 266 |
| పాడైన మెరుకతో | సామంతం | 172 |
| పాపములే సంబళ | శంకరాభరణం | 228 |
| పాపమెరఁగని | మాళవిగౌళ | 270 |
| పాయక మతినుండి | కన్నడగౌళ | 299 |
| పాయమంటా ముదిమంటా | గుండక్రియ | 199 |
| పారకుమీ వోమన | ఆహిరి | 257 |
| పారితెంచి యెత్తివేసి | భూపాళం | 231 |
| పాలజలనిధిలో | పళమంజరి | 184 |
| పాలదొంగనద్ద | మలహరి | 283 |
| పుట్టఁగాఁ బుట్టిన | బౌళి | 109 |
| పుట్టు పూలినబరు | సాళంగం | 245 |
| పుడమి నిందరిఁ బట్టె | వరాళి | 246 |
| పృథుల హేమ కౌపీన | పాడి | 211 |


45

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
| --- | --- | --- |
| పెద యాబళపుఁగొండ | భల్లాటి | 9 |
| పెరిగినాఁడు చూడరో | సాళంగనాట | 158 |
| పాలమెల్లఁ దిరిగిన | శ్రీరాగం | 212 |
| పోయఁ గాలంబడవి | కన్నడగౌళ | 261 |
| పోయఁ బోయఁ గాల | దేసాక్షి | 269 |
| పోయెఁ బోయెఁ గాలు | సామంతం | 268 |
| పోరాక పోయి | గుండక్రియ | 296 |
| పోరో పోరో యమ్మ | వరాళి | 221 |
| ప్రాణుల నేరమి | గుండక్రియ | 316 |
| బడి బడి నింద్రియాలే | లలిత | 125 |
| బల్లిదులు నీ కంటె | లలిత | 44 |
| బాపు దైవమా | మాళవి | 254 |
| బాపు బాపు దేవుఁడా | సామంతం | 75 |
| బిరుదు బంటితఁడు | లలిత | 129 |
| బొడ్డు తామెరలోన | సామంతం | 1[illegible]6 |
| బ్రహ్మ గడిగిన పాద | ముఖారి | 259 |
| భవములు వీడఁగ | లలిత | 191 |
| భళి భళి రామా | రామక్రియ | 42 |
| భారకుఁడతఁడే | మంగళకౌశిక | 40 |
| భోగీంద్రులును మీరు | ముఖారి | 320 |
| మంగాంబుధి హను | సామంతం | 101 |
| మనుజుఁడై పుట్టి | సామంతం | 262 |
| మఱచితి మంటే | లలిత | 78 |
| మాదృశానాం భవా | ముఖారి | 292 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| మాధవ కేశవ | లలిత | 21 |
| మాధవ భూధవ | సాళంగ | 18 |
| మానదు మతిమఱపు | బౌళి | 45 |
| మాయలకగపడి | ఆహిరి | 163 |
| మాయలో మోహాము | రామక్రియ | 31 |
| మిన్నక వేసాలు | భూపాళం | 324 |
| ముట్టితేనే మూర్ఖై | మంగళకౌశిక | 58 |
| ముదమలర కాలము | భూపాళం | 192 |
| మునుకలుగఁ బిలిచీ | సామంతం | 209 |
| మేదిని జీవులఁగావ | భూపాళం | 326 |
| మేలుకొనవే | భూపాళం | 176 |
| మొక్కరో మీరు | ముఖారి | 204 |
| రామమిందీవర శ్యామం | బౌళి | 106 |
| రాముఁడు లోకాభి | రామక్రియ | 150 |
| రాముఁడు లోకాభి | మాళవిగౌళ | 153 |
| లంకెలూడుటే లాభ | నాట | 262 |
| లోకము లోపల | సామంతం | 176 |
| వట్టిజోలి యెంతలేదు | కన్నడగౌళ | 126 |
| వలసిన వారికి వైపు | గౌళ | 105 |
| వాగ బలువ్రుదై వపు | కాంబోది | 182 |
| వాఁడె వెంకటేశుఁడనే | భూపాళం | 254 |
| వారిధిశయన వో | దేవగాంధారి | 115 |
| వింతనానెఁ దనకు | ముఖారి | 38 |
| వినకయ్య నరసింహా | నాట | 147 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| వినుఁడిదె రఘుపతి | శంకరాభరణం | 152 |
| విన్నవమిదే నీకు | శ్రీరాగం | 85 |
| విశ్వప్రకాశునకు | కన్నడగౌళ | 312 |
| వీఁడివో కలశాపుర | బౌళిరామక్రియ | 156 |
| వీఁడివో కొలువున్నాఁడు | రామక్రియ | 157 |
| వీఁడివో యిదె వింత | భైరవి | 290 |
| వెదకిన నిదియే | బౌళి | 95 |
| వెనక ముందరికి | సామంతం | 93 |
| వెన్నముద్ద కృష్ణుఁడు | దేసాళి | 159 |
| వెన్నవట్టుక నేయి | శ్రీరాగం | 265 |
| వెరగుతో మరచితే | గుండక్రియ | 76 |
| వెరపు జెలుపు నీ | శ్రీరాగం | 162 |
| వెరపులు నొరపులు | ముఖారి | 276 |
| వెలయు నిన్నియును వృథా | రామక్రియ | 229 |
| వెలికి వెళ్ళఁడు | కన్నడగౌళ | 284 |
| వేంకటగిరి గోవిం | శోకవరాళి | 180 |
| వేదనఁ బొరలే | శ్రీరాగం | 275 |
| వేవేల చందాల | లలిత | 117 |
| శరణంబితఁడే | మలహరి | 72 |
| శరణాగత వజ్ర | ధన్నాసి | 56 |
| శ్రీపతి నీ కెదురు | వరాళి | 88 |
| శ్రీ సతీశ బహు | వరాళి | 124 |
| సంతత దుఃఖపు | సామంతం | 185 |
| సందడి సొమ్ముల | భైరవి | 61 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| సందెకాడఁ బుట్టినట్టి | రామక్రియ | 32 |
| సకలభూతదయ | సామంతం | 280 |
| సకల సంగ్రహా | లలిత | 308 |
| సకల సందేహామై | శ్రీరాగం | 296 |
| సడిఁబెట్టె గటకటా | భైరవి | 263 |
| సతతము నేఁజేయు | ఆహిరి | 303 |
| సమమతినని | వరాళి | 48 |
| సమసె రావణుఁడు | సామంతం | 155 |
| సముఖా యెచ్చరిక | సామంతం | 131 |
| సమ్మతించి కనుకొండ | ముఖారి | 95 |
| సరిలేరితనికిని | నాట | 138 |
| సర్వరక్షకుఁడైన | లలిత | 140 |
| సర్వేశ్వరుఁడే | సామంతం | 26 |
| సామాన్యమా పూర్వ | ధన్నాసి | 264 |
| సిబ్బితి పడఁగనేల | గుండక్రియ | 103 |
| సీతా శోకవిఘా | దేశాక్షి | 219 |
| సుగ్రీవనారసింహా | తోండి | 118 |
| సులభుఁడై వున్నాఁడు | బౌళి | 146 |
| సేవించరో జనులాల | సాళంగనాట | 133 |
| సోదించిరిదియె | లలిత | 26 |
| హరిఁగొలిచినఁగాని | వరాళి | 97 |
| హరినామము కడు | భైరవి | 76 |
| హరి నీకే నేరుణమత్తు | దేవగాంధారి | 84 |
| హరి నీకే శరణని | గుండక్రియ | 71 |

| సంకీర్తన | రాగము | పుటసంఖ్య |
|---|---|---|
| నారాయణ నిను | మాళవిగౌళ | 72 |
| హరి నీ మయమే | లలిత | 82 |
| హరి నీవే సర్వా | దేశి | 99 |
| హరి నెఱఁగని పుణ్యా | ఆహిరి | 277 |
| హరి హరి నిను సక | గుజ్జరి | 105 |
| హరి హరి యిందరికి | లలిత | 46 |
| హితమిదియే కా | లలిత | 198 |
| హేయమేమీ లేదు | గుజ్జరి | 120 |


తిరుమల తిరుపతి దేవస్థానం ప్రెస్, తిరుపతి. కా 250. 28-3-55.